Sub-Syndicate Members: Almondz Global Securities Ltd., Amrapali Capital & Finance Services Limited, Anand Rathi Share & Stock Brokers Ltd., Anand Share Consultancy, ANS Pvt Limited, Asit C. Mehta Investment Interrmediates Ltd, Avendus Wealth Management Private Limited, Axis Securities Limited, Centrum Broking Limited, Dalal & Broacha Stock Broking Private Limited, DB (International) Stock Brokers Ltd, Finwizard Technology Private Limited, G Raj & Co. (Consultants) Limited, HDFC Securities Limited, ICICI Securities Limited, IDBI Capital Markets & Securities Limited, IIFL Securities Ltd, Innovate Securities Pvt Limited, Investmentor Securities Limited, Jhaveri Securities, JM Financial Services Limited, Jobanputra Fiscal Services Private Limited, K M Jain Stock Brokers Pvt Ltd, Kalpataru Multiplier Limited, Kantilal Chhaganlal Sec Pvt Ltd, Keynote Capitals Limited, KJMC Capital Market Services Limited, Lakshmishree Investment & Securities Pvt Ltd, LKP Securities Limited, Marwadi Shares & Finance, Mehta Equities Limited, Motilal Oswal Financial Services Limited, Motilal Oswal Securities Limited, Nirmal Bang Securities Pvt Limited, Nuvama Wealth and Investment Limited, Nuvama Wealth and Investment Limited (Edelweiss Broking Limited), Patel Wealth Advisors Pvt Limited, Prabhudas Lilladher Pvt Limited, Pravin Ratilal Share & Stock Brokers Limited, RR Equity Brokers Private Limited, SBIcap Securities Limited, Sharekhan Limited, SMC Global Securities Limited, Spark PWM Private Limited, SS Corporate Securities Limited, Tanna Financial Services, TradeBulls Securites Private Ltd., Upstox Securities Private Limited, Viren M Shah and YES Securities (India) Limited.

Bankers to the Offer

Escrow Collection Bank and Sponsor Bank: Kotak Mahindra Bank Limited

Public Offer Account Bank, Refund Bank and Sponsor Bank: ICICI Bank Limited

All capitalized terms used herein and not specifically defined shall have the same meaning as ascribed to them in RHP.

For **Lenskart Solutions Limited**
On behalf of the Board of Directors
Sd/-
Preeti Gupta
Company Secretary and Chief Compliance Officer

Place: Delhi
Date: October 31, 2025

Lenskart Solutions Limited is proposing, subject to, receipt of requisite approvals, market conditions and other considerations, to make an initial public offering of its Equity Shares and has filed the RHP with the RoC on October 25, 2025. The RHP shall be available on the website of the Company at https://www.lenskart.com, SEBI at www.sebi.gov.in, as well as on the websites of the BRLMs, i.e. Kotak Mahindra Capital Company Limited, Morgan Stanley India Company Private Limited, Avendus Capital Private Limited, Citigroup Global Markets India Private Limited, Axis Capital Limited and Intensive Fiscal Services Private Limited at https://investmentbank.kotak.com, www.morganstanley.com/, www.avendus.com, https://www.citigroup.com/global/about-us/global-presence/india/disclaimer, www.axiscapital.co.in and www.intensivefiscal.com, respectively and the websites of National Stock Exchange of India Limited and BSE Limited at www.nseindia.com and www.bseindia.com, respectively. Any potential investor should note that investment in equity shares involves a high degree of risk and for details relating to such risk, please see ***"Risk Factors"*** on page 64 of the RHP. Potential investors should not rely on the DRHP for making any investment decision and instead should place reliance on the RHP and Addendum cum Corrigendum. Specific attention of the investors is invited to "***Risk Factors***" beginning on page 64 of the RHP. This announcement has been prepared for publication in India only and is not for publication or distribution, directly or indirectly, in or into the United States. The equity shares described in this announcement have not been and will not be registered under the U.S. Securities Act of 1933, as amended (the "**U.S. Securities Act**") or any other applicable law of the United States and, unless so registered, may not be offered or sold within the United States, except pursuant to an exemption from, or in a transaction not subject to, the registration requirements of the U.S. Securities Act and applicable U.S. state securities laws. Accordingly, the equity shares of the Company are being offered and sold (i) within the United States only to persons reasonably believed to be "qualified institutional buyers" (as defined in Rule 144A of the U.S. Securities Act) pursuant to Section 4(a) of the U.S. Securities Act, and (ii) outside the United States in "offshore transactions", as defined in and in reliance on, Regulation S of the U.S. Securities Act and the applicable laws of the jurisdictions where those offers and sales occur. There will be no public offering of securities in the United States.

Adfactors

ఈనాడు

విజయవాడ 3-11-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 83
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ దీప్తి శర్మ

మన వనిత.. విశ్వవిజేత



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ షెఫాలి వర్మ

మహిళల వన్డే ప్రపంచకప్ భారత్‌దే

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం

47 ఏళ్ల నిరీక్షణకు తెర
తొలిసారి కప్పు కైవసం

ఎన్ని విజయాలు సాధించనీ..
ఎన్ని ఘనతలైనా అందుకోనీ..
ఎన్ని రికార్డులైనా సొంతం కానీ..
ఆ ఒక్కటీ అందకపోతే అసంపూర్ణమే!
అది దక్కితే అంతులేని ఆనందమే!

ఆట ఏదైనా ప్రపంచకప్ అంటే.. ఆడే ప్రతి ఒక్కరూ నెరవేర్చుకోవాలనుకునే స్వప్నం. ఈ దేశంలో బ్యాటు, బంతి పట్టిన ప్రతి అమ్మాయీ దశాబ్దాలుగా ఆ కలను కంటూనే ఉంది. 1978 నుంచి భారత జట్టు ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ప్రతిసారీ నిరాశే.

2005లో మిథాలీసేన ఫైనల్ చేరింది. ట్రోఫీకి దగ్గరగా కూడా వెళ్లనివ్వలేదు ఆస్ట్రేలియా. 2017లో మళ్లీ మిథాలీ సారథ్యంలో మరో జట్టు ప్రయత్నించింది. అప్పుడు కప్పు చిక్కినట్లే చిక్కి చేజారింది. మరి మూడోసారైనా ముచ్చట తీరుతుందా? ఈ జట్టయినా ఆఖరి అడ్డంకిని అధిగమిస్తుందా? అని దేశమంతా ఉత్కంఠగా ఎదురు చూసింది ఆదివారం! దేశమంతా తమ వెంటే నిలవగా.. మునుపెన్నడూ లేనన్ని ఆశలు, అంచనాల నడుమ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో అడుగు పెట్టింది భారత బృందం.

టాస్ చేజారి బ్యాటింగ్ చేయాల్సి వచ్చినా.. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం.. 27 ఓవర్లకు స్కోరు 162/1.. (మిగతా 2లో)

మరిన్ని వివరాలు ఛాంపియన్ లో..

తమిళనాట 'సర్' వద్దు

సుప్రీంకోర్టును ఆశ్రయించడమే మార్గం

అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం 2లో

'మగధ్'లో మహా ఉత్కంఠ!

ఒకే కులం, బంధువుల మధ్యే చాలాచోట్ల పోటీ 8లో

రెబల్స్ ప్రభావమూ అధికమే..

రైలు బోగీ మొత్తం.. రక్తపాతమే

పది మంది ప్రయాణికులపై కత్తులతో దాడి

బ్రిటన్‌లో రెచ్చిపోయిన దుండగులు 12లో

నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టు

ఆయన సోదరుడు రామునూ అదుపులోకి తీసుకున్న పోలీసులు

విచారణ నిమిత్తం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలింపు

కీలకంగా మారిన ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు వాంగ్మూలం

జోగి పాత్రపై ఆధారాలు లభించడంతో అరెస్టు చేసిన సిట్, ఎక్సైజ్ అధికారులు



జోగి రమేష్‌ను ఇబ్రహీంపట్నం ఫెర్రీఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఆయన ఇంటి వద్ద అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-ఇబ్రహీంపట్నం: వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రామును నకిలీ మద్యం కేసులో పోలీసులు అరెస్టు చేశారు. రమేష్‌ను ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. వేకువజామున 4.20 గంటలకు సిట్, పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు ఇబ్రహీంపట్నం వెళ్లాయి. ఒక బృందం జోగి రమేష్ ఇంటికి వెళ్లింది. నకిలీ మద్యం కేసులో రమేష్‌ను అదుపులోకి తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ సందర్భంలో రమేష్ కుటుంబసభ్యులు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. జోగి ఇంటిని తనిఖీ చేసేందుకు జారీ అయిన వారంట్ ఇచ్చి, దానిపై ఆయన సంతకం తీసుకున్నారు. అనంతరం 8 గంటలు దాటాక అదుపులోకి తీసుకుని విజయవాడ గురునానక్ కాలనీలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. మరో బృందం జోగి రమేష్ పీఏ ఆరేపల్లి రాము ఇంటికి వెళ్లింది. ఆయన్ను వెంటబెట్టుకుని జోగి రమేష్ సోదరుడు రాము ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ రామును కూడా అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించింది. ఈ కేసులో ఇప్పటికే 16 మందిని అరెస్టు చేశారు. జోగి సోదరుల అరెస్టుతో ఈ సంఖ్య 18కి పెరిగింది. (మిగతా 3లో)

గంటన్నర హైడ్రామా

తెల్లవారుజామున 4.20 గంటలకు సిట్ బృందం జోగి ఇంటికి వెళ్లింది. తలుపులు కొట్టగా ఎంతసేపటికీ తియ్యలేదు. అవి బయోమెట్రిక్ తాళాలు ఉన్న తలుపులు. గంటన్నర సేపు పోలీసులు తలుపులు కొడుతూనే ఉన్నా ఎవరూ తియ్యలేదు. ఈలోపు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు జోగి రమేష్ ఫోన్లు చేసి పిలిపించుకున్నారు. చివరకు తలుపులు పగలగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా అప్పుడు తీశారు.

తెలియదు.. సంబంధం లేదు.. గుర్తులేదు!

సిట్ విచారణకు సహకరించని జోగి రమేష్

కీలక ప్రశ్నలన్నింటికీ మౌనమే సమాధానం

అరాచకమే.. జోగి నైజం

ఐదేళ్లూ అడ్డూఅదుపూ లేకుండా రెచ్చిపోయిన వైనం

దాడులు.. జుగుప్సాకర పదజాలంతో తిట్లు

ప్రతి పనికీ ధర నిర్ణయించి మరీ అక్రమాలు

ఆధారాలతో బయటపడిన అసలు రంగు

నకిలీ మద్యం తయారీ వెలుగుచూశాక జోగి రమేష్ హంగామా 3లో

భళా.. బాహుబలి

- 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతం
- నింగిలోకి దూసుకెళ్లిన ఎల్‌వీఎం3-ఎం5
- సీ-25 క్రయోజెనిక్ స్టేజీ రీజనరేషన్ పరీక్ష సఫలం
- ఇస్రో ఛైర్మన్ నారాయణన్



నింగిలోకి దూసుకెళుతున్న ఎల్‌వీఎం3-ఎం5 వాహకనౌక

ఈనాడు డిజిటల్, తిరుపతి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. బాహుబలి రాకెట్‌గా పేరొందిన 'ఎల్‌వీఎం3-ఎం5' వాహకనౌక ద్వారా ఇది నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఇది నింగిలోకి బయల్దేరింది. 16 నిమిషాల 29 సెకన్ల పాటు పయనించి 5.42 గంటలకు ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఇది ఇస్రో నుంచి 103వ ప్రయోగం. ఈ శాటిలైట్ 15 ఏళ్ల పాటు కమ్యూనికేషన్ సేవలు అందించనుందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రయోగాన్ని విజయవంతం చేశామన్నారు. 2013లో ప్రయోగించిన జీశాట్-7 ఉపగ్రహ స్థానంలో ఇది సేవలందిస్తుందన్నారు.

ఎల్‌వీఎం3-ఎం5 నుంచి సీఎంఎస్-03 ఉపగ్రహం విడిపోయే సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ కేంద్రంలో ఉత్కంఠ నెలకొంది. శాటిలైట్ (మిగతా 2లో)



చంద్రబాబు, భువనేశ్వరిలకు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

లండన్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం

నేడు పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న సీఎం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి ఆదివారం లండన్ చేరుకున్నారు. వారికి అక్కడి తెలుగువారు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు వారందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) సంస్థ 2025 సంవత్సరానికిగానూ ప్రకటించిన డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును (మిగతా 2లో)

ఈ నెలలో రెండు భారీ ప్రాజెక్టులకు అంకురార్పణ

6న 'కేఎస్‌ఎస్‌ఎల్', 14న 'ఆర్సెలార్ మిత్తల్'లకు శంకుస్థాపనలు 8లో

రూ.1,37,400 కోట్ల పెట్టుబడులు

కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి..

తేజస్విని సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ ప్రకటించింది

బిహార్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ 12లో

రాకాసి అల.. మృత్యు వల

మైపాడు బీచ్‌లో ముగ్గురి దుర్మరణం

తుమ్మలపెంట తీరంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి 14లో

ఆత్మకూరు చెరువులో మరొకరి గల్లంతు



పదేపదే ప్రమాదాలు జరుగుతుంటే

గుత్తేదారులకు భారీ జరిమానా

రూ.50 లక్షల వరకు వడ్డన

దిల్లీ: జాతీయ రహదారులపై పదేపదే ప్రమాదాలు జరుగుతున్నట్లయితే ఆ ప్రాంతంలో పనులుచేసిన గుత్తేదారులకు భారీ జరిమానాలు విధించాలని 'కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ' నిర్ణయించింది. 'నిర్మించు- నిర్వహించు- బదిలీచేయు' (బీవోటీ) విధానంలో ఈ మేరకు మార్పులు చేసింది. 500 మీటర్ల నిర్దిష్ట పరిధిలో ఒక ఏడాదిలో ఒకటికంటే ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటే గుత్తేదారులకు రూ.25 లక్షల జరిమానా (మిగతా 2లో)

ఆలయాల పరిస్థితులపై అధ్యయనం

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారం అందజేత



మందసలో మృతురాలు బోర బృంద కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, పలాస, మందస, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆలయాల పరిస్థితులపై అధ్యయనం చేసి, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులను కలుపుకొని పని చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తొక్కిసలాట జరిగిన ఆలయ పరిసరాలను ఆదివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి మంత్రి పరిశీలించారు. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులతో మాట్లాడి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెక్కులు అందజేశారు. అనంతరం స్థానిక తెదేపా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. "కాశీబుగ్గలో జరిగిన ఘటన దురదృష్టకరం. ప్రతిపక్షాలు రాజకీయం చేయడం ఆపాలి. తొక్కిసలాట క్రమంలో ఆరేడు అడుగుల ఎత్తు నుంచి ఒకరిపై ఒకరు పడిపోవడంతోనే ప్రాణనష్టం జరిగింది. ఘటనపై కలెక్టర్ ఆధ్వర్యంలో ముగ్గురు అధికారులతో కమిటీ వేశాం. ఆలయ నిర్మాణంలో సాంకేతిక నిపుణులు, స్థపతుల సలహాలు తీసుకొని ఉంటే ఈ ఘోరం జరిగేది కాదు. ప్రైవేటు ఆలయం అయినప్పటికీ ప్రభుత్వం బాధ్యత తీసుకుంది. ధర్మకర్త అనుమతి ఇస్తే ఆలయ బాధ్యతలు (మిగతా 2లో)



ఆశీర్వచనం అందుకుంటున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దంపతులు

చినవెంకన్న సేవలో సుప్రీం న్యాయమూర్తి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి ఆదివారం సందర్శించారు. ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి దర్శనం చేయించారు. జస్టిస్ జె.కె.మహేశ్వరితో పాటు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి శ్రీవారి చిత్రపటాలు బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డా.ఎం.రామకృష్ణరాజు, సీనియర్ సివిల్ జడ్జి బి.వి.వి.కె.బుల్లి కృష్ణ, భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పాల్గొన్నారు.

తమిళనాట 'సర్' వద్దు

అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణ పనులు విడనాడాలని ఎన్నికల కమిషన్‌ను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని అఖిలపక్ష సమావేశం కోరింది. లేకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదని తెలిపింది. బిహార్ వ్యవహారంతో 'ఎస్ఐఆర్' పనులను తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల 4 నుంచి డిసెంబరు 4 వరకు తమిళనాడులో ప్రత్యేక సవరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఈసీ ప్రకటించిన నేపథ్యంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం స్టాలిన్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరగడానికి కొన్ని నెలలే ఉన్న నేపథ్యంలో 'సర్'ను తీసుకురావడాన్ని ఆమోదించలేమని సమావేశం తీర్మానించింది. వెంటనే 'సర్'ను విడనాడాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పారదర్శకంగా పాటించి 2026 శాసనసభ ఎన్నికలకు తర్వాత చేపట్టాలని కోరింది. ఇందుకు ఈసీ సమ్మతించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప తమకు వేరే మార్గంలేదని స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయాలని అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది.

లండన్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

4న భువనేశ్వరి అందుకోనున్నారు. హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఆ సంస్థ ఎండీ హోదాలో అదే వేదికపై ఆమె స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు. సోమవారం లండన్‌లో పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, పెట్టుబడిదారులతోనూ సీఎం సమావేశం కానున్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు వారిని ఆహ్వానించనున్నారు. ✦ ఆక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్ గెరాల్డ్, హిందూజా గ్రూపునకు చెందిన వివిధ సంస్థల ఛైర్మన్‌లతో చంద్రబాబు సమావేశమవుతారు. రోల్స్‌రాయిస్ గ్రూపు చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్ నిక్కీ-గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ ప్రామ్ సంస్థ ఛైర్మన్ శైలేశ్ హీరానందాని, శ్యామ్ కో హోల్డింగ్స్ ఛైర్మన్ సంపత్‌కుమార్ తదితరులతో వరుసగా భేటీ కానున్నారు. ✦ అనంతరం భారత పరిశ్రమల సమాఖ్య నేతృత్వంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తారు. ఇందులో బ్రిటిష్ హెల్త్ టెక్ ఇండస్ట్రీ, ఏఐ పాలసీ ల్యాబ్, ఫిడోటెక్, పీజీ పేపర్ కంపెనీ, నేషనల్ గ్రాఫెనీ ఇన్‌స్టిట్యూట్, వార్విక్ మాన్యుఫాక్చరింగ్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ✦ లండన్‌లోని భారత హైకమిషనర్ దొరైస్వామితో చంద్రబాబు సమావేశం కానున్నారు.

నేటి నుంచి లండన్‌లో అధికారుల పర్యటన


అమరావతిలో పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ నెల 3నుంచి 6వరకు సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, రాష్ట్ర పురపాలకశాఖ సంచాలకులు సంపత్‌కుమార్, డ్రోన్స్ కార్పొరేషన్ ఎండీ సౌర్యమాన్ పటేల్ లండన్‌లో పర్యటించనున్నారు.

తెలుగు భాషా, సాహిత్య సంపద పరిరక్షణ అవశ్యం

● పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, కడప: తెలుగు భాషా, సాహిత్య సంపదను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. కడప పర్యటనలో భాగంగా ఆదివారం సీపీ బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన హనుమచ్ఛాస్త్రి శత జయంత్యుత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. విదేశీయుడైన సీపీ బ్రౌన్ రాష్ట్రానికి వచ్చి తెలుగు భాషకు చేసిన కృషిని కొనియాడారు. ప్రతి ఊళ్లో ఒక దేవాలయం, విద్యాలయం, సేవాలయం, గ్రంథాలయం నెలకొల్పేలా సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. మాతృభాషలో పరిపాలన ఉత్తర్వులు సాగాలని, న్యాయమూర్తులు తీర్పులను తెలుగులోనే ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, సాంకేతిక విద్య స్వదేశీ భాషలోనే అందించాలంటూ.. ఈ కోణంలోనూ ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని వివరించారు. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి తన కుమార్తె నిర్వహించే స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో 50 వేలకు పైగా పుస్తకాలతో పాటు 200 తాళపత్ర గ్రంథాలను సేకరించి శుద్ధి చేసి.. వాటిని స్కాన్ చేసి భద్రపర్చడం అభినందనీయమన్నారు. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మాట్లాడుతూ యువతరం, తెలుగు భాషా ప్రేమికులు సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించారు. హనుమచ్ఛాస్త్రి శతజయంతి సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, అవధాని మేడసాని మోహన్, గ్రంథాల సంరక్షకులు ఎం.అంకేగౌడ, సాహితీవేత్త రేవూరు అనంత పద్మనాభరావుకు పురస్కారాలు ప్రదానం చేశారు. జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ సేవలను అతిథులు ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





జానమద్ది సాహితీపీఠం రూపొందించిన సీడీని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప. చిత్రంలో ఎస్‌బీఐ డీజీఎం హేమ, అవధాని మేడసాని మోహన్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, రేవూరి అనంత పద్మనాభరావు, సంగీత దర్శకుడు బాబు ప్రసాద్, యలమర్తి మధుసూదన, యోగివేమన యూనివర్సిటీ వీసీ రాజశేఖర్, జానమద్ది విజయభాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మడి గోపాలకృష్ణ, అంకేగౌడ ★ సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకయ్యనాయుడు



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్క్రీన్‌పై క్రికెట్ చూస్తూ చిన్నారుల కేరింతలు

మహిళల విజయోత్సాహం వీక్షించేందుకు డిజిటల్ స్క్రీన్లు

● ఏసీఏ, శాప్ ఆధ్వర్యంలో పలు నగరాల్లో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఆదివారం జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు రాష్ట్రంలోని పలు క్రీడా మైదానాలు, కళాశాలల వద్ద ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో డిజిటల్, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు చూసేందుకు వీలుగా వీటిని అమర్చారు. ఏసీఏ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంతో పాటు విశాఖపట్నంలోని రెండు స్కూళ్లలో, కాకినాడ, తిరుపతిల్లో ఒక్కో కళాశాల వద్ద స్క్రీన్లు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా శాప్ కార్యాలయాల వద్ద ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చారు.

మన వనిత.. విశ్వవిజేత


(మొదటి పేజీ తరువాయి)

ఆ ఊపు చూస్తే 350 కొట్టేయబోతున్నాం, అలవోకగా మ్యాచ్ గెలిచేయబోతున్నాం అని ధీమా! కానీ చివరికి చూస్తే లక్ష్యం 299 పరుగులే. ఇదే వేదికలో సెమీఫైనల్లో మన జట్టు ఛేదించిన స్కోరు కంటే ఇది 40 తక్కువ. మరి ఈ స్కోరును కాపాడుకోగలరా అన్న అనుమానం! కెప్టెన్ ముందుండి నడిపించగా సఫారీ జట్టు 39 ఓవర్లకు 207/5తో నిలిచిన సమయాన లోలోన గుబులు! కానీ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన విజయం గాలివాటం కాదని చాటుతూ.. ఇది ఒకప్పటి జట్టు కాదని.. తమది సిసలైన ఛాంపియన్ బృందమని రుజువు చేస్తూ.. హర్మన్‌ప్రీత్ సేన ఒక్కసారిగా జూలు విదిల్చింది.

తమ జీవితాల్లో అత్యంత ముఖ్యమైన రోజు.. పదకొండు మందీ ప్రాణం పెట్టి ఆడగా.. జట్టంతా చేయి చేయి కలిపి సమష్టిగా కదలగా.. కలల కప్పును ఒడిసిపట్టింది భారత్. గ్రూప్ దశలో పడుతూ లేస్తూ సాగినప్పటికీ, సెమీస్‌లో ఆస్ట్రేలియా రూపంలో ఎదురైన అతి పెద్ద అడ్డంకిని మహా గొప్ప ఆటతో అధిగమించిన టీమ్‌ఇండియా.. ఆఖరి పోరులో దక్షిణాఫ్రికా విసిరిన సవాల్‌నూ కాచుకుంది. ఆఖరి పోరులో అద్భుత విజయంతో తొలిసారి ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించింది.

✦ భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలిచి దేశం గర్వపడేలా చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా కొనియాడారు.

పీఆర్‌సీఐ ఏపీ డైరెక్టర్‌గా వీఎస్ఆర్ నాయుడు



ఈనాడు, అమరావతి: ప్రజా సంబంధాల రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న వీఎస్ఆర్ నాయుడు పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) డైరెక్టర్ (నేషనల్ ఎగ్జిక్యూటివ్-ఏపీ)గా నియమితులయ్యారు. గతంలో ఆయన ఏపీ ట్రాన్స్‌కోలో జనరల్ మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్)గా, ఏపీ సౌర విద్యుత్తు సంస్థలో చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. పీఆర్‌సీఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్‌గా, పీఆర్‌సీఐ అమరావతి చాప్టర్ వ్యవస్థాపక ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. వీఎస్ఆర్ నాయుడు పీఆర్‌సీఐ నేషనల్ ఎగ్జిక్యూటివ్‌లో డైరెక్టర్ హోదాలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

పదేపదే ప్రమాదాలు జరుగుతుంటే గుత్తేదారులకు భారీ జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

పడుతుంది. మరుసటి ఏడాది మరో ప్రమాదం సంభవిస్తే ఇది రూ.50 లక్షలకు పెరుగుతుంది. 15-20 ఏళ్లపాటు అమల్లో ఉండే ఒప్పందాల్లో గుత్తేదారులకు జవాబుదారీతనం నిర్ణయించడం దీని ఉద్దేశం. బీవోటీ విధానంలో నిర్మించే హైవేలపై ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లదేనని, వారే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ స్పష్టంచేశారు. ప్రమాద ముప్పు 3,500 ప్రాంతాల్లో ఉందన్నారు. జరిమానాలు విధించడంతోపాటు రోడ్డుప్రమాద బాధితులకు తక్షణ, నగదురహిత చికిత్స అందించే పథకాన్ని దేశవ్యాప్తం చేయనున్నారు. ఈ ఏడాది మే నెలలో ప్రయోగాత్మకంగా దీనిని చేపట్టారు. ప్రమాదం సంభవించిన వారం రోజుల్లోపు నిర్ణీత ఆసుపత్రుల్లో చికిత్సకు రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సాయం ఈ పథకం కింద అందుతుంది. నమోదు, పరిశీలన, క్లెయింలు నగదురహితంగా, సమర్థంగా జరిగేలా జాతీయ రహదారుల సంస్థ సాంకేతిక ఏర్పాట్లు చేసింది.

భళా.. బాహుబలి



వాహకనౌక నమూనాతో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, వివిధ విభాగాల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించినట్లు అధికారికంగా ప్రకటించినప్పటికీ శాస్త్రవేత్తల నుంచి ఎలాంటి ఆనందోత్సాహాలూ వ్యక్తంకాలేదు. దీంతో ప్రయోగంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడిన నారాయణన్ దీనిపై స్పష్టత ఇచ్చారు. ఎల్‌వీఎం3లోని ఆఖరి దశ అయిన సీ-25 క్రయోజనిక్ స్టేజీని రీఇగ్నైట్ అయ్యేలా తొలిసారి ప్రయోగం చేయడమే ఇందుకు కారణమన్నారు. సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టాక క్రయోజెనిక్ ఇంజిన్‌లోని థ్రస్ట్ చాంబర్‌ను మరోసారి విజయవంతంగా మండించామని చెప్పారు. "సీఎంఎస్-03.. రాకెట్ నుంచి విడిపోవడం కోసం ఉత్కంఠగా ఎదురుచూశాం. ఆ తర్వాత క్రయోజెనిక్ ఇంజిన్‌తో ప్రయోగం నిర్వహించాం. ఇది కూడా పూర్తయ్యే వరకూ ఎదురుచూశాం. అందువల్లే మేం వెంటనే స్పందించలేదు" అని తెలిపారు. భవిష్యత్‌లో ఒకే రాకెట్ ద్వారా బహుళ కక్ష్యల్లోకి అనేక ఉపగ్రహాలను పంపడానికి ఈ ప్రయోగం బాటలు వేస్తుందన్నారు. సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడడంతోపాటు సముద్ర వాతావరణ పరిస్థితులు తెలుసుకొనే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళ అవసరాల కోసం దీన్ని రూపొందించారు. భారత భూభాగం నుంచి ఇస్రో ప్రయోగించిన అతి పెద్ద కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇదే. భారీ శాటిలైట్లను ప్రయోగించడానికి ఇప్పటివరకూ ఇస్రో.. ఫ్రాన్స్‌కు చెందిన ఎరియాన్-5 రాకెట్‌పై ఆధారపడేది. ఎల్‌వీఎం-3 వల్ల ఇప్పుడు వీటిని మన దేశం నుంచే ప్రయోగించేందుకు వీలు కలుగుతోంది.

మార్చిలోగా మరో ఏడు

వచ్చే ఏడాది మార్చి నాటికి మరో ఏడు ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటించారు. ఎల్‌వీఎం-3 ద్వారా వాణిజ్య సంస్థకు చెందిన సమాచార ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామన్నారు. ఆ తర్వాత మూడు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు ఉంటాయన్నారు. ప్రైవేటు ఆధ్వర్యంలో రూపొందిస్తున్న పీఎస్ఎల్‌వీ-ఎన్1 రాకెట్‌నూ మార్చిలోగా ప్రయోగిస్తామన్నారు. యావత్ భారతదేశం ఎదురుచూస్తున్న గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా చేపట్టే మూడు మానవరహిత మిషన్లలో మొదటిది వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలోగా ఉంటుందని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 50 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగిస్తుందన్నారు.

గవర్నర్, ముఖ్యమంత్రి హర్షం

ఈనాడు, అమరావతి: ఇస్రో నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతం కావడంపై గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇదో కీలక మైలురాయని ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ ఘనత సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన వైకాపా విద్యార్థి సంఘం నేత



కొండారెడ్డి

విశాఖపట్నం (పెదవాల్తేరు), న్యూస్‌టుడే: విశాఖలో వైకాపా విద్యార్థి విభాగం నేత డ్రగ్స్ తరలిస్తూ పట్టుబడ్డారు. తమకు అందిన సమాచారంతో విశాఖలోని టాస్క్‌ఫోర్స్, నాలుగో పట్టణ పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడులు నిర్వహించారు. రైల్వేస్టేషన్‌కు సమీప శ్రీనివాస కల్యాణ మండపం వద్ద ఐదుగురు వ్యక్తులు ఎల్.ఎస్.డి. స్ట్రిప్స్ నగరానికి తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేపట్టి వారినుంచి 48 స్ట్రిప్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కరరావు తెలిపారు. డ్రగ్స్ తరలిస్తున్న వారిలో వైకాపా విద్యార్థి విభాగం నేత మద్దిలపాలేనికి చెందిన కొండారెడ్డి ఉన్నారు. ఆయనతో పాటు విజయవాడకు చెందిన చరణ్, శ్రీకాకుళానికి చెందిన హర్షవర్ధన్, శరత్‌లను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి సంతానం పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరంతా దురంతో ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు నుంచి వాటిని విశాఖ తరలించినట్లు గుర్తించారు. పట్టుబడిన వారిని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు.

ఆలయాల పరిస్థితులపై అధ్యయనం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునేందుకు ఆలోచిస్తాం. సలహా కమిటీ నివేదిక వచ్చాక ధర్మకర్తకు సూచనలు చేసి, ఆలయాన్ని సరైన పద్ధతిలో నడిచేలా చేస్తాం. సొంతంగా నిర్వహించే ఆలయాలపై పూర్తి వివరాలతో జాబితాగా తయారు చేసి కలెక్టర్, దేవాదాయ శాఖ పరిధిలో ఉంచేలా ప్రయత్నిస్తాం" అని వివరించారు. మందసలోని శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడి అర్చకులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ మంత్రి వెంట ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేత

తొక్కిసలాట ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు ఆదివారం పరిహారం చెక్కులను అందజేశారు. కొందరు క్షతగాత్రులకూ పరిహారం చెక్కులు పంపిణీ చేశారు.

✦ పలాస, సోంపేట, టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల విలువైన చెక్కులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్యే శిరీష అందజేశారు.

✦ మందసకు చెందిన బోర బృంద, బెల్లుపటియాకు చెందిన దువ్వు రాజేశ్వరి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చెక్కులు ఇచ్చారు.

పలాస సీహెచ్‌సీలో 11 మందికి చికిత్స

ఈనాడు, అమరావతి: తొక్కిసలాటలో గాయపడి, చికిత్స అనంతరం కోలుకున్న వారిని ఇళ్లకు పంపుతున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవల గురించి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం 11 మంది పలాస సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు.



వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటకు చెందిన మురిపింటి నీలమ్మ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, శిరీష

రద్దీ నియంత్రణకు ప్రణాళిక

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రైవేటు ఆలయాల్లో ఎలాంటి కార్యాచరణ అమలు చేయాలనే దానిపై దేవాదాయ శాఖ దృష్టి పెట్టింది. భక్తుల రద్దీకి తగినట్లుగా తీసుకోవాల్సిన చర్యలపై తగిన సూచనలు సలహాలతో ప్రణాళికను జారీ చేసి.. అమలు చేసేలా చూడనుంది. ఇందులో భాగంగా ప్రైవేటు ఆలయాల వివరాలను రెండు మూడు రోజుల్లో పంపాలని ఆ శాఖ కమిషనర్ అన్ని జిల్లాల దేవాదాయ శాఖ అధికారులను కోరారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆలయాల్లో క్యూలైన్ల ఏర్పాటు, భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు తదితర ఏర్పాట్లు ఎలా అమలు చేయాలనే దానిపై దేవాదాయ శాఖ తరఫున శాశ్వత కార్యాచరణ ప్రణాళికను జారీ చేయనున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు వీటిని అమలు చేయాలి. భక్తులు ఏ రోజుల్లో అధికంగా వస్తారన్న వివరాలను తయారు చేసి.. వాటిని పోలీసు, రెవెన్యూ, జిల్లా అధికార యంత్రాంగానికి ఇవ్వాలి. అలాగే ఆయా ఆలయాల నిర్వాహకులకు అవసరమైతే దేవాదాయశాఖ అధికారులు తగిన సూచనలు చేస్తారు.

'మెయిన్స్'లో కాలిక్యులేటర్‌కు అనుమతి లేదు: ఎన్‌టీఏ

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్‌లో ఏ రూపంలోనూ కాలిక్యులేటర్‌ను అనుమతించబోమని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) స్పష్టం చేసింది. జేఈఈ మెయిన్స్‌కు సంబంధించి శుక్రవారం అర్ధరాత్రి వెబ్‌సైట్‌లో సమాచార పత్రాన్ని పెట్టిన ఎన్‌టీఏ.. అందులో వర్చువల్ కాలిక్యులేటర్ వినియోగించుకోవచ్చని పేర్కొంది. తాజాగా ఆదివారం దానిపై ఆ సంస్థ వివరణ ఇచ్చింది. సమాచార పత్రంలో పొరపాటు దొర్లిందని, ఎటువంటి కాలిక్యులేటర్‌ను అనుమతించడం లేదని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపింది.

ముఖం కడుక్కోండి.. నిద్రమత్తు వీడండి

రాత్రివేళ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎక్కువగా ప్రమాదాలకు నిద్రమత్తే కారణమని గుర్తించి, వాహన డ్రైవర్లను అప్రమత్తం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ రహదారులపై వెళ్లే బస్సులు, భారీ వాహనాలను పోలీసులు ఆపి.. డ్రైవర్లు ముఖం శుభ్రం చేసుకోవడానికి నీళ్లు ఇస్తున్నారు. కాసేపు ఆగిన తర్వాత టీ కూడా ఇచ్చి, తాగేసి వెళ్లాలని చెబుతున్నారు. విజయనగరం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాలతో చెల్లూరులోని జాతీయ రహదారిపై శనివారం ఇలా తనిఖీలు చేపట్టారు.



– న్యూస్‌టుడే, విజయనగరం నేరవార్తా విభాగం

గ్రహం అనుగ్రహం

3–11–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, శుక్లపక్షం
త్రయోదశి: రా. 11-39 తదుపరి చతుర్దశి
ఉత్తరాభాద్ర: మ. 12-59 తదుపరి రేవతి
వర్జ్యం: రా. 12-30 నుంచి 2-02 వరకు
అమృత ఘడియలు: ఉ.8-22 నుంచి 9-54 వరకు
దుర్ముహూర్తం: మ. 12-07 నుంచి 12-52 వరకు తిరిగి 2-23 నుంచి 3-09 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.03; సూర్యాస్తమయం: సా.5.26

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	38.0	24.5
నరసాపురం	35.8	27.0
నెల్లూరు	35.4	28.0
ఒంగోలు	35.2	27.4
విజయవాడ	35.0	24.7
శ్రీకాకుళం	34.0	26.0
అనంతపురం	34.0	23.2
విశాఖపట్నం	33.2	25.6
కడప	33.0	25.0
తాడేపల్లిగూడెం	32.0	28.0
కర్నూలు	32.0	25.6
విజయనగరం	32.0	25.0

జోగి రమేష్‌కు ఒక్కో విడతలో రూ.3-5 లక్షలు

- రెండు, మూడు నెలలకోసారి అందజేసిన అద్దేపల్లి జనార్దన్‌రావు
- నకిలీ మద్యం తయారీకి అండదండలిచ్చినందుకు ప్రతిఫలంగా చెల్లింపు
- ఈ దందాతో ప్రభుత్వ ఖజానాకు రూ.9 కోట్ల నష్టం
- తీవ్ర ఆర్థిక నేరానికి పాల్పడిన జోగి రమేష్, రాము
- మనీ ట్రయల్ గుట్టు విప్పాల్సి ఉంది
- రిమాండు రిపోర్టులో ప్రస్తావించిన ఎక్సైజ్, సిట్ అధికారులు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ-1), ఆయన సోదరుడు జగన్మోహన్‌రావు (ఏ-2)లు వైకాపా ముఖ్యనేత, మాజీ మంత్రి జోగి రమేష్ (ఏ-18), ఆయన సోదరుడు జోగి రాము (ఏ-19)లకు రెండు మూడు నెలలకోసారి రూ.3-5 లక్షల చొప్పున డబ్బు ముట్టజెప్పేవారని ఎక్సైజ్, సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. నకిలీ మద్యం దందాకు అండదండలు, సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ప్రతిఫలంగా ఈ సొమ్ము ముట్టజెప్పేవారని వెల్లడైంది. రమేష్ ఆదేశాల మేరకు వైకాపా హయాంలో 2022 జూన్‌లో జనార్దన్‌రావు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.8 లక్షలు విత్‌డ్రా చేసి అందులో రూ.4 లక్షలు, మరో సందర్భంలో రూ.9 లక్షలు విత్‌డ్రా చేసి అందులో రూ.5 లక్షలను ఇబ్రహీంపట్నంలోని పెట్రో హౌస్ వద్ద జోగి రాముకు ముట్టజెప్పినట్లు గుర్తించింది. రమేష్ జనార్దన్‌రావు డబ్బులిచ్చినట్లు తాము చూశామని పలువురు సాక్షులు వెల్లడించినట్లు పేర్కొంది. నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేష్, రాములను అరెస్టు చేసిన ఎక్సైజ్, సిట్ అధికారులు.. వారిద్దరినీ ఆదివారం రాత్రి 11 గంటలకు విజయవాడ ఎక్సైజ్ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇప్పటివరకూ దర్యాప్తులో తేలిన అంశాలు, జనార్దన్‌రావు, జోగి రమేష్ మధ్య సంబంధాలు, ఈ కేసులో వీరి ప్రమేయం, పాత్ర, కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా ములకలచెరువులో జనార్దన్‌రావుతో నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేయించడం, దానిపై దాడికి ముందు.. ముందస్తు కుట్ర ప్రకారం జనార్దన్‌రావును ఆఫ్రికాకు పంపేయడం తదితర అంశాలన్నింటినీ వివరిస్తూ న్యాయస్థానానికి రిమాండు రిపోర్టు సమర్పించారు. నకిలీ మద్యం దందా వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.9 కోట్ల నష్టం వాటిల్లినట్లు గుర్తించామని, దీనిపై ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించింది. అందులోని ఇతర ప్రధానాంశాలివి.

జోగి మద్దతుతోనే నకిలీ దందా..

◆ అద్దేపల్లి జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావులు జోగి రమేష్ మద్దతుతోనే తెలంగాణలో తక్కువ ధరకు మద్యం కొని తీసుకొచ్చి దాన్ని వేరే బాటిళ్లలో నింపి అధిక ధరకు విక్రయించేవారు. నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. చిన్నతనం నుంచే రమేష్, జనార్దన్‌రావు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి.

◆ జోగి రమేష్, రాము 2006-19 మధ్య స్వర్ణబార్‌లో భాగస్వాములు. 2019లో దాని పేరు చెర్రీస్ బార్‌గా మార్చారు. వీరిద్దరి సహకారంతోనే జనార్దన్‌రావు 2013లో బాలాజీ బార్‌ను గుడివాడలో ఇచ్చి కొన్నారు. తర్వాత దాని పేరును ఏఎన్ఆర్ రెస్టారెంట్ అండ్ బార్‌గా మార్చారు. 2017లో ఇబ్రహీంపట్నం బార్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అందులో జోగి రమేష్, రాములు కీలకం. 2019 ఎన్నికలు జరిగేవరకూ ఈ సిండికేట్ కొనసాగింది.

◆ తర్వాత 2023 నుంచి జనార్దన్‌రావు.. జోగి రమేష్, రాము సహకారంతో నకిలీ మద్యం తయారీ మొదలుపెట్టారు. గతేడాది ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం.. నిఘా పెరగడంతో నకిలీ మద్యం తయారీని జనార్దన్‌రావు ఆపేశారు.

ములకలచెరువులో నకిలీ మద్యం ఆయన పనే

కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని, దుష్ప్రచారం చేయాలనే లక్ష్యంతో అద్దేపల్లి జనార్దన్‌రావును ముందు పెట్టి రమేష్ ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేయించారు. తంబళ్లపల్లె నాయకుడు జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి తోడుత ఈ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటుకు అంగీకరించలేదు. జనార్దన్‌రావు వారిపై ఒత్తిడి తేవటంతో వారు మౌనంగా ఉన్నారు. సెప్టెంబరు 15, 16 తేదీల్లో జోగి రమేష్, రాములు జనార్దన్‌రావును సంప్రదించి జయచంద్రారెడ్డి ఎక్కడున్నారని ఆరాతీశారు. ఆఫ్రికాలో ఉన్నట్లు చెప్పగా.. ఆ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశించారు. సెప్టెంబరు 23 ఉదయం 8.30 గంటలకు జనార్దన్‌రావు జోగి రమేష్ ఇంటికి వెళ్లారు. రూ.3 కోట్లు ఇస్తానని రమేష్ ప్రలోభపెట్టడంతో సెప్టెంబరు 24న జనార్దన్‌రావు ఆఫ్రికా వెళ్లారు. తర్వాత కొద్దిరోజులకు రమేష్.. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రం గురించి సమాచారం బయటకు వ్యాప్తి చేయించి ప్రభుత్వంపై దుష్ప్రచారం మొదలుపెట్టారు. ఆయనా ప్రభుత్వంపై వ్యతిరేకత రాజేసేవిధంగా ఇబ్రహీంపట్నంలో నకిలీ దందా జరుగుతోందని హడావుడి చేశారు.

◆ జోగి రమేష్, రాము తీవ్ర ఆర్థికనేరానికి పాల్పడ్డారు. అక్రమంగా, అనుచితంగా ఆర్థిక లబ్ధి పొందారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మనీ ట్రయల్, కుట్రదారులు, కొల్లగొట్టిన సొత్తు ఎక్కడికి చేర్చారు తదితర అంశాలపై జోగి సోదరులను లోతుగా విచారించాలి. వారు విచారణకు సహకరించలేదు. వీరు రాజకీయంగా పలుకుబడి గల వ్యక్తులు. సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదముంది. ఆధారాలు ధ్వంసం చేయొచ్చు. పారిపోయేందుకు అవకాశముంది. అందుకే వారిని కస్టడీకి తీసుకోవాల్సి ఉంది.



గత నెల 6న పాత ఏఎన్ఆర్ బార్ వద్ద వైకాపా శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న జోగి రమేష్

ఆధారాలతో బయటపడిన అసలు రంగు

నకిలీ మద్యం తయారీ వెలుగుచూశాక జోగి రమేష్ హంగామా

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం: తామే నకిలీ మద్యం వ్యవహారాన్ని వెలికి తీయించామని.. మేం లేకపోతే కూటమి ప్రభుత్వం నీరుగార్చేది అంటూ ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం యూనిట్, సీసాలను స్వాధీనం చేసుకున్న సమయంలో మాజీ మంత్రి జోగి రమేష్ అక్కడకు వచ్చి నానా యాగీ చేశారు. చివరకు ఆయన పాత్ర బయట పడడంతో ఆదివారం అరెస్టయ్యారు. గత నెల 6న ఇబ్రహీంపట్నంలోని జనార్దన్‌రావుకు చెందిన పాత ఏఎన్ఆర్ బార్‌లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేసి నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు చేశారు. ఆ సమయంలో జోగి.. తన అనుచరులను వెంటబెట్టుకుని అక్కడకు వచ్చారు. నానా హడావుడి చేశారు. నకిలీ మద్యం డంపు వెలుగులోకి వచ్చేందుకు తామే కారణమని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారంలో తనకున్న లింకులను దాచి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారు. పెద్దఎత్తున ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. నారా వారి సారా అంటూ చలోక్తులు విసిరారు. ప్రభుత్వమే నకిలీ మద్యం తయారు చేయిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు లొంగుబాటుతో జోగి రమేష్ వ్యవహారమంతా బయటకు వచ్చింది. మద్యం తయారీ ముడిసరకులను స్వాధీనం చేసుకునే సమయంలోనూ ఎక్సైజ్ పోలీసుల విధులకు జోగి రమేష్ ఆటంకం కలిగించారు. చివరకు వారి ఫిర్యాదుతో ఆయనపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

జోగి పాత్ర తేలడంతోనే అరెస్టు: ఎక్సైజ్ మంత్రి రవీంద్ర



భోగాపురంలో మహిళా రైతులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం, న్యూస్‌టుడే: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ పాత్ర ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టయ్యారని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని భోగాపురం, రాయపురాజుపేట గ్రామాల్లో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుతో కలిసి తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. మహిళా రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. 'నకిలీ మద్యం కేసులో అనుమానాలు సృష్టించి కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేయాలని జరుగుతున్న కుట్ర బహిర్గతమైంది. జనార్దన్‌రావు విదేశీ పర్యటనకు వెళ్లేటప్పుడు రమేష్ కలిసినట్లు పక్కా సమాచారం ఉంది. ఇదంతా చేసేందుకు రూ.3 కోట్లు ఇచ్చేందుకు సమ్మతించినట్లు విచారణలో తేలింది' అని వివరించారు.

మాజీ మంత్రే సూత్రధారి: అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ సూత్రధారి మాజీ మంత్రి జోగి రమేష్ అయితే.. పాత్రధారి అద్దేపల్లి జనార్దన్‌రావు ముఠా అని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. నేరస్థులకు కులాలు ఉండవని, వారు కులద్రోహులని దుయ్యబట్టారు. "ఎన్నో ఆధారాలు జోగి రమేష్ పాత్రను స్పష్టంగా రుజువు చేస్తున్నా ఆయన్ను వైకాపా నుంచి జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదు? ఇద్దరూ తోడుదొంగలు కావడంతో నేనా?'' అని నిలదీశారు. న్యాయస్థానాల్లో ఆధారాలు నిలబడతాయి కానీ.. జోగి చేస్తున్న ప్రమాణాలు, ఒట్లు, సవాళ్లు కావని ఆదివారం ఓ ప్రకటనలో సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

నకిలీ మద్యం తయారు చేయించింది ఆయనే

- ఎక్సైజ్, సిట్ అధికారుల దర్యాప్తులో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయించింది వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేషేనని ఎక్సైజ్, సిట్ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. రమేష్ మంత్రిగా ఉండగా ఆయన అండదండలతోనే ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావు ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం దందా మొదలుపెట్టినట్లు తేలింది. జగన్ జమానాలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో నాటి ప్రభుత్వ పెద్దల పాత్రపై వెలుగుచూస్తున్న సంచలన నిజాల నుంచి ప్రజల దృష్టి మరల్చడం, అదే సమయంలో కూటమి ప్రభుత్వంలో ఊరూరా నకిలీ మద్యం తయారవుతోందని దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా... తన చిన్ననాటి స్నేహితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావుతో ములకచెరువులో జోగి రమేష్ నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేయించినట్లు వెలుగుచూసింది. జనార్దన్‌రావు, ఆయన సోదరుడు జగన్మోహన్‌రావులను వారం రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించిన ఎక్సైజ్ అధికారులు పలు కీలక సమాచారం రాబట్టారు. వారిచ్చిన వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలతో సరిచూసుకున్న తర్వాతే జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము పాత్రలపై నిర్ధారణకు వచ్చి అరెస్టు చేశారు.

నేరపూరిత కుట్రలోనూ ప్రధాన పాత్ర

జోగి రమేష్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోనే ఇబ్రహీంపట్నంలో జనార్దన్‌రావు నకిలీ మద్యం తయారు చేసేవారని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నుంచి నకిలీ మద్యాన్ని తీసుకొచ్చి తన బార్‌లో విక్రయించేవారని తేల్చారు. 'జోగి రమేష్, ఆయన సోదరుడు రాము ద్వారా ఈ ఏడాది ఏప్రిల్‌లో నన్ను వాళ్ల ఇంటికి పిలిపించారు. వైకాపాకు రాజకీయంగా మైలేజీ రావాలంటే తెదేపాపై బురదజల్లాలని, కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలని నాతో చెప్పారు. వైకాపా హయాంలో నకిలీ మద్యం తయారు చేసినట్లే మళ్లీ మొదలుపెట్టాలని ఆదేశం చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో ఈ నకిలీ మద్యం తయారీ చేపట్టాలన్నారు. ఎందుకని అడిగితే 'తంబళ్లపల్లె నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి నీ క్లాస్‌మేట్ కదా, ఆ నియోజకవర్గం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుపై దుష్ప్రచారం చేయాలంటే అక్కడే నకిలీ మద్యం తయారుచేయాలని చెప్పారు' అంటూ జనార్దన్‌రావు ఎక్సైజ్ అధికారులకు వాంగ్మూలమిచ్చారు. దీంతో తాజాగా వెలుగుచూసిన నకిలీ మద్యం తయారీ దందా వెనక నేరపూరిత కుట్రలో జోగి రమేష్‌దే ప్రధాన పాత్రని తేటతెల్లమైంది.

ఆ రూ.3 కోట్లు ఎవరు సమకూర్చుస్తామన్నారు?

ములకలచెరువు, ఇబ్రహీంపట్నాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటుచేసి.. ఆ బురదను కూటమి నాయకులపై చల్లితే ఆఫ్రికాలో డిస్టిలరీ ఏర్పాటుకు రూ.3 కోట్లు ఇస్తానని జోగి రమేష్ తనను ప్రలోభపెట్టి ఈ దందాలో పావుగా వాడుకున్నారని జనార్దన్‌రావు వాంగ్మూలమిచ్చారు. ఆ ప్రలోభానికి ఆశపడే ఈ కుట్రలో భాగస్వామినయ్యానని చెప్పారు. అయితే ఈ రూ.3 కోట్లు ఎక్కడి నుంచి సమకూర్చాలనుకున్నారు? దాని వెనక ఎవరున్నారనే దానిపై ఎక్సైజ్, సిట్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ములకలచెరువులో దాడి జరగకముందే అద్దేపల్లి జనార్దన్‌రావును ఆఫ్రికాకు పంపడం, ఇబ్రహీంపట్నంలో జనార్దన్‌రావుకు చెందిన బార్ ఎదురుగా ఉన్న గోదాములో రాత్రికి రాత్రి నకిలీ మద్యం తయారీ జరుగుతున్నట్లు క్యాన్లు, సరుకు పెట్టడం అన్నీ జోగి రమేష్ కనుసన్నల్లోనే నడిచాయని ఎక్సైజ్, సిట్ అధికారులు గుర్తించారు. ముందస్తు కుట్రలో భాగంగానే నకిలీ మద్యం తాగి అనేకమంది చనిపోయారంటూ సాక్షి పత్రిక, ఛానల్‌లో ప్రచారం చేయించినట్లు వెల్లడైంది. జనార్దన్‌రావును ముందు పెట్టుకుని జోగి రమేష్, వైకాపా ముఠా నడిపించిన నేరపూరిత కుట్ర, కుతంత్రమంతా దర్యాప్తులో బయటపడటంతో జోగి సోదరులను అరెస్టు చేశారు.

తెలియదు.. సంబంధం లేదు.. గుర్తులేదు!

- సిట్ విచారణకు సహకరించని జోగి రమేష్

ఈనాడు, అమరావతి: 'నాకు తెలియదు, సంబంధం లేదు. గుర్తులేదు..' సిట్ విచారణలో ఎక్కువ ప్రశ్నలకు నకిలీ మద్యం కేసు నిందితుడు జోగి రమేష్ ఇచ్చిన సమాధానాలివే. అరెస్టు అనంతరం విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో 11 గంటలకు పైగా జోగి, ఆయన సోదరుడు రామును సిట్ పోలీసులు వేర్వేరుగా విచారించారు. పోలీసులు ఏం అడిగినా.. జోగి రమేష్ పొడిపొడిగానే సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. తనకు ఈ కేసుతో సంబంధం లేదని, మీరు అడుగుతున్నవేవీ తెలియదంటూ చెప్పుకొచ్చారు. 'చంద్రబాబు ఇంటిమీదకు నేను వెళ్లినందుకే ఈ కేసులో ఇరికించారు. నా కుమారుడిని కూడా అగ్రిగోల్డ్ భూముల కేసులో కక్షపూరితంగా ఇరికించారు. నా కుమారుడు ఇంకా జీవితంలో స్థిరపడలేదు. అమెరికా నుంచి రాగానే అరెస్టు చేశారు' అంటూ జోగి పదేపదే చెప్పినట్టు తెలిసింది. అద్దేపల్లి జనార్దన్‌రావు తనకు తెలియదని, ఎందుకు పదేపదే అడుగుతున్నారంటూ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కీలకమైన ప్రశ్నలకు మౌనమే సమాధానమని తెలిసింది. రమేష్ సోదరుడు రామును కూడా సిట్ పోలీసులు వేరుగా విచారించగా.. ఆయన నుంచీ ఎలాంటి సమాధానాలు రాలేదని తెలిసింది.

విచారణ సాగిందిలా..

◆ అద్దేపల్లి జనార్దన్‌రావు మీకు తెలుసా?
జోగి: నాకు తెలియదు.
◆ అతనితో కలిసి మీరు ఏవైనా వ్యాపారాలు చేశారా?
జోగి: నేను ఎవరితోనూ వ్యాపారాలు చేయలేదు.
◆ ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయా?
జోగి: ఎలాంటివీ జరగలేదు.
◆ మీరు చివరిసారి అతడిని ఎప్పుడు కలిశారు?
జోగి: నాకు తెలియదు, గుర్తులేదు.
◆ మీ ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి కదా?
జోగి: అవి ఎలా వచ్చాయో నాకు తెలియదు.



విజయవాడ జీజీహెచ్‌లో వైద్యపరీక్షల అనంతరం జోగి రమేష్, ఆయన సోదరుడు రామును కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

తొక్కిసలాట ఘటన నుంచి దృష్టి మరల్చేందుకే జోగి అరెస్టు

వైకాపా అధినేత జగన్

ఈనాడు, అమరావతి: కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటన నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే మాజీ మంత్రి జోగి రమేష్‌ను కూటమి ప్రభుత్వం అరెస్టు చేయించిందని వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని రమేష్ హైకోర్టులో పిటిషన్ వేసిన మరుసటి రోజే ఆయన్ను అరెస్టు చేశారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అరెస్టును ఖండించారు.

జోగి రమేష్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

నకిలీ మద్యం కేసులో రమేష్, రాము సోదరుల పాత్రపై సిట్, ఎక్సైజ్ అధికారులు పలు కోణాల్లో విచారించి ఆధారాలు సేకరించారు. ఆర్థిక లావాదేవీలు, కాల్ డేటా, ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు విచారణలో వెల్లడించిన అంశాలు.. ఇలా పలు మార్గాల్లో పోలీసులు సమాచారం రాబట్టారు. తమకు, జోగి సోదరులకు మధ్య ఎప్పట్నుంచో వ్యాపార సంబంధాలు ఉన్నాయని ఇప్పటికే జనార్దన్‌రావు వెల్లడించారు. జోగి, జనార్దన్‌రావుల మధ్య సాగిన వాట్సప్ సంభాషణలు, అద్దేపల్లి సోదరులు జోగి రమేష్‌తో కలిసి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. 2023లో జోగి మంత్రిగా ఉన్నప్పుడే నకిలీ మద్యం తయారీని చేపట్టినట్లు విచారణలో ప్రధాన నిందితుడు వెల్లడించారు. రూ.3 కోట్ల ఆర్థిక సాయం చేస్తానని, ఆ డబ్బుతో ఆఫ్రికాలో డిస్టిలరీ ఏర్పాటు చేసుకోవచ్చని ఆశ పెట్టినట్లు చెప్పారు. మాజీ మంత్రి ప్రోద్బలంతోనే తయారీని చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి వీడియో, స్టేట్‌మెంట్లను ఇప్పటికే సిట్.. కోర్టుకు సమర్పించింది.

ఇంటివద్ద కార్యకర్తల నినాదాలు

జోగి అరెస్టు సమాచారం తెలియడంతో ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటి వద్దకు పార్టీ కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. జోగికి అనుకూలంగా నినాదాలు చేశారు. అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ నిరసన తెలియజేశారు.

జోగి పీఏను ప్రశ్నించిన పోలీసులు

మాజీమంత్రి ప్రధాన అనుచరుడు, పీఏ అయిన ఆరేపల్లి రామును పోలీసులు విజయవాడ ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రశ్నించారు. రమేష్ ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ నేపథ్యం, రాజకీయ కార్యకలాపాలు, లావాదేవీల గురించి వివరాలు అడిగారు. స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. తిరిగి ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరుకావాలని చెప్పి విడిచిపెట్టారు. ఇబ్రహీంపట్నంలోని జోగి సోదరుల ఇళ్లలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్సైజ్, సిట్, క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. పలు పత్రాలు, కీలక ఆధారాలు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నాయి. జోగి రమేష్, ఆయన భార్య, జోగి రాము ఫోన్లతో పాటు... జోగి రమేష్ ఇంటి సీసీటీవీ ఫుటేజిని కూడా సిట్ బృందం స్వాధీనం చేసుకుంది.



వైకాపా నేత జోగి రమేష్‌ను అరెస్ట్ చేసి తరలిస్తున్న పోలీసులు

పక్కాగా రెక్కీ.. గుట్టుగా ప్రణాళిక అమలు

ఈనాడు, అమరావతి: జోగి రమేష్ అరెస్టుకు సిట్, పోలీసులు పకడ్బందీ వ్యూహం పన్నారు. ఎక్కడా సమాచారం లీక్ కాకుండా, నిందితులు తప్పించుకునే వీల్లేకుండా పక్కా ప్లాన్‌తో రమేష్, ఆయన సోదరుడు రామును అదుపులోకి తీసుకున్నారు. జోగి సోదరుల కదలికలపై శనివారం సాయంత్రం నుంచే నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు వారి సెల్‌టవర్ లొకేషన్లను పరిశీలిస్తూ, ఇంటికి ఓ బృందాన్ని పంపారు. రమేష్ ఇంటి సమీపంలో రెక్కీ చేసి, ఇంట్లోనే ఉన్నారని నిర్ధారించుకున్నారు. తెల్లవార్లూ అక్కడే ఉండి ఉన్నతాధికారులకు చెప్పారు. అరెస్టు విషయం బయటకు పొక్కకుండా, జోగి అజ్ఞాతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అర్ధరాత్రి పోలీసులకు సందేశాలు

జోగి సోదరుల అరెస్టుకు ఉన్నతస్థాయిలో అనుమతి తీసుకున్నాక పోలీసులు రంగం సిద్ధం చేశారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి పంచనామాకు సిబ్బందిని సిద్ధం చేసుకున్నారు. న్యాయపరమైన ప్రక్రియను పూర్తిచేశారు. అంతా అనుకూలంగా ఉందని నిర్ధారించుకున్నాక.. బందోబస్తుకు అవసరమైన అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి, వారికి వేకువజామున సిద్ధంగా ఉండాలని అర్ధరాత్రి వాట్సప్ సందేశాలు, వాయిస్ మెసేజ్‌లు పంపించారు. తెల్లవారుజామున 4 గంటలకు అందరూ వచ్చాక గానీ జోగి రమేష్ అరెస్టు గురించి చెప్పలేదు. అప్పుడు అందరూ బయలుదేరి ఇబ్రహీంపట్నం వెళ్లారు.



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లోకి వెళ్తూ ఎవరినీ వదిలిపెట్టనంటూ బిగ్గరగా అరుస్తున్న జోగి రమేష్

చంద్రబాబూ ఖబడ్దార్.. లోకేశ్ జాగ్రత్త!

వేలు చూపిస్తూ జోగి రమేష్ హెచ్చరికలు ● ఎక్సైజ్ స్టేషన్‌లోకి తరలిస్తుండగా నానా యాగీ

ఈనాడు, అమరావతి: 'చంద్రబాబూ ఖబడ్దార్.. లోకేశ్ జాగ్రత్త' అని వేలు చూపిస్తూ.. వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "చంద్రబాబు నీకూ కుటుంబముంది. భార్యాబిడ్డలు ఉన్నారు. నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. జాగ్రత్త. మీ ఇద్దరి సంగతి తేలుస్తా'' అంటూ చిందులు తొక్కారు. ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నంలోని ఇంటి నుంచి ఆయన్ను అదుపులోకి తీసుకున్న తర్వాత. . పోలీసు వాహనంలో విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ వాహనం దిగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శిస్తూ జోగి రమేష్ ఆగ్రహంతో ఊగిపోయారు. "నా అరెస్టు చంద్రబాబు పిచ్చికి పరాకాష్ఠ. సీఎం నాపై కక్ష కట్టారని 20 రోజులుగా చెబుతూనే ఉన్నా. ఇది దుర్మార్గమైన చర్య. నా భార్యాబిడ్డల సాక్షిగా చెప్పా. దుర్గమ్మ సాక్షిగా ప్రమాణం చేశా. అయినా సీఎం రాక్షసానందం తీరలేదు'' అని వ్యాఖ్యానించారు. వైకాపా నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్, రుహుల్లా తదితరులు జోగి రమేష్‌కు మద్దతుగా స్టేషన్ వద్దకు వచ్చారు.

అనుచరుల రచ్చ రచ్చ

ఎక్సైజ్ స్టేషన్ వద్ద జోగి రమేష్ అనుచరులు మరింత రెచ్చిపోయారు. స్టేషన్ తలుపులు తీసుకుని లోపలకు వెళ్లేందుకు యత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసు సిబ్బందిని దూషిస్తూ తీవ్రంగా బెదిరించారు. కొద్దిసేపు స్టేషన్ వద్ద నానా హంగామా సృష్టించారు. జోగికి అనుకూలంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ''రెడ్ బుక్ కాదు.. బ్లూ బుక్ వస్తుంది. జగన్ 2.0 అంటే ఏంటో మీరే చూస్తారు. అప్పుడు ఒక్కొక్కడి బట్టలూడదీస్తాం" అంటూ వ్యాఖ్యానించారు. స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన వారిని బయటకు పంపించిన పోలీసులపై వైకాపా కార్యకర్తలు దూషణలకు దిగారు. మా ప్రభుత్వం వచ్చాక మీ సంగతి తేలుస్తామని బెదిరించారు.

ఆసుపత్రి వద్దా వీరంగం..

జోగి రమేష్, అతని సోదరుడు రామును విజయవాడ జీజీహెచ్‌కు వైద్య పరీక్షల కోసం ఆదివారం రాత్రి 10గంటల సమయంలో పోలీసులు తీసుకురాగా, అక్కడా వైకాపా మూకలు వీరంగం చేశాయి. ఆసుపత్రి వద్ద భారీగా వైకాపా ముఖ్య నాయకులు, శ్రేణులు, జోగి కుటుంబ సభ్యులు అప్పటికే వేచి ఉన్నారు. జోగిని తీసుకురాగానే ఒక్కసారిగా వారంతా అరుస్తూ, కేకలేస్తూ.. జై జోగి అంటూ నినాదాలు చేస్తూ వాహనాన్ని చుట్టుముట్టారు. అనంతరం జోగిని పోలీసులు ఆసుపత్రిలోకి తీసుకెళ్లారు. అదే సమయంలో జోగి అనుచరులు ఆసుపత్రి లోపలకు చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆసుపత్రి అత్యవసర విభాగం తలుపుల అద్దాలను పగలగొట్టారు. వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించిన మాచవరం ఎస్సై శంకర్ చొక్కాను కొందరు పట్టుకుని పక్కకు లాగారు. ఓ కానిస్టేబుల్ కింద పడిపోగా, అతడిని తొక్కుకుంటూ ముందుకెళ్లారు. పోలీసులు వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా గొడవకు దిగారు. జోగిని లోపలకు తీసుకెళ్లే సమయంలో అతని భార్య, కుమార్తె, ఇతర కుటుంబసభ్యులు, వైకాపా నేత వెలంపల్లి శ్రీనివాస్ మరికొందరు నాయకులను పోలీసులు అనుమతించారు. వారంతా ఆసుపత్రి లోపలకు వెళ్లి జోగితో మంతనాలు జరిపారు. నేను త్వరగా వచ్చేస్తాను' బాధపడొద్దంటూ భార్య, కుమార్తెకు జోగి ధైర్యం చెప్పారు. అనంతరం రాత్రి 10.40 గంటలకు ఆసుపత్రి నుంచి వారిని కోర్టుకు తీసుకెళ్లారు.



వైద్యపరీక్షల నిమిత్తం పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలోకి తీసుకెళ్తున్నప్పుడు భార్య, కుమార్తెల చేతుల్లో చేతులు వేసి, వైకాపా నాయకులు, అనుచరులను వెంటేసుకుని కారిడార్‌లో వెళుతున్న జోగి రమేష్



ఎక్సైజ్ స్టేషన్ ముందు పోలీసులతో వాగ్వాదానికి దిగిన దేవినేని అవినాష్, అనుచరులు

అరాచకమే.. జోగి నైజం

ఈనాడు, అమరావతి: ఐదేళ్ల వైకాపా హయాంలో జోగి రమేష్ అరాచకాలు, దౌర్జన్యాలకు లెక్కే లేదు. బహిరంగ సభల్లోనూ జుగుప్సాకర పదజాలంతో ప్రత్యర్థి పార్టీల అధినేతలు, ముఖ్యనేతలు, వారి కుటుంబాలను తిట్టేవారు. జగన్‌కు తాను ఆప్తుడినని, పార్టీలో ఎవరైనా తన తర్వాతేనంటూ ప్రచారం చేసుకునేవారు. తనకు ఎదురొచ్చినా, అడ్డుకునేందుకు ప్రయత్నించినా.. వారి అంతు చూస్తానంటూ బహిరంగంగానే బెదిరించేవారు. తాను ప్రాతినిధ్యం వహించిన పెడనతోనే ఈయన అక్రమాలు ఆగలేదు. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, గత ఎన్నికల్లో పోటీచేసిన పెనమలూరులోనూ అరాచకాలతో చెలరేగిపోయారు. ● వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జోగి రమేష్ తన హయాంలో ఇసుక, మట్టి దందాలు, అగ్రిగోల్డ్ భూముల కబ్జా, నకిలీ మద్యం తయారీ వరకూ దేన్నీ వదల్లేదు. నాటి ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు ఇంటిపైకే దాడికి వెళ్లారు. అక్కడ నోటికొచ్చినట్టు తిడుతూ.. సవాళ్లు చేస్తూ.. జోగి చేసిన హంగామాకు ప్రతిఫలంగానే మంత్రి పదవి దక్కిందని అంటారు.

మడ అడవుల విధ్వంసం

కృష్ణా జిల్లాలో మడ అడవుల విధ్వంసానికి ప్రధాన కారకుడు జోగేనని ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో కృత్తివెన్ను మండలంలో 1,500 ఎకరాలకు పైగా చేపల చెరువులుగా మారిపోయాయి. ఎకరాకు రూ.30-50 వేల చొప్పున వసూలుచేసి.. చెరువులకు అనుమతులిచ్చేశారని ఆరోపణలున్నాయి. ● పెడనలో జగనన్న లేఔట్ కోసం 40 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ భూముల మార్కెట్ ధరను పెంచేసి, అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ఎకరాకు రూ.5లక్షల చొప్పున రూ.2కోట్ల వరకూ తినేసినట్టు సమాచారం. ● కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇసుక, బుసక తవ్వకాలను జోగి తన అనుచరులతో కొనసాగించారనే ఆరోపణలున్నాయి. తాను పోటీచేసిన పెడన, మైలవరం, పెనమలూరు.. మూడు నియోజకవర్గాల్లోనూ అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించారు. అక్కడ సొంత పార్టీ ఎమ్మెల్యేలనూ ఇబ్బంది పెట్టేవారు. ఇబ్రహీంపట్నం మూలపాడులోని బూడిద చెరువును కబ్జా చేసి.. రూ.కోట్లలో దండుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందు మైలవరాన్ని గుప్పిట పట్టుకున్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్‌లోని పోస్టులనూ అమ్ముకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

బెదిరించి రూ.కోట్లలో వసూళ్లు..

గత ఎన్నికల్లో పెనమలూరు నుంచి జోగికి టికెట్ ఖరారవ్వగానే.. ఇసుక మీద అజమాయిషీ తమదేనంటూ ఆయన వర్గం ప్రకటించుకుంది. ఎమ్మెల్యే మాట కూడా వినక్కర్లేదని అధికారులకు హుకుం జారీచేశారు. పెనమలూరులోని ఇసుక రీచ్‌ల నుంచి రోజుకు రూ.50 లక్షలకు పైగా సంపాదించినట్లు ఆరోపణలున్నాయి. ● పెనమలూరు పరిధిలోని పారిశ్రామికవేత్తలు, స్థిరాస్తి వ్యాపారులు, భవన నిర్మాణదారులతో సమావేశం ఏర్పాటుచేసి, ఎన్నికల ఫండ్ ఇవ్వాలంటూ బెదిరించి రూ.కోట్లలో వసూళ్లు చేసినట్టు విమర్శలొచ్చాయి. ● ఉయ్యూరు, తాడిగడప మున్సిపాలిటీ అధికారులకు సైతం రూ.20 లక్షల చొప్పున ఎన్నికల ఫండ్ ఇవ్వాలంటూ ఆదేశించినట్లు విమర్శలొచ్చాయి.

పెడనలో ప్రత్యేక రాజ్యాంగం

పెడన ఎమ్మెల్యేగా, తర్వాత మంత్రిగా చేసిన జోగి అక్కడ ప్రత్యేక రాజ్యాంగమే నడిపించారు. రేటు చెల్లిస్తే పని అయిపోతుందని, కాదంటే జిల్లాలోనే అడుగుపెట్టొద్దనేలా బెదిరించారనే ఆరోపణలున్నాయి. అక్రమ నిర్మాణాల నుంచి జోగి అనుచరులు వసూళ్లు చేశారు. ● పెడన పరిధిలో గతంలో రైతులకు షరతులతో ఇచ్చిన పట్టాలకు.. పూర్తి హక్కులు కల్పించేందుకు.. ఒక్కో రైతు నుంచి ఎకరాకు రూ.20 వేల చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ● పెడనలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కావాలంటే రూ.2-4లక్షల వరకు మంత్రి కార్యాలయానికి చెల్లించాలనే ప్రచారం చేశారు. చెల్లించిన వారికే అప్పట్లో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసేవారని సమాచారం. ● ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల జారీకి కూడా వచ్చినదానిలో 20% తమకు చెల్లించాలని వసూలు చేసినట్టు తెలుస్తోంది. ● పట్టాదారు పాస్ పుస్తకం కావాలంటే.. మంత్రి కార్యాలయంలో లంచం ఇవ్వాల్సిందేనని, దీనికీ ఓ ధర పెట్టారని స్థానికులు చెబుతున్నారు. భూమి విలువను బట్టి ధర చెల్లిస్తేనే పాస్‌పుస్తకం ఇచ్చేవాళ్లని వాపోతున్నారు.

ఈనాడు

నివారించదగిన విషాదమిది!

గుండెలను మెలిపెట్టే కొన్ని విషాద దృశ్యాలు చాలారోజుల పాటు వెంటాడతాయి. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మొన్న తొక్కిసలాట సమయంలో నెలకొన్న భీతావహ పరిస్థితులు సైతం చూపరులను అలాగే కంటతడి పెట్టించాయి. తొమ్మిది మందిని పొట్టనపెట్టుకున్న ఈ దారుణోదంతం వ్యవస్థాగత లోపాలెన్నింటినో మరోసారి బట్టబయలు చేసింది. ఇటీవలే ప్రారంభించిన ఆ గుడికి నిత్యం రెండు వేల మంది దాకా భక్తులు వస్తుంటారు. శనివారం కార్తిక ఏకాదశి సందర్భంగా అంతకు ఎనిమిది రెట్ల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అంతమందిని బస్సుల్లో ఆటోలు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తుంటే ఆ దారిలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. అయినప్పటికీ స్థానిక పోలీసులకు గుడిలో భక్తజన రద్దీ గురించి తెలియలేదంటే ఏమనుకోవాలి? చుట్టుపక్కల పరిణామాలను ఆమాత్రం పసిగట్టలేనివారు శాంతిభద్రతలను ఎలా కాపాడతారు? నిఘా వ్యవస్థ విఫలం కాకపోయుంటే ఆలయంలోకి భక్తుల ప్రవేశాన్ని క్రమబద్ధీకరించేందుకు వీలుచిక్కేది. పెరుగుతున్న రద్దీని గమనించి, మెట్ల మార్గంలో అప్పటికే ఉన్నవారు దర్శనం చేసుకునేంత వరకు మిగిలినవారిని లోపలికి రాకుండా నిర్వాహకులైనా తగిన హెచ్చరికలతో అందరినీ అప్రమత్తం చేసుంటే- నిండు జీవితాలను చిదిమేసిన ఘోరకలిని నివారించడం సాధ్యపడేది!

దేశీయంగా గడిచిన 22 ఏళ్లలో జరిగిన తొక్కిసలాటలు మూడు వేలకు పైగా ప్రాణాలను కబళించాయి. ఈ ఏడాది ఇప్పటిదాకా అలాంటి ఆరు దారుణ ఘటనలు దాదాపు 114 మందిని బలిగొన్నాయి. పర్వదినాలు, ఆధ్యాత్మిక వేడుకల వేళలోనే ఈ దుర్ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. రాజకీయ సభలు, క్రీడా ఈవెంట్లూ మృత్యు వేదికలవుతున్నాయి. మొన్న జనవరిలో ప్రయాగ్‌రాజ్ తొక్కిసలాటలో 30 మంది విగతజీవులయ్యారు. మహా కుంభమేళా రోజుల్లోనే దిల్లీ రైల్వేస్టేషన్‌లో జనం తాకిడిని సరిగ్గా నియంత్రించలేని యంత్రాంగం అసమర్థతకు పద్దెనిమిది మంది బలయ్యారు. టీవీకే అధినేత, ప్రముఖ నటుడు విజయ్ ర్యాలీలో 41 మంది నలిగిపోయారు. అంతకు ముందు బెంగళూరులో ఆర్సీబీ జట్టు విజయోత్సవం పదకొండు ప్రాణాలను కొండెక్కించింది. నిర్వాహకుల బాధ్యతారాహిత్యం, అధికారుల నేరపూరిత నిర్లక్ష్యంవల్లే ఇలా ఎన్నో కుటుంబాలకు కన్నీళ్లు మిగులుతున్నాయి!

నిర్దిష్ట ఘడియల్లో ఫలానా పనిచేస్తే పాపాలన్నీ పోతాయనే ప్రచారాలు ఇటీవలి కాలంలో తరచూ హోరెత్తుతున్నాయి. జనబాహుళ్యంలో నిర్మల భక్తికి బదులుగా ఒకరకమైన భయంతో కూడిన ఉద్వేగాన్ని పెంచుతున్న కొందరి ప్రసంగాలు సామాజిక మాధ్యమాల ద్వారా ఇంటింటికీ చేరుతున్నాయి. ఈ క్రమంలో పుణ్యక్షేత్రాలు, తీర్థ ప్రదేశాల్లో జనం రద్దీ అనూహ్యంగా పెరుగుతూ విభ్రాంతికర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆధ్యాత్మికవేత్తలు, ప్రవచనకారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఎవరైనా సరే- జన సామాన్యం భద్రతను దృష్టిలో పెట్టుకుని, తమను అనుసరించేవారికి సరైన మార్గనిర్దేశనం చేయాలి. స్టార్ హీరోల సినిమా రిలీజులు, క్రికెట్ సంబరాలు, నాయకుల ర్యాలీలప్పుడు అభిమానుల్లో ఉత్సాహం కట్టలుతెంచుకుంటూ ఉంటుంది. ఆ విషయం తెలిసే ఇరుకిరుకు ప్రాంతాల్లో చాలామంది గుమిగూడుతున్నారు. కిక్కిరిసిన జనంలోకి పిల్లలనూ తీసుకొచ్చి వారి నూరేళ్ల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి విచక్షణారహిత చర్యలకు దూరంగా విజ్ఞతతో ప్రవర్తించడం పౌర బాధ్యతల్లో భాగం! పండుగలు, వివిధ సమావేశాలూ సంబరాల సమయంలో ఆయా ప్రదేశాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం!



ఎందరో సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి కాపాడుతున్న మన స్వేచ్ఛ దుర్వినియోగం కాకూడదంటే అది ఎంత విలువైనదో తెలియాలి. అప్పుడే యువత దాన్ని గౌరవించడాన్ని తమ బాధ్యతగా భావిస్తారు.

– అడ్మిరల్ కరమ్‌బీర్ సింగ్

మాజీ నౌకాదళాధిపతి

పనే పరమాత్మ

ప్రతి పనికీ ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. 'నాకు పని అంటే ఇష్టం. అందుకే ఆవిడ చేస్తూ ఉంటే అలా కుర్చీలో కూర్చుని గంటల తరబడి చూస్తూ ఉంటా'నని చెప్పాడు వెనకటికో ప్రబుద్ధుడు. అలాంటి పనిదొంగల సంగతి పక్కనబెడితే- ఇంట్లో పూజా మందిరాన్ని శుభ్రంగా తీర్చిదిద్దడమైనా, విధి నిర్వహణలో భాగంగా దస్త్రాల దుమ్ము దులపడమైనా... చేసే పనిని కళాత్మకంగా చెయ్యాలి. ఇంట్లో పని, బయటి పని అని తేడా ఉండకూడదు. పని చేసేవారికి ఎంతో సహనం కావాలి. పూజని పనిగా కాదు.. పనిని పూజగా భావించాలి. శాంతంగా చేసుకోవాలి. అది మొక్క నాటడం కావచ్చు, భవనం నిర్మించడం కావచ్చు. తమను తాము పనిలో భాగంగా మలచుకుని కర్తవ్యాన్ని పూర్తిచేయాలి.

కాలక్షేపం కోసం చేసేది కాదు పని. యజమాని తోటలోకి రాగానే ఆయన వెనకాలే తిరుగుతాడు ఒక పనివాడు. మరొక పనివాడికి ఆ సంగతే పట్టదు. యజమాని వచ్చింది కూడా చూడకుండా తన పనిలో తాను నిమగ్నమై ఉంటాడు. రామకృష్ణ పరమహంస ఈ కథ చెబుతూ నిజంగా పనిచేసే వ్యక్తిపైనే యజమాని దృష్టి ఉంటుందనేవారు.



అంతర్యామి

ఎవరికి వచ్చిన పని వారు చెయ్యాలి. శివుడి ఇల్లు కురుస్తోందట. ఇల్లు కప్పే వ్యక్తి కోసం ఈశ్వరుడు రాత్రీ పగలూ తిరుగుతున్నాడట. ఎక్కడా దొరకడం లేదు. 'మీరు శివుడు కదా.. మీకే అన్ని పనులూ వచ్చు. ఈ పని మీరే చేయవచ్చు కదా..?' అని అమ్మ అడిగిందట. 'అలా కాదు.. నేనే చేసి ఆ పనిని నమ్ముకుని బతుకుతున్నవారి పొట్ట కొట్టలేను' అని ఈశ్వరుడు నవ్వుతూ చెప్పాడట. ఇది వినడానికి హరికథలో పిట్ట కథే కావచ్చు. కానీ ఆలోచిస్తే ఎంతో లోతైన అర్థం దొరుకుతుంది. ఈ లోకంలో ప్రతి ప్రాణికీ తనవైన విధులుంటాయి. గురువు ఒక్కరోజు కూడా సెలవివ్వకుండా తాను పనిచేస్తూ తమచేతా పనిచేయిస్తున్నారని శిష్యులకు కోపం. అందుకని వాళ్లు పనిముట్లను కనబడకుండా దాచేశారు. దాంతో ఆయన భోజనం మానేశాడు. శిష్యులు జాలిపడి నాలుగో రోజు వాటిని తెచ్చిచ్చారు. ఆ రోజంతా ఆయన పనిచేశాకే కడుపు నిండా భోజనం చేశాడు. పనిచేస్తేనే తిండి తిన డానికి అర్హత ఉంటుందని ఆ గురువు ఆచరణలో చూపించాడు శిష్యులకు.

పని చేసేవారి బాగోగులు ఆ భగవంతుడే చూసుకుంటాడు. ఒక పేద కుటుంబానికి కొన్నాళ్లపాటు పని దొరకలేదు, దాంతో తిండీ లేదు. దేవుడి మీద భారం వేసి కూర్చున్నారు. ఆ ఊరి పెద్దమనిషికి పొలంలో అత్యవసర పని పడింది. స్వయంగా వాళ్ల ఇంటికెళ్లాడు. పరిస్థితి చూసి ముందు వాళ్లకు కడుపునిండా భోజనం పెట్టి ఆ తర్వాత పనికి తీసుకెళ్లాడు.

పనిని దైవకార్యంగా భావించాలి. నిష్ఠగా చేయాలి. అలా ఎరుకతో చేసే పని వ్యక్తికే కాదు, ఈ లోకానికి కూడా శాంతి సౌభాగ్యాలనిస్తుంది.

– భమిడిపాటి వెంకటేశ్వర రావు

సంధి కుదిరింది కానీ...

సయోధ్య కాదు!

దక్షిణ కొరియాలోని బుసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల సమావేశం సందర్భంగా వాణిజ్య సుంకాలు, ప్రతి సుంకాలపై వాదప్రతివాదాలు జరుగుతాయని చాలా మంది భావించారు. అదేమీ లేకుండానే, ఆ భేటీలో తాత్కాలిక సంధి కుదిరింది. అంతా సద్దుమణిగింది. సుంకాల సమరంలో స్వల్ప విరామం వచ్చినట్లయింది.

చైనా ఎగుమతులపై సుంకాలను తగ్గిస్తామని ట్రంప్ ప్రకటించారు. మత్తుపదార్థమైన ఫెంటానిల్ తయారీకి ఉపకరించే ముడి పదార్థాల ఎగుమతిపై సుంకాలను 20 నుంచి 10 శాతానికి తగ్గిస్తామన్నారు. దీనికి బదులుగా అమెరికా నుంచి సోయాబీన్, తదితర వ్యవసాయ సరకులను పెద్ద మొత్తాల్లో కొనుగోలు చేస్తామని చైనా ప్రకటించింది. ముఖ్యంగా అమెరికాకు మరో ఏడాదిపాటు అరుదైన ఖనిజాల ఎగుమతిని నిరాటంకంగా కొనసాగిస్తామని భరోసా ఇచ్చింది. సెమీ కండక్టర్ల తయారీకి, రక్షణ పరిశ్రమలకు, హరిత ఇంధన ఉత్పత్తికీ అరుదైన లోహాలు కీలకం. ప్రపంచంలో 80శాతం అరుదైన ఖనిజాల సరఫరా చైనా చేతుల్లోనే ఉంది. దీంతో డ్రాగన్‌పై ఎత్తిన సుంకాల కత్తిని అగ్రరాజ్యం తాత్కాలికంగా కిందకు దించింది. వాణిజ్య చర్చల్లో ఒక మెట్టు కిందకు దిగింది.



వాణిజ్య యుద్ధంలో తాత్కాలికంగా లభించిన విరామాన్ని చైనా సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోనుంది. తన ఎగుమతుల కోసం అమెరికా మార్కెట్‌పై ఆధారపడాల్సిన అగత్యాన్ని తగ్గించుకునే అవకాశముంది. మరోవైపు ట్రంప్‌నకు చైనా మీద పైచేయి సాధించినట్లు తన ఓటర్లకు చాటుకోవడానికి వీలు చిక్కింది. చైనా నుంచి చవక సరకుల సరఫరా లేక అమెరికాలో ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతున్నారు. ఈ సమయంలో తాత్కాలిక సంధితో పరిస్థితి కుదుటపడుతుందని ట్రంప్ ఆశిస్తున్నారు.

స్వావలంబన బాటలో చైనా

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడైనప్పటి నుంచి చైనా మీద ఉరుముతున్నారు. ఫిబ్రవరి 4వ తేదీన 10 శాతం ఫెంటానిల్ సుంకం విధించారు. ఫెంటానిల్ ముడి సరకుల ఎగుమతిని చైనా నిరోధించలేకపోయిందంటూ నెల రోజుల తరవాత సుంకాన్ని 20 శాతం చేశారు. ఇతర సరకుల ఎగుమతులపై కూడా ఎడాపెడా ప్రతీకార టారిఫ్‌లు వేసి, చైనా సరకులపై సుంకాలను ఏకంగా 145 శాతానికి చేర్చారు. డ్రాగన్ చూస్తూ ఊరుకోలేదు. అమెరికా ఎగుమతులపై సుంకాలను 125 శాతానికి పెంచేసింది. చైనాకు అమెరికా ఎగుమతి చేసే ఇంధనం, వ్యవసాయ సరకులపై తీవ్ర ప్రభావం చూపింది. డ్రాగన్ అమెరికా నుంచి సోయాబీన్, కోడి, పంది మాంసం, మొక్కజొన్న, గోధుమలను కొనడం ఆపేసింది. ఇది ట్రంప్ గ్రామీణ ఓటర్ల ఆదాయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. అంతేకాదు, అమెరికా వ్యవసాయ కంపెనీల లైసెన్సులను చైనా రద్దుచేసింది. అమెరికాకు గాలియం తదితర అరుదైన ఖనిజాల ఎగుమతిపై కంట్రోళ్లు విధించింది. అమెరికన్ కంపెనీలైన మైక్రాన్, బోయింగ్‌లను బ్లాక్‌లిస్టులో చేర్చింది. క్రమంగా ముదిరిన వాణిజ్య యుద్ధం- ఆపిల్, సీమెన్స్ వంటి అమెరికా, ఐరోపా కంపెనీలను భారత్, వియత్నాం, మెక్సికో దేశాలకు తరలించేలా చేసింది. అయినా, చైనా ఆధిక్యమేమీ దెబ్బతిన లేదు. అమెరికాకు 2025 మే నెలలో 2,880 కోట్ల డాలర్లుగా ఉన్న చైనా ఎగుమతులు సెప్టెంబరుకల్లా 3,430 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. అమెరికా వినియోగదారులకు చవక చైనా వస్తువులు లేనిదే పూట గడవదని తేలిపోయింది. మరోవైపు అమెరికా సుంకాల దెబ్బకు భారత్ ఎగుమతులు 37శాతం తగ్గిపోయాయి. ఇండియాకన్నా తక్కువ సుంకాలు చెల్లించే దేశాలు ఆ మార్కెట్‌ను చేజిక్కించుకున్నాయి.

సెమీకండక్టర్లలో అమెరికా, చైనాల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. కృత్రిమ మేధకు అవసరమైన ఏ100, హెచ్100 చిప్‌లను అమెరికా కంపెనీ ఎన్విడియా తయారు చేస్తుంది. వీటిని చైనాకు విక్రయించరాదంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్ గతంలో నిషేధించారు. దీంతో చైనా తక్కువ శక్తిమంతమైన హెచ్20 చిప్‌లను దిగుమతి చేసుకుని, వాటితో అవసరమైన పనితీరును రాబట్టుకుంది. ట్రంప్ హెచ్20తో సహా అన్ని రకాల చిప్‌ల ఎగుమతిని బంద్ చేశారు. కానీ అప్పటికే హువావై తదితర చైనా కంపెనీలు సొంతంగా ఎన్విడియాకు దీటైన చిప్స్ తయారు చేశాయి. చైనాలో ఎవరూ ఎన్విడియా చిప్స్ కొనవద్దని ఆ దేశ ప్రభుత్వం ఆదేశించింది. డ్రాగన్ ఎదుగుదలను అడ్డుకోవడానికి ట్రంప్ విధించిన ఆంక్షలు చివరికి చైనా స్వావలంబనకు దారితీశాయి. అమెరికన్ కంపెనీలకు చైనా అతిపెద్ద మార్కెట్. ట్రంప్ పుణ్యమా అని అది వాటి చేజారింది.

అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ

చైనా, అమెరికాలు ఒకరిపై ఒకరు ఆధారపడటం తగ్గించుకోవాలని చూస్తున్నాయి. చైనాలో ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న పెట్టుబడిదారీ విధానం వేగంగా ఫలితాలనిస్తోంది. చైనా మేధోహక్కుల చౌర్యానికి పాల్పడుతోందనీ, తన దేశంలో పెట్టుబడులు పెట్టి కర్మాగారాలు నడపాలంటే పాశ్చాత్య సాంకేతికతలను తనకు బదిలీ చేయాలని ఒత్తిడి చేస్తోందనీ, ఇది అన్యాయమైన వాణిజ్య విధానమని అమెరికా రుసరుసలాడుతోంది. అమెరికా తన ఎగుమతులపై ఆంక్షలు విధించడం, ఇండో-పసిఫిక్‌లో క్వాడ్ పేరిట హడావుడి చేయడం తన ఎదుగుదలను అడ్డుకోవడానికేనని డ్రాగన్ ఆగ్రహిస్తోంది. దీంతో ఆర్థిక పోటీ కాస్తా సైనిక వ్యూహాత్మక పోరుగా మారిపోతోంది. నేడు అమెరికా, చైనాల పోటీ వాణిజ్యానికే పరిమితం కాకుండా అంతరిక్ష, డిజిటల్ సీమలకూ విస్తరించింది. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనే పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియాలోని బుసాన్‌లో రెండు దేశాల మధ్య కుదిరిన సంధి తాత్కాలికం మాత్రమే. సుంకాలు తగ్గించడం, వ్యవసాయ సరకుల ఎగుమతులపై ఆంక్షలు సడలించడం పరిస్థితిని కాస్త మెరుగుపరచినా చైనా ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంపై అమెరికా అభ్యంతరం అలాగే ఉంది. ఒకటి మాత్రం నిజం- చైనాను ఏకాకి చేయాలనుకుంటే తానూ ఏకాకినైపోతానని అమెరికాకు తెలిసివచ్చింది. రెండు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక రంగాల్లో యుద్ధాలకు ఇప్పుడు కాస్త విరామం వచ్చిందే కానీ పూర్తి సయోధ్య కుదిరే అవకాశం లేదు.



అజయ్ శ్రీవాస్తవ

వ్యవస్థాపకులు, గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ)

మధ్యతరగతి అనగానే కష్టాలకూ భలే ఇష్టం. వరసగా మీద పడిపోతాయి. ఏళ్ల తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్తే, షుగరంటూ తేల్చేస్తే హడలిపోతాం. రేపట్నుంచి కొత్త అలవాట్లతో బతకాలని హెచ్చరిస్తే బెదిరిపోతాం. వాకింగ్ తప్పదంటే ఇదెక్కడి తంటా అనుకుంటాం. పొద్దున పిల్లల్ని స్కూళ్లలో దింపేసి, చద్దిమూట చంకనేసుకుని ఆఫీసుకు వెళ్లిపోయి, ఏ రాత్రికో ఇంటికి చేరి, నాలుగు మెతుకులు తినడమే కష్టమనుకుంటుంటే- వాకింగ్‌లూ వ్యాయామాలూ చెయ్యాలా అని విసుక్కుంటాం. కానీ, ప్రతి సమస్యకీ పరిష్కారం ఉంటుంది. బండికి గుడ్‌బై చెప్పేసి, బస్సు బాట పడితే సరి! ఇంటి నుంచి బస్టాపుదాకా, బస్సు దిగాక ఆఫీసుదాకా.. పోనూరానూ రోజూ నడవాలి. కాస్త ముందుగా బయల్దేరి, మరికాస్త ఆలస్యంగా ఇంటికి చేరతామంతే! ఖర్చూ తగ్గి, ఆరోగ్యమూ సొంతమవుతుంది.

ఆలోచన ఆచరణలోకి...



ఆకుకూరల్లో మురుగు కంపు.. కూరగాయల్లో పురుగుమందు వాసన.. ఒక్కటీ తాజాగా ఉండదు. మార్కెట్లో అయిదొందలు వదిలిస్తే, చిల్లరే చేతికొస్తుంది. డబ్బులు పెట్టినా, నాణ్యమైన కాయగూరలూ తినలేకపోతున్నామన్నదే అందరి బాధ. మనసు పెడితే మార్గం దానికదే దారివెతుక్కుంటూ మరీ వస్తుంది. చేతిలో సమయం, మిద్దెపై జాగా ఉన్నవాళ్లు కొద్దిగా చెమటోడిస్తే సొంతంగానే కూరగాయలు పండించుకోవచ్చు కదా! మట్టి, కుండీలు, ఎరువులు, విత్తనాలు, శ్రమ, కొంచెం ఖర్చు పెట్టాలంతే! మందులు కొట్టని, తాజా కూరగాయలు తినొచ్చు. డాబాపై చెట్లతో ఇల్లంతా చల్లదనం. ఫ్యాన్లు, ఏసీల ఖర్చూ తగ్గుతుంది. మొక్కల పెంపకంతో ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు, మనసుకూ, శరీరానికీ ఉత్తేజం దక్కుతాయి.

సొంతిల్లంటే ఓ భరోసా! జీవితంలో అదో ఫుల్‌నెస్ ఫీలింగ్! పోగేసిన సేవింగ్స్‌తో ఇల్లు కొంటే పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, రిటైరయ్యాక సెటిలయ్యేదెలా? ఇన్నేళ్లుగా అద్దింటి కాపురమేగా, నెట్టుకొచ్చేస్తే సరిపోదా అనుకుంటారు చాలా మంది. మరెలా? సేవింగ్స్ డబ్బుల్ని సురక్షితమైన మ్యూచువల్ ఫండ్‌లో పెట్టి, సిస్టమేటిక్ విత్‌డ్రాలకు, ఇంటిఅద్దె కలిపి కడితే, రుణంపై ఈఎంఐకి సరిపోతుంది. కొన్నేళ్లకి అప్పు తీరిపోతుంది. ఇల్లూ సొంతమవుతుంది. పొదుపు డబ్బులూ ఉండిపోతాయి. ఆదాయం ఆగిపోయే విశ్రాంత జీవనంలో అద్దెలేని సొంతింట్లో కనీస ఖర్చులతో జీవితం గడపడం సులభమే కదా!

మధ్యతరగతి మహా కోరికల్లో ఒకప్పుడు కిందుండే కారు, ఇప్పుడు పైకొచ్చేసింది. కుటుంబమంతా కలిసి సొంతూరికో, యాత్రలకో కారులో వెళ్లాలనేది చాలామందికి తీరని కోరిక. జీఎస్టీ మార్పులతో దాదాపు అన్ని కార్ల కంపెనీలూ ధరల్లో దిగొచ్చాయి. పాత కోరికను తీర్చుకోవడానికి ఇదే మంచి తరుణం. వేరే వస్తువుల కోసం చేసిన ప్లానింగ్‌లో కొన్ని మార్పులతో కారు కల తీర్చుకోవచ్చు.

మన రోజువారీ జీవితానికి సంబంధించి సమస్యలపై నిత్యం ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి, పోతుంటాయి. వాటిని ఆచరణలో పెట్టాలనుకుంటూనే కాలం గడిచిపోతుంటుంది. అందుకే, ఆలోచనలను ఆచరణలోకి తేవడమే కీలకం. పట్టుదలగా ప్రయత్నిస్తేనే అది సాధ్యం. ఏ పనిలోనైనా స్థిరత్వంతోనే విజయం. జీవితం అందరికీ ఒక్కటే. మనకు కావాల్సినట్లు మార్చుకోవాలంతే! అందుకోసం మనం కొంత మారాలంతే!

– డి.శ్రీనివాస్



కేసుల గుట్ట కరిగేదెలా?

ఈ ఏడాది జూన్ నాటికి ఇండియాలోని సబార్డినేట్ కోర్టుల్లో నాలుగున్నర కోట్లకు పైగా కేసులు పెండింగులో మూలుగుతున్నాయి. అన్ని కోర్టుల్లోని మొత్తం కేసుల్లో ఇవి దాదాపు 87శాతం. ఈ కేసులు వీలైనంత వేగంగా పరిష్కారం కావాలంటే జడ్జిలు పూర్తిస్థాయిలో ఉండాలి. అయితే, ఈ సంవత్సరం ఆరంభం నాటికి ఏపీ సబార్డినేట్ కోర్టుల్లో 11.7శాతం, తెలంగాణలో 20.5శాతం పోస్టులు భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో పావు శాతానికి పైగా ఖాళీగా ఉన్నాయి. ఆ రాష్ట్రాలు, ఖాళీలు... (శాతాల్లో)

ఛత్తీస్‌గఢ్	29.9
గుజరాత్	31.1
హరియాణా	29.4
ఝార్ఖండ్	28.2
తమిళనాడు	25.3
ఉత్తర్ ప్రదేశ్	26.9
మేఘాలయ	43.4
మిజోరం	39.2
సిక్కిం	34.3

(ఆధారం: ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025)

బీఎస్‌ఎన్‌ఎల్ ముందున్న మార్గమేంటి?

ప్రైవేట్ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ 1995లో ప్రవేశించి 2014లో 4జీ సేవలను ప్రారంభించింది. రిలయన్స్ జియో 2016లో దేశవ్యాప్తంగా 4జీ ఎల్‌టీఈ పరిజ్ఞానంతో అడుగుపెట్టింది. వొడాఫోన్ ఐడియా 2019 నాటికి ప్రధాన సర్కిళ్లలో 4జీ నెట్‌వర్క్ ఏకీకరణను సాధించింది. బీఎస్‌ఎన్‌ఎల్ పనితీరును జియో, ఎయిర్‌టెల్‌లతో పోల్చలేం. 4జీ అప్‌గ్రేడేషన్‌లో దశాబ్ద కాలం వెనుకంజలో ఉండటం వల్ల బీఎస్‌ఎన్‌ఎల్ మార్కెట్ వాటా గణనీయంగా తగ్గింది. అయితే, టెలికాం రంగం అంతరిక్షం, యుద్ధతంత్రంతో పాటు ఇతర కీలక సాంకేతికతలతో ముడిపడి ఉన్నందువల్ల బీఎస్‌ఎన్‌ఎల్‌ను కేవలం వాణిజ్య పోటీలో భాగంగా చూడకూడదు. వ్యూహాత్మక, సైబర్ భద్రత రంగాల్లో సంస్థ సేవలను వాడుకోవాలి. సుమారు 80 కోట్ల స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, పటిష్ఠమైన వేదికల ద్వారా అవాంతరాలు లేని చెల్లింపులతో, భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విలువ లక్ష కోట్ల డాలర్లను దాటబోతోందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీఎస్‌ఎన్‌ఎల్‌లోని యువ సిబ్బందిని వ్యూహాత్మక సైబర్ భద్రత నియంత్రణ కోసం వినియోగించాలి. సమర్థులు, ప్రతిభావంతులైన ఇంజినీర్లను ఎంపిక చేసి, నిపుణులతో శిక్షణ ఇప్పించి సైబర్ క్రైమ్ యోధులుగా తీర్చిదిద్దాలి.

భారత టెలికాం రంగం ఆర్థిక వ్యవస్థకు కీలక చోదక శక్తి. ఇది దేశ జీడీపీకి సుమారు ఆరుశాతందాకా అందిస్తోంది. ఈ రంగం ప్రత్యక్షంగా సుమారు 22 లక్షల మందికి, పరోక్షంగా మరో 18 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. బీఎస్‌ఎన్‌ఎల్ నాలుగు లక్షల మంది ఉద్యోగులు, రూ.40 వేల కోట్ల మిగులుతో పాతికేళ్ల క్రితం ఏర్పడటం ఒక చరిత్ర. తరవాతి కాలంలో మెరుగైన స్థితి నుంచి కిందికి జారింది. రజతోత్సవాన్ని పూర్తి చేసుకున్న వేళ బీఎస్‌ఎన్‌ఎల్ భవిష్యత్తుపై విశ్లేషణ అవసరం.

మౌలిక సదుపాయాల కోసం...

స్పెక్ట్రమ్ అనేది కంపెనీ ఆస్తి కాదు. అది ఒక లైసెన్స్. అలాంటప్పుడు ఒక కంపెనీకి జారీ చేసిన లైసెన్స్ మరొకరితో పంచుకోవడం లేదా అమ్మడం ఎలా సాధ్యమవుతుంది? దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ విధానాన్ని పునః సమీక్షించాల్సిన అవసరం ఉంది. స్పెక్ట్రమ్‌కు పూర్తి యజమానిగా ప్రభుత్వమే ఉన్నందువల్ల దాని లీజు, అమ్మకం, మూడోపక్షానికి తాకట్టు పెట్టడం అనుమతించకూడదు. టెలికాం రంగం సంరక్షణనూ బీఎస్‌ఎన్‌ఎల్ పర్యవేక్షించవచ్చు. 2025 జులైలో ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదా జాతీయ టెలికాం పాలసీ-2025 ఇతర విషయాలతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించడం, భవిష్యత్ డిమాండ్‌ను తీర్చడానికి కార్మికుల నైపుణ్యాలను పెంచడం తదితర లక్ష్యాలను ప్రకటించింది. వీటిని చేరుకోవడంతో పాటు తరవాతి తరం సాంకేతికతలలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 'సీడాట్' సంస్థను అత్యుత్తమ టెలికాం పరిశోధక, అభివృద్ధి సంస్థగా మార్చాలని పేర్కొంది. డీవోటీ/ బీఎస్‌ఎన్‌ఎల్ ఆధ్వర్యంలో గాజియాబాద్‌లో అడ్వాన్స్‌డ్ లెవల్ టెలికాం ట్రైనింగ్ సెంటర్, జబల్‌పూర్‌లో భారతరత్న బీఆర్ అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెలికాం ట్రైనింగ్ ఉన్నాయి. ఈ రెండూ అంతర్జాతీయ స్థాయి శిక్షణా కేంద్రాలు. ఇవి అత్యంత నైపుణ్యం, అనుభవం ఉన్న నిపుణుల బృందంతో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణను అందిస్తాయి. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించడానికి అత్యాధునిక మౌలిక సదుపాయాలు కలిగి ఉన్నాయి. టెలికాం సాఫ్ట్‌వేర్, మేనేజ్‌మెంట్ రంగంలో పారిశ్రామిక శిక్షణ, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్, కార్పొరేట్ శిక్షణను అందిస్తాయి. దేశవ్యాప్తంగా సుమారు డజను రీజినల్ టెలికాం ట్రైనింగ్ సెంటర్లు ఉన్నాయి. అయితే, 2025 ఆగస్టులో పొదుపు చర్యలలో భాగంగా బీఎస్‌ఎన్‌ఎల్ తన శిక్షణా కేంద్రాల్లోని సిబ్బందికి శిక్షణా భత్యాన్ని నిలిపివేయాలని ఆదేశించింది. ఇలాంటి చర్యలకు దిగడానికి బదులుగా, తన లక్ష్యాల సాధనలో భాగంగా, అనుభవజ్ఞులతో కూడిన మౌలిక సదుపాయాలను మెరుగ్గా ఉపయోగించుకోవచ్చు.



నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహణ

ఆర్థిక విశ్లేషకుల నివేదికల ప్రకారం 2025 ఆర్థిక సంవత్సరంలో భారతీయ కార్పొరేట్లు రూ.16.5 లక్షల కోట్ల లాభాలను నమోదు చేశాయి. వాటిలో రూ.5.15 లక్షల కోట్లు ప్రభుత్వరంగ సంస్థల నుంచి సమకూరాయి. అంటే, సమాన అవకాశాలు కల్పిస్తే వస్తువులు, సేవల రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థలు కూడా మెరుగ్గా రాణించగలవు. బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ స్వతంత్ర ఇంజినీరింగ్ నిపుణుల ఆధ్వర్యంలో నడిస్తేనే ఆధునిక పరిజ్ఞానాలతో నాణ్యమైన సేవలను అందించడంలో ప్రైవేట్ సంస్థలతో పోటీ పడగలదు. ఈ విషయంలో ప్రభుత్వ విధానాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. బీఎస్‌ఎన్‌ఎల్‌ను విపత్తు సాయం, సార్వజనిక సేవా ప్రయోజనాలు, వ్యూహాత్మక కమ్యూనికేషన్ అవసరాలు వంటి కీలక బాధ్యతల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాంలో ఒక భాగంగా చూడాలి. శిక్షణ పొందిన ఇంజినీర్లను వదిలించుకోవాలనే ఆలోచనలను వీడాలి. ఉద్యోగుల వేతన సవరణను లాభాలతో ముడిపెట్టకూడదు. అప్పుడే బీఎస్‌ఎన్‌ఎల్ మెరుగైన పనితీరుతో ప్రజలకు సేవలు అందించగలదు.




ఎం.ఆర్. పట్నాయక్

టెలికం రంగ నిపుణులు

చీమ స్నేహం!

దేవగిరి అడవిలో ఉండే ఒక చిట్టి మిడతకు ఒకరోజు తినడానికి తిండి దొరకలేదు. దానికితోడు జోరుగా వాన కురుస్తుండటంతో చలికి వణికిపోతోంది. ఇక మెల్లగా పక్కనే చీమ ఇల్లు కనిపిస్తే వెళ్లింది. చీమ దానికి తాగడానికి వేడి వేడి సూప్ తయారుచేసింది. కప్పుకోవడానికి వెచ్చటి దుప్పటి కూడా ఇచ్చింది. చీమ ఇంట్లో దాచుకున్న ఆహారాన్ని చూసేసరికి మిడతకు ఆశ్చర్యమేసింది. తాను ఇన్నిరోజులు చేసిన తప్పేంటో అర్థమైంది. 'సారీ చీమా... నువ్వు ఎప్పుడూ ఆడుకోకుండా పనిచేస్తుంటే వెక్కిరించాను. ఎప్పటికీ వేసవి కాలమే ఉంటుందనుకుని ఆడుతూ పాడుతూ కాలం గడిపేశాను. కానీ నాకు ఇప్పుడు బుద్ధొచ్చింది' అంది మిడత చీమతో.

ఇక ఆ వర్షాకాలం అంతా చీమ ఇంట్లోనే



ఉండిపోయింది మిడత. అన్ని పనుల్లోనూ చీమకు సాయం చేసేది. సాయంత్రం అయ్యాక చక్కగా పాటలు పాడేది. చీమ విశ్రాంతి తీసుకుంటూ వినేది. అలా రోజులు గడుస్తూ ఉన్నాయి.. మళ్లీ ఎండాకాలం వచ్చింది. చీమతో పాటు బయటికి వెళ్లి కష్టపడి పనిచేయడం నేర్చుకుంది మిడత. రెండూ పగలంతా ఆహారం సేకరించి తెచ్చేవి. దాన్ని జాగ్రత్తగా దాచుకునేవి. సాయంత్రం మాత్రం ఎంచక్కా కాసేపు ఆడుకునేవారు. రాత్రి కథలు చెప్పుకొంటూ నిద్రపోయేవారు.

హాయ్! బుజ్జీ!!

ఇంతకు ముందు తనకు తోటి మిడతలే స్నేహితులుగా ఉండేవి. అవి పని చేసేవి కాదు తనని చేయనిచ్చేవి కాదు. దాంతో ఎన్నోసార్లు వానాకాలం తిండి లేక ఆకలితో ఉండిపోవాల్సి వచ్చేది. 'చీమ స్నేహం వల్ల ఆకలి బాధ తప్పింది. అందుకేనేమో అమ్మ మంచి వాళ్లతో స్నేహం చేయమని చెప్పేది' అనుకుంటూ హాయిగా నిద్రపోయింది మిడత. ★

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. ☐☐ చేలో మేస్తే ☐☐ గట్టున మేస్తుందా?
2. ఎంత ☐☐కు అంత ☐☐.
3. గోరంత ☐☐ కొండంత ☐☐☐.

[illegible]

ఈనాడు అమరావతి ఎన్టీఆర్
సోమవారం నవంబరు 3, 2025

అమ్మాయిలు అదరగొట్టారు.. అభిమానులు జై కొట్టారు..



విజయం మనదే..



ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెర



ముంబయి వేదికగా ఆదివారం జరిగిన మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో తెరపై వీక్షించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో అభిమానులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. - ఈనాడు, అమరావతి

విలువలు వీడి.. విర్రవీగె జోగి..!





వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌కు తరలిస్తుండగా పోలీసులపై జోగి అసహనం

★ మూడు నియోజకవర్గాల్లోనూ భారీగా అక్రమాలు ★ పెడనలో అధికారులను సైతం బెంబేలెత్తించి...

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో జోగి రమేష్ అడుగుపెట్టిన ప్రతి నియోజకవర్గంలోనూ ప్రశాంత వాతావరణం మాయమైపోతుందనే అపవాదు ఉంది. మైలవరం, పెనమలూరుల్లో.. అక్కడి స్థానిక ఎమ్మెల్యేలను కూడా అధికారంలో ఉండగా.. తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. పెడనలో ఏకంగా అవినీతి సామ్రాజ్యాన్నే స్థాపించారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ స్థానికంగా ఉండే.. ఇసుక, మట్టి, బుసక.. నిల్వలపై ప్రధానంగా దృష్టిపెట్టి తన ఆధీనంలోకి తెచ్చుకునేవారు. గత ఎన్నికల ముందు తన సోదరుడు, కుమారుడు, బాబాయి, ఇద్దరు ప్రధాన అనుచరులను రంగంలోకి దింపి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక రీచుల్లో పాగా వేసి డబ్బులను భారీగా దోచుకున్నారనే విమర్శలున్నాయి. ఇదేంటని అక్కడి ఎమ్మెల్యేలు నిలదీస్తే.. వారిపై సామాజిక మాధ్యమాల వేదికగా బురదజల్లే ప్రయత్నం చేసేవాళ్లు. మైలవరం, పెనమలూరుల్లోనూ ఇలాగే ఎన్నికల ముందు చేశారు. తమ వసూళ్లకు అడ్డొస్తే.. సొంత పార్టీ నేతలనైనా బలి చేసేందుకు వెనుకాడేవారు కాదు.

పెడన నియోజకవర్గాన్ని జోగి, అతని వర్గం పదేళ్లు శాసించింది. 2009, 2019లో రెండుసార్లు పెడన నుంచే గెలిచారు. 2009లో తొలిసారి పెడనకు వచ్చిన జోగి.. నియోజకవర్గంలో తనకు బలమైన అనుచర వర్గాన్ని తయారు చేసుకున్నారు. వారి ద్వారానే పనులన్నీ చక్కబెట్టేవారు. ఎక్కడా తెర ముందుకు మాత్రం జోగి వచ్చేవారు కాదు. ఏ అధికారి అయినా తాను చెప్పినట్టు నడుచుకోవాల్సిందే. తన ఆదేశాలను పాటించని అధికారులను ముప్పతిప్పలు పెట్టేవారు. ప్రభుత్వ శాఖలతో పనిలేకుండా నేరుగా అనుమతులిచ్చి పనులను చక్కబెట్టించేవారనే ఆరోపణలు జోగిపై తీవ్రస్థాయిలో ఉన్నాయి. మడ అడవులను చెరువులుగా మార్చేయడం, అక్రమ నిర్మాణాల అనుమతుల విషయంలో.. పెడనలో విచ్చలవిడిగా నిబంధనలకు పాతరేశారు. జోగి హయాంలో నిర్మించిన అనేక అక్రమ భవనాలకు ఇప్పటికీ సరైన అనుమతులు లేవు. ఇప్పుడు వాటిపై అధికారులు దృష్టిసారిస్తే.. అనేక అవకతవకలు వెలుగులోకి వస్తాయి.

దృష్టిపెడితే భారీగా అక్రమాలు..

కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామం పరిధిలో సముద్ర తీరంలో ఉన్న అత్యంత విలువైన మడ అడవులను భారీగా కొట్టేసి ప్రకృతి సమతుల్యతను దెబ్బకొట్టారు. 2021 నుంచి 24 మధ్య కాలంలో ఈ విధ్వంసం భారీగా జరిగింది. సముద్ర తీరప్రాంతంలోని చిత్తడి నేలల్లో పెరిగే మడ అడవుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తుపాన్లు వచ్చిన సమయంలో ఇవి తీవ్రతను తగ్గిస్తాయి. ఈ అడవుల్లో జీవపర్యావరణం కీలకం. పలురకాల జంతుజాలం అభివృద్ధి చెందుతుంది. అంతరించే జాతులు వృద్ధి చెందుతుంటాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న మడ అడవులను విచ్చలవిడిగా జోగి ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో కొట్టేశారు. కానీ ఇంతవరకూ ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూసింది లేదు. కనీసం కేసు కూడా ఇంతవరకూ నమోదు చేయలేదు. రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సర్వే చేస్తే.. అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయి. - ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, పెడన



ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైకాపా నాయకులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్ తదితరులు



ఎక్సైజ్ స్టేషన్ ముందు పోలీసులతో వాగ్వాదానికి దిగిన జోగి అనుచరులు

కథ అడ్డం తిరిగింది..!

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం దర్యాప్తు, పెద్దల పాత్రపై వెలుగుచూస్తున్న సంచలనాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు జోగి రమేష్ వదిలిన బాణంగా అద్దేపల్లి జనార్దనరావు తెరమీదకు వచ్చారు. ఆయన్ని పావుగా వాడుకుని గుడ్డకాల్చి కూటమి సర్కారుపై వేయాలని వైకాపా ఆరాటపడింది. కానీ కట్టుకథ అడ్డం తిరిగింది. జనార్దనరావు అరెస్టుతో లాగిన తీగ డొంక మొత్తాన్ని కదిలించింది. ఈ వ్యవహారంలో అద్దేపల్లి పాత్రధారి మాత్రమే అని అసలు సూత్రధారి జోగి రమేష్ అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఆదివారం ఆయన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిన్నప్పటి నుంచి తెలుసు..

జోగి రమేష్ ఇల్లు అద్దేపల్లి దుకాణం దగ్గరే ఉంటుంది. ఆ సమీపంలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం సరఫరా జరిగింది. వీరిద్దరికి చిన్నతనం నుంచి మంచి పరిచయాలున్నాయి. అద్దేపల్లి ఎన్నికల ఖర్చులకు సైతం జోగికి గతంలో భారీగా డబ్బులు ఇచ్చినట్లు ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో పెద్ద చర్చ జరిగింది. అద్దేపల్లి ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా జోగి హాజరవుతుంటారు.

కూటమి సర్కారుపై బురదజల్లే నాటకానికి తెర

ఇటీవల వారు కలిసి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. వీరిద్దరి మధ్య జరిగినట్లు చెబుతున్న వాట్సప్ సంభాషణలు సైతం వెలుగులోకి వచ్చాయి. జోగి ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన సందర్భంలో అద్దేపల్లి వ్యాపారాలకు అండగా నిలబడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అద్దేపల్లి గతంలో ఆఫ్రికా దేశాల్లో మద్యం వ్యాపారం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అక్కడ మద్యం తయారీ విధానాన్నే ఇక్కడ కూడా అనుసరించినట్లు గుర్తించారు. విషయం వెలుగులోకి వస్తుందన్న నేపథ్యంలో ఆఫ్రికా నుంచి తిరిగి రావాల్సిన అద్దేపల్లి జనార్దనరావు రాకుండా అక్కడే ఆగిపోయారు. తనకు అసలు సంబంధమే లేదంటూ ఓ వీడియో సైతం విడుదల చేశారు. తర్వాత గన్నవరం విమానాశ్రయంలో దిగిన తర్వాత సైతం ఈ కేసుతో తనకు ఏ సంబంధం లేదని, కావాలనే ఇరికిస్తున్నారని మీడియాతో మాట్లాడారు. విచారణలో అసలు విషయాలు వెల్లడించారు.

వైకాపా పాలనలోనూ అద్దేపల్లితోనే..

'జోగి రమేష్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన నేతృత్వంలోనే నకిలీ మద్యం తయారు చేశా. ఆయన ఆధ్వర్యంలోనే హైదరాబాద్ నుంచి తెచ్చిన మద్యాన్ని నా బార్లో అమ్మేవాడిని. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత కఠినంగా వ్యవహరించడంతో దందా ఆపేశాను. మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్‌లో రమేష్ తన తమ్ముడి ద్వారా నన్ను పిలిపించి నకిలీ మద్యం తయారు చేసి కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని చెప్పారు. అన్నీ తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. రూ.3కోట్లు ఇస్తానని ప్రలోభ పెట్టారు.' అని పోలీసులకు ఇచ్చిన వీడియో వాంగ్మూలంలో అద్దేపల్లి కుండబద్దలు కొట్టారు. ఈ పరిణామం తర్వాతే జోగి, అద్దేపల్లి బంధం, జోగికి సైతం కల్లు, మద్యం వ్యాపారం చేసిన నేపథ్యం ఉండడం..జనార్దనరావుతో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ 'జనార్దన్‌కు నాకు సంబంధం లేదని' అని జోగి బహిరంగంగా చెప్పడం..ఇలా అనేక అనుమానాస్పద వ్యవహారాలతో జోగి రమేష్‌కు ఉచ్చు బిగుసుకుంది.

డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా జడ్జి జి.గోపి తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ ఇలా అన్ని కోర్టుల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దీని కోసం ఆయా న్యాయస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లు, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదిని సంప్రదించి ఇందులో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 3వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

✦ మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీల దాఖలు.. ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని ఆయన వివరించారు.

కలరా ఆసుపత్రికి ఆ పేరెలా వచ్చిందీ..

చిట్టినగర్ సమీపంలోని కలరా ఆసుపత్రి సెంటర్ ఇది. ఈ పేరు రావడానికి పెద్ద కథే ఉంది. నాడు బ్రిటీష్ అధికారి సర్ ఆర్థర్ కాటన్ పర్యవేక్షణలో ఆనకట్ట నిర్మిస్తున్న రోజుల్లో కలరా వ్యాధి ముమ్మరంగా వ్యాపించింది. ప్రజలు వేల సంఖ్యలో మృతి చెందుతున్న నేపథ్యంలో భయాందోళనలు పెరిగిపోతాయన్న దూరదృష్టితో ఆ వ్యాధికి ప్రచారం రానివ్వలేదు.



ఇప్పుడు సర్కిల్-I కార్యాలయం

వ్యాధి సోకిన వారిని అప్పట్లో నగరానికి పొలిమేరగా ఉన్న ఊరు చివర క్వారంటైన్‌లో ఉంచడం ప్రధానమని ఆయన భావించారు. అందుకు తగిన ప్రదేశం ఇప్పుడు మనం పిలిచే కలరా ఆసుపత్రి సెంటర్. అప్పుడు తాటాకు పాకలు వేసి రోగులకు నివాసం కల్పించారు. అక్కడే కలరా వ్యాధిగ్రస్థులకు చికిత్స చేయించారు. బయట నుంచి ఆ ప్రాంతానికి జనాన్ని రానివ్వకుండా కట్టుదిట్టం చేయించారు. కలరా వ్యాధి సోకి పెద్ద సంఖ్యలో ఇక్కడ చికిత్స చేయించడం వల్ల కలరా ఆసుపత్రిగా పేరు గాంచింది. కాలానుగుణంగా నగరం పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు దానిని సర్కిల్-1 కార్యాలయంగా విస్తరించారు. దానిలో జోనల్ కమిషనర్, ఈఈ-1, శానిటరీ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం, పన్నుల వసూళ్ల కేంద్రం, సచివాలయం నిర్వహిస్తున్నారు. ప్రజలకు పలు సేవలందిస్తున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

ప్రకృతి వరం.. క్రీడాకారులకు ఊతం

జగ్గయ్యపేట శివారు కె.అగ్రహారం లోని పాలేరు ఈతకొలనుకు ప్రత్యేకత ఉంది. ఇది సహజసిద్ధంగా ఏర్పడింది. ఇక్కడ ఓంకారేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న స్నానాలఘాట్‌లో రెండు దశాబ్దాల క్రితం పెద్ద గుంత పడింది. అప్పట్లో సమస్యగా భావించిన ఆ గుంతే ఇప్పుడు క్రీడాకారులకు వరమైంది. కీళ్ల నొప్పుల కారణంగా నడవలేని విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ మోహనరావు.. వైద్యుల సూచన మేరకు ఇక్కడ ఈత కొట్టేవారు. ఈ క్రమంలో ఎంతోమంది ఆయన వద్ద శిక్షణకు కూడా వచ్చేవారు. ఇలా సహజసిద్ధమైన ఈతకొలనుగా మారింది. ఆ తర్వాత కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వారు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఇక్కడే సాధన చేసిన ఈత క్రీడాకారులు పాండురంగారావు, లక్ష్మీ దంపతులు డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఐదేళ్లుగా క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర,



జాతీయ, అంతర్జాతీయ పోటీలకు తీసుకెళుతున్నారు. దేశంలో ఎక్కడ ఈతల పోటీలు జరిగినా విజేతల్లో జగ్గయ్యపేట ప్రాంత క్రీడాకారుల పేర్లు వినిపిస్తుంటాయి. ఇందుకు ఇక్కడ ప్రకృతి వరంగా ఏర్పడిన పాలేరు ఈతకొలనే కారణంగా భావిస్తుంటారు. – జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

తిరుపతమ్మకు పసుపు కొమ్ముల అలంకరణ



పెనుగంచిప్రోలులోని శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అలంకరించారు. కార్తిక మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పాలపొంగళ్లు తయారుచేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి పాల పొంగళ్లు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. - న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు


ఓఆర్ఆర్ 3ఏమాయె..!

☛ ప్రతిపాదనల తయారీలో జాప్యం
☛ ఎన్టీఆర్ జిల్లాలో కొలిక్కి రాని ప్రక్రియ

ఈనాడు, అమరావతి

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి మణిహారమైన ఓఆర్ఆర్‌కు కీలకమైన 3ఏ ప్రతిపాదనల తయారీ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. పల్నాడు, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ పూర్తికాగా..కృష్ణా జిల్లాల్లోనూ దాదాపు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎన్టీఆర్‌లో మాత్రం ఇప్పటికి బాలారిష్టాలు దాటలేదు. 35 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. భూసేకరణ, పరిహారం, నిర్మాణం వంటి అనేక దశల ప్రక్రియ సజావుగా సాగేందుకు ముఖ్యమైన 3ఏ ప్రతిపాదనల తయారీ ఆలస్యం కావడంతో ప్రాజెక్టు ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది.

ఇంకా ఆరు గ్రామాలే.. మొత్తం ఓఆర్ఆర్ 23 మండలాల్లో 97 గ్రామాల మీదుగా వెళ్తుండగా ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల, మైలవరం, వీరులపాడు, జి.కొండూరు మండలాల్లోని 18 గ్రామాల్లో నిర్మాణం చేయనున్నారు. దీని కోసం



ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూముల వివరాలు, సర్వే నంబర్లు, యజమానుల పేర్లు, ఆ భూమి సాగు చేస్తున్నారా లేక వ్యాపారాలు నిర్వహిస్తున్నారా, నివాసాలున్నాయా ఇలా అనేక వివరాలు పొందు పరిస్తూ 3ఏ ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఇప్పటివరకు రెవెన్యూ శాఖ పెరకలపాడు, పొన్నవరం, జగన్నాథపురం, గూడెంమాధవరం, మున్నలూరు, కినికినపాడుకు సంబంధించిన వివరాలు మాత్రమే సిద్ధం చేశారు. అంటే 33.3 శాతం గ్రామాల్లో మాత్రమే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇంకా 12 గ్రామాల్లో ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఈ ప్రతిపాదనల ఆమోదం అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిహారం నిర్ధారణ, భూసేకరణకు గెజిట్ ఉత్తర్వులు జారీ.. ఇలా అన్ని పరిణామాలకు ఇదే కీలక దశ. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మాత్రం మీనమేషాలు లెక్కించడం గమనార్హం.

పంపినవి సవరించాల్సిందే..

ఓఆర్ఆర్ నిర్మాణం గుంటూరులో 90 కి.మీ మేర జరుగుతుండగా తర్వాత అత్యధికంగా 51 కిలోమీటర్లు ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటవుతోంది. 700 హెక్టార్ల భూమి అవసరం ఉన్న నేపథ్యంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే కొంత ఆలస్యం అవ్వడానికి ఆస్కారం ఉంది. క్షేత్రస్థాయిలో అంతకు మించి జాప్యం అవుతుండంతో రెవెన్యూ అధికారులు ప్రక్రియను సాగదీస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటి వరకు సిద్ధం చేసిన 6 గ్రామాల 3ఏ ప్రతిపాదనల్లో సైతం రహదారి నిర్మాణానికి తీసుకోబోయే భూమి, దాని సర్వే నంబర్లు మాత్రమే నమోదు చేశారు. నిబంధనల ప్రకారం సదరు సర్వే నంబరులో మొత్తం ఎంత భూమి ఉందన్న విషయం కూడా స్పష్టంగా పొందు పర్చాలి. దీంతో తయారు చేసిన గ్రామాల ప్రతిపాదనలను సైతం సవరించి పంపాల్సి రావడంతో మరింత ఆలస్యమవుతోంది. వేగంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

దెబ్బతిన్న పంటల రక్షణపై కేవీకే శాస్త్రవేత్తతో ఫోన్‌ఇన్ నేడు



డి.సుధారాణి

మొంథా తుపాను పంటల్ని నిలువునా ముంచేసింది. దీనికి ముందు వర్షాలు చాలా వరకు దెబ్బతీశాయి. వరుస అలజడుల నేపథ్యంలో ఉన్న పంటనైనా కాపాడుకోవాలని రైతు తాపత్రయ పడుతున్నాడు. ఈనేపథ్యంలో వరి, మినుము, చెరకు, తదితర పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు..మీతోడు' ఆధ్వర్యంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డి.సుధారాణితో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రైతుల సమస్యలు, సందేహాలకు ఆమె సమాధానాలు ఇస్తారు. అన్నదాతలు చేయాల్సిందల్లా కింది సెల్ నెంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. – ఘంటసాల, న్యూస్‌టుడే

80082 01253

తేదీ: 03-11-2025 సోమవారం ఉదయం: 11 నుంచి 12 గంటల వరకు


ఆశకు పోతే.. కేసుల మోతే!

◆ అక్రమ లావాదేవీలకు అమాయకులు బలి
◆ బెట్టింగ్, విదేశాలకు డబ్బు తరలింపునకు వినియోగం

ఈనాడు, అమరావతి

☛ **విజయవాడలోని చిట్టినగర్‌కి చెందిన** కూలీని ఇటీవల ఒడిశాకు చెందిన ఒకరు కలిశారు. బ్యాంకులో పొదుపు ఖాతా తెరిచి మూడు నెలలు లావాదేవీలు చేసుకునేందుకు ఇవ్వాలని కోరాడు. ఇందుకు నెలకు రూ.5వేలు చొప్పున ఇస్తానని ఒప్పించి, ఖాతా తెరిపించాడు.

☛ **ఇటీవల క్రికెట్ బెట్టింగ్ కోసం** ఒడిశాకు చెందిన మధ్యవర్తులు కొత్తగా పలువురితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. వారి పాస్ పుస్తకాలు, బ్యాంకు కిట్లు దిల్లీకి పంపారు. కేసు దర్యాప్తులో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూడడంతో అమాయకులు పోలీసుల విచారణ ఎదుర్కొంటున్నారు.



అదనపు ఆదాయం ఆర్జించాలన్న ఆశను పలువురు మోసగాళ్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. మీ బ్యాంకు ఖాతా పాస్‌బుక్, అంతర్జాల, మొబైల్ బ్యాంకింగ్ ఐడీ, పాస్‌వర్డ్‌లను వివరాలు ఇస్తే చాలు కమీషన్ ఇస్తామని ఆశచూపుతున్నారు. ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వీరి మాటలు నమ్మి యువత, గృహిణులు పోలీసు కేసుల్లో చిక్కుకుంటున్నారు.

మధ్యవర్తులే తెరిపిస్తున్నారు..

అమాయకుల నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించేందుకు దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. సామాజిక మాధ్యమాలు, పరిచయం ఉన్న వారి ద్వారా కమీషన్ల ఎర వేసి ఖాతాలు సేకరిస్తారు. దళారులకు దండిగా కమీషన్ ముడుతుంది. ఖాతాదారుల మొబైళ్లకు ఫిషింగ్ లింక్స్ పంపి వాటి ద్వారా ఖాతాల రిజిస్టర్డ్ ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్‌లు వెళ్లకుండా అవి తమకు ఫార్వార్డ్ అయ్యేలా చూస్తారు. ఖాతాల్లో జమ అవుతున్న నగదును బినామీ ఖాతాలకు మళ్లిస్తున్నారు. ఆ ఖాతాల నుంచి దేశం దాటిపోతోంది. క్రిప్టో కరెన్సీ రూపంలో ఇతర దేశాలకు చేరుతోంది.

డబ్బు ఎర వేసి..

తేలికగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డ కేటుగాళ్లు ఆర్థిక లావాదేవీలకు తెలివిగా ఇతరుల ఖాతాలను ఉపయోగిస్తున్నారు. పోలీసులకు ఎక్కడా దొరక్కుండా ఉండేందుకే ఈ ఎత్తుగడ వేస్తున్నారు. అసలు ఖాతాలే లేని వారినీ కమీషన్ ఆశచూపి నిందితులే తెరిపిస్తున్నారు. వీరికి తమ ఖాతాల ద్వారా పెద్ద మొత్తాల్లో లావాదేవీలు జరుగుతున్నట్లు తెలియదు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

★ మీ బ్యాంకు, యూపీఐ వివరాలెవరికీ చెప్పొద్దు.
★ సులభంగా డబ్బు సంపాదించండి అని చెప్పే ఉద్యోగ ప్రకటనలు, ఆన్‌లైన్‌లో వచ్చే ఆఫర్లు నమ్మొద్దు.
★ ఎవరైనా మీకు డబ్బు ఇచ్చి.. ఇతరులకు పంపమని లేదా ఖాతా ద్వారా అందుకోమని కోరితే స్పందించకపోవడం ఉత్తమం.



సాధన చేస్తూ..

బాలికలకు శిక్షణ.. ఆత్మరక్షణ

- జిల్లాలో 162 పాఠశాలల ఎంపిక
- నేటి నుంచి కార్యక్రమానికి శ్రీకారం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బాలికలు తమను తాము రక్షించుకోవడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి శక్తిమంతులమనే భావన కలుగజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష- స్వీయ రక్షణ శిక్షణ'కు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా జిల్లాలోని 17 మండలాల్లో 162 పాఠశాలల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను రెండు నెలలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర శిక్షా పథకం అధికారులు ఆయా పాఠశాలల్లో ఏర్పాట్లు చేశారు.

నిపుణులైన శిక్షకుల నియామకం

బాలికలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని ఎదుర్కొని స్వీయరక్షణ పొందాలని జిల్లాలోని అన్ని పాఠశాలలకు నిపుణులైన శిక్షకులను నియమించింది. వీరు ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులు, అత్యవసర సమయాల్లో ప్రతి స్పందించేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో పిరియడ్ 90 నిమిషాలు చొప్పున 60 రోజుల్లో 20 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇది కేవలం బాలికలకే పరిమితం కాకుండా పాఠశాలల్లో విధులు నిర్వహించే వ్యాయామ ఉపాధ్యాయినులకు ఈ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారు. వీరు నేర్చుకొని తరువాత వీటిని విద్యార్థినులతో చేయించాలి.

వ్యక్తిత్వ వికాసానికి దోహదం



బాలికల స్వీయ రక్షణ కార్యక్రమం వారిలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి దోహదపడుతుంది. జీవితంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవడానికి తోడ్పడుతుంది. తమను తాము రక్షించుకోగలమనే సురక్షిత భావన కలుగుతుంది. వీటి వల్ల సానుకూల దృక్పథంతో ఉంటారు. ఈ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారం అందించాలి. **- ఎం.రజనీకుమారి, సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు, వేద పండితులు, ఆలయ పర్యవేక్షకుడు స్వాగతం పలికారు. నాగదేవత పుట్టకు పూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం స్వామికి నిర్వహించే మహాన్యాస రుద్రాభిషేకాల్లో న్యాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. వేద మంత్రాలతో పండితులు ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



నాగదేవత పుట్టలో పాలుపోసి హారతి ఇస్తున్న జస్టిస్ డాక్టర్ లక్ష్మణరావు దంపతులు

5 నుంచి 11 వరకు యోగా తరగతులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నర్ ఇంజినీరింగ్ పేరుతో రామవరప్పాడులోని ఎస్ఎల్‌వీ గ్రీన్ మెడోస్‌లో ఈ నెల 5 నుంచి 11 వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, సాయంత్రం పూట రెండు బ్యాచ్‌లతో నిర్వహిస్తున్నట్లు, ఆసక్తిగలవారు 91664 94989 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'జోగి పాపం పండింది'

పటమట, న్యూస్‌టుడే: వైకాపా నేతలకు దోచుకోవడం.. దాచుకోవడం అలవాటుగా మారిందని.. తప్పులు చేయడమనేది వాళ్ల డీఎన్ఏలోనే ఉందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో సంబంధం ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్.. అమ్మవారి ముందు దొంగ ప్రమాణం చేశారని, అందుకే అతని పాపం పండి అరెస్టు అయ్యారన్నారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన జనార్దన్‌రావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే జోగి రమేష్‌ను సిట్ అధికారులు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ అరెస్టుకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తన అరెస్టును ముందే గ్రహించిన జోగి తన స్థాయిని పెంచుకోవడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై ఆరోపణలు చేస్తున్నారని బుద్దా ఆగ్రహం వ్యక్తం చేశారు. జోగి రమేష్ గురించి ఆలోచించే తీరిక చంద్రబాబు, లోకేశ్‌లకు లేదన్నారు. తప్పు చేసిన దొరికిపోయిన జోగి రమేష్ తన అరెస్ట్ సమయంలో కులం గుర్తుకు రావడం సిగ్గు చేటన్నారు. తెదేపాయే రాష్ట్రంలో బీసీలకు అధికార హక్కు కల్పించిందన్నారు. జోగి రమేష్ మంచోడని జగన్ సర్టిఫికెట్ ఇవ్వడం విడ్డూరంగా ఉందని బుద్దా విమర్శించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, నాయకులు నరసింహ చౌదరి, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, చిత్రంలో భవకుమార్, నరసింహా చౌదరి, గురునాథం

ఈ నెల 5న కార్తిక దీపోత్సవం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న దేవస్థానం సేవాదళ్ ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో కార్యాలయంలో పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావులతో కలిసి భవానీ దీక్షల విరమణ, కార్తిక మాస వేడుకలకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం విడుదల చేశారు. అనంతరం వైదిక కమిటీ, పోలీసు, ఇంజినీరింగ్ దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. భక్తుల భద్రత దృష్ట్యా దీపాలు వెలిగించేందుకు ప్రత్యేకంగా 500 మంది సేవాదళ్ సభ్యులు అర్చకులకు సహకరిస్తారన్నారు. డిసెంబరు 4న సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి దుర్గగుడి వరకు ఊరేగింపులో భవానీ దీక్షాధారులు పాల్గొంటారని చెప్పారు. పశ్చిమ, వన్ ట్రాఫిక్ ఏసీపీలు దుర్గారావు, రామచంద్రరావు, సీఐలు ఉమామహేశ్వరరావు, గురుప్రకాష్, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవోలు రమేష్, వెంకటరెడ్డి, సుధారాణి, చంద్రశేఖర్, వాసు, గంగాధర్ పాల్గొన్నారు.



గోడపత్రం విడుదల చేస్తున్న ఈవో శీనానాయక్ రాధాకృష్ణ, శివప్రసాద్‌శర్మ తదితరులు

అనుచిత లబ్ధి పొందినవారికి నోటీసులు

అద్విక కేసులో సొమ్ము రాబట్టేందుకు చర్యలు

ఈనాడు, అమరావతి

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం కేసులో అనుచిత లబ్ధి పొందిన ఏజెంట్లు, డిపాజిటర్ల నుంచి సొమ్మును కక్కించేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. నష్టపోయిన వారికి న్యాయం చేసేందుకు రావాల్సిన దాని కంటే ఎక్కువ పొందిన వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే కొందరిని పిలిపించి మాట్లాడుతున్నారు. అదనపు సొమ్మును తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చెల్లిస్తే సాక్షులుగా పరిగణిస్తామని చెబుతున్నారు. దీంతో కొందరు గడువు ఇస్తే తిరిగి చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు.

రూ.70 కోట్లు రాబట్టేలా..

మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది ఎక్కువ ప్రయోజనం పొందారు. రూ.54కోట్లు పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.105 కోట్లు లబ్ధి పొందారు. వారికి దక్కాల్సిన దాని కంటే రూ. 49 కోట్లు అనుచితంగా పొందారు. వీరితో పాటు కొందరు డిపాజిటర్లకు కూడా ఇలా ప్రయోజనం దక్కింది. 204 డిపాజిటర్లు రూ.35 కోట్లు పెట్టుబడి పెట్టగా రూ.56 కోట్లు వచ్చింది. ఈ రెండు వర్గాల నుంచి అదనంగా రూ. 70 కోట్ల వరకు అనుచితంగా ప్రయోజనం పొందారు. ఈ సొమ్మును తిరిగి రాబడితేనే నష్టపోయిన వారికి ఉపశమనం కలుగుతుంది. ఇప్పటికే 52 చరాస్తులను గుర్తించి ఎటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి లేఖ రాశారు. వీటి డాక్యుమెంట్ విలువ రూ. 20 కోట్లు కాగా మార్కెట్ విలువ ఐదు రెట్లు ఉంది.

☛ లబ్ధి పొందిన ఏజెంట్లలో పలువురు అజ్ఞాతంలో ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వారు.. ఇటీవల ప్రత్యేక బృందం సోదాల సమయంలో ఇళ్లల్లో లేకుండా పరారయ్యారు. రోజూ కొందరు ఏజెంట్లను పిలిపించి వారు లబ్ధి పొందిన మొత్తం వివరాలు అందజేస్తూ, డబ్బును చెల్లించాలని గట్టిగా చెబుతున్నారు. దీనికి వారు వారం రోజుల సమయం కోరుతున్నారు. గడువు దాటిన తర్వాత కూడా ఇంకా స్పందించకపోతే వారికి సంబంధించిన ఆస్తులను ఎటాచ్ చేయడంతో పాటు అరెస్టు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కమిషనరేట్‌లో ఎస్సైల బదిలీ

విజయవాడ నేరవార్తలు, గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యారావుపేట ఎస్సై జి.అనిల్‌ను గంపలగూడెంకు, గంపలగూడెం ఎస్సై ఎస్.శ్రీనును రెడ్డిగూడెంకు బదిలీ చేశారు. నున్న క్రైం ఎస్సై జి.మహాలక్ష్ముడును ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణను వీఆర్‌కు పంపారు.

తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్: కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం కాస్త తగ్గింది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి ఉదయం ఆరు గంటలకు 1,58,175 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఇదే పరిస్థితి ఉంది. బ్యారేజీ వద్ద 25 గేట్లను నాలుగు అడుగులు, 44 గేట్లను మూడు అడుగుల మేర ఎత్తారు. నీటి మట్టం 12 అడుగులు ఉంది.

రాయనపాడు రైల్వేగేటు మూసివేత

గొల్లపూడి: రైల్వే ట్రాక్ అభివృద్ధి పనుల్లో భాగంగా రాయనపాడు రైల్వేగేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈనెల 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తామన్నారు. ఆ మార్గంలో ఏవిధమైన వాహనాలను అనుమతించడం జరగదని పేర్కొన్నారు.

ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆరోగ్య కార్డులపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగుల వైద్య సేవలపై ఆదివారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల ఆరోగ్యకార్డులకు సంబంధించి 60 రోజుల్లోగా ప్రణాళిక చేసి, నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం సంతోషకరమన్నారు. వైద్య సేవల్లో సమస్యలు, పాత ప్యాకేజీ ధరల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, ఆసుపత్రులకు సరిగా బిల్లులు చెల్లించకపోవడం వల్ల తలెత్తే సమస్యలు, దశాబ్ద కాలం క్రితం నిర్ణయించిన రెండు లక్షల రూపాయల సీలింగ్ తదితర సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 60రోజుల్లో అన్ని పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఎన్జీవో ఎన్నికలకు సమయం సిద్ధంగా ఉందని తెలిపారు. వేతన సవరణ, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగుల కాంటమ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులకు కృషి చేయాలని, ఎన్జీవో 75 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. సంఘం రాష్ట్ర కోశాధికారిగా పీవీ డిపార్ట్‌మెంట్‌కి చెందిన భారతీప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వి.రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్, 26 జిల్లాల నుంచి వచ్చిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్, వేదికపై రమణ, జగదీశ్వరరావు, ప్రసాద్ యాదవ్, మాధవ్ తదితరులు

ధర వరలు



వంకాయలు-46/50, టమాటా-28, బెండ-44, పచ్చిమిర్చి-26, కాకర-40, బీర-42/46, క్యాలీ ఫ్లవర్-20/22, క్యాబేజీ-28, క్యారెట్-56/72, దొండ-34, బంగాళదుంప-32, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-44, దోస-22, సొర-25, పొట్ల-28/25, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-46, బీట్ రూట్-50, కీరదోస-38, బీన్స్-85/95, క్యాప్సికమ్-78, చింతకాయలు-70, నిమ్మ (డజను)-24/28, కొత్తిమీర-13/26, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 లైవ్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 190, 199, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

[illegible]

కేరింతలతో హోరెత్తిన ఐజీఎంసీ స్టేడియం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఏసీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్ పార్క్‌కు నగర వాసులు, క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఐసీసీ ఉమెన్ వరల్డ్ కప్-2025లో భాగంగా ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు మూడు పెద్ద తెరలను ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులు గ్యాలరీతో పాటు కింద కూర్చొని తిలకించేందుకు కార్పెట్ పర్చారు. కొంత మంది అభిమానులు స్టేడియంలోని స్టాండ్స్‌పై నుంచి వీక్షించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు సభ్యులు సిక్సర్లు, బౌండరీలు కొట్టినప్పుడు ప్రేక్షకులు చప్పట్లు, కేరింతలు కొడుతూ సందడి చేశారు. [illegible]



మ్యాచ్ తిలకిస్తున్న ఎంపీ శివనాథ్, శ్రీనివాస్, రఘురామరాజు

గుండె జబ్బును 20 ఏళ్లు ఆపవచ్చు

గుడివాడ, న్యూస్‌టుడే : 'గుండె జబ్బు వస్తుందనే భయం వద్దు. అధునాతన ఏఐ సాంకేతికతతో సిటీ కరోనరీ యాంజియోగ్రఫీ ద్వారా ముందుగానే ముప్పును గుర్తించి.. చికిత్స ద్వారా 20 నుంచి 25 ఏళ్ల వరకు గుండె జబ్బును [illegible]' అని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు పోతినేని రమేష్ బాబు పేర్కొన్నారు. గుడివాడలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం చాలా వరకు గుండె సమస్యలకు స్టంట్, బైపాస్‌లు అవసరం లేకుండానే వైద్యం చేయవచ్చన్నారు. గుండెకు 70 నుంచి 80 శాతం వరకు బ్లాకులు ఉన్నా.. శస్త్రచికిత్స లేకుండా స్టంట్‌లు లేకుండా వైద్యం చేస్తున్నామన్నారు. గతంతో పోల్చితే.. ఏఐ రాకతో గుండె వైద్యంలో రోగనిర్ధారణలో పూర్తిగా మార్పులు వచ్చాయన్నారు. గుండె జబ్బులకు చాలా రకాల పరీక్షలు చేస్తున్నారని.. నేడు అవన్నీ అవసరం లేదని, సీటీ కరోనరీ యాంజియోగ్రఫీ చాలన్నారు. ఈ పరీక్షను 30 ఏళ్లు దాటిన వారు చేయించుకుని, ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. వైద్యులు కూడా జబ్బుల లక్షణాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి పుణుకొల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస్, కోశాధికారి దేవరపల్లి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్ బాబు తదితరులు

రైతులకు పూర్తి పంట నష్టపరిహారం చెల్లించాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి పంట నష్ట పరిహారాన్ని చెల్లించడంతో పాటు.. వారి నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని తుపాను బాగా దెబ్బతీసిందన్నారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకూ సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడతామని తెదేపా వాగ్దానం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం ఒత్తిడితో 2024 రబీ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసిందని ఆరోపించారు. రైతులే ప్రీమియం చెల్లించే స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉచిత బీమా పథకం వల్ల 2024 ఖరీఫ్‌లో 35 లక్షలమంది రైతులకు 84 లక్షల ఎకరాలకు బీమా వర్తిస్తే.. కొత్త పథకం వల్ల ఈ సంఖ్య 19 లక్షల ఎకరాలకు పడిపోయిందన్నారు. బీమా చెల్లిస్తున్న రైతుల సంఖ్య 7 లక్షలకు తగ్గిందన్నారు. ప్రభుత్వమే పంటల బీమా కంపెనీ పెట్టి.. ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తే ఎలాంటి నష్టం ఉండదన్నారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటన విచారకరమన్నారు. ఉత్తరాంధ్ర తిరుపతిగా ప్రచారంలో ఉన్న దేవాలయం.. ప్రభుత్వ దృష్టిలో లేదని దేవాదాయ శాఖ మంత్రి చెబుతుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పేదరిక నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

స్మృతివనం నిర్వహణలో అలసత్వం తగదు



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ. పక్కనే సీపీ రాజశేఖరబాబు, కమిషనర్ ధ్యానచంద్ర, మల్లికార్జునరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని అంబేడ్కర్ స్మృతి వనం నిర్వహణలో అలసత్వాన్ని సహించే ప్రసక్తి లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఇప్పటి వరకు నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు సంస్థను తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, ఇతర బకాయిలు చెల్లించాలని సదరు సంస్థను ఆదేశించినట్టు చెప్పారు. ఆదేశాలు బేఖాతరు చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. స్మృతి వనం నిర్వహణ, ప్రగతిపై నగరంలోని కలెక్టరేట్‌లో ఆదివారం సమన్వయ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. స్మృతి వనం నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ శాఖల ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతరం ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని, ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అంబేడ్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా కృషి చేయనున్నట్టు వివరించారు. జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధాశ్రమ నిర్వాహకుడి మృతి

కృష్ణలంక: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధాశ్రమ నిర్వాహకుడు మృతి చెందిన సంఘటన కృష్ణలంకలో ఆదివారం చోటుచేసుకుంది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్ట గురవయ్య(55) వృద్ధాశ్రమ నిర్వాహకుడు కాగా.. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్కేవీఎన్ నగర్‌లో కుటుంబంతో ఉంటున్నారు. ఇబ్రహీంపట్నంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి భార్యతో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. విజయవాడ వచ్చి బీసెంట్ రోడ్డులో షాపింగ్ ముగించుకున్న అనంతరం కుమార్తె వద్దకు వెళ్లేందుకు సాయంత్రం సుమారు 5గంటల సమయంలో వీఎంసీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వెనుక నుంచి వచ్చిన గవర్నర్‌పేట-1 డిపోకు చెందిన నూతక్కి-రైల్వేస్టేషన్, 217సీ నంబరు ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో గురవయ్య కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని వారు అతడిని ఆసుపత్రికి తరలించగా కొద్ది సేపటికి మృతి చెందారు. ఘటనాస్థలానికి చేరుకున్న కృష్ణలంక పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అవినీతిపై పోరాటానికి ముందుకు రావాలి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి అవినీతి అవరోధంగా మారిందని, దానిని తరిమికొట్టాల్సిన అవసరం ఉందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ పేర్కొన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవం-2025లో భాగంగా ఆదివారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఆయన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా అవినీతిపై ఫిర్యాదు చేయాలనుకుంటే 1064కు కాల్ చేయవచ్చన్నారు. దీనిపై వెంటనే అవినీతి నిరోధక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతిపై పోరాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మంచి సహకారం ఉందన్నారు. ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ మహాత్మాగాంధీ రోడ్డు మీదుగా బెంజిసర్కిల్ తిరిగి పోలీస్ కంట్రోల్ నుంచి ఐజీఎంసీ స్టేడియం వద్దకు చేరుకుంది. ప్రదర్శనలో ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అదనపు ఎస్పీ సుధాకర్, అదనపు ఎస్పీలు మహేందర్, దిలీప్ కిరణ్, పలువురు అధికారులు, యువత పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? అంతర్గత రహదారుల వెంట మురుగు కాలువల నుంచి తొలగించిన పూడికను రోడ్డుపైనే వదిలేయడంతో ఇబ్బందిగా ఉంది. **- గిరిబాబు, స్థానికుడు**

✔ కార్మికులతో పూడికలను తొలగించి, తరలిస్తాం.

- ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

– న్యూస్‌టుడే, మైలవరం

? దుగ్గిరాలపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారక దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. **- కె.కిరణ్, గ్రామస్థుడు**

✔ సమస్య తెలిసింది. తక్షణమే సిబ్బందితో కాలువలు పూడిక తీయించి దోమల నివారణ చర్యలు చేపడతాం.

-మనోజ్, పంచాయతీ కార్యదర్శి– న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి ఆరు పంపులకు వెళ్లే రహదారి మూల వద్ద ఆదివారం చెత్తను తొలగించకపోవడం వల్ల ఆవులు, పందులు అక్కడి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంది. అదే రహదారిలో మురుగు కాలువలోని చెత్త తొలగించకపోవడం వల్ల ప్లాస్టిక్ కవర్లు, చెత్త కాలువలో పేరుకుపోయింది. **-శ్యామలరావు, స్థానికుడు** ✔ సోమవారం ఉదయం సిబ్బందిని పంపి ఆ ప్రాంతమంతా శుభ్రం చేయిస్తాం. - వెంకటరత్నం సంబంధిత అధికారి

– న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం



✦ ఇటీవల కురిసిన వర్షాలకు సున్నంపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 2వ తేదీన వార్త ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ స్పందించారు. సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమలు నివారణకు బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. – **న్యూస్‌టుడే, జి.కొండూరు**

✦ పట్టణంలోని 9వ వార్డులో గల డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును శానిటరీ అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



✦ విస్సన్నపేట అనుమోలు వారి వీధి, కుక్కడపు వారి వీధి, తిరుపతమ్మ తల్లి గుడి ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపిన సమస్యను మేమున్నాం మీకు తోడుగా శీర్షిక ప్రచురించగా ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. కార్మికులు చెత్తను ట్రాక్టర్‌కి ఎత్తి డంపింగ్ యార్డ్‌కి తరలించారు. – **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచరామాలు, వాడపల్లి ఆలయాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నామని డిపో మేనేజర్ జీవి.నాగమల్లేశ్వరావు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 98856 61835, 73824 87969 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రెడ్డిగూడెం, ముచ్చనపల్లి గ్రామాల్లో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేస్తారని ఆ సంఘం నాయకులు బండారు సత్యనారాయణ, వేముల బాబులు తెలిపారు. మండల పరిధిలోని రుద్రవరం, కూనపరాజుపర్వ, ముచ్చనపల్లి గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి.. ప్రదర్శనగా రెడ్డిగూడెం చేరుకొని పూజా కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. ఏపీ వడ్డెర సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు పాల్గొంటారన్నారు.

భక్తిశ్రద్ధలతో జయంత్యుత్సవం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో భక్త బృందం ఆధ్వర్యంలో ఆయన జయంత్యుత్సవం ఆదివారం నిర్వహించారు. అర్చకులు రామలింగేశ్వశర్మ ఆధ్వర్యంలో గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. తదుపరి భక్తులు స్వామివారి చిత్రపటంతో గ్రామంలో పల్లకీసేవ చేశారు.

ఘనంగా పడిపూజ



జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పార్వతీ సమేత అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు భక్తి గీతాలాపన చేస్తూ పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు.

సీసీఐ జాడలేదు.. గ్రామాల్లో ధరలేదు..!


మైలవరం, న్యూస్‌టుడే

అక్టోబరులోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సిన భారత పత్తి సంస్థ (సీసీఐ) నవంబరు మొదటి వారంలో ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. మొదటి వారంలో మూడ్రోజులు గడిచినా, నిర్దిష్ట కార్యాచరణ ప్రకటనా వెలవడలేదు. ఇప్పటికే అధిక వర్షాలతో అయోమయంగా మారిన పత్తి రైతుల పరిస్థితి, కొనుగోలు జాప్యంతో మరింత దిగులు చెందుతున్నారు. సీసీఐ కొనక, బయట మార్కెట్‌లో మద్దతు ధర దక్కక దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

రూ.రెండున్నర వేలకు పైగా...

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 40వేల ఎకరాల వరకు పత్తిని సాగు చేశారు. అధిక వర్షాలు ఈ ఏడాది పత్తి రైతులను దెబ్బతీశాయి. మొంథా తుపాను సమయానికి పత్తి తీతలకు సిద్ధంగా ఉన్నా, కూలీల కొరతతో మూడొంతుల విస్తీర్ణంలో సాధ్యం కాలేదు. దాంతో నాలుగు రోజుల ముసురు తీవ్ర ప్రభావాన్ని చూపాక, గత మూడ్రోజులుగా తీతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయినా నాణ్యత పేరిట ప్రైవేటు వ్యాపారులు క్వింటా పత్తికి రూ.5,500 మించి ధరలివ్వడంలేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.8,110లుగా ప్రభుత్వం ప్రకటించినా, బయట మార్కెట్‌లో అమ్ముతున్న రైతులు, క్వింటాకు రూ.రెండున్నర వేలకు పైగా నష్టపోతున్నారు.

✤ పత్తి కొనుగోళ్లలో కానరాని కార్యాచరణ



మైలవరంలో చివరి దశకు చేరిన పత్తి చేలు

ఆందోళన మొదలైంది..

పత్తి దిగుబడులు అక్టోబరు తొలి వారం నుంచే ప్రారంభమవగా, వెంటనే సీసీఐ రంగంలోకి దిగుతుందని రైతులు భావించారు. అందుకు అనుగుణంగా రెండు వారాల కిందట జిల్లాస్థాయి అధికారుల సమావేశం నిర్వహించి, నవంబరు మొదటి వారం నుంచి పూర్తిస్థాయిలో సీసీఐ కొంటుందని ప్రకటించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోని, మూడు చోట్ల ఈ కేంద్రాలను తెరిస్తే రైతులకు ఉపయుక్తంగా ఉండేది. అయితే అధికారుల నుంచి నేటికీ కొనుగోలు కార్యాచరణ ప్రకటించకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మరో వైపు తీవ్ర వర్షాలతో పత్తి చేలు జీవం కోల్పోయాయి. కేవలం ఒక్క తీతకే చేలన్నీ ఎర్రబారి కనిపిస్తున్నాయి. దాంతో ఈ నెలలోనే ఒకే తీతతో పత్తిని తీసేసి, మొక్కజొన్న సాగుచేయాలని రైతులు ఆలోచన చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోయాం



వర్షాలకు చేలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. కనీస దిగుబడులు రాక నష్టపోతున్నాం. ఈ సమయంలో మద్దతు ధరలతో కొనుగోలు చేస్తే రైతులకు మేలు చేసినట్లు అవుతుంది. గ్రామాల్లో వ్యాపారులు ధరలు తగ్గించి కొంటున్నారు.

- వి.రామసుబ్బారెడ్డి, పత్తి రైతు

ఉమాగౌరీశా..శరణు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగాన్ని ఆదివారం అర్చకులు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు. భక్తులు శివలింగం దర్శించుకుని పూజలు చేశారు.

పీపీపీ విధానంతో పేదలకు అన్యాయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏపీలో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ విధానం చేయడం వల్ల పేదలైన వారికి వైద్య విద్య, వైద్యంలో అన్యాయం జరుగుతుందని సీపీఎం మండల కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం సిహెచ్. విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ నెల 7 తేదీన విజయవాడలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ద్వారా ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేందుకు ప్రజలు తరలిరావాలని కోరారు. నాయకులు ఎం.మాధవరెడ్డి, వి.కృష్ణారెడ్డి, కాంతారావు, రాజు, వెంకటేశ్వరరావు, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కల్తీ మద్యం పాపం జోగి రమేష్‌దే'

మైలవరం, న్యూస్‌టుడే: కల్తీ మద్యం పాపం జోగి రమేష్‌దేనని, అక్రమాలకు పాల్పడిన ఆయనను అరెస్టు చేస్తే, డైవర్షన్ రాజకీయాలంటూ వైకాపా చేస్తున్న విమర్శలు సిగ్గుచేటని ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, తెదేపా సీనియర్ నాయకులు నాగేశ్వరరెడ్డి, శోభన్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్తి ఆధారాలతో అధికారులు అరెస్టు చేశారని, నిందితుడిగా ఉండి, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌లపై నోరు జారడం మంచిది కాదని హితవు పలికారు. మండల అధ్యక్షులు గోపాలస్వామి, వెంకటేశ్వరరావు, వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైలవరం తెదేపా కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కొండపల్లి, న్యూస్‌టుడే: జోగి రమేష్ అరెస్టు విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని పుర ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సిట్ అధికారుల విచారణలో వైకాపా నేత జోగి రమేష్ పాత్ర నిర్ధారణ అయినందువల్లే ఆయనను అరెస్టు చేశారన్నారు. విచారణలో ప్రధాన నిందితుడు జనార్దనరావు జోగి పేరును ప్రస్తావించి ఆయన ప్రోద్బలంతోనే చేస్తున్నానని చెప్పారన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కొండపల్లిలో ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు, నాయకులు

ఎన్టీఆర్ ఆశయాలు నెరవేరుద్దాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలో విస్సన్నపేటలో నూతనంగా నిర్మించిన తెదేపా కార్యాలయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఏపీ ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు, గోటేటి సుబ్రహ్మణ్యం, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కుక్కడపు నాగేశ్వరరావు, ఎన్నారై గిరిబాబు, మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలను నెరవేర్చేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండా దిమ్మెను ఆవిష్కరించి.. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూటమి శ్రేణులు

కిడ్నీ వ్యాధితో మరొకరి బలి



మంగ్యా (పాత చిత్రం)

కృష్ణారావుపాలెం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ తండాకు చెందిన జరపల మంగ్యా (45) మూత్రపిండాల వ్యాధితో శనివారం రాత్రి మృతి చెందాడు. గత ఐదేళ్లుగా అతను కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా వైద్యం కోసం తమకున్న కొద్దిపాటి సాగు భూమి కూడా విక్రయించామని కుటుంబ సభ్యులు వాపోయారు. తెదేపా, సీపీఎం నాయకులు పి.శ్రీనివాసరావు, పి.ఆనందరావు, అమ్మిరెడ్డి తదితరులు ఆదివారం మంగ్యా మృతదేహానికి నివాళులర్పించారు. అతని కుటుంబానికి వీఆర్వో రాణి ప్రభుత్వం నుంచి రూ.10వేలు, వైకాపా నాయకుడు పర్వతనేని చంద్రం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

అడుగడుగునా గుంతలే

స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మునగపాడు వెళ్లే బైపాస్ రహదారిలో అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మోకాలిలోతు గుంతల్లో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాలు సైతం నిత్యం ఇటుగానే ప్రయాణిస్తుండడంతో గుంతలు మరింత పెరిగి అటుగా ప్రయాణించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టి అవస్థలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జి.కొండూరు



పాఠశాల బస్సు నంబర్ ప్లేటు సైతం రోడ్డుకు తగులుతోందిలా

అక్కడక్కడా రోడ్డు ఉంది అంతే..!

విజయవాడ వయా రెడ్డిగూడెం నుంచి విస్సన్నపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా తయారైంది. అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. రంగాపురం, బూరుగగూడెం, రామవాపురం, కొత్తరెడ్డిగూడెం, మద్దులపర్వ గ్రామాల వరకు గుంతలే. మొంథా తుపాను దాటికి వాటిల్లో నీరు చేరి ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బైకుల్లోనే కాక ఆటోలు, బస్సుల్లో వెళ్లాలన్నా ఒల్లు గుల్ల అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



కొత్తరెడ్డిగూడెం వడ్డెర కాలనీలో ఇలా



దేవాలయం ఎదురుగా భారీ గోతులు

ఎర్రన్నాయుడు సేవలు మరువలేనివి



గొల్లపూడి: చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని



గంపలగూడెం మండలం గోసవీడులో..

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ప్రజలకు కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఎర్రన్నాయుడి వర్ధంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశ రాజధాని స్థాయిలో బలంగా వినిపించారన్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

మైలవరం, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లితీష్, గోపాలస్వామి, బాలకృష్ణ, షహనబేగం తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో తెదేపా నాయకులు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడులో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.రజనీకాంత్, జి.కిషోర్, కె.వెంకటేశ్వరరావు, ఎస్.బాబురావు, యాకూబ్, కృష్ణారావు, సురేష్, పుల్లారావు తదితరులు నివాళులర్పించారు.

చట్టబద్ధంగా ఎదుర్కొంటాం: జోగి రాజీవ్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తన తండ్రి జోగి రమేష్ అరెస్టు అన్యాయమని, తప్పుడు కేసులను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని జోగి రాజీవ్ అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై తప్పుడు కేసు పెట్టారని.. ఇప్పుడు మద్యం గురించి రాష్ట్ర ప్రజలకు తెలియజేసి నిరంతరం ప్రభుత్వానికి ఊపిరి ఆడకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తునందు వల్లే నా తండ్రిని కూడా అరెస్టు చేశారన్నారు. భవిష్యత్తులో తప్పుడు కేసులు పెట్టిన వారు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

✤ కాశీబుగ్గ ఘటన నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చడానికే జోగి అరెస్టు అని జడ్పీ వైస్ ఛైర్మన్ శ్రీదేవి, కొండపల్లి కౌన్సిలర్లు అన్నారు. ఆదివారం ఉదయం మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు సమయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆయన ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలర్లు గుంజాశ్రీను, దయా తదితరులు పాల్గొన్నారు.



జోగి ఇంటి ముందు బైఠాయించిన వైకాపా శ్రేణులు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూల సమీప కట్లేరు వంతెన వద్ద విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ఎస్‌కే. సైదాతో దురుసుగా ప్రవర్తించిన వినగడపకు చెందిన పి.నాగేశ్వరరావుపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పీఎస్సై శశిధర్ తెలిపారు. వంతెన వద్ద మళ్లింపు రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సందర్భంలో నిందితుడు తన విధులను ఆటంకం కలిగించినట్లు కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నవారిపై..: మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని ఎదురుబీడెం నుంచి అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి, గ్రావెల్ రవాణాకు ఉపయోగించిన టిప్పర్, జేసీబీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరులపై..: జి.కొండూరు, న్యూస్‌టుడే: పినపాక గ్రామం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ ఆదివారం సాయంత్రం తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రమేష్ సేవలు ప్రశంసనీయం


పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: తిరువూరు సహకార బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన దేవరపల్లి రామేశం(రమేష్)ను ఆయన స్వస్థలమైన మండలంలోని పెనుగొలనులో ఆదివారం సత్కరించారు. సహకార శాఖలో ఆయన 39 ఏళ్ల పాటు ప్రశంసనీయమైన సేవలు అందించారని వక్తలు కొనియాడారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, కేడీసీసీబి సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్, జీఎం సీహెచ్.చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్.మురళి, తెదేపా మాజీ మండలాధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, వైకాపా నాయకుడు జి.చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రమేష్ దంపతులను సత్కరించిన కేడీసీసీబీ అధికారులు, తెదేపా నాయకులు

మగధ్‌లో మహా ఉత్కంఠ!

- ఒకే కులం, బంధువుల మధ్యే చాలాచోట్ల పోటీ
- రెబల్స్ ప్రభావమూ అధికమే..



బిహార్‌లోని మగధ్ ప్రాంతంలో అసెంబ్లీ పోరు తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ మధ్యలో గట్టి పోటీ నెలకొంది. జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులు, రెబల్స్ ఈ రెండు కూటములకు తలనొప్పిగా మారారు. ఈ ప్రాంతంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకే కులం మధ్య పోటీ జరుగుతోంది. కొన్ని చోట్ల బంధువులే పోటీపడుతున్నారు. ఇక్కడి 5 జిల్లాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాలా చోట్ల రెండు కూటముల్లో ఒకే వర్గానికి టికెట్లిచ్చారు. రాష్ట్రానికి దక్షిణాన ఉన్న మగధ్‌లో ఔరంగాబాద్, గయా, అర్వాల్, జెహానాబాద్, నవాద జిల్లాలున్నాయి.

బెలాగంజ్, బోధ్ గయా, బారాచట్టి, వజీర్‌గంజ్, నవాద, హిసువా, ఔరంగాబాద్‌లలో ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములు టికెట్లిచ్చిన అభ్యర్థుల సామాజిక వర్గాలు ఒకటే కావడం విశేషం.

ఎన్డీయేకి సవాలే..

2020 అసెంబ్లీ ఎన్నికల్లో మగధ్ ప్రాంతం ఎన్డీయేకు షాక్ ఇచ్చింది. పక్కనే ఉన్న షాబాద్ మాదిరిగానే ఇక్కడా ఫలితాలు అనుకూలంగా రాలేదు. గత ఎన్నికల్లో మగధ్‌లోని 26 సీట్లలో కేవలం 6 చోట్ల ఎన్డీయే గెలిచింది. మహాగఠ్‌బంధన్ 20 చోట్ల విజయం సాధించింది.

జెహానాబాద్, ఔరంగాబాద్, అర్వాల్ జిల్లాల్లో ఎన్డీయే ఖాతాయే తెరవలేదు. ఇక్కడ క్లీన్‌స్వీప్, ఎల్జేపీ వీటికతో ఆ కూటమి నష్టపోయింది.

- గత ఎన్నికల్లో ఎల్జేపీ ఒంటరిగా పోటీ చేసింది. ఈసారి ఎన్డీయేలోకి తిరిగిరావడంతో ఈ ప్రాంతంలో 6 సీట్లు ఆ పార్టీకి దక్కాయి. మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హెచ్ఏఎం పార్టీకి 5 సీట్లు దక్కాయి. ఎస్సీ వర్గాల వారిని ఆకట్టుకునేందుకు ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు 11 సీట్లను ఎన్డీయే కేటాయించింది. ఈ వ్యూహాన్ని ఎదుర్కొనేందుకు ఆర్జేడీ పలు చోట్ల అభ్యర్థులను మార్చింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ 15 సీట్లను గెలుచుకుంది.

తీవ్ర ఉత్కంఠ

బెలాగంజ్‌లో ఈసారి పోటీ మాత్రం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. జెహానాబాద్ ఎంపీ, ఆర్జేడీ అగ్ర నేత సురేంద్ర ప్రసాద్ యాదవ్ అగ్ని పరీక్షను ఎదుర్కొంటున్నారు. 2024 నవంబరులో ఈ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు విశ్వనాథ్ యాదవ్ పరాజయం పాలయ్యారు. అదీ బంధువైన మనోరమా దేవి చేతిలో కావడంతో ఆయనకు అది తీసికట్టయింది. ఈసారి వారి మధ్యే పోటీ నెలకొంది. దీంతో సురేంద్ర ప్రసాద్ యాదవ్ తానే అన్నట్లుగా కుమారుడి తరఫున ప్రచారం చేస్తున్నారు.

- బెలాగంజ్‌లో 10 నియోజకవర్గాలు ఉండగా.. జేడీయూ ఒక్కచోటే పోటీ చేస్తోంది.
- బోధ్ గయాలోనూ ఆర్జేడీ, ఎల్జేపీ మధ్య ఒకే వర్గానికి చెందినవారు పోటీ పడుతున్నారు. ఆయితే పాశ్వాన్ వర్గానికి చెందినవారే 1972 నుంచి 2020 మధ్య 8 సార్లు విజయం సాధించారు.
- బారాచట్టిలోనూ ఒకే వర్గం పోటీపడుతోంది. ఇక్కడ జీతన్ రామ్ మాంఝీ బంధువు జ్యోతి దేవి, మాజీ ఎమ్మెల్యే సమతా దేవి తనుశ్రీ మాంఝీ పోటీ చేస్తున్నారు.
- వజీర్‌గంజ్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత అవధేశ్ సింగ్‌తో భాజపాకు చెందిన వీరేంద్ర సింగ్ తలపడుతున్నారు. వీరిద్దరూ ఒకే వర్గానికి చెందినవారు.
- నవాదలో కుటుంబాలదే పేరు సాగుతోంది. జేడీయూ నుంచి విభా దేవి, ఆర్జేడీ నుంచి కౌశల్ యాదవ్ తలపడుతున్నారు. వీరిద్దరూ ఎన్నికలకు ముందు అటు ఇటు పార్టీలు మారారు.
- హిసువాలో భూమిహార్ వర్గానికి చెందిన నీతు కుమారి (కాంగ్రెస్), అనిల్ సింగ్ (భాజపా) పోటీ చేస్తున్నారు.
- ఔరంగాబాద్‌లోనూ ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా రాజకీయాలను ప్రభావితం చేస్తున్న భూమిహార్ వర్గం (అగ్ర వర్గం) నుంచే అభ్యర్థులు పోటీపడుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఆనంద్ సింగ్, భాజపా నుంచి త్రివిక్రమ్ సింగ్ తలపడుతున్నారు.

దడపుట్టిస్తున్న రెబల్స్

మగధ్ ప్రాంతంలో ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటములకు రెబల్స్ బెడద భారీగానే ఉంది. వారు స్వతంత్రులుగానూ, జన్ సురాజ్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. రెబల్స్ కారణంగా గోవిందపుర్, గురువా, నబీనగర్‌లలో త్రిముఖ పోటీ నెలకొంది.

- గోవిందపుర్‌లో ఆర్జేడీ రెబెల్, సిటింగ్ ఎమ్మెల్యే ఎండీ కమ్రాన్.. అధికారిక అభ్యర్థి పూర్ణిమా యాదవ్‌కు చెమటలు పట్టిస్తున్నారు. ప్రత్యర్థి, ఎల్జేపీ అభ్యర్థికి వణుకు పుట్టిస్తున్నారు.
- గురువాలో జేడీయూ రెబల్ అభ్యర్థి సంజీవ్ శ్యామ్. ఎన్డీయే అధికారిక అభ్యర్థిని ఇబ్బంది పెడుతున్నారు.
- నబీనగర్‌లోనూ జేడీయూ రెబల్ అభ్యర్థితో అధికారిక అభ్యర్థికి తిప్పలు తప్పడం లేదు.

నేషనల్ డెస్క్



మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి


శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల, న్యూస్‌టుడే: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఉగ్రశ్రీనివాసమూర్తి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి ఇరు దేవేరుల సమేతంగా కేవలం కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో దర్శనమిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి వద్ద వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని నిర్వహించారు. చిన్నజీయర్‌స్వామి, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, డిప్యూటీ ఈవో లోకనాథం, పారుపత్తేదార్ బాల, ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అన్నవరంలో వైభవంగా తెప్పోత్సవం



హంస వాహనంలో స్వామి, అమ్మవార్ల విహారం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామివారి తెప్పోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. కార్తిక మాసం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పంపా సరోవరం చెంతన ప్రత్యేక వేదికపై ఆసీనులను చేసి తులసీధాత్రి పూజ నిర్వహించారు. అనంతరం హంసవాహనంలో కొలువుదీర్చి పంపా రిజర్వాయర్‌లో మూడుసార్లు విహరింపజేశారు.

హన్మంతూ.. అడవి వదిలిరా..!

- మావోయిస్టు అగ్రనేతకు కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో అగ్రనేతల కుటుంబ సభ్యులు తమ వారిని జనజీవన స్రవంతిలో కలిసేలా ఒప్పించేందుకు ఉన్న ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అగ్రనేత పాక హన్మంతు అలియాస్ ఊకే గణేశ్.. కంధమాల్ ఏరియా ప్రాంతంలో కార్యకలాపాలు సాగిస్తున్నారనే సమాచారం ఆధారంగా ఆయన సోదరుడు ప్రదీప్ మరికొందరితో కలిసి ఒడిశా వెళ్లారు. అక్కడ ఆయన కోసం రోజులు వేచి చూసి, కలవడం సాధ్యం కాకపోవడంతో 5 నిమిషాల నిడివి ఉన్న వీడియోతో పాటు లేఖ విడుదల చేశారు.

చదువు ఆపేసి.. అడవిబాట: నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంలకు చెందిన హన్మంతు బీఎస్సీ చదువుతున్నప్పుడే పీపుల్స్‌వార్ ఉద్యమానికి ఆకర్షితుడై, చదువు మధ్యలోనే వదిలేసి అడవిబాట పట్టారు. ప్రస్తుతం కేంద్రకమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మావోయిస్టు పార్టీలో సౌత్ రీజినల్ బ్యూరో (ఎస్ఆర్‌బీ) కేంద్ర కమిటీ ప్రతినిధిగా మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆయనపై రూ.25లక్షల రివార్డు ఉంది.

లేఖలో ఏముందంటే..: 'మీరు 43 ఏళ్లుగా ప్రజల కోసం పోరాడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేవు. మీతోపాటు పనిచేసిన నేతలు జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. మీరు కూడా ఆ బాట అనుసరించండి. శేష జీవితాన్నీ ప్రజల కోసం పోరాడటానికి మావంతు సహకరిస్తాం' అని ప్రదీప్ కోరారు.

ఈ నెలలో 2 భారీ ప్రాజెక్టులకు అంకురార్పణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెండు భారీ పరిశ్రమలకు ఈ నెలలో భూమిపూజ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ ఉక్కు కర్మాగారం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో రక్షణ రంగానికి చెందిన కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్)ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సంస్థలు రెండు దశల్లో కలిపి రూ. 1,37,400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఒకే నెలలో ప్రారంభించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ కార్యక్రమాలకు ఆయా శాఖల కేంద్ర మంత్రులు రానున్నారు.

మడకశిరలో రక్షణ రంగ పరికరాల ఉత్పత్తి

శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కేఎస్ఎస్ఎల్‌కు ఈ నెల 6న శంకుస్థాపన చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బ్రిటన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 5న రాష్ట్రానికి తిరిగి రానున్నారు. అందుకు అనుగుణంగా కార్యక్రమాన్ని రూపొందించారు. సైన్యానికి అవసరమైన రక్షణ పరికరాలను తయారు చేసే డిఫెన్స్ ఎనర్జిటిక్స్ యూనిట్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇక్కడ ఆయుధాల్లో మందుగుండు సామగ్రిని నింపడం, తుపాకీ తూటాలను కేఎస్ఎస్ఎల్ తయారు చేస్తుంది. దీనికి 1,000 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మొదటి దశలో రూ. 1,000 కోట్లు, రెండో దశలో రూ.1,400 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. రక్షణ రంగానికి అవసరమైన ఆయుధ సామగ్రి తయారీ, పరీక్షించే యూనిట్‌నూ ఏర్పాటు చేయనుంది. ఇందుకు మరో 500 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

ఉక్కు పరిశ్రమతో పాటు పోర్టు కూడా..

అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిత్తల్.. నిప్పాన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ ఉక్కు కర్మాగారానికి ఈ నెల 14న శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయెల్ హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈ నెల 14, 15న విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు కేంద్రం తరఫున ఆయన రానున్నారు. ఇదే సమయంలో ఉక్కు కర్మాగారానికి భూమిపూజ కూడా చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ 2029 నాటికి పూర్తి కానుంది. ఇక్కడ ఏటా 8.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ అందుబాటులోకి వస్తుంది. రెండో దశను 2033 నాటికి పూర్తి చేయాలన్నది సంస్థ లక్ష్యం. ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు సొంతంగా పోర్టును సంస్థ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టులకు 2,020 ఎకరాలను బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్ పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

మొంథా బాధిత చేనేత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. నీట మునిగిన నూలు, రంగులు, రసాయనాలకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారాన్ని అందించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. వర్షాల కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మిక కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, లీటరు పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార కిలో చొప్పున అందిస్తామన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మొంథా తుపాను అనంతరం రాష్ట్రంలో చేపట్టిన సర్వేలో 27,982 చేనేత కుటుంబాలను తుపాను బాధిత కుటుంబాలుగా గుర్తించాం. నీట మునిగి 3 మగ్గాలు దెబ్బతిన్నాయి. మరో 3 మగ్గాలకు స్వల్ప నష్టం వాటిల్లింది. వీటికి అవసరమైన పరికరాల కొనుగోలుకు బాధితులకు రూ.10 వేలు అందిస్తాం. 718 మందికి చెందిన నూలు, రంగులు, రసాయనాలు తదితర వస్తువులు నీటిలో తడిసిపోయాయి. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 8,567 కుటుంబాలు, కోనసీమ-4,278, కృష్ణా- 3,900, శ్రీకాకుళం- 3,333, నెల్లూరు-2,400, తిరుపతి జిల్లాలో 1,700 కుటుంబాలను తుపాను బాధిత కుటుంబాలుగా గుర్తించాం. మిగతా జిల్లాల్లోనూ బాధితులను గుర్తించి నిత్యావసరాలను అందజేస్తాం' అని వివరించారు.

శాసనమండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా సోము వీర్రాజు

ఈనాడు, అమరావతి: శాసన మండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా సోము వీర్రాజును ఆ పార్టీ ఎంపిక చేసింది. విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శాసనమండలిలో భాజపాకు ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీలు పాకా సత్యనారాయణ, సీఎం రమేశ్ పాల్గొన్నారు.

దిగుబడి రాదనే మనస్తాపంతో అన్నదాత బలవన్మరణం



సుధాకర్

వాంకిడి, న్యూస్‌టుడే: అధిక వర్షాలతో పంట దెబ్బతిని.. దిగుబడి వచ్చేలా లేదని కలత చెంది పత్తి రైతు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తెలంగాణలోని ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మసీదు వాడకు చెందిన బుట్లె సుధాకర్(34) తన సొంత భూమి 5 ఎకరాలతోపాటు, కౌలుకు తీసుకున్న 4 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో పెట్టుబడి సైతం వచ్చేలా లేదని ఆందోళన చెందేవారు. పత్తికి పురుగు మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చి శనివారం రాత్రి పురుగు మందు తాగారు. వాంతులు చేసుకోవడం చూసిన కుటుంబ సభ్యులు అడగ్గా.. తాను పురుగు మందు తాగినట్లు చెప్పారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే సుధాకర్ మృతి చెందారు. ఆదివారం భార్య సంగీత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



భూపాల్‌రెడ్డి

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు.. అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగ తగిలి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం సింగప్పగూడ గ్రామానికి చెందిన పడమటి భూపాల్‌రెడ్డి(55) రెండెకరాల్లో వరి పంట సాగు చేశారు. పక్కనే ఉన్న సోదరుడి వరి పంట చుట్టూ అడవి పందుల కోసం విద్యుత్తు తీగ ఏర్పాటు చేశారు. ఆదివారం భూపాల్‌రెడ్డి పొలానికి వెళ్తుండగా కాలు జారి విద్యుత్తు తీగను తాకి పడిపోయారు. తండ్రి రాలేదని కుమారుడు నరేందర్‌రెడ్డి ఫోన్ చేస్తే స్పందించలేదు. అనుమానంతో వెళ్లి చూడగా పొలం గట్టుపై పడి ఉన్నారు. వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానంతో.. కుటుంబాన్ని అంతమొందించాడు!

- భార్య, కుమార్తె, వదినను నరికి చంపి తానూ ఆత్మహత్య
- ప్రాణాలతో బయటపడ్డ పెద్ద కుమార్తె
- వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో దారుణం



యాదయ్య ★ భార్య అలివేలు ★ వదిన హన్మమ్మ★ చిన్న కుమార్తె శ్రావణి

పరిగి, కుల్కచర్ల, న్యూస్‌టుడే: చిన్న అనుమానం ఆ కుటుంబంలో రక్తపుటేరులు పారించింది. నలుగురి ప్రాణాల్ని బలి తీసుకుంది. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణ ఘటన తెలంగాణలోని వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలకేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, డీఎస్పీ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కుల్కచర్లకు చెందిన వేపూరి యాదయ్య (40)కు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడియాల్‌కి చెందిన అలివేలు(35)తో వివాహం జరిగింది. ఇద్దరూ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి అపర్ణ (13), శ్రావణి (9) కుమార్తెలు. యాదయ్యకు కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం ఉండేది. దీంతో తరచూ ఆమెను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీలు జరిగితే సర్దిచెప్పి పంపారు. శనివారం సాయంత్రం భర్త వేధింపులు భరించలేక అలివేలు.. గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి వద్ద గోడు వెళ్లబోసుకుంది. దీంతో ఆయన భర్తను పిలిపించి మందలించారు. ఇద్దరూ కలిసిమెలిసి ఉండాలని సముదాయించి పంపారు. అప్పటికే అలివేలు.. నారాయణపేట జిల్లా బలభద్రాయపల్లిలో ఉంటున్న తన సోదరి హన్మమ్మకు జరిగిన విషయం చెప్పింది. దీంతో ఆమె మాట్లాడటానికి కుల్కచర్లకు చేరుకుంది.

ముదిరిన వివాదం..

హన్మమ్మ తన ఇంటికి రాగానే యాదయ్య కోపోద్రిక్తుడయ్యాడు. చీటికిమాటికి భార్యాభర్తల వివాదంలో తలదూర్చుతున్నావని మండిపడ్డాడు. ఆమె వల్లే భార్య తన మాట వినడం లేదనుకున్నాడు. దాంతో అక్కాచెల్లెళ్లిద్దరినీ అంతం చేయాలనుకున్నాడు. రాత్రి భోజనాల తర్వాత అంతా నిద్రకు ఉపక్రమించారు. ఇదే అదనుగా ఇంట్లోని కత్తితో మొదట వదిన హన్మమ్మపై దాడికి పాల్పడ్డాడు. ఆమె ఆర్తనాదాలతో భార్య మేల్కొని అడ్డుకోబోయింది. అదే కత్తితో ఆమెపైనా దాడి చేశాడు. అక్కాచెల్లెళ్లు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. యాదయ్య అంతటితో ఆగకుండా.. 'అమ్మ చనిపోతే మిమ్మల్ని ఎవరు చూసుకుంటార'ని ఆగ్రహంతో ఊగిపోతూ.. చిన్న కుమార్తె శ్రావణిని కత్తితో పొడిచి హత్య చేశాడు. పెద్ద కుమార్తె అపర్ణపైనా దాడి చేయగా మెడ, తల, చేతికి గాయాలయ్యాయి. ఆమె తప్పించుకుని పారిపోయి సమీప బంధువుకు సమాచారం అందించింది. అప్రమత్తమైన ఆయన డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేలోపే యాదయ్య అదే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు అపర్ణను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పక్కన నిల్చున్నా.. దూసుకొచ్చిన మృత్యువు

- దంపతుల మృతి.. ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు



దంపతులు ప్రశాంత్, ప్రసూన

బీబీనగర్, న్యూస్‌టుడే: ఫోన్ రావడంతో రోడ్డు పక్కన ఆగిన దంపతులను.. అతివేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషాదకర ఘటన తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. బీబీనగర్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండల కేంద్రానికి చెందిన గర్దాసు ప్రశాంత్(32), భార్య ప్రసూన(28)తో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ఫోన్ రావడంతో జాతీయ రహదారి 163పై బీబీనగర్ పెద్దచెరువు సమీపంలో రోడ్డు పక్కన నిలిపి మాట్లాడుతున్నారు. అదే మార్గంలో హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు కారులో వెళ్తున్న ముగ్గురు యువకులు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ దంపతులను బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై ప్రశాంత్.. పక్కనున్న చెరువులోకి ఎగిరిపడి ప్రసూన అక్కడికక్కడే మృతిచెందారు. దంపతులను ఢీకొట్టిన అనంతరం వాహనం ఎగిరి సర్వీసు రోడ్డుపై పడటంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు సైతం తీవ్రగాయాలయ్యాయి. వీరు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు చెందిన తంగళ్లపల్లి షణ్ముఖ్(20), చైతన్యపురికి చెందిన దోర్నాల భార్గవ్(18), పద్మానగర్‌కు చెందిన కొండా సాయిరిత్(18)గా గుర్తించారు. వరంగల్ వాసులైన వీరు హైదరాబాద్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ఎల్బీనగర్ సమీపంలో థార్ వాహనాన్ని అద్దెకు తీసుకొని బయలుదేరారు. వారిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఇందులో సాయిరిత్ పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ మద్యం కేసులో 23కు చేరిన నిందితుల సంఖ్య

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో మొత్తం నిందితుల సంఖ్య 23కు చేరింది. ఈ కేసులో జోగి రమేష్ (ఏ-18), జోగి రాము (ఏ-19)తో పాటు తాజాగా మరో నలుగురిని నిందితులుగా చేర్చారు. నకిలీ మద్యం తయారుచేసిన తర్వాత దాన్ని నింపేందుకు అవసరమైన సీసాలు, మూతలు సరఫరా చేసినందుకు మనోజ్ కొఠారిని ఎ-20గా, సెంథిల్‌ను ఏ-22, ప్రసాద్‌ను ఏ-23గా పేర్కొన్నారు. ఈ అక్రమ దందాలో భాగస్వామైన సుదర్శనను ఏ-21గా చేర్చారు. ఈ మేరకు రిమాండు రిపోర్టులో ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

గోల్ఫ్ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణం: మంత్రి జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ గోల్ఫ్ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం తెలంగాణకు రావడం గర్వకారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో 60వ ఐజీఎఫ్ఆర్ (ఇంటర్నేషనల్ గోల్ఫింగ్ ఫెలోషిప్ ఆఫ్ రోటేరియన్స్) అంతర్జాతీయ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. "వారం రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 24 దేశాలకు చెందిన 180 మంది రోటరీ గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రసూతి, శిశు, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో అద్భుతమైన ఫలక్‌నుమా ప్యాలెస్, గోల్కొండ కోట వంటి పర్యాటక ప్రాంతాలను ఈ ఛాంపియన్ షిప్‌లో భాగస్వామ్యం చేశాం. క్రీడలతో పర్యాటకం అభివృద్ధి ముడిపడి ఉంది. గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ పోటీలు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాయి" అని ఆయన పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ ఎర్రన్నాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డగా, ఉన్నత విలువలకు ప్రతిరూపంగా, రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా.. జాతీయ రాజకీయాల్లోనూ దివంగత ఎర్రన్నాయుడు తనదైన ముద్రవేశారని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఎర్రన్నాయుడి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా సీఎం నివాళి అర్పించారు. ప్రజలకు, పార్టీకి ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకొన్నారు.

బడుగు బలహీన వర్గాల కోసం పోరాడారు: లోకేశ్

ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి చివరిశ్వాస వరకూ కృషి చేసిన వ్యక్తి దివంగత ఎర్రన్నాయుడు అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఎక్స్ వేదికగా ఆయనకు నివాళి అర్పించారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో..

ఉత్తరాంధ్రుల హృదయాల్లో ఎర్రన్నాయుడు చిరస్థాయిగా నిలిచిపోతారని తెదేపా నేతలు పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఎర్రన్నాయుడి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి: యూటీఎఫ్

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరించే విధానాలను అనుసరిస్తున్నాయని పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మండిపడ్డారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో యూటీఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

జనార్దన్‌రావుతో 'జోగి' సంబంధాలపై ఆధారాలు

సాదినేని యామినీ శర్మ

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములకు నకిలీ మద్యం కేసులో ఏ1గా ఉన్న జనార్దన్‌రావుతో నేరుగా సంబంధాలు ఉన్నట్టు సిట్ పక్కా ఆధారాలు సేకరించిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ తెలిపారు. జోగి రమేష్ అరెస్టును స్వాగతిస్తున్నట్టు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "ఇది చిన్న కేసు కాదు. ఏపీ నుంచి ఆఫ్రికా వరకూ వ్యాపించిన నకిలీ మద్యం మాఫియా. బినామీల పేర్లతో టెండర్లు వేసి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలకు జోగి రమేష్ నకిలీ మద్యం సరఫరా చేసినట్టు స్పష్టమైంది. కానీ, వైకాపా వాళ్లు మాత్రం రాజకీయ కక్షలంటూ పాత నాటకాన్ని మొదలుపెట్టారు" అని యామినీ శర్మ విమర్శించారు.

సంజయ్ దీపక్‌రావుకు వెంటనే వైద్యం అందించాలి: ఐఏపీఎల్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: 'మావోయిస్టు సైద్ధాంతికవాది సంజయ్ దీపక్‌రావు ఆరోగ్యం క్షీణించింది. ఆయనకు వెంటనే వైద్యం అందించాలి' అని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్ లాయర్స్ (ఐఏపీఎల్) డిమాండ్ చేసింది. ఆరు రోజులుగా సంజయ్ నిరాహార దీక్ష చేస్తున్నా జైలు అధికారులు ఆసుపత్రికి తరలించకపోవడం అమానవీయమని ఐఏపీఎల్ ఉపాధ్యక్షుడు ఎం.వెంకట్ ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. "సంజయ్ వయసు దాదాపు 60 ఏళ్లు. నిరాహార దీక్ష కారణంగా ఆయన ఆరోగ్యం దిగజారినా అధికారులు పట్టించుకోవడం లేదు. జైలులోని ఖైదీల స్వేచ్ఛ పట్ల ఆయన చేసిన డిమాండ్లు చట్టబద్ధమైనవి. ఆయనను వెంటనే నిమ్స్‌కు తరలించి వైద్యం అందించాలి. చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై న్యాయ విచారణ జరిపించాలి" అని డిమాండ్ చేశారు.

విద్యార్థినిపై చేయిచేసుకున్నారని.. మహిళా కానిస్టేబుల్‌పై దాడి

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో ఘటన



షాద్‌నగర్ పట్టణ కూడలిలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రిన్సిపల్ వేధింపులకు పాల్పడుతున్నారని.. ఆమెను విధుల నుంచి తొలగించాలంటూ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆదివారం ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పురపాలిక పరిధిలోని సోలీపూర్ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో నాగర్‌కర్నూల్ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ప్రిన్సిపల్ శైలజలతోపాటు కొందరు అధ్యాపకులు తమను వేధిస్తున్నారని విద్యార్థినులు కళాశాల నుంచి ర్యాలీగా వచ్చి జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై ధర్నా చేశారు. తర్వాత షాద్‌నగర్ పట్టణ కూడలికి చేరుకుని దాదాపు 450 మంది బైఠాయించారు. 3 గంటలపాటు అలాగే ఉండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సివిల్ డ్రెస్‌లో ఉన్న మహిళా కానిస్టేబుల్ జ్యోత్స్న విద్యార్థినిపై చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ.. ఆమెను ఇతర విద్యార్థినులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి దాడి చేశారు. స్థానికులు, పోలీసులు వారిని అడ్డుకున్నారు. షాద్‌నగర్ పట్టణ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఠాణాలో మాట్లాడుదామని నచ్చజెప్పడంతో విద్యార్థినులు అక్కడికి వెళ్లారు. సాంఘిక సంక్షేమశాఖ మల్టీ జోనల్ అధికారిణి నిర్మల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ పాటించడం లేదనీ, హాజరు తక్కువగా ఉందని డబ్బులు తీసుకుంటున్నారనీ, ప్రశ్నిస్తే ప్రిన్సిపల్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

వసుంధర

vasundhara@eenadu.in

మీరే ఒక సైన్యం!



మార్షల్ ఆర్ట్స్‌లో భిన్నమైన కిక్‌లు, పంచ్‌లు ఉంటాయి. వీటి సాధనకు అనేక ఏళ్లు పడుతుంది. కానీ అమ్మాయిలకు ఆత్మరక్షణ చాలా ముఖ్యం. అందుకోసం... కొన్ని ప్రాథమిక టెక్నిక్‌లైనా నేర్చుకోవాలి. ఎవరైనా తప్పుగా చూసినా, ప్రవర్తించినా, దాడికి యత్నించినా అక్కణ్నుంచి పారిపోవడం, సాయం కోసం అరవడం చేస్తారు. ఇలా చేయడం అన్నిసార్లూ సమస్యకు పరిష్కారం కాదు. కొన్నిసార్లు ఎదురుదాడి చేయడమే మనకు రక్ష. దాడికి యత్నించినవాళ్లను కాళ్లు, చేతులు, సున్నితమైన భాగాల్లో గాయపరిస్తే వాళ్లే వెనకడుగు వేస్తారు. ఈ టెక్నిక్‌లు తెలిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదే సమయంలో మనం గాయపడకుండా చూసుకోవాలి. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల కోసం బయటకు వెళ్లే మహిళలకు ఈ నైపుణ్యాలు రావడం తప్పనిసరి. ఇందులో భాగంగా కొన్ని సులభమైన టెక్నిక్స్ నేర్చుకుందాం.

నెక్‌లాక్ చేసి...



మనపైన దాడి చేయాలనుకుంటున్న వ్యక్తి మెడ మీద ఎడమ చేత్తో గట్టిగా అదిమిపట్టి లాక్ చేస్తూ... కుడి చేత్తో తలని ముందుకు బలంగా వంచాలి. ఈ ఆత్మరక్షణ టెక్నిక్‌వల్ల మనపైన దాడికి యత్నించిన వ్యక్తిని ఊపిరాడకుండా చేయొచ్చు. ఈ విధానంలో మనకంటే రెట్టింపు బరువు ఉన్న వ్యక్తినైనా మట్టికరిపించవచ్చు.

ఈ నైపుణ్యం అంత వేగంగా రాదు. నిపుణులు వీటిని వందలూ, వేలసార్లు ప్రాక్టీసు చేస్తారు. ఎంత ఎక్కువగా ప్రాక్టీసు చేస్తే అంతలా పట్టు సాధిస్తారు. తక్కువలో తక్కువ 20 సార్లు ప్రాక్టీసు చేయాలి. ప్రాక్టీసు సమయంలో 'ట్యాప్' విధానం పాటించాలి. ఎవరిపైనైతే కిక్, పంచ్ ప్రాక్టీసు చేస్తామో వాళ్లకు గాయాలవ్వకుండా చూడాలి. వాళ్లకు ఇబ్బందిగా అనిపిస్తే చేత్తో మనల్ని ఒకసారి తట్టమనాలి.



హ్యాండ్ లాక్...

మనల్ని అటాక్ చేసిన వ్యక్తి ఒక చేతిని పట్టుకుని మెలితిప్పే ప్రయత్నం చేయాలి. దీన్లో అరచేయి పైకి వచ్చినట్టు చేసి మణికట్టు మీద గట్టిగా ఒత్తిడి తేవాలి. తర్వాత ఆ వ్యక్తిని దగ్గరగా లాగి మన భుజం మీద వారి మోచేయిని ఆన్చి పైకి ఎత్తి పడేసే ప్రయత్నం చేయాలి.

ప్రాక్టీసులోఎక్కువ ఒత్తిడి పెట్టకుండా చేయాలి, లేకుంటే మణికట్టు, మోచేయి గాయమవుతుంది. భుజం కీలు డిస్‌లొకేట్ అయ్యే అవకాశాలు ఎక్కువ.

జాగ్రత్తలు: నెక్‌లాక్‌తో కేవలం నిమిషంలో దాడికి దిగిన వ్యక్తిని అపస్మారక స్థితిలోకి పంపొచ్చు. అలాగే పట్టి ఉంచితే ఆ వ్యక్తి రెండు నిమిషాల్లో చనిపోతారు. కాబట్టి ఎరుకతో ఉండండి. కిక్‌లు, పంచ్‌లు ఇచ్చేటప్పుడు శరీరం వేగవంతంగా స్పందించాలంటే నిత్యం వ్యాయామాలు చేయాలి. శరీరం ఎంత ఫ్లెక్సిబుల్‌గా ఉంటే అంత మేలు. ప్రాక్టీసు అనంతరం చేతులు, కాళ్లను మెల్లగా కదిలిస్తూ విశ్రాంతి పొందే కూలింగ్‌డౌన్ వ్యాయామాలు చేయాలి. మనమూ దృఢంగా, బలంగా ఉండాలి. దీని కోసం వ్యాయామం చేయడంతోపాటు మంచి ఆహారం తీసుకోవాలి.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

? మేం ఇద్దరం అక్కచెల్లెళ్లం. వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తున్నాం. నాకు రెండు నెలల పాప ఉంది. మావారు వేరే ఊరిలో ఉంటారు. పాపనీ నన్నూ ఇప్పుడు అమ్మే చూసుకుంటోంది. కానీ నెలకు పది రోజులు చెల్లి దగ్గరకు వెళ్తా అంటోంది. ఇప్పుడు నేను ప్రసూతి సెలవుల్లో ఉన్నా... అవి అయ్యాక కూడా అమ్మ ఇలానే వెళితే నా పాపను ఎవరికి అప్పజెప్పాలో అర్థం కావడం లేదు. నాన్నకు పోర్న్ చూసే అలవాటు ఉంది. నా చిన్నప్పట్నుంచీ ఆయన ఫోన్ స్టోరేజ్‌లో అన్నీ ఆ వీడియోలే. ఆయన్ని నమ్మి పాపను అప్పగించలేను. పరిష్కారం తెలుపగలరు. -ఓ సోదరి

నాన్నకు అప్పగించాలంటే భయమేస్తోంది..!

పెద్ద కూతురితోపాటు, చిన్నమ్మాయినీ చూసుకోవాలి అనుకోవడం మీ అమ్మగారి తప్పేం కాదు. అది ఆమె బాధ్యత. ఇకపోతే, వయసులో ఉన్నప్పుడు దాంపత్య జీవితం కోరుకున్న విధంగా లేకపోతే... ఆడ, మగ ఎవరైనా ఇలాంటి తప్పటడుగులు వేసే అవకాశం ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకుని మనవరాలితోనూ అలా ప్రవర్తిస్తారేమో అని భయపడటం సబబు కాదు. అలా అని మీ భయాన్నీ పక్కన పెట్టలేం. రోజులు అసలే బాలేదు. కాబట్టి ఇప్పుడు మీకు రెండు దారులున్నాయి. ఒకటి సెలవుల్ని పొడిగించుకుని పాపకు రెండు మూడేళ్లు వచ్చే వరకూ మీరే దగ్గరుండి చూసుకోండి. పిల్లలకు తల్లి సంరక్షణ అవసరం అయ్యే వయసు ఇది. తనని ప్రీ-స్కూల్లో చేర్పించాక మళ్లీ కెరియర్‌ని మొదలుపెట్టొచ్చు. లేదూ మీ అమ్మగారు ఊళ్లో లేని రోజుల్లో పాపను చూసుకోవడానికి ఎవరైనా మహిళను నియమించుకోండి. మీ నాన్నగారి పర్యవేక్షణ ఉండేట్లు చూసుకోండి.



డియర్... వసుంధర

డా. మండాది గౌరీదేవి, మానసిక నిపుణురాలు



అమ్మాయిలూ

ధైర్యమే మీ పెట్టుబడి!

వ్యాపారం... యువత వల్లిస్తోన్న మంత్రమిది. పెరుగుతోన్న విద్యావకాశాలు, ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిగతంగా ఏదైనా సాధించి చూపాలన్న కోరిక... ఇలా ఎన్నో కారణాలు అమ్మాయిలు, మహిళలు కూడా ఇటువైపు నడిచేలా చేస్తున్నాయి. దేనికైనా సాధించాలన్న బలమైన కోరిక ఒక్కటే చాలదు కదా! నడిచే మార్గం తెలియాలి. ఎదురయ్యే సవాళ్లకు దీటుగా నిల్చోగలగాలి. ఏం అవకాశాలుంటాయి? వాటినెలా అందిపుచ్చుకోవాలన్న స్పష్టత ఉండాలి. వాటిపై కొంచెం అవగాహన ఉన్నా అమ్మాయిలు తమ ఆశలకు రెక్కలు ఇవ్వొచ్చు. ఆ ప్రయత్నంలో భాగంగానే ఈనాడు వసుంధర- తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సంయుక్తంగా ఆదివారం మహిళా వ్యాపారవేత్తలతో వెబినార్ నిర్వహించింది.

ఇద్దరు వ్యాపారవేత్తలు స్టార్ టూన్స్ సహవ్యవస్థాపకురాలు మైత్రేయి సుసర్ల, అకిన్ అనలిటిక్స్ స్థాపకురాలు జానకి పులపర్తి, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ లంక రమాదేవి ఈ చర్చలో పాల్గొన్నారు. మిల్లెట్ బ్యాంక్ అధినేత్రి విశాల రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆ చర్చా వివరాలు క్లుప్తంగా...

విజయవంతమయ్యే ఆలోచనేది?

స్టార్టప్‌లుగా వస్తున్న ఆలోచనలెన్నో. అయితే అవన్నీ విజయం సాధిస్తున్నాయని చెప్పలేం. కారణం ఏంటంటే... సరైన పరిశోధన లేకపోవడమే. మీరు ఎంచుకున్న ఉత్పత్తి లేదా సర్వీస్‌కి మార్కెట్‌లో అవసరం ఉందా? ఉంటే ఎంతమందికి అన్నది గమనించుకోవాలి. కేవలం మీకు, మీ బంధువుల వరకూ అవసరమైతే సరిపోదు. లక్షలమందికి ఉపయోగపడాలి. తరవాత అది ఏ రంగం కిందకి వస్తుంది? దానికి టెక్నాలజీ ఎలా జోడించగలం అన్నవి గమనించాలి. వీటన్నింటికీ సమాధానం ఇవ్వగలదే సరైన వ్యాపార ఆలోచన అవుతుంది.

పెట్టుబడి ఎలా?

నిజానికి వ్యాపారం చేయాలనుకోగానే ఆలోచించాల్సింది పెట్టుబడి ఎలా అని కాదు. ఎంవీపీ అంటే మినిమమ్ వయబిలిటీ ప్రొడక్ట్ సిద్ధం చేసుకోవాలి. ఉత్పత్తి లేదా సర్వీస్ మార్కెట్‌లోకి తీసుకెళ్లేలా సిద్ధం చేయాలి. తరవాత దానికి ఎంత ధర నిర్ణయిస్తారో చూసుకోవాలి. ఇందుకు అయ్యే ఖర్చును మాత్రం సొంతంగా భరించాలి. అలా సిద్ధమయ్యాకే పెట్టుబడి వరకూ వెళ్లాలి. ఇందుకు ప్రతి రాష్ట్రంలో ఇంక్యుబేషన్ సెంటర్లు ఉన్నాయి. వాళ్లు మీ ఎంవీపీ మోడల్ గమనించి సీడ్ ఫండ్ రూపంలో గ్రాంట్లు ఇస్తాయి. కొందరు ఉచితంగా ఇస్తే మరికొందరు చాలా తక్కువ మొత్తంలో షేర్ తీసుకుంటారు.

మార్కెట్‌లోకి వెళ్లాలంటే...

ఇక్కడే చాలా జాగ్రత్తగా ఉండాలి. ముందు మీ ఉత్పత్తికి విశ్వసనీయతను సంపాదించాలి. ఇప్పుడు రంగమేదైనా తయారైన ఉత్పత్తి నాణ్యమైనదేనా అని తేల్చే ప్రభుత్వ సర్టిఫికేషన్లు బోలెడు. ముందు వాటిని సాధించండి. కొంచెం సమయం పట్టినా పర్లేదు. ఇవి మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. తరవాత కొందరికి ఇచ్చి మార్కెట్ రిసెర్చ్ చేయండి. ఫీడ్‌బ్యాక్ తీసుకోండి. అయిదుగురిలో ముగ్గురు బాగుందని చెప్పి, ఇద్దరు నెగెటివ్‌గా చెప్పినా పర్లేదు అని ముందుకు వెళ్లొద్దు. లోపాలేంటో కనుక్కుని సరిచేయండి. లేదని తొందరపాటుతో ముందుకే వెళ్తే తొలిరోజుల్లో బాగానే నడిచినా దీర్ఘకాలంలో ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్న చిన్న పొరపాట్లు మిమ్మల్ని మీరు మెరుగుపరచుకునే అవకాశాలు. వాటిని సీరియస్‌గా తీసుకుంటేనే విజయం సాధించగలరు.

వ్యాపార విస్తరణకు...

వ్యాపారం బాగా నడుస్తోంది. పరిధి పెంచుకోవాలంటే... స్టార్టప్ ఇండియా సీడ్ ఫండింగ్ ప్రయత్నించొచ్చు. ముందు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ వెబ్‌సైట్‌లో స్టార్టప్ రిజిస్టర్ చేసుకోవాలి. అయితే ప్రారంభించిన రెండేళ్లలోపే అయ్యుండాలి. వాళ్లు రూ.10 లక్షలవరకూ పెట్టుబడి ఇస్తారు. అయితే ఒక్కో దశలో మీ మెరుగుదలను గమనిస్తారు. ఇక్కడా విజయం సాధించి పరిధి పెంచుకోవాలంటే రూ.50 లక్షల వరకూ ఇస్తారు. ఇది మాత్రం అప్పులాంటిదే. నిర్ణీత కాలంలో తిరిగి చెల్లించాలి. మహిళలకోసం నీతి ఆయోగ్ ప్రత్యేకంగా ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌ని ప్రారంభించింది. దీనిలో పెట్టుబడితోపాటు నెట్‌వర్కింగ్, మెంటార్‌షిప్ కూడా దొరుకుతుంది. నిజానికి ఇప్పుడు సాయం చేసే ప్రభుత్వ, ప్రైవేటు ఇంక్యుబేటర్లు, ఆక్సిలరేటర్లు చాలానే ఉన్నాయి.

పోటీని తట్టుకునేదెలా?

చాలామందికి ఆసక్తి ఉంటుంది. కానీ పోటీని చూసే భయపడతారు. నిజానికి ఆరోగ్యకరమైన పోటీ ఎప్పుడూ మంచిదే. మనం చూసుకోవాల్సిందల్లా మన ప్రత్యేకత ఏంటనే! అది ఒక్క శాతం మెరుగ్గా ఉన్నా చాలు... విజయం సాధ్యమే. మీరు చేయాల్సిందల్లా ఎంచుకున్న రంగంలో ఎవరు ముందున్నారు, వాళ్ల కంటే ఎంతవరకూ మెరుగైన సేవలు అందించొచ్చు లేదా ఎంతెక్కువ ప్రభావం చూపించొచ్చు అన్నది గమనించుకోవడమే. కుదరకపోతే ఎవరితోనైనా కలిసి పని చేయొచ్చేమో చూడండి. నిజానికి కొత్త దారులు వెతుక్కుంటే పరిచయం చేయడానికే కష్టపడాలి. అదే అప్పటికే గుర్తింపు ఉన్న రంగమైతే మన ప్రత్యేకత చూపిస్తే చాలు. అవకాశాలు కచ్చితంగా వస్తాయి.

విఫలమైతే?

అపజయం దాటకుండా విజయాన్ని సాధించిన వారే లేరు. కాబట్టి, ఇంట్లోవాళ్లు, స్నేహితులు, తెలిసిన వాళ్లు ఏమనుకుంటారోనన్న ఆలోచనను పక్కన పెట్టేయండి. వ్యాపారంలో రాణిస్తున్న వాళ్లంతా ఎన్నో అపజయాలు చూసినవారే. వాటిని పాఠాలుగా చేసుకుని వచ్చినవారే. అపజయం మీద భయంతో మెప్పించలేమని తెలిసినా అదే వస్తువు, సర్వీస్‌తో ముందుకెళ్లొద్దు. దీన్ని పక్కన పెట్టి, ఈ అనుభవంతో మరొకటి ప్రయత్నించడమే. వైఫల్యాన్ని ఎంత త్వరగా అంగీకరిస్తే అంత మేలు. అలాగని ఆగిపోవద్దు. ఆ పాఠంతో మరొకటి ప్రయత్నించాలి. అప్పుడే సక్సెస్ పలకరిస్తుంది.

ఇదే అత్యుత్తమ సమయం...

ప్రభుత్వం, పరిశ్రమ, అకడమిక్ సంస్థలు... అన్నీ అంకుర సంస్థల్ని ప్రోత్సహిస్తున్నాయి. కాబట్టి అంకుర సంస్థలు ప్రారంభించడానికి అనుకూల సమయం ఇది. ఆలోచన ఉంటే ముందడుగు వేయండి. ప్రభుత్వపరంగా విమెన్ ఆంత్రప్రెన్యూర్ ప్లాట్‌ఫాం, స్టార్టప్ ఇండియా, టీ హబ్, వి హబ్, గ్రామీణులకు స్టేట్ ఇన్నొవేషన్ సెల్ సహకరిస్తున్నాయి. ఆరోగ్యం, విద్య, వాతావరణం... లాంటి విభాగాల్లో సమస్యలకు ప్రభుత్వం పరిష్కారాలను ఆహ్వానిస్తోంది. పరిశ్రమలకు... ఇన్నొవేషన్ చాలా కష్టం. అందుకని స్టార్టప్‌లపై ఆధారపడుతున్నాయి.

వీసీలు ఏం చూస్తారంటే...

సీడ్ ఫండింగ్ దశలో ప్రభుత్వం నుంచి చిన్న స్థాయిలో పెట్టుబడి వస్తుంది. ఒక స్థాయి దాటిన తర్వాత ప్రైవేట్ సంస్థల దగ్గరకు వెళ్లాల్సి వస్తుంది. అలా వెళ్లినప్పుడు వీసీలు ప్రధానంగా వ్యవస్థాపకుల నేపథ్యం చూస్తారు. మీ ఆలోచనకు మీ నేపథ్యానికి మధ్య సంబంధాన్ని చూస్తారు. తర్వాత ఆలోచనను ఆచరణలోకి తేగలరా లేదా అని గమనిస్తారు. మీ మెంటార్స్ ఎవరన్నదీ ముఖ్యం. అలాగే మీరు ఇంక్యుబేట్ అయ్యారా లేదా అయితే గనుక, మీకు ఏమేర నిధులు వచ్చాయనేది ముఖ్యం. మిమ్మల్ని మీరు ఎంత నమ్ముతున్నారు, ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నారో గమనిస్తారు. మీ మార్కెట్, వినియోగదారులు, ఆదాయం... ఇట్లాంటివన్నీ ఏ3 షీట్/టయోటా మోడల్‌లో వాళ్లకు చెప్పాలి.

విద్యార్థి దశలో

ఇప్పుడు చాలా పాఠశాలలు, కళాశాలలు విద్యార్థి దశలోనే ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ని ప్రోత్సహిస్తున్నాయి. అటల్ ఇండియా మిషన్... నీతి ఆయోగ్ కింద ఇంక్యుబేషన్ లాబ్స్ పెడుతున్నారు. మంచి ఆలోచనలు వస్తే ఆ ఐడియాకి తగ్గట్టుగా మెంటార్ పూల్‌ని తయారుచేసి ప్రోత్సహిస్తున్నారు. వాళ్లకు అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాల్ని చెబుతున్నారు. అక్కడే చిన్న ప్రొటోటైప్‌లనూ చేయొచ్చు. అంకురాల పోటీ పరీక్షల్లో పాల్గొంటూ నైపుణ్యాలను పెంపొందించవచ్చు.

టెక్ స్టార్టప్ అయ్యుండాలా?

సాంకేతిక అంకురాలకు ఆకర్షణ ఉన్న మాట నిజమే. కానీ ఆలోచన బాగుంటే ఏ విభాగంలో అంకురానికైనా అవకాశం ఉంటుంది. 'వి హబ్' అన్ని రంగాల అంకురాలనూ ప్రోత్సహిస్తుంది. గ్రామీణ ప్రాంత మహిళలు, గృహిణులు కుటీర పరిశ్రమలు పెట్టుకోవచ్చు. 'సెర్ప్' లాంటి వాటి ద్వారా నిధులు అందుతాయి. వ్యవసాయం, ఆహారం, తయారీ రంగాల్లోనూ అంకురాలకు ఉన్న పథకాల నుంచి ప్రోత్సాహకాలు అందుతాయి. టెక్ రంగమనే కాదు, దేంట్లో అయినా మీరు బిజినెస్ మొదలుపెట్టొచ్చు.

బ్యాంకుల నుంచి నిధులు

వీసీ ఫండ్స్ మాత్రమే కాదు బ్యాంకులూ అంకురాలకు రుణాలు ఇస్తాయి. ఇవి ఎక్కువగా ప్రభుత్వ పథకాల రూపంలో ఉంటాయి. 'స్టాండ్ అప్ ఇండియా' పథకంలోనూ బ్యాంకులే భాగం. ముద్రా యోజన కూడా ఇలాంటిదే. సిడ్బి(స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచీ రుణాలు అందుతాయి. అయితే, ఆదాయం, డాక్యుమెంటేషన్ వంటివి చూస్తాయి.

ఈ వెబినార్ కోసం యూట్యూబ్ లింక్
https://www.youtube.com/watch?v=wlqAuZcRuzQ

ధైర్యమే ముందస్తు పెట్టుబడి. మీకు మంచి ఆలోచన ఉంటే... ముందడుగు వేయడానికి ఆలోచించకండి. మీ కలల్ని నెరవేర్చుకోండి. – లంక రమాదేవి

స్టార్టప్ అంటేనే సుదూర ప్రయాణం. ఆలోచన వచ్చిన వెంటనే అంటే నెలకో, సంవత్సరానికో మ్యాజిక్ ఏమీ జరిగిపోదు. ఐడియాని నమ్ముకుని దాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు వెళ్లాలి. ఆసక్తితోపాటు ఓపిక, సహనం ఉండాలి. అప్పుడే ప్రపంచ స్థాయికి చేరగలం. – మైత్రేయి సుసర్ల

స్టార్టప్ ప్రయాణంలో వైఫల్యాలు ఎక్కువే. వాటికి మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఇక్కడ పొగడ్తలు చాలా తక్కువ, విమర్శలు ఎక్కువ ఉంటాయి. మీరేం చేయాలనుకుంటున్నారో దాని మీద ఫోకస్ చేయండి. ఉన్న వ్యవస్థలను వినియోగించుకుని ముందుకు వెళ్లండి. సో బీ బోల్డ్, బీ స్ట్రాంగ్. – జానకి పులపర్తి

ఎవరో ఏదో అనుకుంటారని భావించకుండా... మీ ఆలోచన కోసం కష్టపడండి. మీరు ఆంత్రప్రెన్యూర్‌గా అడుగు పెట్టాలనుకున్న రంగం గురించి మీకు పూర్తిగా తెలియకపోవచ్చు. ఎక్స్‌పోజర్ లేకుండా బయటకు వెళ్లి కంపెనీలు పెడితే ఫెయిల్ అయ్యే అవకాశం ఎక్కువ. కంఫర్ట్‌జోన్ నుంచి బయటకు వచ్చి ఎక్స్‌పోజర్‌ని పెంచుకోండి. నెట్‌వర్కినీ ఏర్పరచుకోండి. కొత్త ఆలోచనలెన్నో వస్తాయి. – విశాల రెడ్డి

మీకు తెలుసా

మగవాళ్లతో పోలిస్తే ఆడవారి శరీరమే బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లతో మెరుగ్గా పోరాడగలదట. వాళ్లలో ఉండే ఈస్ట్రోజన్ హార్మోన్ వీటికి వ్యతిరేకంగా పోరాడే శక్తిని అందిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

జెన్ జీ అమ్మాయిలు

మరచిపోతున్నారా..!

కాలం, పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునే మిలీనియల్స్‌ను పక్కకు నెట్టి... 'మీరు నెమ్మదస్థులు. ట్రెండ్ సెట్ చేయాలన్నా, దాన్ని కొనసాగించాలన్నా మేమే ముందుంటాం' అంటూ అన్ని విషయాల్లోనూ దూసుకుపోతున్నారు జెన్ జీ అమ్మాయిలు. ఒకటా రెండా ఇంటి నుంచి పనిచేసే ప్రాంతాల వరకూ వీళ్లు తీసుకొచ్చిన మార్పులు ఎన్నో. అన్నింటితోనూ శభాష్ అనిపించుకున్నారు. ధైర్యవంతులు, భవిష్యత్ మీద వీళ్లకు ఎంత స్పష్టత అంటూ ప్రశంసలూ అందుకున్నారు. అందుకే జెన్ జీ అమ్మాయిల జీవనశైలినే మిలీనియల్స్ కూడా ఫాలో అవ్వడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇన్ని విషయాల్లో ముందున్న వారు... స్నేహం విషయంలో మాత్రం వెనకబడుతున్నారట. పాత స్నేహితుల్ని మరచిపోతున్నారట. జీవనశైలిలో మార్పులు, అలవాట్లు, అభిరుచులు మారడమే ఇందుకు కారణం అంటున్నారు. వయసు పెరిగేకొద్దీ వీటిలో మార్పులు సహజమే... దీనికోసం పాత స్నేహితులతో కంపాటబిలిటీ లేదని విడిపోవడం ఎంత వరకూ సమంజసం? కమ్యూనిటీ బిల్డింగ్, విస్తృత పరిధి పేరుతో ఇలా బంధాల్ని వదులుకుంటూ పోతే... మంచి స్నేహితుల్ని ఎలా సంపాదించుకుంటారు? ఒక్కసారి ఆలోచించండి అంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు.



నాడి పట్టారు... ఉపాధి పొందారు!

ఈటీవీ భారత్

ఏవో చిన్న చిన్న పనులు చేయడం. వచ్చిన మొత్తంతో కుటుంబానికి సహాయపడటం. ఇదే అక్కడి మహిళల జీవనశైలి. కట్ చేస్తే... ప్రభుత్వ సహాయంతో చిన్న వ్యాపారాన్ని ప్రారంభించారు. దానిద్వారా రోజుకు రూ.30వేలు సంపాదిస్తున్నారట. అసలా వ్యాపారం ఏంటి? వాళ్లు ఎవరు? ఎక్కడి వారో తెలియాలంటే...



ఒడిశాలోని సంబల్‌పుర్ జిల్లాలో ధామా గ్రామం అది... ఇక్కడి వాళ్లందరివీ రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు. అందుకే మహిళలు కూడా ఏదో ఒక పని చేస్తూ... కుటుంబానికి ఆర్థికంగా సహాయపడుతుంటారు. అందులో భాగంగానే స్థానిక మనేశ్వర్ బ్లాక్ ప్రభుత్వ కార్యాలయంలో వంటలు చేసే వారు కొంతమంది. వీరి చేతి భోజనాన్ని తిన్న ఓ వీడియోగ్రాఫర్... 'మీ వంటలు చాలా బాగున్నాయి. ఓ హోటల్ ప్రారంభించొచ్చు కదా' అన్నారట. ఆ మాటలు వారిని ప్రభావితం చేశాయి. అప్పటికే వారంతా స్వయం సహాయక సంఘ సభ్యులు కావడం కూడా కలిసొచ్చింది. అంతా కలిసి రుణానికి అప్లై చేసుకుని, ఆ వచ్చిన మొత్తంతో 'సుభద్ర కేఫ్'ను ప్రారంభించారు.

'పురాతన ఆలయాలకీ, పర్యటక ప్రాంతాలకీ మా ప్రాంతం పెట్టింది పేరు. కానీ సౌకర్యాలు తక్కువ. చుట్టుపక్కల వాళ్లూ, పర్యటకులూ ఆహారం కోసం చాలా ఇబ్బందులు పడుతుంటారు. దాన్ని గమనించే ధామాలో హోటల్ ప్రారంభించాం' అంటారో మహిళా సభ్యురాలు. 'మేం కేఫ్ ప్రారంభించి మూడు నెలలే అవుతోంది. ఇంటి రుచుల్ని తలపించేలా భోజనం అందిస్తున్నాం. అది కూడా తక్కువ ధరకే. చుట్టుపక్కల కాలేజీ విద్యార్థులు కూడా ఇక్కడికే వస్తున్నారు. దాంతో ప్రారంభించిన కొద్ది నెలల్లోనే మంచి ఆదరణను సంపాదించుకున్నాం' అంటున్నారు మరో సభ్యురాలు. ఈ కేఫ్‌లో మొత్తం పదిమంది మహిళలు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. శుభ్రత నుంచి వంటలు చేయడం వరకూ ప్రతి పనీ పంచుకుంటున్నారు. వీళ్ల కష్టానికి ప్రతిఫలంగా రోజుకి దాదాపు రూ.30వేల దాకా ఆదాయం వస్తోంది. దాంతో ఒక్కో మహిళ నెలకు రూ.20వేలు సంపాదిస్తున్నారట. అవసరం పడితే వీళ్ల భర్తలూ తోచిన సహాయం చేస్తున్నారట. సమష్టిగా కృషి చేసి అనుకున్నది సాధిస్తున్న వీళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



ఒత్తిడిని తగ్గించే ఫిష్ ట్యాంక్‌లివి..!

స్వీట్ హోమ్

అక్వేరియం అంటే ఒకప్పుడు ఇంట్లో గాజు బీకరుగా, చతురస్రకారంలో ఏదొక కార్నర్‌లో ఉండటం మాత్రమే తెలుసు. ఇప్పుడు... అవి కూడా ఇంటి అలంకరణలో ఓ భాగమైపోయాయి. ఆధునిక రంగులద్దుకుని డిజైనర్ వాల్, హాల్లో టీపాయ్, బెడ్‌రూమ్‌లో హెడ్‌బోర్డుగానూ దర్శనమిస్తున్నాయి. రంగురంగుల బుల్లి బుల్లి చేపలు గిరగిరా తిరుగుతుంటే ఒక్క పిల్లలనేముంది పెద్దవాళ్లు కూడా కళ్లు విప్పార్చుకుని మరీ వాటినే చూస్తూ ఆనందిస్తుంటారు. నీళ్లు మారుస్తూ శుభ్రం చేయాల్సి ఉన్నా అందరూ ఇంట్లో అక్వేరియంను పెట్టుకుంటారు. ఇంటీరియర్ డిజైన్‌లో రోజుకోరకం ట్రెండ్ పుట్టుకొస్తున్న ఈ సమయంలో అక్వేరియాలు సరికొత్త లుక్‌లో కనువిందు చేస్తున్నాయి. ఒకప్పటిలా ఏదో మూలకే పరిమితం కాకుండా ఆఫీసు డెస్క్, డైనింగ్ టేబుల్, స్టడీ టేబుల్ మీద అలకరించుకునేలా 'డెస్క్ టాప్ హ్యాంగింగ్ ఫిష్ ట్యాంక్'ల్ని తీసుకొస్తున్నారు డిజైనర్లు. వీటిని గుండ్రంగానూ, అండాకారంలోనూ ఐరన్ స్టాండుకి వేలాడే విధంగా ఒక హ్యాంగింగ్‌తో తయారుచేస్తున్నారు. ఒకే స్టాండుకి రెండు ఆకారాల్లో ఉండే బీకర్లను అమర్చుకోవచ్చు. పరిమాణంలో చిన్నవిగా ఉండటంవల్ల ఎక్కువ స్థలం ఆక్రమిస్తాయనే భయమూ అక్కర్లేదు. ఈ గాజు బీకర్లు శుభ్రం చేయడమూ సులువే. ఆఫీసులో టేబుల్ మీద ఉండే అక్వేరియాలు డెస్క్‌కి అందంతోపాటు ఆహ్లాదాన్నీ అందిస్తాయి. వర్క్ మధ్యలో ఒత్తిడి అనిపించినప్పుడు కాసేపు అక్వేరియంలో చేపపిల్లల ఆటని చూస్తే అది కాస్తా మాయమైపోతుంది. అంతేకాదు, మానసిక స్థితి, సృజనాత్మకత మెరుగుపడతాయట. మరి మీరూ స్ట్రెస్ ఫ్రీగా ఉండాలనుకుంటున్నారా! అయితే వీటిపై ఓ లుక్కేయండి మరి.



చిమ్నీలు వాడుతున్నారా?

వంటగదిలో జిడ్డు పేరుకుపోవడమే కాదు... ఘాటైన వాసనలూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. అలాకాకుండా ఉండటానికి ఈ మధ్య అందరూ చిమ్నీలు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో వాల్‌మౌంటెడ్, ఇన్‌బిల్ట్, టెలిస్కోపిక్, డక్టెడ్, డక్ట్‌లెస్... ఇలా ఎన్నో రకాలు దొరకుతున్నాయి. వేలకు వేలు పోసి కొనడమే కాదు... దాన్ని ఎలా వాడాలో, శుభ్రం చేయాలో కూడా తెలుసుండాలి. అప్పుడే అది ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా చిమ్నీ ఫిల్టర్స్‌నీ, గ్రీజ్ ట్రాప్‌లనూ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వేణ్నీళ్లు, వంటసోడాతో రుద్ది కడిగితే జిడ్డు త్వరగా వదలడమే కాదు మన్నికగానూ ఉంటుంది. ఇక, డక్టెడ్ చిమ్నీల్లో ఏమైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలి. బయటకి తెరుచుకున్న వాటిల్లో ఏవీ దూరకుండా చూసుకోవాలి. కార్బన్ ఫిల్టర్స్ వాడితే వాటిని నిర్ణీత కాలంలో మార్చాలి. అంతేకాదు, బాగా మరిగిన నీళ్లల్లో కాస్త వినెగర్, వంటసోడా కలిపి అందులో చిమ్నీప్లేట్స్ నానబెట్టాలి. తర్వాత ఓ పాత టూత్ బ్రష్‌తో శుభ్రం చేస్తే సరి. జిడ్డు త్వరగా వదిలిపోతుంది. వంట చేసినప్పుడు పొగ, ఆవిర్లను తగ్గించేందుకు పాత్రలపై మూత పెట్టాలి. నిర్ణీత కాలంలో టెక్నీషియన్ ద్వారా చిమ్నీలకు సర్వీసింగ్ చేయించాలి.



మన దేశంలో మహిళల క్రికెట్ ఒకప్పటిలా లేదు. చాలా మారింది. ఇంకా మారుతుంది కూడా. అభిమానులు మైదానాలకు వస్తున్నారు. ఆటను ఆస్వాదిస్తున్నారు. ఎన్నడూ లేని ప్రోత్సాహమూ లభిస్తోంది. కానీ ఎంతో పురోగతి సాధించినా ఏదో వెలితి. ఏదో తెలియని అసంతృప్తి. దేశంలో క్రికెట్ రూపురేఖల్ని మార్చేసిన కపిల్స్ డెవిల్స్ '83' విజయంలా.. భారత మహిళల క్రికెట్‌కు ఓ కిక్కిచ్చే భారీ విజయం దక్కలేదన్న వేదన అది.

కానీ ఆ అసంతృప్తికీ..ఆ నిరాశకు ఆదివారంతో తెర. దశాబ్దాల నిరీక్షణ ముగిసింది. భారత మహిళల స్వప్నం సాకారమైంది. ఆఖరి పోరాటంలో చిరస్మరణీయ ప్రదర్శన చేసిన వేళ.. కల కప్పు అందింది. సొంతగడ్డపై, వేలాది ప్రేక్షకుల మధ్య హర్మన్‌ప్రీత్ బృందం ప్రపంచకప్పును ముద్దాడింది సంబరంగా.. సగర్వంగా!

ఫైనల్లో భారత అమ్మాయిల ఆట అదరహో! ఎందరో హీరోలు. అనూహ్యంగా జట్టులోకి వచ్చిన షెఫాలి వర్మ ఆశించినట్లే బ్యాటుతో చెలరేగిపోయింది. అనుకోని విధంగా బంతితోనూ మాయ చేసింది. ఇంకో అద్భుతం దీప్తి. అమూల్యమైన అర్ధసెంచరీ చేయడమే కాదు.. ఐదు వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించింది. స్మృతి, రిచా కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడగా.. నిలకడైన ప్రదర్శనను కొనసాగించిన తెలుగమ్మాయి శ్రీచరణి ఫైనల్లోనూ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడిచేసింది. ఫలితం దక్షిణాఫ్రికాను మట్టికరిపించిన భారత మహిళల జట్టు.. మొట్టమొదటిసారి జగజ్జేతగా నిలిచింది. నిస్సందేహంగా ఇది అమ్మాయిల '83'.

ఇది గొప్ప అనుభూతి. మా ఎత్తు పల్లాల్లో మద్దతుగా నిలిచిన అభిమానులకు రుణపడి ఉంటాం. ఫైనల్లో షెఫాలితో ఒక్క ఓవరైనా వేయించాలనుకున్నా. కానీ తాను పది ఓవర్లు వేస్తానని షెఫాలి నాతో అంది. జట్టు కోసం నిలబడ్డ ఆమెకు సెల్యూట్.
- హర్మన్‌ప్రీత్

ఛాంపియన్స్

4 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన నాలుగో జట్టు భారత్. ఆస్ట్రేలియా అత్యధికంగా ఏడుసార్లు (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) గెలవగా.. ఇంగ్లాండ్ నాలుగుసార్లు (1973, 1993, 2009, 2017) ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ (2000) ఒకసారి గెలిచింది.

వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత కెప్టెన్లు
కపిల్‌దేవ్: 1983
ఎంఎస్.ధోని: 2011
హర్మన్‌ప్రీత్ కౌర్: 2025



ప్రపంచకప్‌తో భారత మహిళల జట్టు

జగజ్జేత భారత్

వీల్‌చైర్‌లో ప్రతీక

కల తీరెలే కప్పందగా..

భారత మహిళలకు తొలి ప్రపంచకప్ • ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం

ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్: షెఫాలి వర్మ 87 2/36

నవీ ముంబయి

భారత అమ్మాయిల కల నెరవేరింది. దేశాన్ని సంబరాల్లో ముంచెత్తుతూ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుంది. ఆదివారం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో భారత్ 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. యువ ఓపెనర్ షెఫాలి వర్మ (87; 78 బంతుల్లో 7×4, 2×6) చెలరేగడంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. దీప్తి శర్మ (58; 58 బంతుల్లో 3×4, 1×6), స్మృతి మంధాన (45; 58 బంతుల్లో 8×4), రిచా ఘోష్ (34; 24 బంతుల్లో 3×4, 2×6) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా తడబడింది. దీప్తి శర్మ (5/39), షెఫాలి వర్మ (2/36) ధాటికి 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (101; 98 బంతుల్లో 11×4, 1×6) అద్భుతంగా పోరాడినా ఫలితం లేపోయింది.. పాపం.. దక్షిణాఫ్రికా! ఆ జట్టుకు ప్రపంచకప్ మరోసారి అందని ద్రాక్షే అయింది.

మలుపు తిప్పిన షెఫాలి: దక్షిణాఫ్రికా జట్టు కలలో కూడా ఊహించి ఉండదు షెఫాలి బౌలింగ్‌లో దెబ్బతింటానని. షెఫాలి ఎవరూ అనుకోనివిధంగా మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీప్తి శర్మ కూడా కీలక సమయంలో అద్భుతంగా బౌలింగ్ చేసింది. ఛేదనలో ఓపెనర్లు లారా, బ్రిట్స్ (23) రాణించడంతో దక్షిణాఫ్రికా 9 ఓవర్లకు 51/0తో నిలిచింది. కానీ అమన్‌జ్యోత్ సూపర్ త్రోకు బ్రిట్స్ రనౌట్ కావడం, బాష్‌ను చరణి వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో 62/2కు పడిపోయింది. అయితే చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించిన లారా.. లుజ్ (25)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడపించడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. 20వ ఓవర్లో స్కోరు 114/2. కానీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ అనూహ్యంగా షెఫాలికి బంతినివ్వడంతో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. షెఫాలి తన వరుస ఓవర్లలో లుజ్, కాప్ (4)ను ఔట్ చేసి ప్రత్యర్థికి షాకిచ్చింది. కాసేపటికే జఫ్తా (16)ను దీప్తి వెనక్కి పంపడంతో దక్షిణాఫ్రికా 148/5తో చిక్కుల్లో పడింది. భారత్ పట్టుబిగించినట్లయింది. కానీ గొప్పపోరాటపటిమను కొనసాగించిన వోల్వార్ట్.. ఆ జట్టును కలవరపెట్టింది. డెర్క్‌సెన్ (35)తో కలిసి స్కోరును 200 దాటించింది. 40 ఓవర్లో స్కోరు 209/5. అక్కడి నుంచి దీప్తి మాయాజాలం మొదలైంది. డెర్క్‌సెన్‌ను ఔట్ చేయడం ద్వారా స్థిరపడ్డ భాగస్వామ్యాన్ని ఆమె విడదీసింది. అయినా వోల్వార్ట్ రూపంలో అప్పటికి భారత్ ముప్పు పొంచే ఉంది. కానీ కాసేపటికే ఆమెను కూడా చేసి.. భారత్‌కు దీప్తి ఉపశమనాన్నిచ్చింది. ఆమె అదే ఓవర్లోనే ట్రయాన్ (9)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌ను విజయం దిశగా నడిపించింది. కానీ గెలుపు అంత సులభంగా దక్కలేదు. 221/8తో నిలిచిన దక్షిణాఫ్రికాను డిక్లెర్క్ (18) ఆదుకునే ప్రయత్నం చేసింది. ధాటిగా ఆడి భారత్‌ను కాస్త కంగారు పెట్టింది. కానీ ఖకా రనౌట్ కావడం, డిక్లెర్క్‌ను దీప్తి ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా కథ ముగిసింది. భారత జట్టు సంబరాల్లో మునిగిపోయింది.

భళా దీప్తి

ఫైనల్లో షెఫాలి అద్భుత ఆరంభాన్నిచ్చింది. కానీ ఆమె ఔటైపోయాక ఇన్నింగ్స్ గాడి తప్పింది. సెమీస్‌లో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన జెమీమా, హర్మన్ విఫలమయ్యారు. అయినా స్కోరు 300కు చేరువైందంటే కారణం.. దీప్తి శర్మ. విలువైన అర్ధశతకంతో ఆమె మధ్య ఓవర్లలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. టోర్నీలో ఇలాగే మరి కొన్ని మ్యాచ్‌ల్లోనూ దీప్తి విలువైన ఇన్నింగ్స్‌లు ఆడింది. మొత్తంగా 9 మ్యాచ్‌ల్లో 215 పరుగులు చేసింది. ఇక బంతితో అయితే ఫైనల్లో దీప్తి గొప్ప ప్రదర్శనే చేసింది. ఏకంగా 5 వికెట్లు పడగొట్టింది. విలువైన భాగస్వామ్యంతో డెర్క్‌సెన్, లారా మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా వైపు లాగేస్తున్న దశలో వాళ్లిద్దరినీ ఒకరి తర్వాత ఒకరిని ఔట్ చేసి భారత్‌ను విజయం వైపు నడిపించింది దీప్తి. లీగ్ దశలో భారత్‌పై దక్షిణాఫ్రికాను గెలిపించిన ప్రమాదకర ట్రైయాన్, డిక్లెర్క్‌లనూ ఆమే ఔట్ చేసింది. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ దీప్తినే కావడం విశేషం. అందుకే 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' ఆమెనే వరించింది.



ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ: దీప్తి శర్మ (215 పరుగులు, 22 వికెట్లు)

షెఫాలి ధనాధన్: భారత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ షెఫాలి వర్మ ఆటే హైలైట్. ప్రతీక రావల్ గాయంతో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన ఆమె.. తన తొలి మ్యాచ్‌లో విఫలమైనా ఈసారి అవకాశాన్ని పూర్తిగా అందిపుచ్చుకుంది. జట్టు కోసం ఎంతో విలువైన ఇన్నింగ్స్ ఆడింది. భారత జట్టు పూర్తిగా ఉపయోగించుకోలేదు కానీ.. స్మృతితో కలిసి ఆమె అదిరే ఆరంభాన్నిచ్చింది. వర్షం కారణంగా రెండు గంటలు ఆలస్యమైన మ్యాచ్‌లో టాస్ ఓడి భారత్ బ్యాటింగ్‌కు దిగగా. . షెఫాలి, స్మృతి బలమైన పునాది వేశారు. ముఖ్యంగా ధనాధన్ బ్యాటింగ్‌తో షెఫాలి అలవోకగా పరుగులు రాబట్టింది. ఖకా బౌలింగ్‌లో తన తొలి బౌండరీ సాధించిన ఆమె.. ఖకా తర్వాతి ఓవర్లోనూ బంతిని బౌండరీ దాటించింది. అదే జోరులో కాప్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదేసింది. మరోవైపు ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడిన స్మృతి.. చకచకా కొన్ని బౌండరీలు బాదినా, మళ్లీ నెమ్మదించింది. మరోవైపు డిక్లెర్క్ బౌలింగ్‌లో షెఫాలి కొట్టిన సిక్స్‌ను చూసితీరాల్సిందే. ఆమె స్ట్రెయిట్‌గా అలవోకగా బంతిని కొట్టేసింది. ఎప్పటంత సాధికారికంగా ఆడలేకపోయిన స్మృతి.. చివరికి 18వ ఓవర్లో వెనుదిరిగింది. అప్పటికి స్కోరు 104. అయితే 49 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన షెఫాలి.. మరోవైపు జెమీమా ఉండగా జోరు కొనసాగించింది. 28వ ఓవర్లో స్కోరు 166/1. షెఫాలి సెంచరీ కూడా చేసేలా కనిపించింది. కానీ భారత్ ఇన్నింగ్స్‌లో ఒక్కసారిగా కుదుపు. అయిదు పరుగుల వ్యవధిలో షెఫాలి, జెమీమా ఔటయ్యారు. మరో వికెట్ పడుంటే భారత్ పరిస్థితి ఇబ్బందికరంగా ఉండేదే. కానీ దీప్తి నిలబడింది..


లారా వోల్వార్ట్ 101

నిలిచిన దీప్తి: 171/3. 30వ ఓవర్లో భారత్ స్కోరిది. ఆ దశలో దీప్తి కీలక ఇన్నింగ్స్ ఆడింది. హర్మన్‌ప్రీత్ (20; 29 బంతుల్లో 2×4) తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. అయితే గేర్ మార్చాల్సిన దశలో హర్మన్ ఔట్ కావడం భారత్‌కు పెద్ద దెబ్బ. అమన్‌జ్యోత్ (12) కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో 44వ ఓవర్లో భారత్ 245/2తో నిలిచింది. ఆఖర్లో భారత్ అనుకున్న స్థాయిలో వేగాన్ని అందుకోలేకపోయింది. దీంతో జట్టు కోరుకున్నంత స్కోరు చేయలేకపోయింది. రిచా ధాటిగానే ఆడింది. కానీ దీప్తినే బ్యాట్ ఝుళిపించలేకపోయింది. హర్మన్‌ప్రీత్‌తో నాలుగో వికెట్‌కు 52, రిచాతో ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించిన ఆమె.. మెరుపు ముగింపునివ్వలేకపోయింది. ఆఖరి బంతికి ఔటైంది. రిచా 49వ ఓవర్లో వెనుదిరిగింది. భారత్ కనీసం పాతిక పరుగులైనా తక్కువ చేసింది. దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ కూడా అదిరింది.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) జఫ్తా (బి) ట్రయాన్ 45; షెఫాలి వర్మ (సి) లుజ్ (బి) ఖకా 87; జెమీమా (సి) వోల్వార్ట్ (బి) ఖకా 24; హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) ఎంలబా 20; దీప్తి శర్మ రనౌట్ 58; అమన్‌జ్యోత్ (సి) అండ్ (బి) డిక్లెర్క్ 12; రిచా ఘోష్ (సి) డెర్క్‌సెన్ (బి) ఖకా 34; రాధ యాదవ్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 15 మొత్తం: (50 ఓవర్లలో 7 వికెట్లకు) 298

వికెట్ల పతనం: 1-104, 2-166, 3-171, 4-223, 5-245, 6-292, 7-298; **బౌలింగ్:** మరిజేన్ కాప్ 10-0-59-0; ఖకా 9-0-58-3; ఎంలబా 10-0-47-1; డిక్లెర్క్ 9-0-52-1; లుజ్ 5-0-34-0; చోల్ ట్రయాన్ 7-0-46-1

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లారా వోల్వార్ట్ (సి) అమన్‌జ్యోత్ (బి) దీప్తి 101; తజ్మిన్ బ్రిట్స్ రనౌట్ 23; బాష్ ఎల్బీ (బి) శ్రీచరణి 0; సన్ లుజ్ (సి) అండ్ (బి) షెఫాలి 25; మరిజేన్ కాప్ (సి) రిచా (బి) షెఫాలి 4; సినాలో జఫ్తా (సి) రాధ (బి) దీప్తి 16; డెర్క్‌సెన్ (బి) దీప్తి 35; ట్రయాన్ ఎల్బీ (బి) దీప్తి 9; డిక్లెర్క్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 18; ఖకా రనౌట్ 1; ఎంలబా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం:** (45.3 ఓవర్లలో ఆలౌట్) **246**

వికెట్ల పతనం: 1-51 2-62, 3-114, 4-123, 5-148, 6-209, 7-220, 8-221, 9-246

బౌలింగ్: రేణుక 8-0-28-0; క్రాంతి గౌడ్ 3-0-16-0; అమన్‌జ్యోత్ 4-0-34-0; దీప్తిశర్మ 9.3-0-39-5; శ్రీచరణి 9-0-48-1; రాధ యాదవ్ 5-0-45-0; షెఫాలి 7-0-36-2

వారం ముందు ఆ అమ్మాయి అందరిలాగే ప్రపంచకప్ వీక్షకురాలు. టీవీలో భారత జట్టు ఆట చూస్తూ ఉంది. కానీ ఉన్నట్లుండి అంతా మారిపోయింది. ఆమె టీవీ లోపలికి వెళ్లిపోయింది. భారత జట్టులో సభ్యురాలై ప్రపంచకప్‌లో ఆడేసింది. ఆ ఆడడం మామూలుగా కాదు. ప్రతిష్ఠాత్మక ఫైనల్లో ఆమెనే టాప్ స్కోరర్. మొదట భారత జట్టు దాదాపు 300 స్కోరు చేసిందంటే తన చలవే. దక్షిణాఫ్రికా వైపు మొగ్గుతున్న మ్యాచ్‌ను కీలక వికెట్లతో మలుపు తిప్పిందీ ఆమే. తొలి ప్రపంచకప్ విజయంతో ఇప్పుడు హర్మన్‌ప్రీత్ సేన గాల్లో తేలిపోతోందంటే కారణం.. షెఫాలి వర్మనే.

వచ్చింది.. గెలిపించింది

ఈనాడు క్రీడావిభాగం



21 ఏళ్ల షెఫాలి వర్మ గురించి భారత క్రికెట్ అభిమానులకు కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నత్తనడకన సాగే మహిళల క్రికెట్‌కు వేగాన్నందించిన బ్యాటర్లలో ఆమె ఒకరు. పురుషుల క్రికెట్లో ఒకప్పుడు వీరేంద్ర సెహ్వాగ్ ఎలా చెలరేగేవాడో.. మహిళల జట్టులో అలాంటి పాత్రనే పోషిస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షించిందీ హరియాణా అమ్మాయి. కేవలం 15 ఏళ్లకే ఆమె భారత జట్టులోకి రావడం విశేషం. టీనేజీలోనే టీమ్‌ఇండియా తరఫున అనేక మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానం సంపాదించింది. కానీ దూకుడుగా ఆడే షెఫాలి టీ20ల్లో జట్టుకు ఉపయోగపడుతున్నా... వన్డేల్లో పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేక ఇబ్బంది పడింది. దీంతో వేటు తప్పలేదు. గత ఏడాది చివర్లో తన స్థానంలోకి ప్రతీక రావల్ వచ్చింది. ఈ దిల్లీ అమ్మాయి కెరీర్ ఆరంభం నుంచి నిలకడగా రాణిస్తూ ఓపెనింగ్‌లో పాతుకుపోయింది. దీంతో మళ్లీ షెఫాలిని వన్డేల్లో చూడలేమనే అనిపించింది. ప్రపంచకప్‌లోనూ ప్రతీక నిలకడగా రాణించింది. 7 మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ సహా 308 పరుగులు సాధించింది. అయితే బంగ్లాదేశ్‌తో నామమాత్రమైన లీగ్ మ్యాచ్‌లో గాయపడి ప్రతీక టోర్నీకి దూరం కావడం షెఫాలికి వరంగా మారింది. అనూహ్యంగా ఆమె ప్రపంచకప్‌లోకి అడుగు పెట్టింది. సెమీఫైనల్లో కేవలం 10 పరుగులకే వెనుదిరగడంతో ప్రతీక లేని లోటు కనిపించింది అందరికీ. ఆ రోజు అందరూ షెఫాలిని తిట్టుకున్నారు. కానీ ఫైనల్లో మాత్రం బ్యాటుతో చెలరేగి, బంతితో విజృంభించిన షెఫాలి.. దేశమంతా తనను కొనియాడేలా చేసుకుంది. ఆదివారం షెఫాలి తనదైన శైలిలో ధాటిగా ఆడుతూనే కాస్త సంయమనమూ పాటించింది. స్మృతి, జెమీమాలతో ఆమె నెలకొల్పిన భాగస్వామ్యాలతో 320కి పైగా స్కోరు చేసేందుకు పునాది పడింది. కానీ సెంచరీ చేసేలా కనిపించిన షెఫాలి.. ఆ మార్కునూ అందుకుని ఉంటే భారత్ ఇంకా ఎక్కువ పరుగులే చేసేదేమో. కానీ ఆమె ఔటయ్యాక స్కోరు వేగం పడిపోయి 300 లోపు స్కోరుకే పరిమితమైంది. ఇక పార్ట్‌టైం స్పిన్నర్ అయిన షెఫాలి ప్రపంచకప్ లాంటి కీలక మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. కానీ హర్మన్ అనూహ్యంగా షెఫాలికి బంతి అందించింది. ఆమె తొలి ఓవర్లోనే లుజ్ వికెట్ పడగొట్టింది. ఆ తర్వాత ఎంతో విలువైన మరిజేన్ కాప్ వికెట్ కూడా తీసింది. వారం ముందు వరకు అసలు ప్రపంచకప్‌లో లేని అమ్మాయి.. ఇప్పుడిలా అద్భుత ప్రదర్శనతో జట్టుకు ట్రోఫీ అందించడం కొసమెరుపు.

ఆమెకిది రెండో కప్పు

మహిళల వన్డే ప్రపంచకప్‌ను భారత్ అందుకోవడం ఇదే తొలిసారి అన్న సంగతి తెలిసిందే. అయితే జట్టులో మిగతా అందరికీ ఇది తొలి కప్పే కానీ.. షెఫాలికి మాత్రం కాదు. ఆమె ఖాతాలో ఇప్పటికే ఓ ప్రపంచకప్ ఉంది. 2023లో నిర్వహించిన తొలి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న జట్టులో షెఫాలి సభ్యురాలు. అప్పటికే సీనియర్ జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగినప్పటికీ.. వయసు 19 ఏళ్లకు మించకపోవడంతో ఆమెకు ఆ టోర్నీలో ఆడే అవకాశం దక్కింది.



అప్పుడు కపిల్.. ఇప్పుడు అమన్

దక్షిణాఫ్రికా గెలవాలంటే 54 బంతుల్లో 79 పరుగులు చేయాలి. అయినా ఆ జట్టు ధీమాగా ఉంది. సెంచరీ చేసిన కెప్టెన్ లారా వోల్వార్ట్ ఇంకా క్రీజులో ఉండడమే ఇందుకు కారణం. ఈ స్థితిలో దీప్తిశర్మ వేసిన ఇన్నింగ్స్ 42వ ఓవర్లో వోల్వార్ట్ ఓ భారీ షాట్‌కు ప్రయత్నించింది. డీప్ మిడ్ వికెట్‌లోకి బంతి గాల్లోకి లేచింది. దూసుకొచ్చిన అమన్‌జ్యోత్ మొదట బంతిని పట్టేసినట్లే పట్టి విడిచిపెట్టింది. వెంటనే తేరుకుని మళ్లీ ప్రయత్నించింది ఈసారీ దొరకలేదు. మూడోసారి మాత్రం ఆమె చేతిలో ఒదిగిపోయింది. 1983 ప్రపంచకప్‌లో వివ్ రిచర్డ్స్ క్యాచ్‌ను కపిల్ ఇలాగే పట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు.

ప్రైజ్‌మనీ
విజేత జట్టుకు రూ.37.3 కోట్లు
రన్నరప్‌నకు రూ.20 కోట్లు



సచిన్ చేతుల మీదుగా..

ముంబయి: మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ మైదానంలోకి వచ్చాడు. వెలుగు జిలుగుల మధ్య అతడు ప్రపంచకప్ ట్రోఫీతో ప్రవేశించగానే అభిమానుల అరుపులతో డీవై పాటిల్ స్టేడియం దద్దరిల్లింది. భారత ప్లేయర్లతో మాట్లాడి అతడు అభినందనలు తెలిపాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా మ్యాచ్‌కు హాజరయ్యాడు. ఫైనల్ ఆరంభానికి ముందు ప్రముఖ గాయని సునిధి చౌహాన్ జనగణమన ఆలపించింది. తర్వాత 60 మంది డ్యాన్సర్లతో సునిధి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కొరియోగ్రాఫర్ సంజయ్ శెట్టి ఫైర్‌వర్క్స్ ప్రదర్శన, డ్రోన్ డిస్‌ప్లే, లేజర్ షో అభిమానులను విశేషంగా అలరించాయి.

550 టోర్నీలో అత్యధికంగా లారా వోల్వార్ట్ చేసిన పరుగులు. సెమీస్, ఫైనల్లో ఆమె సెంచరీలు బాదింది.

22 దీప్తిశర్మ తీసిన వికెట్లు. అత్యధిక వికెట్ల జాబితాలో ఆమెదే అగ్రస్థానం.

భారత్-దక్షిణాఫ్రికా ఫైనల్ మ్యాచ్‌ను ఆస్ట్రేలియాలో సిరీస్ ఆడుతున్న భారత పురుషుల జట్టు చాలా ఆసక్తికరంగా వీక్షించింది. కోచ్ గౌతమ్ గంభీర్, పేసర్ బుమ్రా, రింకు సింగ్ తదితరులు మ్యాచ్ చూస్తున్న దృశ్యాన్ని బీసీసీఐ పంచుకుంది.



వాళ్ల వెనుక అతడు


అమోల్ మజుందార్

భారత మహిళల క్రికెట్ జట్టులో రెండేళ్ల కిందటి వరకు స్థిరత్వం లేదు. కొన్ని మ్యాచ్‌లు గెలవడం.. తర్వాత గెలిచే మ్యాచ్‌లు ఓడిపోవడం.. ఇలా సాగేది ప్రయాణం. కానీ ఇప్పుడు భారత్ మారింది. బలమైన టీమ్‌లతో ఆడేటప్పుడు బెరుకు లేదు. పెద్ద లక్ష్యాలను ఛేదించాలన్నా భయం లేదు. గెలవాలన్న తపన, పోరాటం పెరిగింది. అందుకు కారణాల్లో కోచ్ అమోల్ మజుందార్ ఒకరు. 2023లో మజుందార్‌ను భారత జట్టు కోచ్‌గా ఎంపిక చేసినప్పుడు చాలామంది పెదవి విరిచారు. అంతర్జాతీయ అనుభవం లేని ఏం మార్గనిర్దేశనం చేస్తాడని అన్నారు. అయితే దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ జూనియర్ జట్టుకు కోచింగ్ ఇచ్చిన అనుభవంతో మజుందార్ భారత జట్టును గాడిలో పెట్టాడు. వారిలో తనపై నమ్మకాన్ని కలిగించాడు. బలమైన జట్టుగా ఎదిగేందుకు కృషి చేశాడు. స్మృతి, హర్మన్‌ప్రీత్ లాంటి స్టార్ ప్లేయర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని ఇచ్చాడు. క్రాంతి గౌడ్, శ్రీచరణి లాంటి యువ ప్లేయర్లను ప్రోత్సహించి వారు సత్తా చాటేందుకు కీలకపాత్ర పోషించాడు. ఎన్నో మ్యాచ్‌ల అనుభవం లేని ఈ ఇద్దరూ ప్రపంచకప్ ఆడారంటే అది మజుందార్ ఇచ్చిన మద్దతు వల్లే. వన్డే ప్రపంచకప్‌లో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడి.. సెమీస్ అవకాశాలను క్లిష్టం చేసుకున్నప్పుడు జట్టు ధైర్యం కోల్పోలేదు. ఛేదనలో పోరాడాలని ప్రతి మ్యాచ్ ఫైనల్ మ్యాచ్‌గా భావించి బరిలో దిగాలని మజుందార్ నూరిపోసిన పాఠాలు ప్లేయర్లలో నాటుకుపోయాయి. ఫలితమే ప్రపంచకప్. 171 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 30 సెంచరీలతో సహా 11 వేలకు పైగా పరుగులు చేసినా భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన మజుందార్.. కోచ్‌గా తానేంటో నిరూపించుకున్నాడు. ఆటగాడిగా సాధించలేనిది కోచ్‌గా నెరవేర్చుకున్నాడు.

– ఈనాడు క్రీడావిభాగం

భారత జట్టుకు ఆడడం ఏ ప్లేయర్‌కైనా పెద్ద కల. అలాంటిది ప్రపంచకప్‌లో బరిలో దిగే అవకాశం వస్తే! అందులోనూ అరంగేట్రం చేసిన కొన్ని నెలలకే ఈ అవకాశాన్ని అందుకుంటే! ఆ అదృష్టం తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణికి దక్కింది. వచ్చిన ప్రతి అవకాశాన్ని రెండు చేతులా అందుకున్న ఈ స్పిన్నర్ భారత్ కప్ గెలవడంలో కీలకపాత్ర పోషించింది.

దొరికింది ఓ ఆణిముత్యం

ఈనాడు క్రీడావిభాగం

కడపకు చెందిన 21 ఏళ్ల శ్రీచరణి మొదట బ్యాడ్మింటన్, కబడ్డీ ఆడేది. తర్వాత ఆమె మనసు క్రికెట్ వైపు మళ్లింది. ఫాస్ట్ బౌలర్‌గా కెరీర్ ఆరంభించింది. అందులో సఫలం కాకపోవడంతో స్పిన్నర్‌గా మారింది. దేశవాళీలో స్థిరంగా రాణించింది. దీంతో గతేడాది డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఈ స్పిన్నర్‌ను రూ.55 లక్షలు పెట్టి దక్కించుకుంది. ఈ ఏడాది మార్చిలో సీనియర్ మహిళల ట్రోఫీలో భారత్-బికి ఆడి ఆకట్టుకుంది. కానీ జాతీయ జట్టుకు ఆడే అవకాశం ఇంత త్వరగా వస్తుందని ఆమె ఊహించలేదు. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ కావడం.. స్థిరంగా రాణిస్తుండడంతో భారత్ సీనియర్ జట్టు నుంచి పిలుపొచ్చింది. ఈ ఏప్రిల్‌లో శ్రీలంకపై అరంగేట్రం చేసింది.


శ్రీచరణి

అనుకోకుండా వచ్చి..

ప్రపంచకప్ జట్టులో చోటు కోసం చాలామంది రేసులో ఉండడంతో కొత్త అమ్మాయి శ్రీచరణికి అవకాశం దక్కుతుందని ఎవరూ అనుకోలేదు. అనుభవం కన్నా నైపుణ్యానికి ప్రాధాన్యత ఇస్తూ శ్రీచరణికి సెలక్టర్లు అవకాశం ఇచ్చారు. ఆమె లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ భారత్, శ్రీలంక పిచ్‌లపై ఎంతో కీలకం అవుతుందని భావించారు. ఆ నమ్మకాన్ని ఈ స్పిన్నర్ వమ్ము చేయలేదు. అత్యధిక వికెట్లు పడగొట్టలేదు కానీ.. ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ కీలకంగా మారింది. ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో ఆ జట్టు మరింత ఎక్కువ స్కోరు చేయలేదంటే అందుకు శ్రీచరణియే కారణం. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన డీవై పాటిల్ పిచ్‌పై జోరు మీదున్న ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేసి అద్భుతమైన తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది.

వైవిధ్యంతోనే

బ్యాటర్ కదలికలను బట్టి బంతులు వేసే శ్రీచరణి.. వైవిధ్యంతో బోల్తా కొట్టిస్తుంది. బంతి వేగాన్ని మార్చడంలో, బంతి స్పిన్ చేసే మార్గం... బంతిని నేరుగా వేయడం ద్వారా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టింది. ప్రపంచకప్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో దీప్తిశర్మ తర్వాత శ్రీచరణిదే రెండో స్థానం. ఆమె ఇప్పటిదాకా 17 వన్డేల్లో 22 వికెట్లు పడగొట్టింది. ప్రపంచకప్‌లో 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసింది. చరణి ఇదే జోరు కొనసాగిస్తే భారత్‌కు మరిన్ని విజయాలు అందించడం ఖాయం.

ఛాంపియన్స్

అప్పట్లో కపిల్ నేతృత్వంలోని పురుషుల క్రికెట్లో దేశానికి తొలి ప్రపంచ కప్‌ను అందించిన జట్టును 'కపిల్ డెవిల్స్' అన్నారు. అసలు అంచనాలే లేకుండా అంతర్జాతీయ ప్రదర్శన చేస్తూ అరవీర భయంకర వెస్టిండీస్‌ను ఓడించి 1983లో అద్భుతం చేసింది ఆ భారత జట్టు. అప్పటితో పోల్చుకుంటే ఇప్పటి హర్మన్ బృందంపై అంచనాలు ఎక్కువే. కానీ ఛాంపియన్ జట్లు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లను కాదని కప్పు గెలుస్తుందని ఎవరూ అనుకోలేదు. కానీ.. రికార్డు ఛేదనతో ఆస్ట్రేలియాను మట్టికరిపించి.. ఫైనల్లో దక్షిణాఫ్రికాను పడగొట్టి అద్భుతమైన ఆటతో.. ఇప్పుడు కప్పు నెగ్గినందుకు భారత జట్టును 'హర్మన్ డెవిల్స్' అనేద్దామా!

మహిళల క్రికెట్లో మలుపు

ఈనాడు – హైదరాబాద్

వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయం యావత్ మహిళల క్రికెట్‌ను మార్చబోతోందని మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ అభిప్రాయపడింది. 1983లో కపిల్ సేన విజయం ప్రపంచ క్రికెట్‌ను మార్చినట్లుగానే.. హర్మన్‌ప్రీత్ బృందం గెలుపు అమ్మాయిల ఆటలో కీలక మలుపు అవుతుందని తెలిపింది. అమ్మాయిల క్రికెట్‌కు మరింత ఆదరణ పెరగడం ఖాయమంటున్న మిథాలీ ఇంటర్వ్యూ 'ఈనాడు'కు ప్రత్యేకం. వివిధ అంశాలపై ఆమె ఏం చెప్పిందంటే..

మధురమైన గెలుపు

ప్రపంచ ఛాంపియన్ భారత్ విజయాన్ని ఎంత వర్ణించినా తక్కువే. 1983లో ఇంగ్లాండ్ నేలపై కపిల్‌దేవ్ నేతృత్వంలోని భారత్ తొలిసారిగా కప్ నెగ్గింది. అది మొదటి మురిపెం. 2011లో సొంతగడ్డపై ధోని నాయకత్వంలో రెండో సారి వరల్డ్‌కప్‌ను భారత్ ముద్దాడింది. ఆ రెండు సందర్భాలకు ఏమాత్రం తీసిపోనిది అమ్మాయిల విజయం. ఈసారి సొంత గడ్డపై టోర్నీ జరుగుతుండటంతో అన్ని వైపుల నుంచి ఆశలు.. అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఆ ఒత్తిడి ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు. అసాధారణ ఒత్తిడిని అధిగమించిన భారత అమ్మాయిలకు హ్యాట్సాఫ్. ఈ విజయం ప్రపంచ మహిళా క్రికెట్లో కీలక మలుపు కానుంది. క్రికెట్ మైదానాలకు వెళ్లే అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.


మిథాలీ రాజ్

హర్మన్ సారథ్యం భలే

సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన విజయం మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. 339 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన విధానాన్ని మహిళల క్రికెట్లో పాఠ్యాంశంగా చేర్చొచ్చు. జెమీమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను ఎంత పొగిడినా తక్కువే. కీలకమైన మ్యాచ్‌లో చిన్న చిన్న సందర్భాల్ని ఒడిసి పట్టుకోవడం ముఖ్యం. ఆష్లీ గార్డెనర్ ఔట్ అలాంటిదే. అప్పటికే ఆసీస్ 331 పరుగులు సాధించింది. మరో 10 బంతులుండగా.. నాలుగు వికెట్లు పడగొట్టి ఆసీస్‌ను ఆలౌట్ చేయడం భారత అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఛేదనలో అమ్మాయిల స్ఫూర్తిమంతమైన పోరాటానికి బీజం పడింది అక్కడే. హర్మన్ సారథ్యం కూడా అద్భుతం.

కూర్పు అదిరిపోయింది

సీనియర్లు.. జూనియర్ల మధ్య సమతూకం, సమన్వయం ఈ ప్రపంచకప్‌లో భారత్ సక్సెస్ సూత్రం. హర్మన్, స్మృతి మంధాన, దీప్తిశర్మ, జెమీమాల అనుభవం జట్టుకు కలిసొచ్చింది. సెమీస్‌లో విఫలమైన షెఫాలీ ఫైనల్లో దుమ్ము దులిపింది. అమన్‌జ్యోత్ కౌర్, క్రాంతి గౌడ్, శ్రీచరణి వంటి జూనియర్ల భాగస్వామ్యం అద్భుతం. ఈ కప్‌లో నన్ను బాగా ఆకర్షించిన అమ్మాయి క్రాంతి. సహజసిద్ధమైన ప్రతిభావంతురాలు ఆమె. శ్రీచరణి కూడా అంతే. నాణ్యమైన స్పిన్‌తో కీలక సమయాల్లో భారత్‌కు వికెట్లు అందించింది. జట్టులోని ప్రతి ఒక్కరూ తమదైన ప్రదర్శనతో భారత్‌ను విశ్వవిజేతగా నిలిపారు. ఇది ముమ్మాటికీ సమష్టి విజయం.

ప్రయాణ ఖర్చుల కోసం చందాలు వేసుకోవడం దగ్గర్నుంచి.. కోట్ల రూపాయల కాంట్రాక్టులు పొందే వరకు!
రోడ్డు మీద వెళ్తుంటే ఎవ్వరూ పట్టించుకోని స్థితి నుంచి.. రక్షణ వలయం లేకుండా బయటికి వెళ్లలేని దశ వరకు!
ప్రత్యక్ష ప్రసారమే లేని రోజుల నుంచి.. ఓ స్ట్రీమింగ్ యాప్‌లో ఒకేసారి 20 కోట్ల మంది మ్యాచ్ చూసే వరకు! వందమందైనా జనం లేక వెలవెలబోయిన మైదానాల నుంచి.. ఒక్క సీటూ ఖాళీగా లేని నిండైన స్టేడియాల వరకు!
ఉచిత ప్రవేశం ఇచ్చినా చూడని రోజుల నుంచి.. వేల రూపాయల టికెట్ల కోసం జనం ఎగబడడం వరకు!
..చాలా దూరమే ప్రయాణించింది భారత మహిళల క్రికెట్. కానీ ఇదంతా ఒక్క రోజులో వచ్చిన మార్పు కాదు!
ఈ ప్రయాణంలో ఈ ప్రపంచకప్ విజయం అతి పెద్ద మలుపు! ఇకపై చూడబోయేది ఇంకా గొప్ప మార్పు!

ఈనాడు క్రీడావిభాగం



కొత్త బంగారు లోకం

2005 వన్డే ప్రపంచకప్ ఫైనల్. భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్. స్టేడియంలో 2 వేల మంది కూడా లేరు. ఆదివారం నాటి భారత్, దక్షిణాఫ్రికా ఫైనల్ మ్యాచ్ కోసమని ఒక రోజంతా స్టేడియం దగ్గర నిలబడ్డా టికెట్లు దొరకని పరిస్థితి. ఆన్‌లైన్లోనూ టికెట్ ముక్క లేదు. మహిళల క్రికెట్ ఎంత మారిందో చెప్పడానికి ఇంతకంటే రుజువేముంది? కానీ మహిళల క్రికెట్ ఈ స్థాయికి చేరడానికి చాలా సమయమే పట్టింది.

అక్కడి నుంచే..

అయిదు దశాబ్దాలుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతోంది మహిళల జట్టు. కానీ ఉమెన్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయింది మహిళల క్రికెట్. అందుకు ప్రధాన కారణం నిధుల కొరత. నామమాత్రపు మ్యాచ్ ఫీజులు.. చాలీచాలని టీఏలు, డీఏలు.. రైల్లో ప్రయాణాలు, ఇరుకు గదుల్లో బస.. ప్రాక్టీస్‌కు సౌకర్యాల లేమి.. ఇలా అనేక ఇబ్బందుల మధ్య మిథాలీ రాజ్ సహా చాలామంది క్రికెటర్ల ప్రయాణం చాలా కష్టంగా సాగింది. పెద్దగా ఆదాయం రాకపోగా సొంతంగా చేతి నుంచి ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి. విదేశీ మ్యాచ్ కోసం మిథాలీ చందాలేసుకుని వెళ్లడం గమనార్హం. కానీ 2006లో బీసీసీఐ గొడుగు కిందికి వచ్చాకే నెమ్మదిగా మార్పు మొదలైంది. మహిళలకు మ్యాచ్‌లు, ఫీజులు పెరిగాయి. వసతులు సమకూరాయి. క్రమంగా వారి ఆట మారింది. ఐపీఎల్ తరహాలోనే మహిళల క్రికెట్ లీగ్ రాకతో మన అమ్మాయిల ఆట మరో స్థాయికి చేరింది. మేటి విదేశీ క్రికెటర్లతో కలిసి ఆడడం ఎంతో ఉపకరించింది. ఒత్తిడికి గురి కాకుండా, పురుషుల్లాగే బెదురులేని క్రికెట్ ఆడడం అలవాటైంది. ప్రస్తుతం పురుషులతో సమానంగా మ్యాచ్ ఫీజులు, నజరానాలు అందుకుంటున్నారు అమ్మాయిలు.

మారిన ఆట, దృక్పథం

పురుషుల క్రికెట్లో వన్డేల్లో 300 స్కోర్లు మామూలైపోయిన రోజుల్లో.. మహిళల క్రికెట్లో 200 దాటడమే కష్టంగా ఉండేది. చిన్న లక్ష్యాలను ఛేదించడానికి కూడా కష్టపడిపోయేవాళ్లు. 2005 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా చేసింది 215 పరుగులే. అయినా భారత్ 98 పరుగుల తేడాతో ఓడింది. ఈ ఆటతీరు వల్లే అభిమానుల్లో కూడా.. అమ్మాయిల ఆటను ఏం చూస్తాంలే అనే భావనుండేది. మహిళల క్రికెట్ బీసీసీఐ కిందికి వచ్చాక కూడా వెంటనే అంతా మారిపోలేదు. ఆటలో దూకుడు పెరగడానికి, మనమ్మాయిలు ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకోవడానికి సమయం పట్టింది. ఎలాంటి బౌలర్లయినా దీటుగా ఎదుర్కొనే, సై అంటే సై అని తలపడే హర్మన్‌ప్రీత్, స్మృతి లాంటి నవతరం క్రికెటర్ల రాకతోనే భారత జట్టు ఆటతీరులో మార్పు వచ్చింది. షెఫాలి, జెమీమా, రిచా లాంటి క్రికెటర్లు కూడా అభిమానుల దృష్టిని తమ వైపు తిప్పుకొన్నారు. 2017 ప్రపంచకప్ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయాన్నందించిన హర్మన్‌ప్రీత్ విధ్వంసక ఇన్నింగ్స్ (171 నాటౌట్) ఓ సంచలనం. పురుషులకు ఏమాత్రం తీసిపోని కళాత్మక బ్యాటింగ్, విధ్వంసక ఇన్నింగ్స్‌లతో తమకూ ఆకర్షణ శక్తి ఉందని, తాము కూడా వేలాది మందిని స్టేడియాలకు రప్పించగలమని.. టీవీల ముందు కోట్ల మందిని కూర్చోబెట్టగలమని మనమ్మాయిలు రుజువు చేశారు. దీంతో ఒకప్పుడు మహిళల క్రికెట్ అంటే అస్సలు పట్టని భారత అభిమానులు.. నెమ్మదిగా స్టేడియాలకు రావడం మొదలైంది. డబ్ల్యూపీఎల్ రాకతో గత రెండు మూడేళ్లలో భారత అమ్మాయిల ఆట మరింత మెరుగైంది. ఒకప్పుడు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి ప్రత్యర్థులంటే ముందే జావగారిపోయేది భారత జట్టు. కానీ ఇప్పుడు ఆ జట్లను దీటుగా ఎదుర్కొంటోంది. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో దాని సొంతగడ్డపై తలపడి వరుసగా టీ20, వన్డే సిరీస్‌లు నెగ్గింది టీమ్‌ఇండియా. ఇక ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాతో స్వదేశంలో సిరీస్ ఆడగా.. అందులో 1-2తో ఓడినప్పటికీ, ఆడిన తీరు మాత్రం అమోఘం. ఓ మ్యాచ్‌లో ఏకంగా 102 పరుగుల తేడాతో నెగ్గింది భారత్. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లు మారిన భారత అమ్మాయిల ఆటతీరుకు ఒక సంకేతం. ఇప్పుడు ప్రపంచకప్‌లో మరింత ఉత్తమంగా ఆడి విజేతగా నిలిచింది.

ఇకపై ఇంకో స్థాయికి

పురుషుల క్రికెట్‌ది 140 ఏళ్ల చరిత్ర. అందులో 1983లో కపిల్ డెవిల్స్ ప్రపంచకప్ గెలవడం పెద్ద మలుపు. అక్కడ్నుంచే ప్రపంచ క్రికెట్ భారత్ చుట్టూ తిరగడం మొదలైంది. దేశంలో క్రికెట్‌కు ఆదరణ అమాంతం పెరిగింది. బీసీసీఐ ప్రపంచంలోనే ధనిక బోర్డుగా ఎదగడంతో మన క్రికెట్ రూపురేఖలే మారిపోయాయి. క్రమంగా టీమ్‌ఇండియా ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడీ ప్రపంచకప్ విజయంతో అమ్మాయిల క్రికెట్ మరో స్థాయికి చేరడం ఖాయం. ఇప్పటిదాకా భారత అమ్మాయిలు ఏం సాధించినా.. ప్రపంచకప్ విజయంతో వచ్చే ఊపు వేరు. మన అమ్మాయిల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అన్నింటికీ మించి దేశంలో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే అమ్మాయిల సంఖ్య, వారికి ప్రోత్సాహం పెరుగుతుంది. శిక్షణ, సౌకర్యాలూ మరింత మెరుగుపడతాయి. ఇప్పటికే క్రికెట్ అంటే అబ్బాయిల ఆట అనే భావన పోయింది. అమ్మాయిల ఆటపై కాస్త చిన్నచూపు కూడా ఇకపై ఉండదు. రెండేళ్ల కిందట మహిళల క్రికెట్ లీగ్‌ను మొదలుపెడితే.. అయిదు ఫ్రాంఛైజీలు కలిపి రూ.4700 కోట్ల రేటు పలికాయి. మీడియా హక్కులు రూ.961 కోట్లకు అమ్ముడయ్యాయి. ఇకపై ఈ లెక్కలు ఇంకా పెద్దవి కావడం.. లీగ్‌లో ఆట, ఆదరణ, ఆదాయం మరో స్థాయికి చేరడం ఖాయం.

హర్మన్ డెవిల్స్

ఈనాడు క్రీడావిభాగం

స్మృతి మంధాన


పరుగులు: 434
సగటు: 54.25

భారత జట్టు కప్పు అందుకోవడంలో ఈ స్టార్ ఓపెనర్‌ది అత్యంత కీలక పాత్ర. సూపర్ ఫామ్, భారీ అంచనాలతో ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన ఆమె.. ఆరంభంలో విఫలమైంది. 0, 23, 23.. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆమె స్కోర్లివి. కానీ అక్కడి నుంచి ఆమె ఆట మారింది. అది జట్టు రాతనే మార్చింది. ఒత్తిడిలో అదరగొట్టిన ఆమె ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లపై 80, 88 పరుగులు చేసింది. ఆ మ్యాచ్‌ల్లో భారత్ ఓడినా.. ఆ ప్రదర్శన ఆమె ఆత్మ విశ్వాసాన్ని, జట్టు విశ్వాసాన్ని పెంచింది. ఫలితం న్యూజిలాండ్‌పై భారీ ఇన్నింగ్స్. ఆమె శతక్కొట్టడంతో కివీస్‌పై గెలిచిన భారత్.. అదే జోరుతో ఫైనల్‌కు దూసుకొచ్చింది.

జెమీమా రోడ్రిగ్స్


పరుగులు: 289
సగటు: 58.40

2025 మహిళల ప్రపంచకప్ అంటే ప్రతి భారత అభిమానికి మొదట గుర్తొచ్చేది జెమీమానే. అంతలా చెరగని ముద్ర వేసింది టోర్నీలో ఈ బ్యాటర్. ఒకే ఒక్క ఇన్నింగ్స్ ఆమెను ఎక్కడికో తీసుకెళ్లింది. భారత క్రికెట్లో ఇప్పుడు జెమీమా పేరు మార్మోగుతోంది. సెమీఫైనల్లో ఆమె పోరాటమే లేకపోయుంటే భారత్ కథ వేరుగా ఉండేదే. ఆస్ట్రేలియాపై భారత్ ప్రపంచ రికార్డు లక్ష్యాన్ని ఛేదించడం ఎవరూ ఊహించనిదే. జెమీమా అద్భుత శతకం (127 నాటౌట్) వల్లే ఆతిథ్య జట్టు అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగింది. జెమీమా లీగ్ దశలో 76 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో న్యూజిలాండ్‌పై ఘనవిజయంలోనూ తన వంతు పాత్ర పోషించింది.

దీప్తి శర్మ


పరుగులు: 215
వికెట్లు: 22

స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ భారత జట్టు విజయానికి ఎంతో దోహదపడింది. బంతితో మాయ చేస్తూనే బ్యాటుతోనూ తనవంతుగా చేయూతనందించింది. 53, 3/54 (శ్రీలంకపై), 25, 3/45 (పాకిస్థాన్‌పై), 50, 4/51 (ఇంగ్లాండ్)పై, 24, 2/73 (ఆస్ట్రేలియాపై), 58, 5/39 (దక్షిణాఫ్రికాపై).. దీప్తి ఆల్‌రౌండ్ ప్రదర్శనకు ఈ గణాంకాలే నిదర్శనం. అత్యంత ఆధారపడదగ్గ ఆల్‌రౌండర్‌గా తన విలువను మరోసారి చాటుకున్న దీప్తి.. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచింది.

హర్మన్‌ప్రీత్ కౌర్


పరుగులు: 260
సగటు: 32.50

హర్మన్‌ప్రీత్ తనదైన శైలిలో భారీ ఇన్నింగ్స్‌లు ఎక్కువగా ఆడి ఉండకపోవచ్చు. పరుగుల వరద పారించి ఉండకపోవచ్చు. కానీ సారథిగా ఆమె జట్టును నడిపించిన తీరు అమోఘం. తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయాల తర్వాత.. వరుసగా మూడు ఓటములు ఎదురైనప్పుడు, సెమీఫైనల్ అవకాశాలు సందిగ్ధంలో పడ్డప్పుడు ఆమె జట్టు స్థైర్యం కోల్పోకుండా చూసింది.. టోర్నీలో కీలక సమయంలో ఆమె రేణుకను తుది జట్టులోకి తేవడం కూడా సత్ఫలితాలను ఇచ్చింది. బ్యాటుతో కాస్త నిలకడ లోపించినా అసలైన పోరులో ఆమె అదరగొట్టింది. సెమీస్‌లో వీరోచిత శతకంతో జెమీమాపై ప్రశంసల జల్లు కురిసింది కానీ.. హర్మన్‌ప్రీత్(89)ది కూడా అంతే విలువైన ఇన్నింగ్స్.

ప్రతీక రావల్


పరుగులు: 308
సగటు: 51.33

దురదృష్టవశాత్తు గాయంతో కీలకమైన సెమీస్, ఫైనల్‌కు దూరమైంది కానీ.. ఓపెనర్ ప్రతీక రావల్ ప్రదర్శన వెలకట్టలేనిది. స్మృతి లేదా రిచాలా దూకుడుగా ఆడకపోయినా... ఆమె చేసిన ప్రతి పరుగూ విలువైందే. ఓపెనర్‌గా దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ రాణించింది. ఈ టోర్నీలో అత్యంత నిలకడగా రాణించిన భారత బ్యాటర్ ఎవరంటే.. ఆమె పేరే చెప్పాలి. సాధికారిక ఆటతో ఆకట్టుకున్న ఆమె, ఒక్క మ్యాచ్‌లో మినహా బరిలోకి దిగిన ప్రతిసారీ కనీసం 30 దాటింది. న్యూజిలాండ్‌తో కీలక పోరులో సెంచరీ (122) సాధించిన ప్రతీక.. జట్టు సెమీఫైనల్ చేరడంలో ప్రధాన పాత్ర పోషించింది.

మనకొకటి..

★ మూడో టీ20లో భారత్ గెలుపు
★ విజృంభించిన అర్ష్‌దీప్
★ రాణించిన సుందర్


హోబర్ట్: అర్ష్‌దీప్ జట్టులో ఉండాలి.. గత కొంతకాలంగా వినిపిస్తున్న డిమాండ్ ఇది. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో 0-1తో వెనకబడిన దశలో అతడికి చోటు లభించింది. ఆ అవకాశాన్ని అతడు వమ్ము చేయలేదు. నిప్పులు చెరిగే బంతులతో కంగారూలకు ఓటమి రుచి చూపించాడు. బంతితో అర్ష్‌దీప్‌సింగ్ (3/35), బ్యాటుతో వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్; 23 బంతుల్లో 3×4, 4×6) చెలరేగిన వేళ అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి విజయాన్ని అందుకుంది టీమ్‌ఇండియా. ఆదివారం మూడో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మొదట ఆసీస్ 6 వికెట్లకు 186 పరుగులు సాధించింది. అర్ష్‌దీప్ బంతితో విజృంభించడంతో ట్రావిస్ హెడ్ (6), జోష్ ఇంగ్లిస్ (1) వెంటవెంటనే పెవిలియన్ బాట పట్టారు. 14 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన జట్టును డేవిడ్ (74; 38 బంతుల్లో 8×4, 5×6), స్టాయినిస్ (64; 39 బంతుల్లో 8×4, 2×6) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆసీస్‌కు పోరాడగలిగే స్కోరు అందించారు. వరుణ్ చక్రవర్తి (2/33) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. సుందర్ సహా భారత బ్యాటర్లంతా తలా ఓ చేయి వేయడంతో 18.3ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరింది. ఈనెల 6న నాలుగో టీ20 జరగనుంది.

చెలరేగిన అభిషేక్: రెండో పోరులో 125కే ఆలౌటైన భారత్ ముందు 187 పరుగుల లక్ష్యం పెద్దగానే అనిపించింది. అయితే ఓపెనర్ అభిషేక్‌శర్మ (25; 16 బంతుల్లో 2×4, 2×6) దూకుడుతో మెరుపు ఆరంభం లభించింది. సిక్సర్లు, బౌండరీలతో చెలరేగడంతో భారత్ 3 ఓవర్లలోనే 30/0 స్కోరుతో దూసుకెళ్లింది. మంచి ఫామ్‌లో ఉన్న అభిషేక్‌ను నాథన్ ఎలిస్ (3/36) బౌన్సర్‌తో బోల్తాకొట్టించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24; 11 బంతుల్లో 1×4, 2×6) క్రీజులో అడుగుపెడుతూనే రెండు సిక్సర్లతో జోరు చూపించాడు. క్రీజులో కుదురుకున్న శుభ్‌మన్ గిల్ (15; 12 బంతుల్లో 1×4)ను ఎలిస్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం.. స్టాయినిస్ (1/22) బౌలింగ్‌లో సూర్య ఔటవడంతో భారత్ కష్టాల్లో చిక్కుకున్నట్లు అనిపించింది. అప్పుడు జట్టు స్కోరు 7.3 ఓవర్లలో 76/3. ఈ సమయంలో తిలక్‌వర్మ (29; 26 బంతుల్లో 1×4, 1×6), అక్షర్ పటేల్ (17; 12 బంతుల్లో 1×4) గొప్ప సంయమనం కనబరిచి జట్టు స్కోరును 100 దాటించారు. ఆ తర్వాత అక్షర్ ఔటైనా.. ఆ ప్రభావం జట్టుపై పడలేదు. అక్కడ్నుంచి తిలక్, సుందర్ జట్టును లక్ష్యం దిశగా తీసుకెళ్లారు. బార్ట్‌లెట్ ఓవర్లో తిలక్ ఔటవగా. . కునెమన్ బౌలింగ్‌లో సుందర్ మరో సిక్సర్ బాదడంతో చివరి 4 ఓవర్లలో బంతికో పరుగుగా సమీకరణం మారిపోయింది. జితేష్‌శర్మ (22 నాటౌట్; 13 బంతుల్లో 3×4) ఆఖర్లో మెరుపులు మెరిపించడంతో భారత్ తేలిగ్గా విజయాన్ని అందుకుంది.


అర్ష్‌దీప్ (3/35)

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) సూర్య (బి) అర్ష్‌దీప్ 6; మార్ష్ (సి) తిలక్ (బి) వరుణ్ 11; ఇంగ్లిస్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 1; డేవిడ్ (సి) తిలక్ (బి) దూబె 74; ఓవెన్ (బి) వరుణ్ 0; స్టాయినిస్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 64; షార్ట్ నాటౌట్ 26; బార్ట్‌లెట్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **186**; **వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-73, 4-73, 5-118, 6-182; **బౌలింగ్:** అర్ష్‌దీప్‌సింగ్ 4-0-35-3; జస్‌ప్రీత్ బుమ్రా 4-0-26-0; వరుణ్ చక్రవర్తి 4-0-33-2; అక్షర్ పటేల్ 4-0-35-0; శివమ్ దూబె 3-0-43-1; అభిషేక్‌శర్మ 1-0-13-0; **భారత్ ఇన్నింగ్స్:** అభిషేక్ (సి) ఇంగ్లిస్ (బి) ఎలిస్ 25; శుభ్‌మన్ (ఎల్బీ) (బి) ఎలిస్ 15; సూర్యకుమార్ (సి) ఎలిస్ (బి) స్టాయినిస్ 24; తిలక్ (సి) ఇంగ్లిస్ (బి) బార్ట్‌లెట్ 29; అక్షర్ (సి) బార్ట్‌లెట్ (బి) ఎలిస్ 17; సుందర్ నాటౌట్ 49; జితేష్‌శర్మ నాటౌట్ 22; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం:** (18.3 ఓవర్లలో 5 వికెట్లకు) **188**; **వికెట్ల పతనం:** 1-33, 2-61, 3-76, 4-111, 5-145; **బౌలింగ్:** జేవియర్ బార్ట్‌లెట్ 4-0-30-1; సీన్ అబాట్ 3.3-0-56-0; నాథన్ ఎలిస్ 4-0-36-3; మాథ్యూ కునెమన్ 4-0-31-0; స్టాయినిస్ 2-0-22-1; షార్ట్ 1-0-13-0.

టీ20లకు విలియమ్సన్ వీడ్కోలు


కేన్ విలియమ్సన్

ఆక్లాండ్: న్యూజిలాండ్ దిగ్గజ ఆటగాడు కేన్ విలియమ్సన్ టీ20లకు వీడ్కోలు పలికాడు. కివీస్ తరఫున 93 టీ20లు ఆడిన కేన్.. 2575 పరుగులు సాధించాడు. 2011లో జింబాబ్వేపై పొట్టి క్రికెట్లో అరంగేట్రం చేసిన ఈ స్టార్ బ్యాటర్.. గతేడాది టీ20 ప్రపంచకప్‌లో పపువా న్యూగినియాపై ఆఖరి మ్యాచ్ ఆడాడు. టెస్టులు, వన్డేల్లో కొనసాగనున్న 35 ఏళ్ల కేన్.. వచ్చే ఏడాది ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు వ్యూహ సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

భారత్-ఎ విజయం

బెంగళూరు: దక్షిణాఫ్రికా-ఎతో నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఎ 4 వికెట్ల తేడాతో గెలిచింది. 275 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 119/4తో ఆఖరి రోజు, ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. మరో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. రిషబ్ పంత్ (90) సత్తా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 309...భారత్ 234 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 199 పరుగులకే ఆలౌటైంది.

పాకిస్థాన్‌దే టీ20 సిరీస్

లాహోర్: దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పాకిస్థాన్ 2-1తో గెలుచుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో పాక్ 4 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 139 పరుగులే చేయగలిగింది. బాబర్ (68) మెరవడంతో లక్ష్యాన్ని పాక్ 19 ఓవర్లలోనే ఛేదించింది.

మహాత్ముడి బాటలో.. ఊరు ఊరంతా శాకాహారులే

ఝార్ఖండ్‌లోని లాతెహార్ జిల్లా బార్వాగడ గ్రామంలో అందరూ శాకాహారులే. వీరిలో ఎక్కువమంది తానా భగత్ సమాజానికి చెందినవారు. ఈ తెగవారు మహాత్మాగాంధీ నిరాడంబరత, అహింస వంటి సిద్ధాంతాలను అనుసరిస్తారు. అందుకే సాత్వికమైన ఆహారాన్ని మాత్రమే తీసుకుంటారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సంప్రదాయాన్ని తాము కొనసాగిస్తున్నామని వారు చెబుతారు. శాకాహారం తినడం వల్ల తామంతా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని బార్వాగడకు చెందిన మంగ్రా తానా భగత్ తెలిపారు. గ్రామ పాఠశాలలోనూ మధ్యాహ్న భోజనంలో పిల్లలకు గుడ్డుకు



బదులుగా పండ్లు ఇస్తున్నట్లు ఉపాధ్యాయురాలు అభిషికా తెలిపారు. అడవులు, పర్వతాలతో నిండిన ప్రాంతమైన లాతెహార్ జిల్లాలో పెంచే మేకలు నాణ్యమైన మాంసానికి చాలా ప్రసిద్ధి కావడం విశేషం.

ఈటీవీ భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

బీసీఏ పట్టభద్రుడి బండి.. తందూరీ సమోసావాలా!

బీసీఏ చదివి ప్రోగ్రామింగులో ప్రత్యేక శిక్షణ పొందిన మనేశ్వర్ చేస్తున్న ఉద్యోగం వదిలి సమోసావాలాగా మారారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా నగరంలో వీధిబండ్లపై తినుబండారాలు విక్రయించే ప్రాంతంలో 'బీసీఏ తందూరీ సమోసావాలా' అంటే చాలా ప్రసిద్ధి. దుర్గ్, రాయ్‌పుర్ నగరాల్లో కొంతకాలం ఉద్యోగం చేసిన మనేశ్వర్‌కు ఆ జీవితం సంతృప్తిని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో చేసిన ప్రత్యామ్నాయ ఆలోచనల నుంచి పుట్టిందే 'తందూరీ సమోసా'. భార్యాభర్తలు ఇద్దరూ తోపుడుబండిపై 2018లో ఈ వ్యాపారం ప్రారంభించారు.



సమోసాల నాణ్యత, రుచితో క్రమంగా ఆదరణ పెరిగి నేడు మనేశ్వర్ మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. "నా పనిని నేను ఆరాధనా భావంతో చూస్తా. రోజుకు 12 - 14 గంటలు కష్టపడినా భారమని అనిపించదు. వినియోగదారులు వ్యక్తం చేసే సంతృప్తి ముందు అన్నీ బలాదూర్" అంటారాయన.

పెయింట్ ది సిటీతో ధంతరీ సుందరీకరణ

ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ నగరంలో జిల్లా అధికార యంత్రాంగం, మున్సిపల్ కార్పొరేషను సిబ్బంది 'పెయింట్ ది సిటీ' పేరుతో వినూత్న సుందరీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో ఎంపికచేసిన గోడలను ఛత్తీస్‌గఢ్ సంస్కృతి, సామాజిక సందేశాలను చాటే సృజనాత్మక చిత్రాలతో తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు, యువత, పెద్దలు.. ఇలా అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా మారారు. వీరికి ఆయా ప్రాంతాల గోడల బాధ్యతను కేటాయించారు. ఆదివారంతో ఈ ప్రక్రియ ముగియగా.. అధికారుల ఆధ్వర్యంలో ఉత్తమ చిత్రానికి రూ.



21,000, ద్వితీయ ఉత్తమ చిత్రానికి రూ.15,000 నగదు బహుమతులను అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ అబినాష్ మిశ్ర తెలిపారు.

46 నుంచి 38కి తగ్గిన నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య

దిల్లీ: దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 1నాటికి 46గా ఉన్న నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కి తగ్గినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజా సమీక్షలో పేర్కొంది. వీటిలో 11 జిల్లాలు మాత్రమే వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నట్లు తెలిపింది. కేవలం 4 జిల్లాల్లో వామపక్ష తీవ్రవాదం ఆందోళనకరంగా ఉన్నట్లు వెల్లడైంది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమసింగ్‌భూమ్, మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్, మహారాష్ట్రలోని గడ్చిరోలి ఈ జాబితాలో ఉన్నాయి. వామపక్ష తీవ్రవాదంతో ప్రభావితమైన జిల్లాల సంఖ్య ఈ ఏడాది ఏప్రిల్‌లో 6గా ఉండగా ఇప్పుడు 3కు తగ్గినట్లు తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, నారాయణ్‌పుర్, సుక్మా జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. కాగా, వామపక్ష తీవ్రవాద సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2015లో 'నేషనల్ పాలసీ అండ్ యాక్షన్ ప్లాన్‌'ను ఆమోదించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి..

- తేజస్విని సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ ప్రకటించింది
- ఫలితాల తర్వాత పరస్పరం తలలు పగలగొట్టుకుంటారు
- బిహార్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ

ఆరా/నవాదా: బిహార్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్న ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య సంబంధాలు సవ్యంగా లేవని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్నారు. ఆర్జేడీ వ్యక్తులు ఆ పార్టీ తలపై తుపాకీ ఎక్కుపెట్టి తేజస్వీ పేరు ప్రకటించేలా చేశారని ఆరోపించారు. రెండు పార్టీల మధ్య విపరీతమైన ద్వేషం ఉందని, ఫలితాల తర్వాత ఒకరి తలలొకరు పగలగొట్టుకుంటారని తెలిపారు. జంగిల్‌రాజ్‌ను బిహార్ ప్రజలు మరిచిపోలేదని, ఎన్డీయే సుపరిపాలనకే వారు ఓటు వేస్తారని మోదీ



నవాదా సభలో మాట్లాడుతున్న మోదీ

ధీమా వ్యక్తంచేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరా, నవాదాలో జరిగిన సభల్లో ప్రధాని ఆదివారం పాల్గొన్నారు. ఈ సభల్లో విపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిహార్ ఎన్నికల్లో అధికార ఎన్డీయే ప్రభుత్వం రికార్డు స్థాయి విజయం సాధించడం ఖాయమని అన్నారు.

కాంగ్రెస్‌కు నిద్రలేని రాత్రులు

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేస్తున్నప్పుడు కాంగ్రెస్ రాజ కుటుంబానికి నిద్రపట్టలేదని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదులను దేశం నుంచి తరిమేస్తామని తాము వాగ్దానం చేశామని, ఆ హామీని నెరవేర్చుకున్నామని చెప్పారు. ప్రధాని పట్నాలో రోడ్ షో కూడా నిర్వహించారు.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

15 మంది మృతి

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌లోని ఫలోదీలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న ఓ ట్రక్కును టెంపో ట్రావెలర్ ఢీకొన్న ఘటనలో 15 మంది మృతిచెందారు. వారిలో 10మంది మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జోధ్‌పుర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులు బీకానేర్‌లోని కొలాయత్ ఆలయాన్ని సందర్శించి జోధ్‌పుర్‌కు తిరిగి వస్తుండగా.. భారత్ మాలా హైవేపై మతోడా గ్రామం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను జోధ్‌పుర్‌లోని సూర్‌సాగర్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ప్రధాని మోదీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధాని పరిహారం ప్రకటించారు.

రైలు బోగీ మొత్తం రక్తసిక్తం

- పది మంది ప్రయాణికులపై కత్తులతో దాడి
- బ్రిటన్‌లో రెచ్చిపోయిన దుండగులు

లండన్: బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌షైర్‌లో శనివారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. లండన్‌లోని డాన్‌కస్టర్ నుంచి కింగ్స్ క్రాస్‌కు వెళ్తున్న రైలులో దుండగులు కత్తులతో వీరంగం సృష్టించారు. 10 మందిని విచక్షణారహితంగా పొడిచారు. కత్తిపోట్ల ఘటనతో రైలు కంపార్ట్‌మెంట్లలో పెద్ద ఎత్తున ఆర్తనాదాలు, అరుపులు రావడంతో ఒక ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో కేంబ్రిడ్జ్‌షైర్ పోలీసులు తక్షణమే స్పందించి, హంటింగ్‌డన్ స్టేషన్‌లో రైలును నిలిపివేశారు. బాధితుల్లో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తొలుత కేంబ్రిడ్జ్‌షైర్ పోలీసులు తెలిపారు. అయితే చికిత్స అనంతరం వీరిలో నలుగురు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని, మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని వెల్లడించారు. దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.



కత్తిపోట్ల ఘటన అనంతరం రైలు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వీరిద్దరూ స్వదేశీయులేనని తెలిపారు. కౌంటర్ టెర్రరిజం పోలీస్ విభాగం కూడా దర్యాప్తులో భాగమైనట్లు బ్రిటిష్ ట్రాన్స్‌పోర్ట్ పోలీస్(బీటీపీ) అధికారిక ప్రకటనలో తెలిపింది. రైల్వే స్టేషన్ పరిసరాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి, రహదారిని అన్నివైపులా మూసివేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రైన్ సర్వీసులు నిలిపివేశారు. ఈ భయంకరమైన ఘటనపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, హోం మంత్రి షబానా మహమూద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



ఫిర్యాదు కాదు.. పరిష్కారం చెప్పండి

ఓ సమస్య గురించి ఫిర్యాదు చేయడం చాలా తేలిక. కానీ దానివల్ల పరిష్కారం దొరకదు. అందుకే ఫిర్యాదుకు బదులు మీరొక పని చేయండి. ఆ సమస్యకు కనీసం ఒక్క పరిష్కార మార్గాన్నైనా సూచించండి. ఆ సమస్య మిమ్మల్ని నిజంగా ఇబ్బంది పెడుతుంటే, మీరు అనివార్యంగా పరిష్కారాల కోసం అన్వేషిస్తారు. అలా చేయడం లేదంటే ఆ సమస్య అంత తీవ్రమైనది కాదని, మీరు దాని గురించి చింతించాల్సిన అవసరం లేదని అర్థం.

– ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్, నటుడు

వ్యాపారవేత్తల చేతి రిమోట్ కంట్రోల్‌గా మోదీ

- విశాలమైన ఛాతీ ఉంటే బలవంతులై పోరు
- ట్రంప్ అంటే ప్రధానికి భయం: రాహుల్

బెగూసరాయ్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే ప్రధాని మోదీ భయపడిపోతారని.. ఆయన బడా వ్యాపారవేత్తల చేతి రిమోట్ కంట్రోల్‌లాంటివారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగడియా జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. 'విశాలమైన ఛాతీ ఉన్నంతమాత్రాన బలవంతులైపోరు. మహాత్మాగాంధీని చూడండి.. బక్కపల్చగా ఉన్నా బ్రిటిష్‌వారిని గడగడలాడించారు. మోదీ తనకు 56 అంగుళాల ఛాతీ ఉందని గొప్పలు చెబుతారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేసేసరికి ఆయన భయ



బెగూసరాయ్‌లోని ఓ చెరువులో మత్స్యకారులతో కలిసి వలను లాగుతున్న రాహుల్‌గాంధీ

పడిపోయారు.. పాక్‌తో సైనిక ఘర్షణను రెండ్రోజులకే ముగించేశారు. అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు ఆయన ఓ రిమోట్ కంట్రోల్. మోదీ సర్కారు నిర్ణయాలైన జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు వంటివన్నీ చిన్నవ్యాపారులను నాశనంచేసి, బడా వ్యాపారులకు లబ్ధి కలిగించేవే'' అని రాహుల్ విమర్శించారు. బెగూసరాయ్ జిల్లాలో ఓ చెరువులో మత్స్యకారులతో కలిసి చేపల వేటలో రాహుల్ పాల్గొన్నారు.

పహల్గాంలో కేబుల్ కార్ పనులకు ఎన్ఐఏ సుముఖత

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో కేబుల్ కార్ ప్రాజెక్టు చేపట్టడానికి ఎలాంటి అభ్యంతరం లేదని 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) ఇటీవల జమ్మూకశ్మీర్ ప్రభుత్వానికి తెలిపింది. ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడిలో పహల్గాంలో



26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దానిపై దర్యాప్తును ఎన్ఐఏ చేస్తుండటంతో ఈ ప్రాజెక్టుకు ఆ సంస్థ ఆమోదాన్ని ప్రభుత్వం కోరింది. 1.4 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు.. పహల్గాంలోని యాత్రీనివాస్ వద్ద మొదలై, ఎగువన బైసరన్ వద్ద ముగుస్తుంది. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనులు 18 నెలల్లో పూర్తవుతాయి.

'డూమ్స్‌డే క్షిపణి'తో రష్యా సరికొత్త అణు జలాంతర్గామి!

మాస్కో: అణుశక్తితో నడిచే పొసైడన్ అణు డ్రోన్‌తో కూడిన కొత్త అణు జలాంతర్గామిని రష్యా ప్రారంభించింది. 'డూమ్స్‌డే క్షిపణి'గా కూడా ముద్రపడిన ఈ డ్రోన్. సాగరంలో సుదూర ప్రాంతాలు చేరి, తీవ్ర వినాశనం సృష్టించగలదు. ఖబారోవ్స్క్ అనే ఈ అణు జలాంతర్గామిని రష్యా రక్షణ మంత్రి ఆండ్రేయ్ బెలోవ్‌సోవ్ ప్రారంభించారు. సెవ్‌మాష్ నౌకానిర్మాణ కేంద్రం ఇందుకు వేదికైంది. నీటి అడుగున సంచరించే ఆయుధాలు, రోబోటిక్ వ్యవస్థలను ఈ సబ్‌మెరైన్ మోసుకెళ్లగలదని బెలోవ్‌సోవ్ ఈ సందర్భంగా తెలిపారు. సముద్ర సరిహద్దులు రక్షణతో పాటు ప్రపంచంలోని వివిధ మహాసాగరాల్లో తమ రష్యా ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఇది సాయపడుతుందని వివరించారు. ఇందులో



అణు ఇంధనంతో నడిచే సముద్ర డ్రోన్ 'పొసైడన్' కూడా ఉంటుందని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. దాన్ని గత వారం రష్యా పరీక్షించిందని తెలిపాయి. ఆధునిక టోర్పిడోలు, జలాంతర్గాముల కన్నా వేగంగా ఇది పయనించగలదని వివరించాయి. అలాగే సాగరంలో చాలా లోతులోకి, ఖండాంతర స్థాయి దూరాలు వెళ్లగలదని తెలిపాయి. పొసైడన్‌ను జలాంతర్గామి నుంచి ప్రయోగిస్తారని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గతవారం ప్రకటించారు. సబ్‌మెరైన్‌లోని అణు రియాక్టర్ కన్నా 100 రెట్లు చిన్నగా ఉండే రియాక్టర్‌తో ఇది పనిచేస్తుందన్నారు. దీన్ని డూమ్స్‌డే క్షిపణిగా రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రీ మెద్వెదేవ్ అభివర్ణించారు.

జేడీ(యూ) అభ్యర్థి అరెస్టు

పీకే మద్దతుదారుడి హత్యకేసు..

పట్నా: జన్‌సురాజ్ పార్టీ మద్దతుదారు దులార్‌చంద్ యాదవ్ హత్యకేసులో మాజీ ఎమ్మెల్యే, జేడీ(యూ) అభ్యర్థి అనంత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంత్ సింగ్ పట్నా జిల్లాలోని మొకామా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. దులార్ చంద్ హత్య నేపథ్యంలో పోలీసులు ఈయనపై నిఘా ఉంచారు. ఇదే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బార్హ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అరెస్టుచేశారు. అనంత్ సింగ్ అనుచరులు మణికాంత్ ఠాకుర్, రంజిత్ రామ్ అనే మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరికి పట్నా కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీని విధించింది. మొకామా నియోజకవర్గంలో గురువారం జన్‌సురాజ్ పార్టీ అభ్యర్థి పీయూష్ ప్రియదర్శి ప్రచారం చేస్తుండగా.. రెండు వర్గాల



అనంత్ సింగ్

మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అదే సమయంలో పీయూష్ మామ, పార్టీ కార్యకర్త దులార్ చంద్‌పై కొందరు దుండగులు కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోస్టుమార్టం ప్రకారం బుల్లెట్ తగిలినప్పటికీ.. షాక్ కారణంగానే ఆయన మృతి చెందినట్లు వెల్లడైంది.

హింసను సహించబోం: ఈసీ

దులార్ చంద్ హత్యపై ఎన్నికల సంఘం(ఈసీ) స్పందించింది. ఏ రకమైన హింసనూ సహించబోమని ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టంచేశారు. బిహార్‌లో ఓటర్లు స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటువేసే భరోసా కల్పిస్తామన్నారు. "ఎన్నికల సంఘానికి అధికారపక్షం, విపక్షం అన్న వివక్ష లేదు. అన్ని పార్టీలూ మాకు సమానమే. బిహార్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి'' అని ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఐఐటీ కాన్పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జ్ఞానేశ్‌కుమార్ కోరారు.

దేశాభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అవసరం

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

హరిద్వార్: మనదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మహిళల భాగస్వామ్యంతో పాటు అందరి సమష్టి కృషి అవసరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని పతంజలి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీలో 62% మంది విద్యార్థులు, కార్యక్రమంలోని గ్రాడ్యుయేట్లలో 64% మంది మహిళలే ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పతకాలు అందుకున్న విద్యార్థినుల సంఖ్య, పురుష విద్యార్థుల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. "ఇవి గణాంకాలు మాత్రమే కాదు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి చెందిన భారతదేశ పురోగతిని సూచిస్తుంది. పురాతన కాలంలో గార్గీ, మైత్రేయి, అపాలా, లోపముద్ర లాంటి మహిళలు కీలక మేధో, ఆధ్యాత్మిక పాత్రలు పోషించారు. ఈ గణాంకాలు ప్రాచీన సంప్రదాయం కొనసాగింపును సూచిస్తాయి. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందాలంటే మనకు కుమారులతో పాటు కుమార్తెల భాగ



పతంజలి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, బాబా రామ్‌దేవ్

స్వామ్యం అవసరం. కుమారులు కష్టపడి, కుమార్తెలు వెనకే ఉంటే అభివృద్ధి చెందిన దేశం అనే కల నెరవేరదు'' అని పేర్కొన్నారు. యోగా, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం ప్రోత్సాహానికి పతంజలి విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారాన్ని ముర్ము ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతికి అనుగుణంగా జీవనశైలిని అవలంబించాల్సిన ప్రాముఖ్యతను రాష్ట్రపతి నొక్కి చెప్పారు.

ట్రంప్‌ది టారిఫ్ టెర్రరిజం

పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను 'టారిఫ్ టెర్రరిజం'గా పతంజలి సహ వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్ విమర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితుల్లో దానిని ఆర్థిక యుద్ధంగా పేర్కొన్నారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలన్న విధానం ఆర్థిక యుద్ధానికి సరైన సమాధానం అవుతుందా? అన్న ప్రశ్నపై రామ్‌దేవ్ స్పందించారు. ట్రంప్ అనుసరించే సామ్రాజ్యవాద, విస్తారవాద పోకడలతో పోలిస్తే. . స్వదేశీ ఉద్యమం మెరుగైందన్నారు. సమష్టిగా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరమైందని చెప్పారు. "టారిఫ్ టెర్రరిజం అత్యంత ప్రమాదకరమైంది. ఇప్పుడు మూడో ప్రపంచ యుద్ధం అంటూ ఉంటే.. అది ఈ ఆర్థిక యుద్ధమే. దీనిలోనైనా.. కనీసం పేద దేశాలను జాగ్రత్తగా చూసుకోవాలి" అని ఆయన సూచించారు.

ఘర్షణల్లో నిమగ్నమయ్యేలా చేయడమే భారత్ వ్యూహం

పాక్ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలు



ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌పై పాకిస్థాన్ మరోసారి అక్కసు వెళ్లగక్కింది. తమ దేశం రెండు వైపులా ఘర్షణలతో మునిగిపోయేలా అఫ్గానిస్థాన్‌ను పావుగా చేసుకొని వ్యూహాలు పన్నుతోందని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆరోపించారు. తూర్పు, పశ్చిమ సరిహద్దుల యుద్ధాలతో పాక్ నిమగ్నమయ్యేలా భారత్ ప్రణాళికలు రచిస్తోందని ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో ఆరోపించారు. "అఫ్గాన్ మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ కాలం నుంచి పాక్‌పై భారత్ పరోక్ష యుద్ధం చేస్తోంది. అవసరమైతే వీటిని నిరూపిస్తాం. తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో పాక్ ఘర్షణలకు పాల్పడేలా ప్రయత్నిస్తోందని'' అని ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అఫ్గాన్-పాక్ మధ్య ఘర్షణలు ఆపేందుకు ఖతార్, తుర్కియేలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నెల 6న ఇరుదేశాల మధ్య మరోసారి చర్చలు జరగనున్నాయి.

దిల్లీ గాలి కాలుష్యంపై తక్షణమే చర్యలు తీసుకోండి

ప్రధాని మోదీ, సీఎం రేఖా గుప్తాలను కోరిన ప్రియాంకా గాంధీ

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. గత రెండు వారాలుగా అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించింది. ఆదివారం కూడా అలాంటి పరిస్థితే కన్పించింది. అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) వెల్లడించింది. కాలుష్య తీవ్రతపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, దిల్లీ సీఎం రేఖా గుప్తాను ట్యాగ్ చేస్తూ ఈ మేరకు 'ఎక్స్‌'లో పోస్టు పెట్టారు. బిహార్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం దిల్లీకి తిరిగి వచ్చిన ప్రియాంక.. దేశ రాజధానిని కాలుష్యం బూడిద రంగు కవచంలా కప్పివేయడం చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా.. నాయకులందరూ కలిసి దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ భయంకర పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకునే ఏ చర్యలకైనా



మద్దతు ఇవ్వాలని రాజకీయ నేతలను కోరారు. ఏటా దిల్లీ పౌరులపై ఈ విష వాయువులు తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు, పాఠశాలకు వెళ్లే పిల్లలు, వృద్ధులతో పాటు తాము కూడా ఈ విష వాయువునే పీల్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే జోక్యం చేసుకుని, చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు.

క్లౌడ్ సీడింగ్ 'క్రూరమైన జోక్': జైరాం రమేశ్

క్లౌడ్ సీడింగ్ కారణంగా ఒకటి లేదా రెండు రోజులు పరిమిత ప్రాంతంలో గాలి నాణ్యతలో స్వల్ప మెరుగుదల కనిపించిందన్న దిల్లీ ప్రభుత్వ ప్రకటనను 'క్రూరమైన జోక్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ఈ మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. శీతాకాలంలో గాలినాణ్యతను మెరుగుపరిచేందుకు క్లౌడ్ సీడింగ్‌తో ప్రయోజనం ఉండదని గతేడాది డిసెంబరులో కమిషన్ ఫర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, సీపీసీబీ, ఐఎండీ మొదలైన సంస్థలు స్పష్టమైన సలహా ఇచ్చాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం రూ.34 కోట్లు ఖర్చుచేయడం నాటకీయంగా కనిపిస్తుందన్నారు.

వీలైతే 6-8 వారాల పాటు దిల్లీని వదిలి వెళ్లండి

వాయు కాలుష్యంపై ఎయిమ్స్ మాజీ వైద్యుడి సలహా

దిల్లీ: దిల్లీ వాయు కాలుష్యంపై ఎయిమ్స్ మాజీ పల్మనాలజిస్ట్ గోపీచంద్ ఖిల్నాని దేశ రాజధాని వాసులకు కీలక సలహా ఇచ్చారు. వీలైతే 6-8 వారాల పాటు దిల్లీని వదిలి వెళ్లాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వీలైతే డిసెంబరు చివరి వరకు దిల్లీని విడిచిపెట్టాలని చెప్పారు. లేదంటే వాయు కాలుష్యం ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించారు. ఓ ఇంటర్వ్యూలో ఖిల్నాని ఈ వ్యాఖ్యలు చేశారు.



అగ్నిప్రమాదం కారణంగా కాలిపోయిన సూపర్ మార్కెట్, వాహనాలు

సూపర్ మార్కెట్‌లో భారీ పేలుడు.. 23 మంది మృతి

మెక్సికోలో ఘటన

మెక్సికో సిటీ: మెక్సికోలోని ఓ సూపర్‌మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. 12 మంది గాయపడ్డారు. శనివారం హెర్మోసిల్లోలోని వాల్డో సూపర్‌మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర గవర్నర్ అల్ఫోన్సో డురాజో ఈ ఘటనను ధ్రువీకరించారు. పేలుడు సంభవించిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విషపూరితమైన వాయువులను పీల్చుకోవడం కారణంగానే మరణాలు సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. పేలుడుకు గల స్పష్టమైన కారణం ఇంకా తెలియరాలేదు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ ఎక్స్ ద్వారా దీనిపై స్పందించారు. ఈ ప్రమాద ఘటన తనను కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

భాజపా ఎన్నికల ప్రచార అధ్యయనానికి విదేశీ దౌత్యవేత్తలు

దిల్లీ: బిహార్‌లో భాజపా ఎన్నికల ప్రచారాన్ని ప్రత్యక్షంగా గమనించి.. అధ్యయనం చేసేందుకు జపాన్, ఇండోనేసియా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, బ్రిటన్, భూటాన్, దక్షిణాఫ్రికాకు చెందిన విదేశీ దౌత్యవేత్తల బృందం సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభించిన 'భాజపా గురించి తెలుసుకోండి' అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రారంభమైన ఈ పర్యటన రెండురోజులు ఉండనుంది. దౌత్యవేత్తలు కొన్ని ముఖ్యమైన నియోజకవర్గాలను సందర్శిస్తారని, పార్టీ సీనియర్ నాయకులతో మాట్లాడి ఎన్నికల కార్యక్రమాలను గమనిస్తారని భాజపా విదేశీ వ్యవహారాల శాఖ ఇంఛార్జ్ విజయ్ చౌతైవాలే తెలిపారు. అయితే ఇదే బృందం గతంలోనూ గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం గమనార్హం.

ఝార్ఖండ్‌లో నవజాత శిశువులకు జనన ధ్రువీకరణ పత్రాల జారీ

జంశెద్‌పుర్: ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని చక్రధర్‌పుర్ డివిజన్ రైల్వే ఆసుపత్రిలో తొలిసారిగా నవజాత శిశువులకు ఆధార్ నమోదు చేసి వారి జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసినట్లుగా అధికారులు తెలిపారు. శనివారం అప్పుడే పుట్టిన నలుగురు శిశువులకు ఒకేరోజున ఈ ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. రైల్వే, జిల్లా పరిపాలన, పోస్టల్, ఆధార్ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం సాధ్యమైందన్నారు.

యువత అవకాశాలను హరిస్తున్న భాజపా, జేడీయూ ప్రభుత్వం: ఖర్గే

దిల్లీ: భాజపా, జేడీయూ కూటమి బిహార్ యువతకు అవకాశాలు లేకుండా చేసిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'బిహార్ యువత ఎక్కడికి వెళ్లినా తమ ప్రతిభతో గుర్తింపు పొందుతారు. రాష్ట్రాన్ని మాత్రం మార్చలేకపోతున్నారు. రెండు దశాబ్దాలుగా భాజపా, జేడీయూ ప్రభుత్వం యువత కలలను దోచుకుంటోంది. వారు కార్మికులుగానే మిగలాల్సిన పరిస్థితి వచ్చింది' అని 'ఎక్స్' పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో ఇద్దరి మృతి

మరో ముగ్గురికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌లోని నైరుతి ఒడెసా ప్రాంతంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు మృతిచెందారు. ఆదివారం తెల్లవారుజామున ఒడెసాలోని కారు పార్క్ స్థలంపై దాడి జరిగిన ఘటనలో ఇద్దరు మృతిచెందినట్లు, మరో ముగ్గురు గాయపడినట్లు స్థానిక గవర్నర్ ఒలేహ్ కిపెర్ వెల్లడించారు. జపోరిజియా ప్రాంతంపై ఎడతెగకుండా రష్యా జరిపిన డ్రోన్లు, క్షిపణుల దాడితో అక్కడి విద్యుత్ గ్రిడ్ దెబ్బతింది. దీంతో 60 వేల మంది పౌరులు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడినట్లు ప్రాంతీయ గవర్నర్ ఇవాన్ ఫెడ్రోవ్ తెలిపారు. పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ కోతలు కొనసాగాయన్నారు. మరోవైపు ఉక్రెయిన్ రష్యాపై నిర్వహించిన డ్రోన్ దాడిలో తౌప్సే పోర్టులో ఆ దేశానికి చెందిన ఓ చమురు ట్యాంకర్, ఇంధన టెర్మినల్ మంటల్లో చిక్కుకున్నాయి. పోర్టు ప్రాంతంలోని పలు భవనాలు, మౌలికసదుపాయాలనుకూడా ధ్వంసమయ్యాయి.


శ్వేతసౌధాన్ని సందర్శించనున్న సిరియా అధ్యక్షుడు!

10న ట్రంప్‌తో అల్ షరా భేటీ

వెస్ట్‌పామ్ బీచ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరాతో చర్చలు జరపనున్నారు. ఈ క్రమంలో అల్ షరా తొలిసారి శ్వేతసౌధాన్ని సందర్శించనున్నారు. ఈ సమావేశం ఈ నెల 10న జరగనుందని ఓ అధికారి అనధికారికంగా వెల్లడించారు. మే నెలలో సౌదీ అరేబియాలో ట్రంప్, అల్ షరా 25 ఏళ్లలో తొలిసారి భేటీ అయ్యారు. అసద్ కుటుంబ పాలన తర్వాత సిరియా మళ్లీ ప్రపంచంతో మమేకం కావడానికి ప్రయత్నాలు చేస్తోందని అధికారులు తెలిపారు.

హార్వర్డ్ మెడికల్ స్కూల్లో పేలుడు

బోస్టన్ : అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూల్లో పేలుడు ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిందేనని ఎఫ్‌బీఐ స్పష్టం చేసింది. ఈ పేలుడులో ఎవరూ గాయపడలేదని పేర్కొంది. శనివారం తెల్లవారుజామున బోస్టన్‌లోని హార్వర్డ్ మెడికల్ స్కూల్ భవనంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఫైర్ అలారం మోగడంతో విశ్వవిద్యాలయం పోలీసు అధికారులు వెంటనే స్పందించారు. అక్కడి నుంచి తప్పించుకున్న ఇద్దరు దుండగుల సీసీ టీవీ దృశ్యాలను విడుదల చేశారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ దర్యాప్తు ప్రారంభించింది.



అన్నపూర్ణ భర్తకు నైవేద్యాలకు కొదవా?

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని సీతా రామాలయంలో శని వారం రాత్రి గౌరీ పర మేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ స్థులు వివిధ రకాల పిండి వంటలు, మిఠా యిలు, పళ్లు, కొబ్బరి బొండాలు కలిపి 300 పళ్లాలతో సారెను ఊరేగించి, శివయ్యకు సమ ర్పించారు. —న్యూస్‌టుడే, కొత్తవలస

గురువు పాటవం.. గోడలూ చెబుతాయి పాఠం



పాఠాలు చెప్పి వదిలేయకుండా ఆయా అంశాలకు సంబంధించిన బొమ్మలను తరగతి గదిలో గోడలపై స్వయంగా వేస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గొరిట జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాచర్ల నరేందర్. 1998 నుంచి ఇప్పటివరకు ఆయన పనిచేసిన ఐదు బడులను ఇలా రంగులతో మార్చారు. తరగతి గదులు, వరండాల్లో పుస్తకాల్లోని అంశాలు, స్వాతంత్ర్య సమరయోధులు, మేధావుల బొమ్మలు వేశారు. ఇదంతా సెలవు రోజులు, పాఠశాల ముగిసిన తర్వాతే చేస్తారు. ఇప్పటివరకు రంగులకు దాదాపు రూ.2 లక్షలు వెచ్చించినట్లు ఆయన చెబుతున్నారు. —న్యూస్‌టుడే, తిమ్మాజీపేట





హిమగిరులకే చెమట పట్టించారు

ఉత్తరాఖండ్ రజతోత్సవాల్లో భాగంగా హిమగిరుల్లో నిర్వహించిన 'ఆది కైలాశ్ అల్ట్రా మారథాన్'లో 14,000 అడుగుల ఎత్తున, మైనస్ 2 డిగ్రీల ఉష్ణోగ్రత నడుమ అథ్లెట్లు పరుగు తీశారు. పిథౌరాగఢ్ జిల్లా పరిధిలో ఆదివారం జరిగిన ఈ మారథాన్‌లో దేశంలోని 22 రాష్ట్రాల నుంచి, విదేశాలకు చెందిన 800 మందికి పైగా అథ్లెట్లు పాల్గొని సరిహద్దు పర్యాటకం, మేలైన జీవనశైలి ప్రాధాన్యాన్ని చాటారు. కేంద్ర రోడ్డు రవాణాశాఖ సహాయ మంత్రి అజయ్ టంటా ఈ పరుగును ప్రారంభించారు. 20 నుంచి 65 ఏళ్ల వరకు వయసున్నవారు పాల్గొన్న ఈ కార్యక్రమం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగానూ గళమెత్తింది. భారత సరిహద్దు గ్రామాల సౌందర్యాన్ని చాటుతూ 60 కి.మీ.ల మేర జరిగిన ఈ మారథాన్ గుంజీ, కాలాపానీ ప్రాంతాల మీదుగా కొనసాగింది. పురుష, మహిళా విభాగ విజేతలకు రూ.2 లక్షల చొప్పున అందజేశారు. —ఈటీవీ భారత్

10 నెలల చిన్నారి ఇంటిని తీసుకొచ్చింది



పది నెలల చిన్నారి హన్సికను లక్కీడ్రా వరించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలిక పరిధి గణేశ్ నగర్‌లో రూ.16 లక్షల విలువైన 66 గజాల స్థలం, అందులో నిర్మించిన ఇంటిని రూ.500కే ఈ చిన్నారి సొంతం చేసుకుంది. ఆదివారం లక్కీడ్రా అనంతరం పాపను విజేతగా ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో హోటల్‌లో పనిచేసే శంకర్.. తన భార్య ప్రశాంతి, కుమార్తెలు సాయి రిషిక, హన్సికల పేరుతో నాలుగు కూపన్లు కొనుగోలు చేయగా.. అందులో హన్సికను అదృష్టం వెతుక్కుంటూ వచ్చిందని గుర్తించారు. ఈ స్థలం, ఇంటి యజమాని కంచర్ల రామబ్రహ్మం తనకు డబ్బు అవసరమై ఈ ఇంటిని అమ్మేందుకు వినూత్న పద్ధతిని అనుసరించారు. లక్కీడ్రాలో రూ.500కే రూ.16 లక్షల విలువైన స్థలం, ఇల్లు సహా పొందవచ్చని ప్రకటించారు. కూపన్లు అమ్మి నవంబరు 2న లక్కీడ్రా తీసి విజేతకు ఇంటిని, స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తానని ప్రకటించారు. ఆలోచన వినూత్నంగా ఉండడంతో అదృష్టాన్ని పరీక్షించుకుందామని 3,600 మంది కూపన్లు కొనుగోలు చేశారు. దీంతో రామబ్రహ్మంకు రూ.18 లక్షలు సమకూరాయి. లక్కీడ్రాలో హన్సిక ఎంపికైందని నిర్వాహకులు సెల్‌ఫోన్‌లో చెప్పగానే చిన్నారి తండ్రి శంకర్ ఎగిరి గంతేశారు. —న్యూస్‌టుడే, చౌటుప్పల్

స్పాంజ్‌లా దారులు.. హాయిగా నగరాలు!

నీటిని స్పాంజ్ పీల్చుకున్నట్లు వరదను రోడ్లే పీల్చుకుంటే..! ఈ నీరే భూగర్భంలో నిలిచి తిరిగి కరవు సమయంలో ఉపయోగపడితే..? చైనా రూపొందించిన 'స్పాంజ్ సిటీ' ఆవిష్కరణ సరిగ్గా ఇలాగే ఉంటుంది!!

భారీ వర్షాలు, తుపానులు, మెరుపు వరదలు.. భారీ ఆస్తి, ప్రాణ నష్టాన్ని మిగిల్చి వెళతాయి.. వర్షం తగ్గినా, వరద సృష్టించే బీభత్సం వేరు. పట్టణాల్లో అయితే రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోతాయి. గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా ప్రజల రోజువారీ జీవనం అస్తవ్యస్తమవుతుంది. దీనికి పరిష్కారంగా ఓ వినూత్న మార్గం కనిపెట్టారు చైనాకు చెందిన యు కాంగ్‌జియన్ అనే ప్రొఫెసర్. నగరాలను వరద నీటి నుంచి తప్పించేలా 'స్పాంజ్ సిటీ' అనే ఆలోచనకు శ్రీకారం చుట్టారు.

మూడు దశల్లో..

సంప్రదాయ పద్ధతుల్లో వరద నిర్వహణకు కాలువలు నిర్మిస్తారు. పైపులు ఏర్పాటు చేస్తారు. నదులు పొంగి పొర్లకుండా.. తీరం వెంబడి.. కాంక్రీట్ నిర్మాణం చేపడతారు. అయితే 'స్పాంజ్ సిటీ' దీనికి భిన్నం. దీన్ని మూడు దశల్లో నిర్మిస్తారు.


1. నగరంలో అనేక చెరువులను తవ్విస్తారు. నీటిని ప్రవాహంగా మారకముందే మొదట్లోనే నిలువరించడానికి ప్రయత్నిస్తారు.
2. వరద నీటి ప్రవాహాన్ని నెమ్మదింపజేస్తారు. సరళ రేఖల్లాంటి కాలువలకు బదులు... వంపులు తిరిగిన కాలువల ద్వారా నీరు వెళ్లేలా చేస్తారు. కాలువల వెంబడి చెట్లు కూడా నాటుతారు.
3. లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణం లేకుండా చూస్తారు. ఎందుకంటే వరద నీరు ఇక్కడి నుంచే చెరువులు, నదులు, సముద్రాల్లోకి పారుతుంది.

రోడ్లు ఇలా..

- వర్షం పడేటప్పుడు నీటిని పీల్చుకునే విధంగా నగరాల్లోని రోడ్లను నిర్మిస్తారు. అందుకు అనువైన మెటీరియల్‌ను రోడ్ల నిర్మాణంలో వాడతారు.
- వాటి కింద కంకరతో మరో పొరలా వేస్తారు. నీరు వీటి లోంచి కిందకు వెళ్లి.. భూగర్భ జలాల్లో కలుస్తుంది. ఎలాగైతే స్పాంజ్ నీటిని పీల్చుకుంటుందో.. రోడ్లు కూడా నీటిని అలానే పీల్చుకుంటాయి.
- రోడ్ల వెంట కాంక్రీట్ సైడ్ వాల్స్ స్థానంలో నీటిని పీల్చుకునే ఇటుకలను ఏర్పాటు చేస్తారు. వరద నీటి నిల్వ కోసం ప్రత్యేకమైన అండర్ గ్రౌండ్ టన్నెల్‌ను నిర్మిస్తారు.

వీటన్నిటి కలయిక...

రోడ్లు మాత్రమే కాదు..నీటిని ఒడిసిపట్టేందుకు రెయిన్ గార్డెన్స్, చెరువులు నిర్మిస్తారు. సులభంగా వర్షపు నీరు పారేందుకు ప్రత్యేకంగా కాలువలు నిర్మిస్తారు.



లాభాలెన్నో

- వరద ముంపు తీవ్రత తగ్గుతుంది. భూగర్భ జలాల పునరుద్ధరణ కారణంగా వేసవిలో నీటి కొరత ఉండదు.
- పచ్చదనం పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. గాలి నాణ్యత మెరుగవుతుంది. జీవ వైవిధ్యం పెరుగుతుంది.
- పార్కులు, పచ్చని ప్రదేశాలు పెరగడంతో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుంది.

ఏ దేశాల్లో అమలులో ఉంది?

- డెన్మార్క్ రాజధాని కోపెన్‌హెగెన్ ప్రపంచంలోనే 'స్పాంజ్ సిటీ' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసిన నగరంగా నిలిచింది. చైనాలోని వుహాన్, షాంఘై, బీజింగ్, షెన్‌జెన్ సహా.. 30కిపైగా నగరాల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు.
- సింగపూర్, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు సైతం వరదల నియంత్రణ కోసం స్పాంజ్ సిటీలను నిర్మిస్తున్నారు.

భారత్‌లో స్పాంజ్ సిటీలు ఎందుకు అవసరం?

- ఎన్‌డీఎంఏ నివేదిక ప్రకారం.. భారతదేశంలో 40 మిలియన్ హెక్టార్ల భూమి వరద ముప్పులో ఉంది.
- సీడబ్ల్యూసీ ప్రకారం.. దేశంలో 60శాతం ప్రాంతం వరదలకు గురయ్యే ఆస్కారముంది. ప్రకృతి విపత్తుల్లో 40శాతం వాటా వరదలదే.
- దేశంలో పట్టణీకరణ 45శాతం దాటింది. ఎక్కువ రోడ్లు, కాంక్రీటు భవనాలు ఉండడంతో నీరు నేలలోకి చొరబడడం లేదు.

- ఈనాడు, ప్రత్యేక విభాగం



పశ్చిమ కనుమల్లో జడలబర్రెలు!

హిమాలయ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే జడల బర్రెలు.. కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లోని చల్లని వాతావరణానికీ అలవాటు పడుతున్నాయి. కర్ణాటకలోని శిరసి నివాసి, జంతు ప్రేమికుడైన రాజేంద్ర శిర్సికర్ సేవలకు ముగ్ధులైన హిమాచల్‌ప్రదేశ్‌లోని వాసులు ఆయనకు మూడు జడల బర్రెలను బహూకరించారు. వాటిని రాజేంద్ర శిర్సికర్ దంపతులు శిరసిలో నడుపుతున్న పెట్‌ప్లానెట్ కేంద్రానికి తీసుకొచ్చారు. పదేళ్ల కిందట నెలకొల్పిన ఈ కేంద్రంలో వీధుల్లో ఆహారం కోసం తిరిగే మూగజీవాలు, రోడ్డు ప్రమాదాలు, విద్యుదాఘాతాలతో గాయాలకు గురైన పక్షులకు చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ అడవిపిల్లి, గుడ్లగూబ, పావురాలు, కుక్కలు, పిల్లులు, వివిధ రకాల పక్షులు, గుర్రాలున్నాయి. చికిత్స పూర్తయ్యాక వాటిని స్వేచ్ఛగా వదిలేస్తారు. రాజేంద్ర మాట్లాడుతూ, తమ కేంద్రంలో కొత్తగా 14 ఏళ్ల ఆడ జడల బర్రె, రెండేళ్ల మగ, పది నెలలున్న ఆడ జడల బర్రెలు చేరాయన్నారు. హిమాచల్‌ప్రదేశ్ వంటి చల్లని పర్వత ప్రాంతాల్లో నివసించే ఈ జడల బర్రెలు పశ్చిమ కనుమలున్న శిరసిలోని చల్లని వాతావరణానికి అలవాటు పడుతున్నాయని చెప్పారు. పచ్చిగడ్డి, ఇతర ఆహారాన్ని తినే వీటిని పోషించడం సులువేనని చెబుతున్నారు. —న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

ఫ్రిజ్ వంటగదిలో ఉందా..?



సాధారణంగా వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అయితే ఇళ్లలో చిన్నపాటి జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు ఎప్పుడైనా జరిగేందుకు ఆస్కారముంది. రిఫ్రిజిరేటర్లు, ఓవెన్‌లు, విద్యుత్తుతో నడిచే పరికరాలేవైనా సరే.. సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యంగా ఈ వస్తువులు వంట గదిలో ఉంటే ఇంకా అప్రమత్తంగా ఉండాలి. కొన్ని మెలకువలతో అగ్నిప్రమాదాలను నివారించొచ్చని అధికారులు వివరిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఉన్నాయా..?

- విద్యుత్తుతో నడిచే రిఫ్రిజిరేటర్లను, ఓవెన్‌లను కిచెన్‌లో ఉంచడం శ్రేయస్కరం కాదు. గ్యాస్ లీక్ అయినా.. షార్ట్‌సర్క్యూట్ జరిగినా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశముంటుంది. వాటిని గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేచోట ఉంచడం మేలు.
- ఎలక్ట్రిక్ వైర్లను కార్పెట్ల కింద, చాపలకింద పోనివ్వకండి. వాటిని తొక్కితే షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదముంది.
- ఒకే ఎలక్ట్రిక్ పాయింట్‌లో ఎక్కువ ప్లగ్‌లు పెట్టొద్దు. ప్లగ్ లేని వైర్ చివరలను సాకెట్‌లో ఉంచొద్దు.
- అధిక ఓల్టేజితో కూడిన విద్యుత్తు ఉపకరణాలకు ఎర్తింగ్ ఉన్న త్రీ పిన్ సాకెట్స్ తప్పనిసరిగా అమర్చాలి.
- ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ల ఛార్జింగ్ బెడ్ దగ్గర పెట్టొద్దు. షార్ట్‌సర్క్యూట్ లేదా వేడి కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదముంటుంది.
- విద్యుత్తు ఉపకరణాలకు నిప్పంటుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లతో ఆర్పొద్దు. అలా చేస్తే విద్యుదాఘాతంతో ప్రాణాపాయం కలగొచ్చు. వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి.
- ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే వారికి అధికమోతాదులో నీటిని ఇవ్వాలి.



విద్యుత్తుకు సంబంధించి ఎలాంటి సహాయానికైనా 1555333 కి కాల్ చేయొచ్చు.

వంటగదిలో ఇలా చేయాలి...

- వంట చేసేటప్పుడు నూనె బాణలిలో ప్రమాదవశాత్తు మంటలు రేగితే వెంటనే దాన్ని మూతతో కప్పివేయాలి.
- ఒకవేళ గ్యాస్ లీకైతే గాబరా పడొద్దు. అవకాశముంటే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపివేయాలి. అలా కుదరకపోతే తడిపిన గోనెసంచిని గాని, తడిబట్టను గాని మండుతున్న సిలిండర్‌పై వేయాలి. వెంటనే మంట ఆగిపోతుంది. అనంతరం వెంటనే గ్యాస్ సిలిండర్‌ను ఖాళీస్థలంలోకి తెచ్చి పెట్టాలి.
- గ్యాస్ లీకైన సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ లేదా ఆఫ్ చేయొద్దు. దేవుడిగదిలో దీపాలు, అగర్‌బత్తీలను ఆర్పివేయాలి. గాలి, వెలుతురు కోసం అన్ని కిటికీలను, దర్వాజాలను తెరవాలి.
- ఒకవేళ ఇంట్లో ఉన్నప్పుడు అగ్నిప్రమాదం జరిగి ఇల్లంతా పొగతో నిండిపోతే ముక్కుకు తడిగుడ్డ చుట్టుకొని నేల మీద పాకుతూ బయటికి రావాలి.



గ్యాస్‌కు సంబంధించిన ఏదైనా సహాయానికి 1906 నంబర్‌కు కాల్ చేయాలి.

- ఈనాడు, హైదరాబాద్



పిల్లలు నడిచేది మీరు చూపిన బాటలోనే..

మీరు అస్తమానం ఫోన్ చూస్తూ ఉంటే, మీ పిల్లలకూ అదే వ్యసనంగా మారుతుంది. మీరు పుస్తకాలు చదవడం, ఇల్లు శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం, కుటుంబ సభ్యులతో మనసారా ముచ్చటించడం చేస్తే, వారూ మిమ్మల్ని అనుసరించి వాటిని అలవర్చుకుంటారు. తల్లిదండ్రుల మాట పిల్లలు వినకపోవచ్చుకానీ, వారు చూపే బాటలో మాత్రం తప్పక నడుస్తారు.

– జెఫ్, పేరెంటింగ్ కోచ్

రహదారి మధ్యలో బిందు సేద్యం



కరీంనగర్ నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 563లో విభాగిని (డివైడర్) మధ్యలో నాటిన మొక్కలకు బిందు సేద్యం ద్వారా నిత్యం నీరందించేందుకు ప్రతి కిలో మీటరుకు 5 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు ప్లాస్టిక్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి శివారులో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులివి. జాతీయ రహదారుల నిర్మాణంలో వస్తున్న మార్పులకు ఇవి అద్దం పడుతున్నాయి. —న్యూస్‌టుడే, మానకొండూర్



కోదండ దండం కరే!

విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని రామనారాయణం ఆలయం ఇది. కార్తికమాసం సందర్భంగా ఆదివారం భక్తులు వెలిగించిన దీపాలతో కాంతులీనుతూ ఇలా దర్శనమిచ్చింది.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం



రాయిచేప అందం.. ముళ్లకప్ప చందం



విశాఖలోని రుషికొండ బీచ్ సమీప సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు విభిన్న రకాల జీవులు చిక్కాయి. ఆకర్షణీయంగా పసుపు తోక కలిగిన రాయి చేపలతో పాటు ములుగుపాములు, ముళ్లకప్పలు లభ్యమయ్యాయి. వీటిని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సముద్రం లోపల రాళ్లు, ఇసుకలో మనుగడ సాగించే ఈ జీవులు ఆహార అన్వేషణలో భాగంగా పైకి వచ్చే సందర్భాల్లో వలలకు చిక్కుతాయని జాలర్లు చెబుతున్నారు. తమకు ఉపయోగం లేని పాములు, కప్పలను మత్స్యకారులు తిరిగి సముద్రంలోకి విడిచిపెట్టారు. – న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

80 ఏళ్ల టీచరమ్మ.. నెట్టింట్లో పద్య కవితాసేవ



ఆమె కవయిత్రి కాదు.. రచయిత్రి కూడా కాదు. అయితేనేం 80 ఏళ్ల వయసులో మలయాళ పద్య కవితా వైభవాన్ని భావితరాలకు అందించేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ పొందిన ఎర్నాకుళం జిల్లావాసి సరసమ్మ యూట్యూబ్ తదితర ఆన్‌లైన్ వేదికల ద్వారా మలయాళ భాషాభిమానులకు ఈ సేవలు అందిస్తున్నారు. ఆమె యూట్యూబ్ ఛానల్ 'కవితారామం'ను 1,30,000 మంది అనుసరిస్తున్నారు. "75 మందికి పైగా గాయకులు మా ఛానల్‌లో పద్యాలు పాడటంతో మరింత పేరొచ్చింది. ప్రసిద్ధ మలయాళ కవుల నుంచి తీసుకొన్న కవితలు, పద్యాలు ఇందులో ఉంటాయి" అని ఆమె వివరించారు. సరసమ్మ భర్త పి.ఎస్.కేశవన్ నాయర్.. భార్య చేస్తున్న భాషాసేవకు అండగా నిలుస్తున్నారు. —ఈటీవీ భారత్

వాళ్లు చెప్పరు.. వీళ్లు పట్టించుకోరు!

ప్రైవేటు ఆలయాలపై నిర్వాహకులు, దేవాదాయ శాఖ తీరు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థల నిర్వహణలో పెద్ద సంఖ్యలో ఆలయాలు ఉన్నా.. వాటిపై దేవాదాయ శాఖ అజమాయిషీ ఉండటంలేదు. ప్రత్యేక పర్వదినాలు, పూజల సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని సమాచారం నిర్వాహకులు అధికారులకు తెలపడం లేదు. ఆయా రోజుల్లో అక్కడ ఏం జరుగుతోందని పర్యవేక్షించాల్సిన దేవాదాయశాఖ పట్టనట్లు వ్యవహరిస్తోంది. కాశీబుగ్గ తరహా ఘటనలు ఏదైనా చోటుచేసుకున్నప్పుడు మాత్రమే ఆ శాఖ కొంత హడావిడి చేస్తోంది. ఆ తర్వాత మళ్లీ పట్టించుకోవడంలేదు.

రాష్ట్రంలో దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, చౌల్ట్రీలు, మఠాలు కలిపి 27,103 ఉన్నాయి. ప్రైవేటు ఆలయాలు ఎన్ని ఉన్నాయో దేవాదాయ శాఖకు తెలియకపోవడం గమనార్హం. శాఖ పరిధిలో ఉన్న వాటిపై వివిధ స్థాయిల అధికారులు, ఆలయాల ఈఓల పర్యవేక్షణ, నియంత్రణ ఉంటుంది. ప్రైవేటు ఆలయాల్లో ఇటువంటివేమీ ఉండవు. ఇలా అధికారుల నియంత్రణ లేనివి రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్నాయి. పైగా ఆయా ఆలయాలకు ప్రత్యేక పర్వదినాల సమయంలో పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్నారు. వారికోసం క్యూలైన్లు, బారికేడ్లు, విశ్రాంతి గదులు, తాగునీరు సదుపాయం కల్పించాలి. ఏర్పాట్లపై అధికారులకు అవగాహన ఉంటుంది. భక్తుల నియంత్రణకు పోలీసుల అవసరం. ఇవేవీ తెలియని నిర్వాహకులు దేవాదాయ, పోలీసు, రెవెన్యూ శాఖలకు సమాచారం ఇవ్వడం లేదు.

ఎందుకు పట్టించుకోవడం లేదు?

ఏదైనా ప్రైవేటు ఆలయం గురించి పెద్దఎత్తున ప్రచారం జరిగినప్పుడు భారీ సంఖ్యలో భక్తులు వస్తారనేది అధికారులకు అవగాహన ఉంటుంది. అటువంటి సమయంలో అప్రమత్తం కావాలి. నిర్వాహకులు సమాచారం ఇవ్వకపోయినా.. దేవాదాయ శాఖ అధికారులే జోక్యం చేసుకుని, ఏర్పాట్లు పర్యవేక్షించాలి. దేవాదాయశాఖ పరిధిలో ఉండే ఆలయాలు, సంస్థల నిర్వహణ, అధికారుల విధులు.. తదితరాలపై 1987లో అమల్లోకి వచ్చిన చట్టం 30లో నిబంధనలు ఉన్నాయి. ప్రైవేటు ఆలయంలో ప్రజలు దానధర్మాలుగా ఇచ్చిన సొమ్ము దుర్వినియోగం జరిగిందనే ఫిర్యాదులు వస్తే మాత్రం దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకొని విచారణ చేపట్టొచ్చు. అలాంటప్పుడు ఏర్పాట్లపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

పర్యవేక్షణ అవసరం..

- ఏ ఆలయానికైనా దేవాదాయశాఖ పర్యవేక్షణ అవసరం.
- ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఆధీనంలోని ఆలయాలు సైతం.. దేవాదాయశాఖలో రిజిస్టర్ చేయించుకోవాలనే నిబంధన తీసుకురావాలి.
- దీనివల్ల నిర్వాహకులు, అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు చేసే అవకాశం ఉంటుంది. ఆ ఆలయ పరిధిలో ఏం జరుగుతోంది? ఏటా పెరుగుతున్న భక్తుల సంఖ్యపై అవగాహన ఉంటుంది. అప్పుడు తగిన చర్యలకు వీలవుతుంది.

తొక్కిసలాటల్లో బయటపడాలంటే..

ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన తర్వాత ఆర్సీబీ విజయోత్సవంలో బెంగళూరులో తొక్కిసలాట, తమిళనాడులోని కరూర్‌లో టీవీకే పార్టీ అధినేత విజయ్ రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట.. ఇవి ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనమయ్యాయి. తాజాగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన ఘటన మరోసారి ఉలిక్కిపడేలా చేసింది. తొక్కిసలాట జరిగినప్పుడు ప్రాణనష్టం ఎక్కువగా ఉండటానికి పలు కారణాలున్నాయి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ ప్రమాదాల నుంచి బయటపడొచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇలా ఎందుకంటే?

భారీ ర్యాలీలు, రాజకీయ యాత్రలు, సమావేశాలు, సినిమా థియేటర్ల వద్ద తొక్కిసలాటలు జరుగుతుంటాయి. ఆలయాల్లో ప్రత్యేక సందర్భాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రద్దీలో ఆందోళనకు గురైన భక్తులు హడావుడి చేసినప్పుడు, వదంతులు వ్యాపించి భక్తులు పరిగెత్తేటప్పుడు జరిగే తొక్కిసలాటలు ప్రాణాలు తీస్తున్నాయి. కొన్నిసార్లు వాతావరణ పరిస్థితుల వల్ల ఆక్సిజన్ తక్కువగా ఉండటం, ఉక్కపోతతోనూ ప్రాణనష్టాలు జరుగుతాయి.

రద్దీలో ఇలా సిద్ధమైతేనే

- రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- ముందుగా ప్రవేశ, తిరిగి వెళ్లే మార్గాలు, ఎమర్జెన్సీ గేట్లు ఎక్కడున్నాయో గుర్తుపెట్టుకోవాలి
- గుంపులు ఉన్నచోట జనాల మధ్యలో కాకుండా, చివరకు ఉండేలా చూసుకోవాలి.
- రద్దీగా ఉన్న క్యూలైన్లలో వెళ్లాల్సి వచ్చినప్పుడు బరువైన బ్యాగులు, హ్యాండ్‌బ్యాగ్‌లు మోసుకెళ్లొద్దు.
- చిన్నపాటి బ్యాటరీ ఫ్యాన్లు, లేదా విసన కర్ర, పేపరు వంటివి చేతుల్లో ఉంటే క్యూలో ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం ఇస్తాయి.

తొక్కిసలాటలో చిక్కుకుంటే

- భయపడితే ఆందోళనతో నియంత్రణ కోల్పోతాం. జనాలకు వ్యతిరేక దిశలో వెళ్లే ప్రయత్నం చేయకూడదు
- చేతులను ఛాతీ ముందు అడ్డుగా పెట్టుకుని గుండెకు ఒత్తిడి తగలకుండా కాపాడుకోవాలి.
- తొక్కిసలాట సమయంలో కింద పడకుండా చూసుకోవాలి.. అదే ముఖ్యం.
- పడిపోతే తలకు చేతులు అడ్డుపెట్టుకుని, మోకాళ్లు వంచి శరీరాన్ని గుండ్రంగా చుట్టుకోవాలి.
- గోడలు, రెయిలింగ్, ఫెన్సింగ్‌ల దగ్గరికి వెళ్లకూడదు. అక్కడ తోపులాటకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

ప్రథమ చికిత్స చేయండి ఇలా

- అస్ఫిక్సియాతో శ్వాస అందకపోతే గుండెపై ఒత్తి... సీపీఆర్ చేయాలి
- గాయాలు తగిలితే శుభ్రమైన వస్త్రంతో రక్తస్రావం ఆపాలి.
- మూర్ఛ, అస్వస్థత ఉంటే అలాంటివారిని ఒక పక్కకు తిప్పి (రికవరీ పొజిషన్)లో ఉంచితే శ్వాస సులభంగా తీసుకుంటారు. గాలి తగిలే ప్రదేశంలో ఇది చెయ్యాలి.
- ఎముకలు విరిగినట్లు అనిపిస్తే కదల్చకుండా అదే స్థితిలో ఆసుపత్రికి తరలించాలి.

మరణాలకు ప్రధాన కారణం ఇదే

తొక్కిసలాటల్లో ఎక్కువమంది చనిపోవడానికి ప్రధాన కారణం అస్ఫిక్సియానే. అంటే ఊపిరి ఆడకుండా ఉక్కిరిబిక్కిరి అయినప్పుడు తలెత్తే పరిస్థితి. శరీరంపై తీవ్రమైన ఒత్తిడి పడి శ్వాస అందకపోతే కాసేపట్లోనే ప్రాణాలు కోల్పోతారు. కదలడానికి వీల్లేకుండా ఒత్తిడికి గురైనప్పుడు శ్వాసకు సంబంధించిన డయాఫ్రమ్ అనే కండరంపై ఒత్తిడి పడి ఊపిరితిత్తుల్లోకి ఆక్సిజన్ వెళ్లదు. అప్పుడే అస్ఫిక్సియాకి గురై కార్బన్ డయాక్సైడ్ పెరిగిపోయి ఒక్కసారిగా బ్రెయిన్ డెడ్ అవుతుంది. పురుషులతో పోల్చితే అస్ఫిక్సియా పరిస్థితి మహిళల్లో ఎక్కువ.

- ఈనాడు, విశాఖపట్నం

ఆలయాల్లో ఏర్పాట్లు అంతంత మాత్రమే..

- రద్దీకి తగినట్లు లేని వరుస మార్గాలు
- ప్రమాదాలకు దారితీస్తున్న నిర్లక్ష్యం

ఈనాడు, విశాఖపట్నం: మొక్కకు రక్షణ కోసం ఇనుప కంచె ఏర్పాటుచేస్తాం. మొక్క మానైనప్పుడు ఆ ఇనుప కంచే దానికి అడ్డొస్తుంది. అలాగే ఆలయాల్లో క్యూలో పంపేందుకు, భక్తుల రక్షణ కోసం రెయిలింగ్‌లు, బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నారు. కొన్నిచోట్ల ఇవి ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో భక్తుల రద్దీ పెరిగినప్పుడు అవే అడ్డుగా మారి ప్రాణాంతకమవుతున్నాయి.

- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి వెళ్లి, తిరిగి రావడానికి ఒకే మెట్లమార్గం ఉంది. 12 అడుగుల ఎత్తులో ఉన్న ఈ మార్గం మధ్యలో.. క్యూ పద్ధతి కోసం స్టీల్ రెయిలింగ్ ఏర్పాటుచేశారు. తొక్కిసలాట జరగ్గానే ఆ రెయిలింగ్ విరిగి దానికింద కొందరు ఇరుక్కుపోగా, మరికొందరు 12 అడుగుల ఎత్తు నుంచి కిందికి పడిపోయారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 30 తెల్లవారుజామున విశాఖ జిల్లా సింహాచలం అప్పన్న చందనోత్సవం వేళ ఏడుగురు భక్తులు మృతిచెందారు. కొత్తగా కట్టిన మెట్లమార్గంలోని గోడ వర్షపునీరు, ఈదురు గాలులకు కూలి వరుసలో ఉన్న భక్తులపై పడింది. క్యూ మధ్యలో బారికేడ్లు, ఫెన్సింగ్ తీగలు ఏర్పాటుచేశారు. గోడ కూలేటప్పుడు ఫెన్సింగ్‌ల కింద చిక్కుకుని బయటకు రాలేక ప్రాణాలు విడిచారు.

నిర్మాణంలో లోపాలే.. శాపాలుగా

ప్రధాన ఆలయాల్లో పర్వదినాల సమయంలో భక్తుల రద్దీకి తగ్గట్లు ముందస్తు ఏర్పాట్లు ఉండాలి. అలాంటప్పుడు వెడల్పైన మార్గాలు ఏర్పాటు చేయట్లేదు. ఫెన్సింగ్‌లు, గ్రిల్స్, బారికేడ్ల ఏర్పాట్లలో లోపాలుంటున్నాయి. భక్తుల క్యూమార్గంలో రెయిలింగ్‌లు, బారికేడ్ల లాంటివి అనుభవం ఉన్నవారితో ఏర్పాటుచేయించాలి. భక్తుల కోసం ఏర్పాటుచేసిన రెయిలింగ్ పేలవంగా ఉందని కాశీబుగ్గ ఘటనలో తెలుస్తోంది. మార్గం చిన్నదిగా ఉన్నచోట బారికేడ్లను అడ్డుగా పెట్టి ఎక్కువ క్యూలైన్లు ఏర్పాటుచేయడంతో భక్తులు తోసుకునే క్రమంలో తొక్కిసలాటకు దారితీస్తోంది. కొన్ని ఆలయాల్లో తాత్కాలిక, పాత రెయిలింగ్‌లు బలహీనంగా ఉండి భక్తుల రద్దీని తట్టుకోలేవు. అత్యవసర సమయంలో రెయిలింగ్‌లు విరిగిపోతే భక్తులు కిందపడి ప్రమాదం జరిగే అవకాశాలెక్కువ.



పంట నష్టం జాబితాలపై సామాజిక తనిఖీ

ఈనాడు, అమరావతి: పంటనష్టం నమోదు జాబితాలను గ్రామస్థాయిలో సామాజిక తనిఖీకి సిద్ధంగా ఉంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ మండల వ్యవసాయ అధికారుల్ని ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలు జాబితాలో ఉండాలని, వారి నుంచి వినతులు తీసుకోవాలని సూచించారు.

దుబాయ్‌కి మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: మూడు రోజుల దుబాయ్ పర్యటనకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణతోపాటు పలువురు అధికారులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. విశాఖలో నిర్వహించే భాగస్వామ్య పెట్టుబడుదారుల సదస్సుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నారు.

లండన్ చేరుకున్న మంత్రి దుర్గేష్

ఈనాడు, అమరావతి: మూడు రోజుల విదేశీ పర్యటనకు వెళ్లిన రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం లండన్ చేరుకున్నారు. విమానాశ్రయంలో లండన్‌లోని జనసేన పార్టీ కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలికారు. ఈనెల 4 నుంచి అక్కడ నిర్వహించనున్న ప్రపంచ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 సదస్సులో ఆయన పాల్గొననున్నారు.

4న తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జగన్ పర్యటన

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైకాపా అధినేత జగన్ ఈ నెల 4న పర్యటించనున్నారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, పెనమలూరు, పామర్రు, పెడన తదితర నియోజకవర్గాల్లో పర్యటించి, రైతులను పరామర్శిస్తారు. ఈ మేరకు ఆ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది.

గుంటూరులో బయటపడ్డ కుళ్లిన మాంసం

తనిఖీల్లో 40 కేజీల పట్టివేత



నాణ్యత లేని మాంసాన్ని బయటకు తీయిస్తున్న ప్రకాశ్‌నాయుడు తదితరులు

గుంటూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: గుంటూరులో కుళ్లిన, నిల్వ ఉంచిన మాంసం భారీగా బయటపడింది. నగరంలోని పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డు, డొంక రోడ్డు, అమరావతి రోడ్డు, పాతమటన్ మార్కెట్ తదితర ప్రాంతాల్లోని మాంసం విక్రయ దుకాణాల్లో మాంసం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్‌నాయుడు, జీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 6 దుకాణాల్లో ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన, కుళ్లిన 40 కేజీల మాంసం పట్టుబడింది. ఈ సందర్భంగా విక్రయదారులపై ప్రకాశ్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లోపించిన మాంసం విక్రయాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్య విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు చేసి, మాంసం నాణ్యతపై రాజీలేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాంసం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రవీణ, మీట్ కార్పొరేషన్ ఎండీ సుబ్బరత్నమ్మ, అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోందని, దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనను వక్రీకరించి కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేశారని, ఆ పోస్టులను తీవ్రంగా పరిగణించి లొకేషన్ ఆధారంగా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు.

బాధితులకు నేతల పరామర్శ



ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తదితరులు

పలాస, కాశీబుగ్గ, శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాశీబుగ్గ ఆలయ తొక్కిసలాట దుర్ఘటన క్షతగాత్రులను ఎన్డీయే, విశ్వహిందూ పరిషత్తుతోపాటు వివిధ పార్టీల నాయకులు ఆదివారం పరామర్శించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, భాజపా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు బాధితులతో మాట్లాడి వారికి భరోసానిచ్చారు.

సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి: బొత్స

వైకాపా నేతలు.. శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కె.కన్నబాబు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు బాధితులను పరామర్శించారు. బొత్స మాట్లాడుతూ 'అది ప్రైవేటు ఆలయం, మేమేం నిర్ణయం తీసుకుంటాం' అని అనంతపురంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఘటనపై సిటింగ్ జడ్జి లేదా విశ్రాంత న్యాయమూర్తితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వైకాపా తరఫున రూ.2 లక్షల నష్టపరిహారం మాజీ సీఎం జగన్ ప్రకటించినట్లు తెలిపారు.



పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం, కె.కన్నబాబు, సీదిరి అప్పలరాజు

సచిన్‌ను కలిసిన లోకేశ్ దంపతులు



సచిన్‌తో మంత్రి లోకేశ్, బ్రాహ్మణి



జైషా, ఆయన తల్లి సోనల్ షాలతో మంత్రి లోకేశ్, బ్రాహ్మణి

ఈనాడు, అమరావతి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఆదివారం క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను కలిశారు. "ఇది ఫ్యాన్ బాయ్ క్షణం. ఈ రోజు లెజెండ్‌ను కలిసే అదృష్టం లభించింది. ఆయన వినయం, ఆప్యాయతల గురించి ఇప్పటి వరకూ వినడమే. నేడు స్వయంగా చూశాను. తరతరాలకు ప్రేరణగా నిలిచిన క్రికెట్ దేవుడు ఆయన" అని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సచిన్‌తో దిగిన చిత్రాల్ని పంచుకున్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న మహిళా ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు లోకేశ్ దంపతులు కుమారుడు దేవాంశ్‌తో కలిసి నవీ ముంబయి వెళ్లారు. అక్కడ సచిన్‌ను కలిశారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్ జైషా, ఆయన తల్లి సోనల్ షాలను కలుసుకున్న లోకేశ్.. "బ్రాహ్మణితో కలిసి ఈ ఆత్మీయ క్షణాల్ని పంచుకోవడం ఆనందంగా ఉంది. వారితో 'క్రికెట్, యువత భాగస్వామ్యం, క్రీడల భవిష్యత్తు' గురించి మాట్లాడాను" అని పోస్టు చేశారు.



స్టేడియంలో జాతీయ జెండాతో మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, దేవాంశ్

జాతీయ రహదారి 2 నెలలకే.. రెండు ముక్కలు!



మైదుకూరు పురపాలక పరిధి పుల్లయ్యస్వామి సత్రం వద్ద పగుళ్లిచ్చిన రోడ్డు

కొత్తగా వేసిన రోడ్డుపై రాకపోకలు ప్రారంభించి రెండు నెలలైనా కాలేదు. అప్పుడే పగుళ్లిచ్చింది. దీంతో వివిధ సాకులతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. కృష్ణపట్నం నుంచి హుబ్బళ్లి మీదుగా వెళ్లే 67వ నంబరు జాతీయ రహదారికి మరమ్మతుల్లో భాగంగా ఇటీవల తారు వేశారు. మైదుకూరు-బద్వేలు సెక్షన్ పరిధిలో చాపాడు మండలం విశ్వనాథపురం సమీపం నుంచి గడ్డంవారిపల్లె వరకు ఈ రహదారి రెండుగా పగుళ్లిచ్చింది. కొన్నిచోట్ల 500 మీటర్ల వరకూ చీలికలు ఉన్నాయి. మైదుకూరు పట్టణం పుల్లయ్యస్వామి సత్రం వద్ద పగుళ్లు ఎక్కువ ఉండటంతో గుత్తేదారు ప్రతినిధులు రాకపోకలు నిలిపివేశారు. ఈ విషయంపై ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇంజినీర్ సాయిరెడ్డిని వివరణ కోరగా 400 కేవీ తీగలు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిపివేసినట్లు చెప్పుకొచ్చారు. చీలికలు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. గుత్తేదారు ప్రతినిధి జయప్రసాద్ స్పందిస్తూ రహదారిని 15 ఏళ్లపాటు నిర్వహించాల్సి ఉందని, సమస్య ఉంటే మరమ్మతులు చేస్తామన్నారు.- న్యూస్‌టుడే, మైదుకూరు



ప్రశ్నిస్తేనే జ్ఞానం వృద్ధి చెందుతుంది

మీకు బోధించిన ప్రతి విషయాన్నీ విమర్శనాత్మక ధోరణితో ప్రశ్నించినప్పుడే మీ జ్ఞానం వృద్ధి చెందుతుంది. అప్పుడే మీరు ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరడం సాధ్యమవుతుంది. అలా కాకుండా మీకు నేర్పిన ప్రతి విషయాన్నీ గుడ్డిగా విశ్వసిస్తూ తర్కానికి దూరంగా ఉండిపోతే మీరు పతనావస్థకు చేరుకుంటారు.

– జాన్ బ్రోసియో, కంటెంట్ క్రియేటర్

రాకాసి అల.. మృత్యు వల

- మైపాడు బీచ్‌లో ముగ్గురు యువకుల దుర్మరణం
- తుమ్మలపెంట తీరంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మైపాడు బీచ్‌లో మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట, కావలి, ఆత్మకూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జిల్లా పరిధిలోని తీర ప్రాంతాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా, చెరువులో పడి మరొకరు గల్లంతయ్యారు. నెల్లూరు కోటమిట్టకు చెందిన హుమయున్(17), సమీద్(17), నారాయణరెడ్డిపేటకు చెందిన తాజిమ్(16) ముగ్గురు స్నేహితులు. వీరంతా ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మధ్యాహ్నం మైపాడు బీచ్‌లో సేదతీరేందుకు వచ్చారు. తీరం వద్ద సరదాగా ఆడుతుండగా ఒక్కసారిగా మీదకు రాకాసి అలలు వచ్చాయి. ఒకరినొకరు కాపాడుకోవాలనే క్రమంలో మునిగిపోతూ రక్షించమని కేకలు వేశారు. మెరైన్ పోలీసులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. విగత జీవులుగా మారిన యువకులను ఒడ్డుకు చేర్చారు. మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నాగార్జున తెలిపారు.

★ సముద్రంలో చేపలు పడుతూ అదుపుతప్పి పడడంతో మత్స్యకారుడు కాటంగారి బ్రహ్మయ్య(34) మృతి చెందారు. కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ పెద్దరాముడుపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులతో కలసి పడవలో బోగోలు మండలం జువ్వలదిన్నె హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన బ్రహ్మయ్య ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

★ ఆత్మకూరుకు చెందిన నలిశెట్టి మహేష్(30) అనే యువకుడు స్థానిక చెరువులోకి ఈత కోసం దిగగా, లోతు ఎక్కువగా ఉండటంతో అదుపుతప్పి పడిపోయారు. సమీపంలోని అయ్యప్ప స్వామి భక్తులు కాపాడేందుకు ప్రయత్నించినా.. గల్లంతయ్యారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలులో బీసీ భవన నిర్మాణానికి ఎంపీలాడ్స్ నుంచి రూ.కోటి కేటాయింపు: ఆర్.కృష్ణయ్య



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో అసంపూర్తిగా ఉన్న బీసీ భవనం నిర్మాణానికి తన ఎంపీ లాడ్స్ నుంచి రూ.కోటి ఇస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టేలా కృషి చేయాలని కోరతామన్నారు. ఈ బిల్లు ప్రధాని మోదీ వల్లే సాధ్యం అవుతుందన్నారు. జనాభా గణనలో కులగణన కూడా చేపట్టాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, ఎన్డీయే ప్రభుత్వం మాత్రం సానుకూలంగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ వృత్తుల వారికి రాయితీ రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

10,147 కిలోల గంజాయి దహనం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



గంజాయిని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ శంఖబ్రతబాగ్చీ తదితరులు

విశాఖపట్నం (కొమ్మాది), న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంతకాలంగా పట్టుబడిన 10,147.59 కిలోల గంజాయి, 19.310 లీటర్ల యాష్ ఆయిల్, కిలో నల్లమందు (ఓపీయం)ను కాపులుప్పాడ డంపింగ్‌యార్డు వద్ద ఆదివారం దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీపీ గుప్తా మాట్లాడుతూ తాజాగా పట్టుబడిన గంజాయికి సంబంధించి 533 కేసుల్లో 1,435 మంది నిందితులు ఉన్నారని వెల్లడించారు. వీరిలో 712 మంది విశాఖ జిల్లాకు చెందిన వారుకాగా.. 332 మంది ఇతర జిల్లాల వారు, 391 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.5.21 కోట్లు ఉంటుందన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు దానిని దహనం చేస్తున్నట్లు వివరించారు. గంజాయిని అరికట్టే చర్యలను తీవ్రం చేయడంలో భాగంగా నిషేధిత మత్తు పదార్థాల వ్యాపారం చేసే వారి ఆస్తులను సైతం జప్తు చేసేలా చట్టాలు తీసుకొచ్చి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మందికి పైగా కఠిన శిక్షలు విధించామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నిల్వ, రవాణాపై టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేసి తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీజీపీ తెలిపారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 83 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

2025లో లక్షకు పైగా టెక్ ఉద్యోగాల కోత

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకు టెక్ పరిశ్రమలో 218 కంపెనీలు లక్ష మందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్.ఎఫ్వైఐ గణాంకాలు చెబుతున్నాయి. కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, లాభదాయకత వంటి అంశాలపై కంపెనీలు దృష్టిపెడుతుండటం వల్లే సిలికాన్ వ్యాలీ నుంచి బెంగళూరు వరకు ఉద్యోగాల కోతలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇంటెల్ అత్యధికంగా 24,000 ఉద్యోగాల కోతలు విధించింది. కంపెనీ ఉద్యోగుల్లో ఇది 22 శాతానికి సమానం. అమెజాన్ 14,000 కార్పొరేట్ ఉద్యోగులను తొలగించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా కూడా ఇదే బాటలో నడిచాయి. టీసీఎస్ జులై-సెప్టెంబరు త్రైమాసికంలో దాదాపు 20,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది.

ఈనాడు బిజినెస్

రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల్లో 13% వృద్ధి

దిల్లీ: అక్టోబరులో రాయల్ ఎన్‌ఫీల్డ్ మొత్తం విక్రయాలు 1,24,951 వాహనాలుగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇదే నెలలో కంపెనీ విక్రయించిన 1,10,574 వాహనాలతో పోలిస్తే ఇది 13% ఎక్కువ. దేశీయ విక్రయాలు 1,01,886 నుంచి 15% పెరిగి 1,16,844కు చేరాయి. ఎగుమతులు మాత్రం 8,688 నుంచి 7% తగ్గి 8,107కు పరిమితమయ్యాయి. 'పండగల సీజన్ అయిన సెప్టెంబరు, అక్టోబరులో కంపెనీ 2.49 లక్షల మోటార్‌సైకిళ్లు విక్రయించింది. కంపెనీ చరిత్రలో ఇది అత్యుత్తమ పండగ విక్రయాలుగా నిలిచాయని ఐషర్ మోటార్స్ ఎండీ, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈఓ బి.గోవిందరాజన్ పేర్కొన్నారు.

ఉద్యోగుల ప్రతిభను గుర్తించేందుకు
ఎస్‌బీఐ-స్టార్ అవార్డులు

దిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఉద్యోగుల ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. ఉద్యోగ బాధ్యతలతో పాటు ఇతర రంగాల్లో మంచి పనితీరు కనబరిచిన వారికి 'ఎస్‌బీఐ స్టార్' (స్టాఫ్ టాలెంట్ అక్నాలెడ్జ్‌మెంట్ అండ్ రికగ్నిషన్) పేరిట ఏటా ఈ అవార్డులను బ్యాంక్ ఇవ్వనుంది. కళలు, సాహిత్యం, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవలు, పర్యావరణ కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఎస్‌బీఐ స్టార్ అవార్డులు ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఉద్యోగులకు ప్రోత్సాహం, సంస్థ పట్ల గౌరవభావం పెంపొందించాలనే లక్ష్యంతో ఈ అవార్డుల కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వివరించింది. ఈ అవార్డుల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ, ఉద్యోగులు వారి వృత్తిపరమైన నైపుణ్యాలే కాకుండా వ్యక్తిగత విజయాలు, అభిరుచులు, సమాజానికి చేసిన కృషిని కూడా ప్రశంసించాల్సిన అవసరం ఉందన్నారు. 'బహుళ నైపుణ్యాలు కలిగిన బ్యాంకు ఉద్యోగులను గౌరవించడం, సమష్టి దృక్పథాన్ని విస్తృతం చేయడమే ఈ అవార్డుల లక్ష్యం. మా ఉద్యోగులు నిపుణులుగా, సృష్టికర్తలుగా, పౌరులుగా సమాజంలో మార్పులు తీసుకువస్తారన్న నమ్మకాన్ని ఈ కార్యక్రమం బలోపేతం చేస్తుంది' అని శెట్టి అన్నారు. ఉద్యోగులను వృత్తిపరంగా మాత్రమే కాకుండా వ్యక్తిగతంగానూ గుర్తించే సంస్కృతి ఎస్‌బీఐలో ఉందన్నారు.

✦ ఎస్‌బీఐలో ఎంతోమంది ఉద్యోగులు తమ వ్యక్తిగత జీవితాల్లో సృజనాత్మకత, పట్టుదలతో విశేష ప్రతిభ కనబరిచిన ఉదాహరణలు ఉన్నాయని శెట్టి పేర్కొన్నారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఎదిగిన ప్రతీక్షా టొండ్‌వాల్కర్, చూపు లేకపోయినా అంకితభావంతో సహోద్యోగులకు స్ఫూర్తిగా నిలిచిన సన్వాలి, 71 ఏళ్ల వయసులో చార్టర్డ్ అకౌంటెన్సీ పరీక్షలో విజయం సాధించిన రిటైర్డ్ బ్యాంకర్ తారాచంద్ అగర్వాల్, అయిదు సార్లు వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి వంటి వారి గురించి ఆయన ప్రస్తావించారు.



✦ ఉద్యోగుల ప్రతిభ సంస్థ అభివృద్ధికి, కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుందని ఎస్‌బీఐ తెలిపింది. ఎస్‌బీఐ స్టార్ అవార్డును సమగ్రమైన, పారదర్శకమైన విధానంలో అందించనున్నట్లు పేర్కొంది. ఉద్యోగులు స్వయంగా తమను నామినేట్ చేసుకునే అవకాశం ఉంటుందని, అనంతరం ప్రమాణాల ఆధారంగా ప్రతి సర్కిల్ లేదా విభాగాల్లో మదింపు చేసి తుది జాబితాను రూపొందించనున్నట్లు వివరించింది. ముంబయిలోని కార్పొరేట్ కేంద్రం తుది జాబితాను విడుదల చేస్తుంది.

ఓయో బోనస్ ఇష్యూ గడువు పొడిగింపు

దిల్లీ: బోనస్ ఇష్యూ కోసం దరఖాస్తుల తుది గడువును పొడిగించినట్లు ఆతిథ్య సేవల సంస్థ ఓయో వెల్లడించింది. నమోదుకాని ఈక్విటీ వాటాదార్ల కోసం గడువును నవంబరు 1 నుంచి 7వ తేదీకి పొడిగించినట్లు సంస్థ తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో వాటాదార్ల నుంచి అభిప్రాయాలు



అందాయని, పెట్టుబడిదార్లకు సరైన బోనస్‌ను ఎంచుకోవడానికి తగినంత సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు ఓయో పేర్కొంది. దరఖాస్తు చేసే ప్రక్రియను సులభతరం చేసేందుకు, వాటాదారులు ఎన్నికల పత్రంతో పాటు క్లయింట్ మాస్టర్ లిస్ట్ (సీఎంఎల్)ను సమర్పించాల్సిన అవసరం లేదని కంపెనీ స్పష్టం చేసింది. బోనస్ ఇష్యూలో భాగంగా వాటాదార్లు ప్రతి 6000 ఈక్విటీ షేర్లకు ఒక ప్రిఫరెన్స్ షేరును పొందుతారు. సంస్థలో ప్రిఫరెన్స్ షేర్ల రూపంలో మెజారిటీ వాటాలు కలిగిన సాఫ్ట్ బ్యాంక్ విజన్ ఫండ్, రితేశ్ అగర్వాల్ సంస్థలకు ఈ ఇష్యూలో పాల్గొనే అర్హత లేదని కంపెనీ వెల్లడించింది.

✦ ఐపీఓకు వచ్చేందుకు ఈ నెలలో సెబీ వద్ద ఓయో ముసాయిదా పత్రాలు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. ఐపీఓ కోసం కంపెనీ విలువను 7-8 బిలియన్ డాలర్లుగా లెక్కకట్టొచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

పెట్రోలు విక్రయాలకు పండగ జోష్

- అక్టోబరులో 5 నెలల గరిష్ఠానికి
- డీజిల్ విక్రయాలు స్తబ్దుగా



దిల్లీ: పండగ సమయంలో ప్రయాణాలు పెరగడంతో అక్టోబరులో పెట్రోల్ అమ్మకాలు 5 నెలల గరిష్ఠానికి చేరాయి. అయితే ఇందుకు భిన్నంగా డీజిల్ వినియోగంలో స్తబ్దత కొనసాగిందని ప్రభుత్వ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. పెట్రోలియమ్, సహజవాయువు మంత్రిత్వ శాఖలోని పెట్రోలియమ్ ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ నెలవారీ నివేదిక ప్రకారం...

✦ పెట్రోల్ వినియోగం గతేడాది అక్టోబరుతో పోలిస్తే ఈ అక్టోబరులో 7 శాతం పెరిగి 36.5 లక్షల టన్నులకు పెరిగింది. ఈ ఏడాది సెప్టెంబరులో నమోదైన 34 లక్షల టన్నులతో పోలిస్తే కూడా అక్టోబరులో పెట్రోల్ విక్రయాలు పెరిగాయి. 2023 అక్టోబరుతో చూసినా పెట్రోల్ వినియోగం 16.3 శాతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి 7 నెలల్లో పెట్రోల్ వినియోగం 6.8 శాతం పెరిగి 248.40 లక్షల టన్నులకు చేరింది.

✦ దేశంలో అత్యధికంగా వినియోగించే ఇంధనమైన డీజిల్ విక్రయాలు అక్టోబరులో పెద్దగా మార్పులేకుండా 76 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. 2024 అక్టోబరులోనూ డీజిల్ విక్రయాలు 76.40 లక్షల టన్నులుగా ఉన్నాయి. సాధారణంగా వర్షాకాలం కావడంతో జూన్‌లో డీజిల్ వినియోగం తగ్గుతుంది. అక్టోబరు నాటికి వర్షాలు తగ్గుముఖం పడుతుండటంతో మళ్లీ వినియోగం పుంజుకుంటుంది. పండగ సీజను కానుండటం ఇందుకు కలిసివస్తుంది. అయినప్పటికీ ఈసారి అక్టోబరులో డీజిల్ విక్రయాలు స్తబ్దుగా ఉండటం గమనార్హం. 2023 అక్టోబరులోని 76.3 లక్షల టన్నుల కంటే కూడా 2025 అక్టోబరులో డీజిల్ గిరాకీ తక్కువగా నమోదైందని నివేదిక తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలల్లో ఈ ఇంధన విక్రయాలు 2.45 శాతం పెరిగి 533 లక్షల టన్నులుగా ఉందని నివేదిక వివరించింది.

✦ కిందటేడాది అక్టోబరుతో పోలిస్తే విమాన ఇంధన (ఏటీఎఫ్) వినియోగం ఈ అక్టోబరులో 1.6 శాతం పెరిగి 7,69,900 టన్నులకు చేరింది. 2023 అక్టోబరుతో పోలిస్తే కూడా ఏటీఎఫ్ విక్రయాల్లో 11.11 శాతం పెరుగదల ఉంది.

✦ ఎల్‌పీజీ విక్రయాలు కూడా 5.4 శాతం పెరిగి 30 లక్షల టన్నులుగా నమోదయ్యాయి.

భారత్‌కు సౌదీ అరేబియా ఫ్లైయెడీల్ విమానాలు

2026 తొలి త్రైమాసికం నుంచి..

దిల్లీ: వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన విపణిపై ఆశతో, సౌదీ అరేబియాకు చెందిన ఫ్లైయెడీల్ 2026 తొలి త్రైమాసికం నుంచి ముంబయితో పాటు మన దేశంలోని పలు నగరాలకు విమానాలను ప్రారంభించనుంది. ప్రపంచంలోనే అత్యంత పోటీ ఉన్న మార్కెట్లలో భారత్ ఒకటని, అక్కడ వెచ్చించే ప్రతి రూపాయిపై జాగ్రత్తగా దృష్టి సారించాల్సి ఉంటుందని విమానయాన సంస్థ సీఈఓ స్టీవెన్ గ్రీన్‌వే పీటీఐకి తెలిపారు. జెడ్డాలో ఉన్న సౌదియా ఎయిర్‌లైన్స్‌కు అనుబంధంగా ఉన్న ఫ్లైయెడీల్ 8 ఏళ్లుగా లాభదాయకంగా విమానాలను నడుపుతోంది. ఈ ఏడాది ఆఖరుకు సంస్థ వద్ద 46 విమానాలు ఉండాలని ఆశిస్తోంది. ప్రస్తుతం 42 ఎ320 విమానాలను కలిగి ఉంది. 2027 జులై నుంచి ప్రారంభించబోయే 10 పెద్ద విమానాలు ఎ330 నియోలకు కూడా ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చింది. 'వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలని అనుకుంటున్నాం. ముంబయి, దిల్లీ వంటి నగరాలకు తొలుత విమానాలు నడుపుతాం. అలాగే దేశంలోని రెండో అంచె నగరాలపైనా దృష్టి ఉంటుంది. ముంబయి మాత్రం ప్రాధాన్య జాబితాలో అగ్ర స్థానంలో ఉంటుంద'ని గ్రీన్‌వే వెల్లడించారు.



కెన్యా, ఈజిప్ట్‌లకు ఆకాశ ఎయిర్ సర్వీసులు

కెన్యా, ఇథియోపియా, ఈజిప్ట్, ఇతర దేశాలకు విమానాలు నడుపుతామని, బోయింగ్ విమానాల డెలివరీ షెడ్యూల్ చాలా బాగుందని విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ సీఈఓ వినయ్ దూబే వెల్లడించారు. అంతర్జాతీయ విస్తరణ సరైన మార్గంలో కొనసాగుతోందని, త్వరలో షార్జాకు విమానాలు నడిపే ప్రకటన వస్తుందని తెలిపారు. ఈ సంస్థ వద్ద 30 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ఈ ఏడాది



ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విమానాలను జత చేసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుధాబి (యూఏఈ), కువైట్ సిటీ (కువైట్), ఫుకెట్ (థాయ్‌ల్యాండ్)తో పాటు 24 దేశీయ గమ్యస్థానాలకు ఆకాశ ఎయిర్ విమానాలను నడుపుతోంది. ఈ సంస్థలో ప్రస్తుతం 750-775 మంది పైలట్లు ఉన్నారు. 2026లో మరి కొంత మందిని ముఖ్యంగా ఫస్ట్ ఆఫీసర్లను నియమించుకుంటామని దూబే తెలిపారు. 226 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డర్ పెట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఎతిహాద్ ఎయిర్‌వేస్‌తో కోడ్‌షేర్ భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ వద్ద మూలధనం తగినంత ఉందని, వచ్చే 2-5 ఏళ్లలో ఐపీఓకు వస్తామని తెలిపారు.

ఆ అధికారం సీసీఐకు లేదు

పేటెంట్ వివాదాలపై ఎన్‌సీఎల్ఏటీ

దిల్లీ: పేటెంట్ అంశాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే అధికారం కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు లేదని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) స్పష్టం చేసింది. స్విట్జర్లాండ్ ఔషధ దిగ్గజం వైఫర్ ఇంటర్నేషనల్ (ఏజీ)పై సీసీఐ ఆదేశాలను అప్పీలు చేస్తూ దాఖలైన ఫిర్యాదును ఎన్‌సీఎల్ఏటీ కొట్టివేసింది. కాంపిటీషన్ చట్టం కంటే పేటెంట్ చట్టం బలమైనదని ఇద్దరు సభ్యులతో కూడిన ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ పేర్కొంది. టెలిఫోనాక్టిబొలాగేట్ ఎల్ఎం ఎరిక్సన్ (పీయూబీఎల్) కేసులో దిల్లీ హైకోర్టు, ఎస్ఎల్‌పీ నం.25026/2023లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకుంటే.. వైఫర్ ఇంటర్నేషనల్‌పై వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేసే అధికారం సీసీఐకు లేదని స్పష్టమవుతోందని వెల్లడించింది.

కోడి గుడ్లు

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	570	తూ/ప గోదావరి	580
వరంగల్	572	విశాఖపట్నం	570
విజయవాడ	575	చిత్తూరు	593

సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగంలో అనంత్ టెక్నాలజీస్‌దీ పాత్ర


హైదరాబాద్: ఎల్‌వీఎం3-ఎం5 వాహక నౌక ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రవేశపెట్టడం ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించిందని అనంత్ టెక్నాలజీస్ ఛైర్మన్ సుబ్బారావు పావులూరి తెలిపారు. ఈ సమాచార ఉపగ్రహ ప్రయోగంలో తమ సంస్థ భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని అన్నారు.

ATL

ఎల్‌వీఎం3-ఎం5 వాహక నౌక కోసం కంట్రోల్ ఎలక్ట్రానిక్స్ మాడ్యూల్స్, నేవిగేషన్ సిస్టమ్స్, ఎలక్ట్రో- మెకానికల్ యాక్టుయేటర్ సిస్టమ్స్ లాంటి కీలక వ్యవస్థలను అందించామని కంపెనీ వెల్లడించింది. సీఎంఎస్-03 ఉపగ్రహానికి అవసరమైన పవర్ కంట్రోల్- పవర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్, టెలిమెట్రీ- టెలికమాండ్ సిస్టమ్స్, స్టార్ సెన్సర్ లాంటివి అనంత్ టెక్నాలజీస్‌కు చెందిన యూనిట్లలో తయారైనట్లు పేర్కొంది.


పసిడి ప్రతికూలమే!

పసిడి



పసిడి డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,22,890 కంటే ఎగువన చలించకుంటే ప్రతికూల ధోరణి కొనసాగుతుందని భావించవచ్చు. అయితే రూ.1,18,276 వద్ద మద్దతు లభించొచ్చని విషయాన్ని ట్రేడర్లు దృష్టిలో ఉంచుకోవాలి. ఒకవేళ రూ.1,23,538 కంటే పైకి వెళితే పెరిగే అవకాశం ఉంటుంది.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,41,803 కంటే కిందకు వస్తే రూ.1,35,207; రూ.1,31,109 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా రూ.1,52,497 కంటే పైకి వెళితే రూ.1,56,595; రూ.1,63,191 వరకు పెరగొచ్చు.

ప్రాథమిక లోహాలు



✦ రాగి నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,004 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.997.65 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.984.45; రూ.970.75 వరకు దిగిరావచ్చు.

✦ సీసం నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.183 కంటే దిగువన చలించకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని లాంగ్ పొజిషన్లను అట్టే పెట్టుకోవచ్చు.

✦ జింక్ నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.304.60 కంటే ఎగువన కదలాడకుంటే.. ఈ స్థాయికి పైన స్టాప్ లాస్ పెట్టుకొని షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహమే అవుతుంది.

✦ అల్యూమినియం నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.274.25 కంటే పైన కదలాడకుంటే రూ.271.05; రూ.268.85 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

ఇంధన రంగం

✦ ముడి చమురు నవంబరు కాంట్రాక్టు


కమొడిటీస్ ఈ వారం

ఈవారం రూ.5,325 కంటే దిగువన కదలాడ కుంటే షార్ట్‌సెల్ పొజిషన్లకు దూరంగా ఉండటం మేలు. రూ.5,511 కంటే పైన కదలాడితే రూ.5,601; రూ.5,714 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.



✦ సహజవాయువు నవంబరు కాంట్రాక్టుకు ఈవారమూ సానుకూల ధోరణి కొనసాగితే రూ.394.45 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.409.20; రూ.451.55 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే రూ.333 దిగువన మాత్రమే షార్ట్ సెల్లింగ్ వైపు మొగ్గు చూపడం మంచిది.

వ్యవసాయ ఉత్పత్తులు



✦ పసుపు డిసెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.14,156 కంటే కిందకు వస్తే రూ.13,422; రూ.12,800 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.15,512 కంటే పైకి వెళితే రూ.16,134; రూ.16,868 వరకు రాణించవచ్చు.

✦ జీలకర్ర నవంబరు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.20,613 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.21,091; రూ.21,583 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.19,643 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.19,151; రూ.18,673 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి (శాతంలో)
పసిడి (డిసెంబరు)	1,22,500	1,21,232	(1.04)
వెండి (డిసెంబరు)	1,42,910	1,48,399	3.84
రాగి (నవంబరు)	1,002.65	1,010.85	0.82
సీసం (నవంబరు)	183.55	183.35	0.44
జింక్ (నవంబరు)	297.35	300.60	1.09
అల్యూమినియం (నవంబరు)	271.90	271.80	(0.04)
ముడి చమురు (నవంబరు)	5,454	5,421	(0.61)
సహజ వాయువు (నవంబరు)	287.50	364.90	26.92
పసుపు (డిసెంబరు)	14,750	14,890	0.95
జీలకర్ర (నవంబరు)	19,630	20,135	2.57

సూచీలు పుంజుకోవచ్చు



స్టాక్ మార్కెట్ ఈ వారం

- నిఫ్టీ-50 తిరిగి 26,000కు చేరొచ్చు
- ఆర్థిక ఫలితాల ఆధారంగా కదలికలు
- బ్యాంకు, చమురు షేర్లకు సానుకూలతలు
- విశ్లేషకుల అంచనాలు

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	847.85	866.30	836.50
హిందుస్థాన్ జింక్	476.50	483.50	472.10
ఎన్ఎండీసీ	75.79	76.80	74.60
సెయిల్	136.85	139.90	133.50
టాటా స్టీల్	182.84	185.30	180.90
వేదాంతా	493.55	513.60	481.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1541.50	1566.40	1525.20
ఇన్ఫోసిస్	1482.30	1503.10	1470.30
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5916.60	6008.80	5829.00
టీసీఎస్	3058.00	3092.50	3007.90
టెక్ మహీంద్రా	1424.40	1444.60	1410.20
విప్రో	240.67	244.10	238.80

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1138.90	1187.40	1075.80
బయోకాన్	372.10	383.50	365.80
సిప్లా	1501.30	1539.60	1480.80
డాక్టర్ రెడ్డీస్	1197.60	1212.50	1183.50
గ్లెన్‌మార్క్ ఫార్మా	1891.20	1919.50	1861.90
నాట్కో ఫార్మా	819.90	845.80	806.00

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,836.50	5,935.50	5,775.50
కోల్గేట్ పామోలివ్	2,243.00	2,278.30	2,213.50
డాబర్ ఇండియా	487.55	508.70	476.20
ఇమామీ	534.40	548.70	526.50
హిందుస్థాన్ యునిలీవర్	2,465.50	2,492.60	2,439.40
ఐటీసీ	420.35	429.90	413.50
మారికో	722.00	733.10	713.10

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	265.49	270.00	258.40
సీజీ పవర్	736.65	752.00	718.90
ఎల్ అండ్ టీ	4,030.90	4,084.70	3,953.30
సీమెన్స్	3,096.30	3,174.20	3,054.20
థెర్మాక్స్	3,218.80	3,313.70	3,165.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1881.50	1943.00	1825.80
అంబుజా సిమెంట్స్	565.40	574.60	558.60
ఇండియా సిమెంట్స్	402.35	417.50	391.90
శ్రీ సిమెంట్	28310.00	28916.70	27956.70
అల్ట్రాటెక్ సిమెంట్	11947.00	12173.70	11803.70

భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం పుంజుకునే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ-50 తిరిగి తన 26,000 స్థాయిని అందుకోవచ్చని అంటున్నారు. ప్రస్తుత స్థాయులు కొనుగోళ్లకు అనుకూలంగా ఉన్నందున తాజా గరిష్ఠాలకు చేరినా ఆశ్చర్యం లేదంటున్నారు. 'స్వల్పకాలానికి నిఫ్టీ-50 ధోరణి బలహీనంగా ఉన్నా.. మధ్యకాలానికి సానుకూలంగా కనిపిస్తోంది. 25,700 కంటే దిగువకు పడితే 25,500 వద్ద బలమైన మద్దతు లభించి, బాగా పుంజుకునేందుకు అవకాశం ఉంద'ని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అయితే 25,800 దిగువన మార్కెట్ సెంటిమెంటు బలహీనపడవచ్చని మరికొంత మంది విశ్లేషకులంటున్నారు. ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలు కీలకమని చెబుతున్నారు. వివిధ రంగాలపై మార్కెట్ విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- **లోహ** కంపెనీల షేర్లు సానుకూల ధోరణితో హెచ్చుతగ్గులకు లోనుకావొచ్చు. కొంత దిద్దుబాటు, స్థిరీకరణ జరగొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 10500, 10400 వద్ద కీలక మద్దతు స్థాయులున్నాయి. మంగళవారం అదానీ ఎంటర్‌ప్రైజెస్, శుక్రవారం హిందాల్కో ఫలితాలున్నాయి.
- **ఐటీ** షేర్లు స్వల్పకాలంలో స్థిరీకరణకు గురికావొచ్చు. ఎటువంటి సానుకూల వార్తలూ లేనందున అర్థవంత రికవరీ జరగకపోవచ్చు. గత వారం ఫెడ్ రేట్ల కోత ప్రకటించినా, డిసెంబరులో కోతకు హామీనివ్వకపోవడంతో మార్కెట్ సెంటిమెంటు దెబ్బతింది.
- నిఫ్టీ **ఫార్మా** సూచీ మరింత నష్టపోవచ్చు. బలహీన ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంటు డీలా పడింది. ఈ రంగంలో బలహీనతలు మరో రెండు వారాలు కొనసాగొచ్చు. నిఫ్టీ ఫార్మాకు 21,600 వద్ద మద్దతు, 22,500 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి.
- గత ఆరు నెలలుగా స్తబ్దుగా కదలాడుతున్న **ఎఫ్ఎమ్‌సీజీ** సూచీ ఈ వారమూ ఒక శ్రేణిలోనే కదలాడొచ్చు. జీఎస్‌టీ రేట్ల కోతతో చాలా వరకు ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల ఫలితాలపై ప్రభావం పడింది. అయితే ధరల పెంపు కొంత ఒత్తిడిని తగ్గించింది.
- ఎంపిక చేసిన **యంత్రపరికరాల** షేర్లు కదలాడవచ్చు. రాబోయే త్రైమాసికాల్లో ఆర్డర్లు తగ్గొచ్చన్న అంచనాలున్నాయి. ఏబీబీ ఇండియా గురువారం, సుజ్లాన్ ఎనర్జీ మంగళవారం ఫలితాలను ప్రకటించనున్నాయి.
- ఎటువంటి వార్తలూ లేనందున **సిమెంటు** కంపెనీలు చాలా తక్కువ శ్రేణిలో కదలాడవచ్చు. దీంతో ఫలితాల ఆధారంగా ఆయా కంపెనీల షేర్లు చలించొచ్చు. అంబుజా(సోమ), గ్రాసిమ్ ఇండస్ట్రీస్, రామ్‌కో సిమెంట్స్(బుధ) ఈ వారమే ఫలితాలను ప్రకటించనున్నాయి.
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితి పెంపు వార్తల మధ్య నిఫ్టీ **బ్యాంక్** సూచీ ఈ వారం రాణించొచ్చు. మంగళవారం వెలువడే ఎస్‌బీఐ ఫలితాలు కీలకం కానున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 57,500 స్థాయి పైన నిలబడితే.. 58,500ను పరీక్షించొచ్చు. ఒకవేళ 57,500 స్థాయిని కోల్పోతే మాత్రం 57,000-56,800కు పడిపోవచ్చు.
- **చమురు-గ్యాస్** షేర్లు సమీప కాలంలో బులిష్ కదలికలను కొనసాగించవచ్చు. గత అయిదు వారాలూ రాణించిన ఈ సూచీ ఈ వారమూ అదే బాట పట్టవచ్చు. పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ 7న ఫలితాలను వెల్లడించనుంది.
- **టెలికాం** షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. సోమవారం వెలువడే భారతీ ఎయిర్‌టెల్ ఫలితాలను మదుపర్లు గమనించొచ్చు. ఆ కంపెనీ షేరు ఈ వారం రూ.1,950-2,100 శ్రేణిలో కదలాడవచ్చు. వొడాఫోన్ ఐడియా రూ.9-10 మధ్య చలించొచ్చు.
- నిఫ్టీ ఆటో సూచీ ఒక శ్రేణిలో చలించొచ్చు. శనివారం వెలువడ్డ **వాహన** విక్రయ గణాంకాలను, ఈ వారం వెలువడే మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్కార్ట్స్ కుబోటా, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, బజాజ్ ఆటో ఫలితాలను గమనించాల్సి ఉంటుంది.

ఈ వారం ఆర్థిక ఫలితాలు(నిఫ్టీ-50)

టైటన్, టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సన్‌ఫార్మా, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ట్రెంట్, బజాజ్ ఆటో

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	987.30	1014.30	967.70
ఐసీఐసీఐ బ్యాంక్	1345.30	1368.90	1331.50
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	81.77	85.00	77.10
ఇండస్ఇండ్ బ్యాంక్	794.80	812.30	783.30
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2102.20	2163.30	2069.50
పీఎన్‌బీ	122.89	126.30	118.40
ఎస్‌బీఐ	937.00	954.40	921.50

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1486.40	1503.90	1473.50
బీపీసీఎల్	356.80	362.90	352.00
హెచ్‌పీసీఎల్	476.00	491.20	461.70
ఐఓసీఎల్	165.90	169.10	161.50
ఓఎన్‌జీసీ	255.37	260.10	251.00
ఆయిల్ ఇండియా	433.35	440.40	427.20

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,054.50	2082.10	2037.90
ఎమ్‌టీఎన్ఎల్	41.72	42.40	41.30
టాటా కమ్యూనికేషన్స్	1875.40	1930.90	1843.10
వొడాఫోన్ ఐడియా	8.73	9.10	8.50

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	141.53	144.70	139.40
బజాజ్ ఆటో	8892.50	9164.20	8666.20
ఐషర్ మోటార్స్	7007.00	7199.30	6806.30
హీరో మోటోకార్ప్	5544.00	5680.70	5432.70
ఎం అండ్ ఎం	3487.20	3542.20	3456.20
మారుతీ	16186.00	16784.00	15650.00
టాటా మోటార్స్	405.85	411.40	400.80
టీవీఎస్ మోటార్	3508.70	3569.80	3463.20

ఈనాడు సినిమా

క్లైమాక్స్ పోరులో శంకర వరప్రసాద్


చిరంజీవి

సంక్రాంతి బరిలో 'మన శంకరవరప్రసాద్‌గారు'గా సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఆదివారం నుంచి హైదరాబాద్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్రారంభించుకుంది. చిరుతో పాటు ఫైటర్స్ బృందంపై తెరకెక్కిస్తున్న ఈ భారీ పోరాట ఘట్టానికి యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో హీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆ వార్తలన్నీ అసత్యం.. నిరాధారం

– ప్రశాంత్ వర్మ



తనకు.. నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై.లి మధ్య ఉన్న వివాద విషయంలో పలు ఛానళ్లు, సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలన్నీ నిరాధారమైనవి, అసత్యమైనవని దర్శకుడు ప్రశాంత్ వర్మ అన్నారు. వ్యక్తిగతంగా తనని లక్ష్యం చేసుకుని కొందరు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఓ ప్రకటన విడుదల చేశారు. "కొన్ని మీడియా పోర్టల్స్, సామాజిక మాధ్యమాల పేజీల్లో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ దాఖలు చేసిన ఫిర్యాదు వివరాల్ని, అలాగే నా సమాధానంలోని కొన్ని భాగాల్ని మాత్రమే ప్రచురించడం, ప్రసారం చేయడం నా దృష్టికి వచ్చింది. ఈ పక్షపాత, బాధ్యతారహిత, ఏకపక్ష సమాచారం ప్రచారం చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నా. మా ఇద్దరి మధ్య ఉన్న వివాదం ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ముందు విచారణలో, న్యాయ పరిశీలనలో ఉంది. ఈ సందర్భంలో అన్ని పక్షాలు ఆ ఫోరమ్ తీర్పును ఎదురు చూడటం మాత్రమే సమంజసం. మీడియా ద్వారా వివాదాన్ని తీర్చే ప్రయత్నం చేయడం సరైంది కాదు. ఈ దశలో అంతర్గత పత్రాలు, ఈమెయిల్స్, ఒప్పందాలు, ఆర్థిక వివరాల్ని బహిర్గతం చేయడం అనేది విచారణలో జోక్యం చేసుకోవడం లాంటి చర్య అవుతుంది. ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో జరుగుతోంది. ఈ అంశంపై అన్ని మీడియా సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ ఊహాగానాలు ఆధారంగా ప్రచారం చేయడం మానుకోవాలి. అలాగే తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఫలితం వచ్చే వరకు వేచి చూడమని కోరుతున్నా" అని ప్రశాంత్ వర్మ తన ప్రకటనలో పేర్కొన్నారు.

గెలుపు దొరికే వరకు దిగులుపడకురా!


ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి, శివ రాజ్‌కుమార్

శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి. శెట్టి ప్రధాన పాత్రధారులుగా అర్జున్ జన్య తెరకెక్కించిన చిత్రం '45 ది మూవీ'. ఉమా రమేశ్ రెడ్డి, ఎం రమేశ్ రెడ్డి నిర్మించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా డిసెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "గెలుపు తలుపు దొరికే వరకు దిగులుపడకురా" అంటూ సాగిన ఈ పాటకు అర్జున్ జన్య స్వరాలు సమకూర్చారు. రోల్ రైడా సాహిత్యమందించడంతో పాటు వినాయక్‌తో కలిసి స్వయంగా ఆలపించారు. జానీ మాస్టర్ నృత్యరీతులు అందించారు. ఈ పాటలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి.

ప్రపంచం నాకిచ్చిన పేరు కింగ్


షారుక్ ఖాన్

"నేను ఎంత మందిని చంపానో నాకు గుర్తు లేదు. వారు మంచివారా చెడ్డవాళ్లా అనేది కూడా అడగలేదు. కానీ నాకు గుర్తున్నదల్లా వారి కళ్లలో భయం చూడటం మాత్రమే. దానికి నేనే కారణం" అంటున్నారు బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్. మరి ఆయన మాటల వెనుక అర్థమేంటో తెలుసుకోవాలంటే 'కింగ్' సినిమా చూడాల్సిందే. ఆయన ప్రధాన పాత్రలో సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఇది 'పఠాన్' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న మరో స్పై యాక్షన్ సినిమా. ఆదివారం షారుక్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ.. గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. ఈ వీడియోతో షారుక్ మరోసారి తన యాక్షన్‌తో తెరపై అదరగొట్టడానికి సిద్ధమైనట్లు స్పష్టం చేసింది చిత్రబృందం. 'ప్రపంచం నాకు ఒక పేరు ఇచ్చింది.. అదే 'కింగ్', 'నేను భయం కాదు.. విధ్వంసం" లాంటి శక్తిమంతమైన సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ వీడియో. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

అప్‌డేట్స్ 2030లో ఇద్దామా!

● ఎస్ఎస్ఎంబీ29పై రాజమౌళికి మహేశ్‌బాబు ఫన్నీ కౌంటర్


మహేశ్‌బాబు


రాజమౌళి

దర్శకుడు రాజమౌళి చిత్రాలే కాదు.. వాటిని తనదైన శైలిలో సినీప్రియుల్లోకి తీసుకెళ్లే తీరు వినూత్నంగానే ఉంటుంది. అందుకే ఆయన సినిమాల నుంచి ఓ అప్‌డేట్ బయటకొస్తుందన్నా.. దాన్ని ఏ రీతిలో సరికొత్తగా జనాల్లోకి తీసుకెళ్తారా అని అందరూ ఆసక్తిగా చూస్తుంటారు. తను ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో ఓ గ్లోబల్ మూవీ రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర అప్‌డేట్‌ను ఈనెలలో బయటకు వదలనున్నట్లు ఆగస్టులోనే మహేశ్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ప్రకటించారు. దీంతో ఇప్పుడీ అంశంపై మహేశ్‌బాబు ఎక్స్ వేదికగా "అప్‌డేట్ ఎప్పుడిస్తారు" అంటూ రాజమౌళిని సరదాగా ప్రశ్నించడం.. దానికి ఆయన తనదైన శైలిలో కౌంటరివ్వడం.. వీళ్లిద్దరి ఫన్నీ ట్వీట్ వార్‌లోకి ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ జత కలవడం నెట్టింట అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇలా ట్వీట్లతో ఈ చిత్ర ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టిన తీరు ముచ్చటగొలిపింది. ఇంతకీ ఈ అప్‌డేట్ అంశంపై ఎవరేమన్నారంటే!

■ **మహేశ్‌బాబు:** రాజమౌళి.. నవంబరు వచ్చేసింది!

● **రాజమౌళి:** అవును. ఏ సినిమాలకి రివ్యూ ఇద్దామనుకుంటున్నావు ఈ నెల?

■ **మహేశ్‌బాబు:** మీ కలల ప్రాజెక్ట్ మహాభారతంపై ఇవ్వాలనుకుంటున్నా. నవంబరులో మాకు అప్‌డేట్ ఇస్తానని మాటిచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి.

● **రాజమౌళి:** ఇప్పుడే కదా మహేశ్ మొదలైంది. ఒకదాని తర్వాత ఒకటి నెమ్మదిగా ఇద్దాం.

■ **మహేశ్‌బాబు:** ఎంత నెమ్మదిగా సర్..? 2030లో ప్రారంభిద్దామా? ఇప్పటికే మన ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లోని ప్రతి వీధిలో ఇన్‌స్టా రీల్స్ చేస్తోంది.

✦ **ప్రియాంక చోప్రా:** హలో హీరో. సెట్స్‌లో మీరు నాతో పంచుకునే అన్ని విషయాల్ని లీక్ చేయమంటారా? మైండ్‌లో ఫిక్స్ అయితే బ్లైండ్‌గా ఏసేస్తా!

● **రాజమౌళి:** ప్రియాంక చోప్రా ఉందనే విషయాన్ని ఎందుకు బయట పెట్టావు మహేశ్. నువ్వు నా సర్‌ప్రైజ్‌ని నాశనం చేశావ్.

■ **మహేశ్‌బాబు:** పృథ్వీరాజ్ సుకుమారన్ ఉన్నారనే విషయాన్నీ సర్‌ప్రైజ్‌లా దాచాలనుకున్నారా?

◆ **పృథ్వీరాజ్ సుకుమారన్:** రాజమౌళి సర్.. వెకేషన్ పేరుతో ప్రతిసారీ హైదరాబాద్‌కు ఎందుకొస్తున్నానో ఇంట్లో కారణాలు చెప్పలేకపోతున్నా. ఇదిలాగే కొనసాగిస్తే నా కుటుంబం నన్ను అనుమానించడం ప్రారంభిస్తుంది (నవ్వుతూ).

● **రాజమౌళి:** మహేశ్ నువ్వు అన్ని సర్‌ప్రైజ్‌లు బయట పెట్టేశావ్. అందుకే నీకు జరిమానాగా నీ ఫస్ట్‌లుక్ వాయిదా వేయాలని నిర్ణయించుకున్నా.

■ **మహేశ్‌బాబు:** ఓరి దీని యేషాలో. ఇవన్నీ ఇప్పటికే అందరికీ తెలుసు. మీరు వాటిని ఇంకా సర్‌ప్రైజ్‌లు అనుకుంటున్నారు. రేపు ఇంకేదైనా కొత్తగా బయట పెట్టండి. అయినా అత్యుత్తమ దాన్ని ఎప్పుడూ రాజమౌళి చివరిలోనే చూపిస్తారు.

◆ **పృథ్వీరాజ్ సుకుమారన్:** మీరు మీ విలన్స్‌ని ఎంతగా ఇష్టపడతారో నాకు తెలుసు రాజమౌళి సర్.

✦ **ప్రియాంక చోప్రా:** బెటర్ లక్ నెక్స్ట్ టైమ్ మహేశ్.

ఈ ట్వీట్ చాట్ ఇప్పటికే మిలియన్ వ్యూస్ దక్కించుకుంది. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమాకు సంబంధించి ప్రత్యేక వేడుకను నిర్వహించనున్నారు. ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతమందిస్తున్నారు. విజయేంద్ర ప్రసాద్ కథ అందివ్వగా.. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు.

'కమల్ ఔర్ మీనా'కు కియారా సై?


కియారా అడ్వాణీ

'బైజుబావ్రా', 'పాకీజా' లాంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలతో చిత్రపరిశ్రమలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు అలనాటి అందాల తార మీనా కుమారి. 'కమల్ ఔర్ మీనా' పేరుతో ఆమె జీవిత కథ తెరపైకి రాబోతున్న సంగతి తెలిసిందే. సిద్ధార్థ్ పి.మల్హోత్రా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా కియారా అడ్వాణీ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పుడామె ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, వచ్చే ఏడాది ప్రథమార్థంలో షూటింగ్ ప్రారంభించనున్నారని సమాచారం. ప్రస్తుతం మీనా కుమారి భర్త కమల్ అమ్రోహి పాత్రను పోషించడానికి కొంత మంది యువనటులతో చిత్రబృందం చర్చలు చేస్తుందని, ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

జెస్సీ ఎవరు?


'పీటర్'

రాజేశ్ ధ్రువ, జాన్వి రాయల, రవిక్ష శెట్టి ప్రధాన పాత్రల్లో సుకేశ్ శెట్టి తెరకెక్కించిన చిత్రం 'పీటర్'. రవి హిరేమత్, రాకేశ్ నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. "జెస్సీ మళ్లీ వచ్చింది. డేవిడ్‌ను ఇక్కడికి తీసుకురా" అంటూ సాగిన ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ సాగింది. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ కథతో ముస్తాబైనట్లు అర్థమవుతోంది. మరి ఆ జెస్సీ ఎవరు? పీటర్ కథేంటి? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఈ చిత్రానికి సంగీతం: రిత్విక్ మురళీధర్, ఛాయాగ్రహణం: గురుప్రసాద్ నార్నాడ్.

మహేశ్‌ని ఏనాడూ సాయం అడగలేదు: సుధీర్‌బాబు


శైలేశ్, శిల్పా శిరోద్కర్, సుధీర్‌బాబు, మహేశ్వరరెడ్డి, రాజీవ్ రాజ్, యదు వంశీ

"మహేశ్‌బాబు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా.. నాకో పాత్ర గానీ, సినిమా గానీ రికమెండ్ చేయమని తనని ఏరోజూ అడగలేద"న్నారు కథానాయకుడు సుధీర్‌బాబు. కృష్ణ అల్లుడు, మహేశ్ బావగానే సినీ ప్రయత్నాలు మొదలు పెట్టినప్పటికీ. . అందరిలాగే తానూ ఆడిషన్స్ ఇచ్చానని చెప్పారు. తనకి కృష్ణానగర్‌లో కష్టాలు తెలియకపోవచ్చు గానీ ఫిల్మ్‌నగర్ బాధలు తెలుసన్నారు. ఆయన 'జటాధర' ప్రీరిలీజ్ వేడుకలో ఈ జ్ఞాపకాలన్నింటినీ గుర్తు చేసుకున్నారు. సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని వెంకట్ కల్యాణ్ - అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించారు. జీస్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్నారు. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈ నెల 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ. . 'సుధీర్‌బాబు అంటే ఎవరు?' అని నన్ను నేను ప్రశ్నించుకునేవాణ్ని. మీరు అనుకున్నట్లు నేను కృష్ణకు అల్లుడు, మహేశ్‌బాబుకి బావనే. దీన్ని నేను గర్వంగా, ప్రేమగా ఒప్పుకుంటాను. చాలా మంది నన్ను నెపోకిడ్ అని అంటున్నారు. నిజానికి అలాంటిదేమీ లేదు. నేను సినిమాల్లోకి రావాలనుకున్నప్పుడు ఎంతోమంది నిర్మాతల్ని కలిశా. నా యాక్షన్ వీడియోలు పట్టుకుని ప్రతి ఆఫీస్‌కు తిరిగా. ఆడిషన్స్ ఇచ్చా. కానీ, ఎక్కడైనా నాకు దొరికింది ఓ ఎక్స్‌ట్రా కాఫీ మాత్రమే. నాకు బస్సులో ప్రయాణిస్తూ అవకాశాల కోసం తిరగడం తెలియకపోవచ్చు కానీ, కారులో కూర్చొని బాధపడటం తెలుసు. ఇది నేను సింపతీ కోసం చెప్పడం లేదు. సానుభూతి కోసమే అయితే నా తొలి సమయంలోనే ఇదంతా చెప్పేవాణ్ని. ఒక్క సినిమా ఛాన్స్ వస్తే చాలనుకున్న నేను ఇప్పటికి 20 చిత్రాలు చేశా. అందులో హిట్స్, ఫ్లాప్స్ ఉన్నాయి. అన్నింటికీ నేనే బాధ్యుణ్ని. ఈ 'జటాధర' నేనిప్పటి వరకు చేసిన చిత్రాల్లో అత్యుత్తమ స్క్రిప్ట్. ధనపిశాచి నేపథ్యంలో ఉంటుంది. తెలుగు ఇండస్ట్రీలో ఇలాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు ఏ హీరో చేయలేదు. సినిమా ఆద్యంతం ఆసక్తిరేకెత్తించేలా ఉంటుంది. దెయ్యాలు ఉన్నాయని నమ్మేవారికి.. లేవని చెప్పేవారికి ఇద్దరికీ ఈ సినిమా సమానంగా నచ్చుతుంది. సోనాక్షి దీంట్లో ధన పిశాచిగా అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శైలేశ్ కొలను, శిల్పా శిరోద్కర్, శివిన్, మహేశ్వరరెడ్డి, ప్రేరణ, యదు వంశీ, విష్ణువర్ధన్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు మనం చరిత్ర సృష్టిస్తాం!


'ఆపరేషన్ సఫేద్ సాగర్'

కార్గిల్ యుద్ధ సమయంలో భారత సైన్యానికి మద్దతుగా వాయుసేన 'ఆపరేషన్ సఫేద్ సాగర్'ను చేపట్టింది. ఈ నేపథ్యంతోనే దర్శకుడు ఓని సేన్ ఆ యుద్ధంలో వైమానిక దళం పోషించిన కీలక పాత్రను ప్రధానాంశంగా అదే పేరుతో సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఇన్‌స్టా వేదికగా ప్రకటిస్తూ.. "చరిత్రలో ప్రపంచంలోనే ఎత్తైన అత్యున్నత గౌరవంతోకూడిన వైమానిక 'ఆపరేషన్ సఫేద్ సాగర్' త్వరలోనే విడుదల కానుది. నెట్‌ఫ్లిక్స్‌లో మాత్రమే చూడండి" అంటూ ఫస్ట్ లుక్ వీడియోను ఆవిష్కరించింది. ఈ వీడియో "భారత వైమానిక దళ చరిత్రలో ఏ స్క్వాడ్రన్ కూడా ఇలాంటి ఆపరేషన్ నిర్వహించలేదు. మేము ఎంపిక చేసిన కొద్దిమందిమే.. ఎత్తులో కూర్చోవడం వల్ల తాము దేనినైనా తప్పించుకోవచ్చని భావిస్తారు పాకిస్థానీయులు. ఇప్పుడు మనం చరిత్ర సృష్టిస్తాం" లాంటి సంభాషణలతో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సిరీస్‌లో సిద్ధార్థ్, జిమ్మీ షెర్గిల్, అభయ్ వర్మ, మిహిర్ అహూజా, తరుక్ రైనా, అర్నవ్ భాసిన్ నటిస్తున్నారు. సంజయ్ రౌత్రే, సరిత పాటిల్, మెహబూబ్ పాల్ సింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారత వైమానిక దళం మద్దతుతో రూపొందించిన ఈ సిరీస్ నిజమైన సంఘటనల ఆధారంగా కార్గిల్ యుద్ధంలో తమ మాతృభూమి కోసం పోరాడడానికి సాహసోపేతంగా ప్రమాదకరమైన మిషన్‌ను చేపట్టే పైలట్ల కథను అనుసరిస్తుంది. కేవలం యుద్ధం గురించి మాత్రమే కాకుండా భారతీయ వాయుసేన ధైర్యం, త్యాగాలను ప్రపంచానికి తెలియజేసేలా రూపొందిస్తున్నట్లు సిరీస్ వర్గాలు తెలిపాయి.

ప్రేమ.. నవ్వులు.. థ్రిల్


ప్రియదర్శి, ఆనంది

ప్రియదర్శి, ఆనంది జంటగా నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించిన చిత్రం 'ప్రేమంటే'. పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. సుమ కనకాల, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. కొత్తగా పెళ్లైన ఓ జంట జీవితంలోని ప్రేమ, గిల్లికజ్జాల్ని ఈ ప్రచార చిత్రంలో వినోదాత్మకంగా చూపించారు. దీంట్లో పోలీసు హెడ్ కానిస్టేబుల్‌గా సుమ కనకాల పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉన్నట్లు టీజర్‌ను బట్టి అర్థమవుతోంది. "ప్రేమ, నవ్వులు, థ్రిల్.. అన్నీ నిండి ఉన్న వినోదాత్మక చిత్రమిది. తప్పకుండా అందర్నీ అలరిస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

క్రైమ్ థ్రిల్లర్ కథతో..


అజయ్

అజయ్, తన్వికా, బేబీ దాన్విత, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రధారులుగా అశ్విన్ కామరాజ్ కొప్పాల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది బ్రెయిన్'. ఎండ్లూరి కళావతి నిర్మిస్తున్నారు. శరత్ లోహిత్, రవి కాలే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో చిత్రీకరణ చేసుకుంటున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు అశ్విన్ మాట్లాడుతూ.. "ఇదొక విభిన్నమైన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని సినిమా చేస్తున్నాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు.

ఎవరూ ఊహించని సూపర్ హీరోని చూపిస్తాం


చాందినీ చౌదరి

చాందినీ చౌదరి, సుశాంత్ యాష్కీ ప్రధాన పాత్రధారులుగా వికాశ్ దర్శకత్వంలో ఓ చిత్రం శ్రీకారం చుట్టుకుంది. సృజన గోపాల్ నిర్మాత. జీవన్ కుమార్, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ కొట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు. "డార్క్ కామెడీ జానర్‌లో సాగే సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. ఈ సినిమాతో ఎవరూ ఊహించని ఓ సూపర్ హీరోని పరిచయం చేయనున్నాం. ఈనెలాఖరు నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు నిర్మాత సృజన గోపాల్.

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ భూగోళశాస్త్రం


సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ స్టేషన్

సంస్థాగత మౌలిక సదుపాయాల్లో కీలకమైంది, శక్తివనరుల్లో ప్రధానమైంది విద్యుత్తు. ఉత్పత్తి, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల ప్రగతి అంతా విద్యుత్తు లభ్యతపైనే ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ ప్రధానమైన ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు ఉత్పత్తి, వినియోగం అధికంగా జరుగుతోంది. సంప్రదాయకంగా థర్మల్, జలవిద్యుత్తు ఉత్పత్తులు సాగుతున్నాయి. ఇటీవలి కాలంలో సౌర, పవన విద్యుత్తు మొదలైన పునరుత్పాదక శక్తి వనరుల స్థాపన, వినియోగంలో వాటా త్వరితగతిన పెరుగుతోంది. పెద్దఎత్తున అణువిద్యుత్తు ఉత్పత్తికీ అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్తు రంగ స్థితిగతులు, అందులో సంప్రదాయ, సంప్రదాయేతర ఇంధన వనరుల వాటాల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. రాష్ట్రంలోని ప్రధాన, పెద్ద విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు, ఏర్పాటైన ప్రాంతాలు, విద్యుత్తు సంస్కరణల ఫలితంగా స్థాపితమైన ఉత్పత్తి, పంపిణీ సంస్థలు, వాటి పరిధులనూ తెలుసుకోవాలి.

నిరంతర అభివృద్ధికి ఆధారాలు

ఆంధ్రప్రదేశ్ - శక్తివనరులు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 25,500 మెగావాట్లు. ఇందులో శిలాజ ఇంధనాల నుంచి 13,890 మెగావాట్లు, జలవిద్యుత్తు కేంద్రాలు 3,050 మెగావాట్లు, పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 8,600 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ ఏటా సుమారు 8% పెరుగుతోంది.

విద్యుత్తు ఉత్పత్తి సంస్థలు

1) ఏపీ జెన్‌కో: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ప్రధాన విద్యుత్తు ఉత్పత్తి సంస్థ. థర్మల్, జల, సౌర విద్యుత్తు కేంద్రాలను నిర్మించి నిర్వహిస్తోంది.

2) ఏపీపీడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్): దీనిని ఏపీ జెన్‌కో, ఇతర సంస్థలతో కలిసి ఉమ్మడిగా ఏర్పాటు చేశారు.



3) ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ (న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్): పునరుత్పాదక ఇంధన వనరుల (సౌర, పవన విద్యుత్తు) అభివృద్ధి, ప్రోత్సాహానికి ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌టీపీసీ (నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్), ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్) కూడా ఏపీలో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఇవేకాకుండా అనేక ప్రైవేటు కంపెనీలు థర్మల్, గ్యాస్, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ద్వారా విద్యుత్తుఉత్పత్తి చేస్తున్నాయి.

థర్మల్ విద్యుత్తు కేంద్రాలు

1) విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (వీటీపీఎస్): విజయవాడ సమీపంలో కొండపల్లి-ఇబ్రహీంపట్నం మధ్య ఉంది. దీనికే 'నార్ల తాతారావు థర్మల్ పవర్‌స్టేషన్' అని పేరు. సామర్థ్యం 1760 మెగావాట్లు. దేశంలోనే అత్యధిక స్థాయిలో 98.7% మేలు రకం విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. దీనికి సింగరేణి కాలరీస్, ఒడిశాలోని తాల్చేర్ నుంచి బొగ్గు వస్తుంది.

2) సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ స్టేషన్: విశాఖపట్నం సమీపంలో పిట్టవానిపాలెం గ్రామం వద్ద జపాన్ సహకారంతో నిర్మించారు. సామర్థ్యం 2000 మెగావాట్లు. తాల్చేరు నుంచి బొగ్గు వస్తుంది.


3) నెల్లూరు థర్మల్ పవర్‌స్టేషన్ (సింహపురి): దీని సామర్థ్యం 145 మిలియన్ కిలోవాట్ అవర్స్.

4) దామోదరం సంజీవయ్య సూపర్ థర్మల్ పవర్ స్టేషన్: నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు గ్రామం వద్ద ఉంది. సామర్థ్యం 1600 మె.వా. 70% బొగ్గు తాల్చేరు నుంచి, 30% ఇండోనేసియా నుంచి వస్తుంది.

5) రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్: కడప జిల్లా ముద్దనూరు వద్ద ఉంది. సామర్థ్యం 1050 మెగావాట్లు. ➡ థర్మల్ విద్యుత్తు కేంద్రాల నుంచి వెలువడే బూడిద నిర్వహణ కోసం విద్యుత్తు శాఖ ప్రారంభించిన యాప్ - 'ASH TRACK'

సహజవాయు ఆధారిత విద్యుత్తు కేంద్రాలు

ఏపీలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో సహజ వాయు నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. 1988లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్యాస్ పవర్ కార్పొరేషన్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ సహజవాయు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది.


విజ్జేశ్వరం సహజవాయు ఆధారిత విద్యుత్తు కేంద్రం

విజ్జేశ్వరం: దేశంలోనే ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన మొదటి సహజవాయు ఆధారిత విద్యుత్తు కేంద్రం. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉంది. సామర్థ్యం 272 మె.వా. దీనికి ఓఎన్‌జీసీ సహజ వాయువును సరఫరా చేస్తుంది.

జేగురుపాడు: దేశంలో ప్రైవేటు రంగంలో ఏర్పాటైన మొదటి సహజవాయు విద్యుత్తు కేంద్రం. తూర్పుగోదావరి జిల్లా జేగురుపాడు వద్ద జీవీకే కంపెనీ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం (2015 నుంచి) ఏపీ ప్రభుత్వం దీనిని తీసుకుని గోదావరి గ్యాస్ పవర్ ప్లాంటుగా మార్చింది. సామర్థ్యం 216 మె.వా.

ఇతర సహజవాయు ఆధారిత విద్యుత్తు కేంద్రాలు: 1) జీఎంఆర్, వేమగిరి, తూర్పుగోదావరి-370 మెగావాట్లు. 2) బార్జ్ మాంటెప్, కాకినాడ-287 మె.వా. 3) గౌతమి, పెద్దాపురం-464 మె.వా. 4) స్పెక్ట్రమ్, కాకినాడ-208 మె.వా. 5) రిలయన్స్ ఎనర్జీ, సామర్లకోట 6) కోనసీమ గ్యాస్ పవర్ ప్లాంట్, కొత్తపేట-445 మె.వా. 7) లాంకోస్ జీవీపీ, కొండపల్లి-366 మె.వా.

జలవిద్యుత్తు కేంద్రాలు


మాచ్‌ఖండ్ జలవిద్యుత్తు కేంద్రం

1) మాచ్‌ఖండ్: ఏపీ ప్రభుత్వం నిర్మించిన మొదటి జలవిద్యుత్తు కేంద్రం. సామర్థ్యం 120 మెగావాట్లు. ఇందులో ఏపీ వాటా 84 మెగావాట్లు. 1955లో మాచ్‌ఖండ్ నదిపై ఉన్న డుడుమా జలపాతం కింద విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించారు. ఇది ఒడిశాలోని కోరాపుట్‌లో ఉంది.

2) నాగార్జునసాగర్ (కుడి కాలువ): దీని సామర్థ్యం 90 మెగావాట్లు. పల్నాడు జిల్లా సత్రశాల వద్ద టెయిల్‌పాండ్ ద్వారా మరో 50 మెగావాట్లు ఉత్పత్తి అవుతుంది.

3) ఎగువ సీలేరు: అల్లూరిజిల్లా మరగంట్యాడ వద్ద సీలేరు నదిపై ఉంది. సామర్థ్యం 240 మెగావాట్లు.

4) దిగువ సీలేరు: తడికలేరు వాగు వద్ద సీలేరు నదిపై ఉంది. సామర్థ్యం 460 మెగావాట్లు.


5) శ్రీశైలం: కర్నూలు జిల్లా నందికొట్కూరు వద్ద ఉంది. 'నీలం సంజీవరెడ్డి జలవిద్యుత్తు కేంద్రం'గా పిలుస్తారు. సామర్థ్యం 770 మె.వా. (ఇది పూర్తిగా ఏపీలో నిర్మించిన మొదటి జల విద్యుత్తు కేంద్రం. రాష్ట్రంలోనే అతిపెద్ద జలవిద్యుత్తు కేంద్రం.)

6) బలిమెల: ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో నిర్మించిన ఏపీ - ఒడిశా ఉమ్మడి ప్రాజెక్టు. ఇందులో ఏపీ వాటా 30 మెగావాట్లు.

7) డొంకరాయి: తూర్పు గోదావరి జిల్లా దిగువ సీలేరు నుంచి డొంకరాయి కాలువపై ఉంది. సామర్థ్యం 25 మెగావాట్లు.

8) పెన్నా అహోబిలం: అనంతపురం జిల్లా అహోబిలం వద్ద ఉంది. సామర్థ్యం 20 మె.వా.

9) చెట్టిపేట మినీ హైడల్ ప్రాజెక్టు, ఏలూరులో ఉంది. సామర్థ్యం ఒక మెగావాట్.


తిరుమల విండ్‌మిల్స్

పవన విద్యుత్తు: దేశంలో పవన విద్యుత్తు ఉత్పత్తిలో ఏపీ నాలుగో స్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మూడు పవన విద్యుత్తు కేంద్రాలున్నాయి. ✦ రామగిరి (రామగిరి పాడ్‌మిల్స్) (1994), 2 మెగావాట్లు ✦ తిరుమల (1996), 1 మె.వా. ✦ కొండపల్లి, 1 మె.వా. ✦ ప్రైవేటు రంగంలో. . 1. నర్మదా విండ్‌ఫామ్-అనంతపురం-50.04 మె.వా.; 2. పుట్లూరు ఆర్‌సీఐ విండ్‌ఫామ్, 20 మె.వా.



సౌర విద్యుత్తు: ✦ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ 1990లో ఏర్పాటైంది. ✦ అనంతపురం అల్ట్రా మెగా సోలార్ పార్క్-1500 మె.వా., నంబులపూలకుంట - అనంతపురం ✦ అనంతపురం మెగా సోలార్ పార్క్-తాడిపత్రి. ✦ కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్-1000 మె.వా. ✦ కడప అల్ట్రా మెగా సోలార్ పార్క్-కర్నూలు గాలివీడు మండలం-1000 మె.వా.

గొల్లవానితిప్ప సోలార్ కేంద్రం: ఏపీలో కాలువపై నిర్మించిన మొదటి సోలార్ విద్యుత్తు కేంద్రం. సామర్థ్యం 5 మెగావాట్. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో లోసరి కాలువపై ఏర్పాటు చేశారు.

అణు విద్యుత్తు: ఏపీలో నిర్మాణంలో ఉన్న అణువిద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు 1) కొవ్వాడ: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని కొవ్వాడ గ్రామంలో నిర్మిస్తున్నారు. దీనిలో ఆరు అణు రియాక్టర్లు ఉంటాయి. ఒక్కొటి 1594 మె.వా. చొప్పున మొత్తం సామర్థ్యం 9,564 మె.వా. 2) కావలి-కొత్తపట్నం: ప్రకాశం జిల్లా కొత్తపట్నం, నెల్లూరు జిల్లా కావలి మధ్య అణువిద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. సామర్థ్యం 6000 మె.వా.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు సరఫరా సంస్థ (ఏపీ ట్రాన్స్‌కో): విద్యుత్తు సంస్కరణల ఫలితంగా 1999, ఫిబ్రవరి 1న ఏర్పడింది. 2000, ఏప్రిల్ 1న ఏపీ ట్రాన్స్‌కోను నాలుగు డిస్కం(డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) లుగా విభజించారు. 1) ఏపీ ఈపీడీసీఎల్- ఏపీ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ 2) ఏపీ ఎస్‌పీడీసీఎల్ (సౌతర్న్) 3) ఏపీ సీపీడీసీఎల్ (సెంట్రల్) 4) ఏపీ ఎన్‌పీడీసీఎల్ (నార్తర్న్) ప్రస్తుతం ఏపీలో ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నాయి. ✦ ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం విశాఖపట్నంలో ఉంది. దీనిపరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాలు ఉంటాయి. ✦ ఏపీఎస్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం తిరుపతిలో ఉంది. దీని పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాలున్నాయి.





రచయిత: మండ సతీష్

కరెంట్ అఫైర్స్



◆ థాయ్‌లాండ్ నూతన ప్రధానిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు?
జ: అనుతిన్ చార్న్ విరాకుల్

◆ నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కింద బ్యాటరీ వ్యర్థాలు, ఇ-వ్యర్థాల నుంచి కీలకమైన ఖనిజ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎంత మొత్తంతో

మాదిరి ప్రశ్నలు

ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించింది? **జ:** రూ.1500 కోట్లు

◆ యూకే నూతన ఉప ప్రధానిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (పన్ను కుంభకోణం కారణంగా రాజీనామా చేసిన ఏంజెలా రేనర్ స్థానంలో ఈయన నియమితులయ్యారు. ఈయన న్యాయ కార్యదర్శి, లార్డ్ ఛాన్సలర్‌గా కూడా వ్యవహరిస్తారు.) **జ:** డేవిడ్ లామీ

◆ ఎప్పటివరకు దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిని రెట్టింపు చేయడానికి నీతి ఆయోగ్ తాజాగా ఓ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది? **జ:** 2047 (2030 నాటికి పప్పుధాన్యాల్లో స్వయంసమృద్ధిని సాధించాలని కూడా నీతి ఆయోగ్ లక్ష్యంగా పెట్టుకుంది.)


మరింత సమాచారం

స్పష్టంగా చెప్పాలంటే.. ఏడు సవాళ్లు దాటాల్సిందే! సాఫ్ట్ స్కిల్స్



చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగా, అవతలి వ్యక్తికి అర్థమయ్యే రీతిలో వ్యక్తీకరించడమే ప్రభావశీలమైన భావ వ్యక్తీకరణ. ఒక సందేశాన్ని పంపినప్పుడు పంపిన వ్యక్తి, అందుకున్నవారు కూడా దానిని సరైన రీతిలో అర్థం చేసుకోవాలి. లేకపోతే అది వృత్తిపరంగా, వ్యక్తిగతంగానూ ఇబ్బందులకు కారణమవుతుంది. అందుకే పెద్ద కంపెనీల్లో ఉద్యోగం సాధించడానికి, ఆ తర్వాత విజయవంతమైన కెరియర్ నిర్మాణానికి చక్కటి భావ వ్యక్తీకరణ ఎంతో అవసరం. అలాంటి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రతిఒక్కరూ ఏడు సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. అవి ఏమిటి? వాటితోపాటు భావ వ్యక్తీకరణను మెరుగుపరుచుకోవడానికి సాయపడే నిపుణుల సూచనలను తెలుసుకోవడానికి **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

దరఖాస్తు చేశారా?



☛ డీఆర్‌డీఓ-ఎల్ఆర్‌డీఈలో అప్రెంటిస్ ఖాళీలు (105)
చివరి తేదీ: 04.11.2025

☛ బెల్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ ఖాళీలు (162)
చివరి తేదీ: 04.11.2025


గాలి నాణ్యతను పెంచే భారత ప్రమాణాలు!



వాయు కాలుష్యానికి ప్రధాన కారణాల్లో రవాణా రంగంలో శిలాజ ఇంధనాల వినియోగం ఒకటి. రవాణా విస్తృతమైన కొద్దీ పర్యావరణ క్షీణతతోపాటు పీల్చే గాలిలో నాణ్యత దారుణంగా పడిపోతోంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా వేగంగా పురోగతి సాధిస్తున్న భారత్ ఇటీవల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలపై, ఆరోగ్యంపై దృష్టి సారించింది. అందులో భాగంగానే రవాణా రంగాన్ని పర్యావరణహితంగా మార్చేందుకు సిద్ధమైంది. పారిశ్రామిక, వ్యక్తిగత వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు 'భారత్ స్టేజ్' పేరుతో కఠినమైన ఉద్గార ప్రమాణాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. అదే విధంగా శిలాజ ఇంధనాల స్థానంలో పునరుత్పాదక జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ పరిణామక్రమం, సాధిస్తున్న ప్రగతి, సంబంధిత సాంకేతిక అంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

పర్యావరణం - రవాణా రంగం


1. కింది వాటిలో B20 అని పిలిచే బయోడీజిల్‌కు సాధారణ మిశ్రమ నిష్పత్తి ఏది?



   1) 20% బయోడీజిల్, 80% పెట్రోలియం డీజిల్
   2) 50% బయోడీజిల్, 50% పెట్రోలియం డీజిల్
   3) 80% బయోడీజిల్, 20% పెట్రోలియం డీజిల్
   4) 100% బయోడీజిల్

2. రవాణా రంగంలో బయోఇథనాల్ ప్రాథమిక ఉపయోగం ఏమిటి?
   1) డీజిల్ ఇంధనానికి ప్రత్యామ్నాయం
   2) ఆక్టేన్‌ను పెంచడానికి, ఉద్గారాలను తగ్గించడానికి పెట్రోల్‌తో బ్లెండింగ్ ఏజెంట్‌గా..
   3) ఇంజిన్లకు కందెనగా..
   4) వాహన రేడియేటర్లలో శీతలీకరణిగా..

3. బయో ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి కిణ్వప్రక్రియలో సాధారణంగా ఉపయోగించే సూక్ష్మజీవి ఏది?
   1) ఎశ్చరీషియా కోలి
   2) సాకరోమైసిస్ సెరివిసియా
   3) లాక్టోబాసిల్లస్ అసిడోఫిలస్
   4) బాసిల్లస్ సబ్టిలిస్


సాకరోమైసిస్ సెరివిసియా

4. బయోగ్యాస్‌ను ఆచరణీయ ఇంధన ఎంపికగా మార్చే ప్రధాన భాగం ఏది?
   1) కార్బన్‌డైఆక్సైడ్ 2) మీథేన్
   3) హైడ్రోజన్ సల్ఫైడ్ 4) నైట్రోజన్

5. కింది వాటిలో దేన్ని జీవఇంధన రూపంగా పరిగణించరు?
   1) బయోడీజిల్ 2) బయోఇథనాల్
   3) బయోగ్యాస్ 4) బొగ్గు

6. వంటనూనెలు, జంతువుల కొవ్వులను బయోడీజిల్‌గా మార్చే ప్రక్రియను ఏమంటారు?
   1) కిణ్వప్రక్రియ 2) ట్రాన్స్ ఎస్టరిఫికేషన్
   3) స్వేదనం 4) హైడ్రోజినేషన్

7. ఏ ఇథనాల్, పెట్రోల్ మిశ్రమాన్ని సాధారణంగా E10గా సూచిస్తారు?
   1) 10% ఇథనాల్, 90% పెట్రోల్
   2) 20% ఇథనాల్, 80% పెట్రోల్
   3) 100% ఇథనాల్
   4) 5% ఇథనాల్, 95% పెట్రోల్



8. సంప్రదాయ శిలాజ ఇంధనాల కంటే జీవ ఇంధనాలను ఉపయోగించడం వల్ల ప్రాథమిక ప్రయోజనం ఏమిటి?
   1) అధికశక్తి కంటెంట్
   2) పునరుత్పాదకం, సులభంగా తిరిగి నింపవచ్చు
   3) తక్కువ ఉత్పత్తి ఖర్చులు
   4) కర్బన ఉద్గారాలు లేవు

9. భారత్ స్టేజ్ ఉద్గార ప్రమాణాల ప్రాథమిక లక్ష్యం ఏమిటి?
   1) భారతదేశంలో ఇంధన ధరలను నియంత్రించడం.
   2) మోటారు వాహనాలతో సహా అంతర్గత దహన యంత్ర పరికరాల నుంచి వాయుకాలుష్య కారకాల ఉత్పత్తిని నియంత్రించడం.
   3) వాహన తయారీ ప్రక్రియలను ప్రామాణీకరించడం.
   4) భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం.

10. భారతదేశంలో భారత్ స్టేజ్ ఉద్గార ప్రమాణాలను ఏ సంస్థ ప్రారంభించింది?
   1) రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ
   2) పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి.
   3) ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా
   4) భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం

11. భారతదేశంలోని అన్ని వాహనాలు తప్పనిసరిగా యూరో 1 లేదా ఇండియా 2000 ప్రమాణానికి అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు ఏ సంవత్సరంలో ఆదేశించింది?
   1) 1996 2) 1995 3) 2005 4) 2010

12. భారతదేశానికి ఉద్గార ప్రమాణాల ఆధారంగా యూరో నిబంధనల అమలు కోసం రోడ్‌మ్యాప్‌ను ఏ కమిటీ సిఫార్సు చేసింది?
   1) కేల్కర్ కమిటీ 2) మషేల్కర్ కమిటీ
   3) నీతి ఆయోగ్ 4) ప్రణాళికా సంఘం

13. సల్ఫర్ కంటెంట్ పరంగా BS IV, BS VI ఇంధనాల మధ్య ముఖ్యమైన తేడా ఏమిటి?
   1) BS VI ఇంధనంలో BS IV కంటే ఎక్కువ సల్ఫర్ ఉంటుంది.



   2) BS VI ఇంధనంలో BS IV లో ఉన్న పరిమాణంలోనే సల్ఫర్ ఉంటుంది.
   3) BS VI ఇంధనంలో BS IV కంటే 80% తక్కువ సల్ఫర్ ఉంటుంది.
   4) BS VI ఇంధనంలో BS IV కంటే 50% తక్కువ సల్ఫర్ కంటెంట్ ఉంటుంది.

14. BS VIతో పోలిస్తే BS IV నిబంధనల ప్రకారం డీజిల్ కార్లకు నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గారాలు ఎంత శాతం తగ్గుతాయని భావిస్తున్నారు?
   1) 25% 2) 50% 3) 70% 4) 90%

పర్యావరణ అంశాలు

15. మెరుగైన ఉద్గార నియంత్రణ కోసం BS VI వాహనాల్లో కింది ఫీచర్లలో వేటిని ప్రవేశపెట్టారు?
   1) సెలెక్టివ్ క్యాటలిటిక్ రిడక్షన్
   2) డీజిల్ పార్టిక్యులేట్ ఫిల్టర్
   3) రియల్ డ్రైవింగ్ ఎమిషన్
   4) పైవన్నీ

16. BS VI వాహనాల్లో BS IV గ్రేడ్ ఇంధనాన్ని ఎందుకు ఉపయోగించలేరు?
   1) ఇది మరింత ఖరీదైంది.
   2) ఇది ఇంజిన్‌కు హాని కలిగించవచ్చు, ఉద్గారాలను పెంచుతుంది.
   3) ఇది భారతదేశంలో అందుబాటులో లేదు.
   4) ఇందులో ఆక్టేన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది.

17. GRAP కింద తీవ్రమైన కేటగిరీకి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పరిధి ఎంత?
   1) 201-300 2) 301-400
   3) 401-450 4) 450-500

18. భారతదేశం అంతటా BS VI ఉద్గార నిబంధనలు ఎప్పుడు అమల్లోకి వచ్చాయి?
   1) ఏప్రిల్ 1, 2018 2) ఏప్రిల్ 1, 2019
   3) ఏప్రిల్ 1, 2020 4) ఏప్రిల్ 1, 2021

19. దిల్లీ-NCRలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలుకు ఏ చట్టబద్ధమైన సంస్థ బాధ్యత వహిస్తుంది?
   1) నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్
   2) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి
   3) కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్
   4) పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ

20. డీజిల్ ఇంజిన్లలోని పార్టిక్యులేట్ ఉద్గారాలను అరికట్టడానికి BS VI వాహనాల్లో ఏ ప్రధాన మార్పును ప్రవేశపెట్టారు?
   1) ఉత్ప్రేరక కన్వర్టర్లు
   2) డీజిల్ పార్టిక్యులేట్ ఫిల్టర్
   3) ఎగ్జాస్ట్ గ్యాస్ రీసర్క్యులేషన్
   4) ఆక్సీకరణ ఉత్ప్రేరకాలు

21. భారత్ స్టేజ్ ఉద్గార ప్రమాణాల కింద ఏ కాలుష్య కారకాలను నియంత్రించారు?
   1) కార్బన్ మోనాక్సైడ్ 2) హైడ్రోకార్బన్లు
   3) నైట్రోజన్ ఆక్సైడ్లు 4) పైవన్నీ

22. భారతదేశం BS V నిబంధనలను దాటవేసి నేరుగా BS VIని ఎందుకు అమలు చేసింది?
   1) ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా.
   2) వాహన కాలుష్యాన్ని నియంత్రించడంలో జాప్యాన్ని తగ్గించడం.
   3) పట్టణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న గాలి నాణ్యతను పరిష్కరించడం. 4) పైవన్నీ

23. BS VI డీజిల్ వాహనాల్లో NOx నియంత్రణ కోసం కింది సాంకేతికతల్లో దేన్ని ఉపయోగిస్తున్నారు?
   1) డీజిల్ పార్టిక్యులేషన్ ఫిల్టర్
   2) సెలెక్టివ్ క్యాటలిటిక్ రిడక్షన్
   3) రియల్ డ్రైవింగ్ ఎమిషన్స్ టెస్టింగ్
   4) వేరియబుల్ జ్యామితి టర్బో ఛార్జర్లు


సెలెక్టివ్ క్యాటలిటిక్ రిడక్షన్

24. BS VI వాహనాల్లో 'రియల్ డ్రైవింగ్ ఎమిషన్స్' పరీక్ష దేన్ని కొలుస్తుంది?
   1) ప్రయోగశాల పరిస్థితుల్లో ఉద్గారాలు
   2) వాస్తవ-ప్రపంచ డ్రైవింగ్ పరిస్థితుల్లో ఉద్గారాలు
   3) నిష్క్రియా వాహనాల నుంచి ఉద్గారాలు
   4) హై-స్పీడ్ డ్రైవింగ్ సమయంలో మాత్రమే ఉద్గారాలు

25. BS VI ఇంజిన్లకు ఏ ఇంధనం అనుకూలంగా ఉంటుంది?
   1) రెగ్యులర్ పెట్రోల్, డీజిల్
   2) BS VI కంప్లైంట్ పెట్రోల్, డీజిల్
   3) ఇథనాల్ కలిపిన ఇంధనం మాత్రమే
   4) బయో-డీజిల్ మాత్రమే

26. BS VI ఇంధనంలో అనుమతించదగిన సల్ఫర్ పరిమితి ఎంత?
   1) 350 ppm 2) 150 ppm
   3) 50 ppm 4) 10 ppm

27. 2020లో BS VI అమల్లో ఏ వాహన విభాగంపై ప్రాథమిక దృష్టి పెట్టారు?
   1) ద్విచక్ర వాహనాలు 2) ప్యాసింజర్ కార్లు
   3) వాణిజ్య వాహనాలు 4) అన్ని వాహన వర్గాలు

28. BS VI వాహనాల్లో OBD అంటే ఏమిటి?
   1) ఆన్ బోర్డ్ డయాగ్నోస్టిక్స్ 2) ఆఫ్ బోర్డ్ డిటెక్షన్
   3) ఆన్ బోర్డ్ పరికరం
   4) ఆప్టిమైజ్డ్ బ్రేకింగ్ డిజైన్

29. భారతదేశంలో BS VII ఉద్గార నిబంధనల అమలు ప్రాథమిక లక్ష్యం ఏమిటి?




   1) వాహన తయారీ ఖర్చులు పెంచడం.
   2) ప్రపంచ ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా, వాహన కాలుష్యాన్ని తగ్గించడం.
   3) డీజిల్ వాహనాల అవసరాలను తగ్గించడం.
   4) ఇంధన సామర్థ్య అవసరాలను తగ్గించడం.

30. భారతదేశ BS VII నిబంధనలకు ఏ యూరోపియన్ ఉద్గారప్రమాణం ఆధారంగా పనిచేస్తుంది?
   1) యూరో 5 2) యూరో 6
   3) యూరో 7 4) యూరో 8

సమాధానాలు

1-1, 2-2, 3-2, 4-2, 5-4, 6-2, 7-1, 8-2, 9-2, 10-2, 11-2, 12-2, 13-3, 14-3, 15-4, 16-2, 17-3, 18-3, 19-3, 20-2, 21-4, 22-4, 23-2, 24-2, 25-2, 26-4, 27-4, 28-3, 29-4, 30-2.



శరీర రోగనిరోధక వ్యవస్థ రక్షణలో ప్రోటీన్ల పాత్ర ముఖ్యమైంది. ఎంజైమ్‌లు ప్రోటీన్ స్వభావాన్ని కలిగి ఉండి, జీవరసాయన క్రియలను వేగవంతం చేస్తాయి. కాబట్టి వీటిని జీవఉత్ప్రేరకాలు అంటారు. ప్రోటీన్లతోనే అమైనో ఆమ్లాల నిర్మాణం జరుగుతుంది. వీటిలో ఆల్ఫా, బీటా, గామా అమైనో ఆమ్లాలు కీలకమైనవి. ఇవి జీవరసాయన పరంగా ప్రముఖపాత్ర వహిస్తాయి. అమైనో ఆమ్లాల నిర్మాణం, లక్షణాలు, శరీర భాగ నిర్మాణ పదార్థాలుగా ప్రోటీన్ల పాత్ర తదితర విషయాలపై పోటీపరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
కెమిస్ట్రీ


అమైనో ఆమ్లాలు
ప్రోటీన్ల నిర్మాణ ఘటకాలు

అమైనో ఆమ్లాలు

అమైనో ఆమ్లాలు ప్రోటీన్ల నిర్మాణ ఘటకాలుగా ఉంటాయి. అంటే ప్రోటీన్లు అమైనో ఆమ్లాల కలయికతో ఏర్పడిన బృహదణువులు.


✦ అమైనో ఆమ్లాలు అమైన్ సమూహం (–NH_2), కార్బాక్సిల్ సమూహం (–COOH) రెండింటినీ కలిగి ఉండే కర్బన సమ్మేళనాలు. ఇవి ఒకే అణువులో ఆమ్ల, క్షార లక్షణాలు ప్రదర్శిస్తాయి.

✦ అమైనో ఆమ్లాలను సాధారణంగా కింది విధంగా సూచిస్తారు.



✦ ఇక్కడ, –R అనేది పార్శ్వ శృంఖలం. ఒక భిన్నమైన సమూహంగా ఉంటుంది. ఈ –R సమూహం అమైనో ఆమ్లానికి ప్రత్యేక స్వభావాన్ని ఇస్తుంది.

✦ రెండు అమైనో ఆమ్లాలు కలిసినప్పుడు ఒక నీటి అణువును కోల్పోయి పెప్టైడ్ బంధం ఏర్పడుతుంది. ఈ రసాయనిక చర్యలో ఒక అమైనో ఆమ్లపు కార్బాక్సిల్ సమూహం (–COOH), రెండో అమైనో ఆమ్లపు అమైన్ సమూహం (–NH_2) మధ్య చర్య జరుగుతుంది.



✦ రెండు అమైనో ఆమ్లాల మధ్య బంధాన్ని డైపెప్టైడ్ అని, మూడు అమైనో ఆమ్లాల మధ్య బంధాన్ని ట్రైపెప్టైడ్ అని, వందల అమైనో ఆమ్లాల మధ్య బంధాన్ని పాలీపెప్టైడ్ అని అంటారు.

✦ ఎక్కువ అణుభారాలున్న పాలీపెప్టైడ్ గొలుసులను ప్రోటీన్ అంటారు.

✦ ప్రోటీన్ల నిర్మాణంలో అమైనో ఆమ్లాల అమరిక క్రమం ఆ ప్రోటీన్ విధులను నిర్ధారిస్తుంది.

α, β, γ అమైనో ఆమ్లాలు


అమైనో ఆమ్లంలోని కార్బాక్సిలిక్ ఆమ్లం సమూహానికి పక్కనున్న కార్బన్‌ను α (ఆల్ఫా) కార్బన్ అంటారు. దాన్ని అనుసరించి వచ్చే రెండో, మూడో కార్బన్‌లను వరుసగా β (బీటా), γ (గామా) కార్బన్లు అంటారు.

☛ కార్బాక్సిల్ గ్రూపునకు సంబంధించి అమైనో గ్రూపునకు చెందిన సాపేక్ష స్థానం ఆధారంగా అమైనో ఆమ్లాలను ఆల్ఫా, బీటా, గామా అమైనో ఆమ్లాలుగా వర్గీకరించవచ్చు.

α – అమైనో ఆమ్లాలు:

అమైన్ సమూహం α - కార్బన్‌పై ఉన్నప్పుడు దాన్ని α - అమైనో ఆమ్లం అంటారు.

ఉదా: గ్లైసిన్, అలనైన్, వాలిన్, ల్యూసిన్, సెరిన్, ఫినైల్ అలనైన్ మొదలైనవి.



(గ్లైసిన్ నిర్మాణం) (అలనైన్ నిర్మాణం)

లక్షణాలు: ఆల్ఫా అమైనో ఆమ్లాలు ప్రోటీన్ల నిర్మాణ అనుఘటకాలు. ఇవి జీవ రసాయనపరంగా అత్యంత ముఖ్యమైనవి.

❖ 20 వరకు ఉండే ప్రామాణిక ఆల్ఫా అమైనో ఆమ్లాలు ప్రోటీన్ల సంశ్లేషణ, ఇతర జీవప్రక్రియల్లో సహాయపడతాయి.

❖ ఆల్ఫా అమైనో ఆమ్లాలు జ్విట్టర్ అయాన్ల రూపంలో ఉంటాయి.

❖ ఇవి ఆమ్లాలు, ధ్రువ ద్రావణమైన నీటిలో కరుగుతాయి.

❖ ఆల్ఫా అమైనో ఆమ్లాలు బీటా, గామా అమైనో ఆమ్లాల కంటే స్థిరంగా ఉంటాయి.

β – అమైనో ఆమ్లాలు:

అమైన్ సమూహం β - కార్బన్‌పై ఉన్నప్పుడు దాన్ని β - అమైనో ఆమ్లం అంటారు.

ఉదా: β - అలనైన్ ($NH_2 – CH_2 – CH_2$ – COOH), β - అమైనో బ్యూటిరిక్ ఆమ్లం (BABA).

లక్షణాలు: ఇవి సాధారణంగా ప్రోటీన్ల నిర్మాణంలో పాలుపంచుకోవు.

❖ β - అమైనో ఆమ్లాలు జీవక్రియలో సహాయక పాత్ర పోషిస్తాయి. కొన్ని జీవ రసాయనాల్లో ముఖ్యంగా విటమిన్ B_5 (పాంటోథెనిక్ ఆమ్లం) నిర్మాణంలో భాగంగా ఉంటాయి.

❖ β - అలనైన్ శరీరంలో కోఎంజైమ్ - A నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది.

γ – అమైనో ఆమ్లాలు:

అమైన్ సమూహం γ - కార్బన్‌పై ఉన్నప్పుడు దాన్ని γ - అమైనో ఆమ్లం అంటారు.

ఉదా: γ - అమైనో బ్యూటిరిక్ ఆమ్లం (GABA) ($NH_2 – CH_2 – CH_2 – CH_2$ – COOH)

లక్షణాలు: ప్రోటీన్లలో ఉండవు, కానీ జీవక్రియలో చాలా ముఖ్యమైనవి.

❖ γ -బ్యూటిరిక్ ఆమ్లం కేంద్ర నాడీ వ్యవస్థలో నాడీ ప్రసారక పదార్థంగా పనిచేస్తుంది. GABA నాడీ సంకేతాల నియంత్రణలో కీలకం.

❖ ఇది నాడీ కణాల మధ్య సంకేతాల ప్రసారాన్ని నియంత్రిస్తుంది. అదేవిధంగా మెదడులో ఉత్ప్రేరకాలను తగ్గిస్తుంది.



రచయిత
డా. పి. భానుప్రకాష్
అసిస్టెంట్ ప్రొఫెసర్

ప్రోటీన్లు

జీవి మనుగడకు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, న్యూక్లియిక్ ఆమ్లాలు ఎంతో ముఖ్యమో, మాంసకృత్తులు (ప్రోటీన్లు) కూడా మిక్కిలి ఆవశ్యకమైనవి.

✦ వివిధ రకాల ప్రోటీన్లు జంతు, వృక్ష జీవనంలో అత్యంత ముఖ్యమైన విధులను నిర్వర్తించే బృహదణువులుగా ఉంటాయి. ప్రోటీన్లు జీవకణాల మౌలిక నిర్మాణం, జీవక్రియల్లో ముఖ్యపాత్రను పోషిస్తాయి.

✦ ప్రోటీన్లు వివిధ శరీర భాగాలకు నిర్మాణ పదార్థాలుగా ఉంటాయి. కొల్లాజెన్, కెరాటిన్, ఎలాస్టిన్, ఫైబ్రోయిన్, ఆక్టిన్, మయోసిన్ లాంటి ప్రోటీన్లు శరీరంలోని కణజాలాల ఏర్పాటు, నిర్మాణంతో పాటు రక్షణను అందిస్తాయి.

కొల్లాజెన్: శరీరంలో అత్యధిక పరిమాణంలో ఉండే ప్రోటీన్. చర్మం, ఎముకలు, కండరాలు మొదలైన వాటిలో ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరానికి బలాన్ని ఇస్తుంది.

కెరాటిన్: ఇది జుట్టు, గోళ్లు, చర్మం, కొమ్ములు, పక్షుల ఈకలు మొదలైన వాటిలో ఉంటుంది. కెరాటిన్ శరీరానికి రక్షణను అందిస్తుంది.

ఎలాస్టిన్: ఇది చర్మం, ఊపిరితిత్తులు, ధమనుల లాంటి భాగాల్లో ఉంటుంది. ఈ ప్రోటీన్ చర్మానికి స్థితిస్థాపకతను ఇస్తుంది. అంటే చర్మం లాగిన తర్వాత తిరిగి మామూలు స్థితికి రావడానికి సహాయపడుతుంది.

ఆక్టిన్, మయోసిన్: ఇవి కండరాల నిర్మాణంలో ప్రధానమైన ప్రోటీన్లు. కండరాల సంకోచం, చలనంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి.

▌హార్మోన్లు దాదాపుగా ప్రోటీన్ స్వభావాన్ని కలిగినవే. రక్తంలోని ఇమ్యూనోగ్లోబిన్ల రూపంలో ఉండే ప్రోటీన్లు యాంటీబాడీలుగా పనిచేసి, శరీర రోగనిరోధక వ్యవస్థను పరిరక్షించడంలో ముఖ్యపాత్రను పోషిస్తాయి.

▌రక్తం ద్వారా ఆక్సిజన్ రవాణా, కొవ్వుల రవాణాలో సహకరించే ప్రోటీన్లను రవాణా ప్రోటీన్లు అంటారు.

▌ప్రోటీన్లలో ప్రధాన మూలకాలు కార్బన్ (C), హైడ్రోజన్ (H), ఆక్సిజన్ (O), నైట్రోజన్ (N), కొన్నిసార్లు సల్ఫర్ (S).

▌జీవుల శరీరంలో ప్రోటీన్ల శాతం సుమారు 15-20% ఉంటుంది.

819 Word of the Day

Erode

Telugu meaning: తుప్పుపట్టడం, క్రమంగా నశించడం

English meaning: The word erode (ఎరోడ్) is a verb that means to gradually wear away or destroy something, usually by natural forces or continuous action.

Synonyms: Corrode, Deteriorate

Antonyms: Strengthen, Fortify

Usage: 1. Over time, constant rainfall began to erode the walls of the ancient fort.

2. Corruption and negligence can erode the public's trust in government institutions.

కరెంట్ అఫైర్స్



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ (62) తెలంగాణ రాష్ట్ర మంత్రిగా 2025, అక్టోబరు 31న ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. అజారుద్దీన్‌తో ప్రమాణం చేయించారు.

☛ 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జన్మించిన అజారుద్దీన్ అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య, నిజాం కళాశాలలో డిగ్రీ అభ్యసించారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టి, తొలి మూడు టెస్టుల్లోనే వరుస సెంచరీలు సాధించి సంచలనం సృష్టించారు.



భారత పురుషుల హాకీ జట్టు మాజీ గోల్‌కీపర్ మాన్యుయెల్ ఫ్రెడరిక్ (78) 2025, అక్టోబరు 31న బెంగళూరులో కన్నుమూశారు. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో ఫ్రెడరిక్ సభ్యుడు. 2019లో కేంద్ర ప్రభుత్వం నుంచి మేజర్ ధ్యాన్‌చంద్ జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్నారు.



తూర్పు నావికాదళ చీఫ్ (ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్)గా వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా 2025 అక్టోబరు 31న నియమితులయ్యారు. కమాండ్ ముఖ్య కార్యాలయం ఐఎన్ఎస్ సర్కార్స్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఎన్‌సీ చీఫ్‌గా పనిచేసిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ స్థానంలో ప్రస్తుత నియామకం జరిగింది. సంజయ్ భల్లా 1989 జనవరి 1న భారత నౌకాదళంలో చేరారు.

దేశ రక్షణ దళాల కోసం మానవ రహిత విమానాలను దేశీయంగా తయారు చేసేందుకు అమెరికా సంస్థ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్, ఇంక్ (జీఏ-ఏఎస్ఐ)తో మౌలిక రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద ఇరు కంపెనీలు కలిసి మీడియం ఆల్టిట్యూట్ లాంగ్ ఎండ్యూరన్స్ (ఎమ్ఏఎల్ఈ) రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ (ఆర్‌పీఏఎస్)ను భారత్‌లో తయారు చేస్తాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ బయోస్ఫియర్ రిజర్వ్‌ల దినోత్సవం



నవంబరు 3
చరిత్రలో ఈనాడు

పర్యావరణ పరిరక్షణలో, జీవవైవిధ్య రక్షణలో అడవుల పాత్ర కీలకం. మానవ కార్యకలాపాల ఫలితంగా వీటి విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. దీంతో పర్యావరణ సమతౌల్యానికి విఘాతం కలుగుతోంది. అడవులు తరిగిపోవడంతో వన్యప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక మొక్కలు, జంతువులు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వాటిని రక్షించేందుకు ఏర్పాటు చేసినవే బయోస్ఫియర్ రిజర్వ్‌లు. వీటి గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా నవంబరు 3న 'అంతర్జాతీయ బయోస్ఫియర్ రిజర్వ్‌ల దినోత్సవం'గా నిర్వహిస్తారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో, స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో జీవావరణ కేంద్రాల ప్రాముఖ్యతను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

బయోస్ఫియర్ రిజర్వ్‌లు

యునెస్కో ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 138 దేశాల్లో 738 బయోస్ఫియర్ రిజర్వ్‌లు ఉన్నాయి. వాటిలో 22 ట్రాన్స్‌బౌండరీ సైట్‌లు. అంటే అవి అంతర్జాతీయ సరిహద్దుల్లో విస్తరించి ఉన్నాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ దేశాలకు వాటితో సంబంధం ఉంటుంది.

చారిత్రక నేపథ్యం: ప్రజలకు, పర్యావరణానికి మధ్య సంబంధాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో యునెస్కో 1971, నవంబరు 3న మాన్ అండ్ ది బయోస్ఫియర్ (ఎంఏబీ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. 2021 నవంబరు 9 నుంచి 24 మధ్య పారిస్‌లో యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ 41వ సమావేశం జరిగింది. ఎంఏబీ ప్రోగ్రాం ప్రారంభమై 50 ఏళ్లు అయిన సందర్భంగా ఏటా నవంబరు 3న 'అంతర్జాతీయ బయోస్ఫియర్ రిజర్వ్‌ల దినోత్సవం'గా జరుపుకోవాలని ఆ సమావేశంలో తీర్మానించారు.

అంతర్జాతీయ బయోస్ఫియర్ రిజర్వ్‌ల దినోత్సవాన్ని ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు? 2025 నినాదం ఏమిటి? భారత్‌లోని బయోస్ఫియర్ రిజర్వ్‌ల గురించి పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పర్యావరణ వ్యవస్థ - క్రియాత్మక అంశాలు

ఆవరణ వ్యవస్థ అనేది జీవాన్ని నిలబెట్టేందుకు సంఘర్షణ చెందే జీవసంబంధమైన, నిర్జీవాత్మక కారకాలతో కూడిన ఒక గతిక వ్యవస్థ. పర్యావరణ వ్యవస్థ క్రియాత్మక అంశాలుగా శక్తి ప్రవాహం, భూ జీవరసాయన వలయాలు, పర్యావరణ ఉత్పాదకతను చెప్పవచ్చు. ఇది జీవ ప్రక్రియల స్థిరత్వం, ఉనికిని నిర్ధారిస్తుంది.

పర్యావరణ వ్యవస్థల్లో శక్తి ప్రవాహం

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది ఆహార గొలుసులో జరిగే శక్తి బదిలీ, వినియోగాన్ని సూచిస్తుంది. పర్యావరణ వ్యవస్థలో పోషక చక్రాలు, శక్తి ప్రవాహం జీవ, నిర్జీవ భాగాలను ఒకదానితో ఒకటి బంధిస్తాయి.

శక్తి ప్రవాహం దశలు

☛ మొదటి దశ ☛ రెండో దశ
☛ మూడో దశ ☛ నాలుగో దశ


శక్తి ప్రవాహం ప్రాముఖ్యత

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది మనుగడలో భాగంగా జరుగుతుంది. జీవులన్నీ పనిచేయడానికి శక్తిపైనే ఆధారపడతాయి. ఆ శక్తిని పొందడానికి పర్యావరణ వ్యవస్థలో తమ తోటి జీవులపై ఆధారపడతాయి.

బయోజియోకెమికల్ సైకిల్స్

బయోజియోకెమికల్ సైకిల్స్ ప్రధానంగా బయోటిక్, అబయోటిక్ కారకాల మధ్య పోషకాలు, ఇతర మూలకాల కదలికను సూచిస్తాయి.

☛ నీటి చక్రం
☛ కార్బన్ చక్రం
☛ నైట్రోజన్ చక్రం
☛ ఆక్సిజన్ చక్రం



ట్రోఫిక్ స్థాయుల సోపాన క్రమం, శక్తి ప్రవాహ నియంత్రణ నియమాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts In the District Child Protection Unit

Applications are invited for the Staff Nurse, P.T and Yoga Teacher, Store Keeper cum Accountant, Social Worker, etc. posts on a contract and contractual basis in Specialised Adoption Agencies (SAA), Sishugruha, Ongole, Children Homes" Ongole and Giddalur, Prakasam district. The total no. of posts is 16. Eligible candidates can apply online before 8 November 2025.

Apprentice Posts

National Mineral Development Corporation Limited (NMDC) in Dantewada, Chhattisgarh, is conducting walk-in interviews for the recruitment of Graduate, Technician, and Trade Apprentice posts in the following departments. The total no. of posts is 197. The interview dates are 12 November 2025 to 21 November 2025.

Did You Apply..?

Today (November 3) is the last date for the following Jobs

◆ 18 Senior Resident posts in JIPMER. ***Eligibility:*** Degree, PG, MD/MS/DNB/DM.

◆ 174 Medical Faculty Jobs at Baba Farid University. ***Eligibility:*** M.Sc. or PhD.

◆ 34 Jobs in NHIDCL.***Eligibility:*** Degree.

◆ Project Staff posts in CSIR-NEIST. ***Eligibility:*** BE/B.Tech, MCA, M.Sc, M.Tech.

For more information and other notifications - scan QR code

SSC Exams
English

One Word Substitution

Directions (Qs. 1 - 27): *Choose the correct one-word substitution of the given phrase/sentence.*

1. A person who pretends to have knowledge
A) Charlatan B) Scholar
C) Expert D) Amateur

2. The art of effective or persuasive speaking or writing
A) Dialectics B) Semantics
C) Rhetoric D) Syntax

3. A person who derives pleasure from inflicting pain on others
A) Masochist B) Sadist
C) Narcissist D) Egoist

4. A person who eats human flesh
A) Omnivore B) Herbivore
C) Carnivore D) Cannibal

5. A speech made without any previous preparation
A) Extempore B) Monologue
C) Dialogue D) Soliloquy

6. A medicine that induces sleep
A) Narcotic B) Stimulant
C) Antidote D) Sedative

7. A person who works only for personal gain
A) Patriot B) Mercenary
C) Altruist D) Volunteer

8. A person who can endure pain or hardship without showing feelings
A) Pessimist B) Cynic
C) Stoic D) Realist

9. One who studies ancient objects and relics
A) Archaeologist B) Geologist
C) Historian D) Anthropologist

10. A person who can use both hands with equal skill
A) Dexterous B) Ambidextrous
C) Versatile D) Skilled

11. A person who draws maps
A) Photographer B) Choreographer
C) Cartographer D) Calligrapher

12. A person who does not take sides in a dispute
A) Diplomat B) Arbitrator
C) Mediator D) Neutral

13. One who leaves his country to settle in another
A) Immigrant B) Refugee
C) Emigrant D) Nomad

14. A person who is talkative and fond of gossiping
A) Garrulous B) Reticent
C) Taciturn D) Introvert

15. A person who writes dictionaries
A) Novelist B) Lexicographer
C) Biographer D) Editor

16. A person who spends money wastefully
A) Miser B) Beggar
C) Pauper D) Spendthrift

17. A person who attacks established beliefs or institutions
A) Iconoclast B) Rebel
C) Dissident D) Radical

18. A large group of stars forming a system
A) Universe B) Constellation
C) Galaxy D) Cluster

19. A person who is extremely careful about details and accuracy
A) Vigilant B) Narcissist
C) Cautious D) Meticulous

20. A person who is unable to pay his debts
A) Bankrupt B) Insolvent
C) Pauper D) Debtor

21. A person who studies the origin and development of human societies and cultures
A) Archaeologist B) Sociologist
C) Anthropologist D) Philologist

22. A person who works for free, usually for charity
A) Donor B) Volunteer
C) Benefactor D) Altruist

23. A person who is always dissatisfied or complaining
A) Pessimist B) Faultfinder
C) Grumbler D) Malcontent

24. A system of government where priests rule in the name of God
A) Theocracy B) Democracy
C) Aristocracy D) Autocracy

25. One who believes that pleasure is the chief good of life
A) Philanthropist B) Egoist
C) Hedonist D) Realist

26. A person who is extremely fond of one's country
A) Patriot B) Nationalist
C) Chauvinist D) Loyalist

27. A person who can speak two languages fluently
A) Linguist B) Polyglot
C) Bilingual D) Orator

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

ఉద్యోగాల రైలు వచ్చింది!

ఇంటర్మీడియట్ విద్యార్హతతో కేంద్రంలో కొలువుదీరే అవకాశం వచ్చింది. నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ(ఎన్‌టీపీసీ)లో 3058 పోస్టుల భర్తీకి రైల్వే నియామక బోర్డు(ఆర్ఆర్‌బీ)లు ఆహ్వానం పలుకుతున్నాయి. పరీక్షలో మెరిస్తే చాలు.. కొలువుల రైలులో పోస్టు ఖాయమైనట్లే.

ఆర్ఆర్‌బీలు నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్(ఎన్‌టీపీసీ) విభాగంలో డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్హతలతో ప్రకటనలు వెలువరిస్తున్నాయి. ఇప్పటికే డిగ్రీతో 5810 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ సారి ఇంటర్మీడియట్‌తో అవకాశమొచ్చింది. ఎన్‌టీపీసీ ఇంటర్, డిగ్రీ కొలువులకు పరీక్ష విధానం, సిలబస్ ఒకటే. డిగ్రీతో రెండిటికీ పోటీ పడొచ్చు. పరీక్షలు విడిగానే జరుగుతాయి. డిగ్రీతో పోలిస్తే ఇంటర్మీడియట్ పోస్టుల ప్రశ్నపత్రం కొంచెం తేలికగానే ఉంటుంది. కానీ, పోటీ మాత్రం వీటికే ఎక్కువ. ఇంటర్‌తోపాటు డిగ్రీ, పీజీ..అర్హతలు ఉన్నవారంతా పోటీపడటమే కారణం. పరీక్ష కోసం తెలుగు మాధ్యమాన్నీ ఎంచుకోవచ్చు. అభ్యర్థులు ఏదో ఒక ఆర్ఆర్‌బీలోని ఖాళీలకే పోటీ పడగలరు.

ఎన్‌టీపీసీ ఇంటర్‌లో.. కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్-2424, అకౌంట్స్ క్లర్క్ కం టైపిస్ట్-394, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్-163, ట్రెయిన్స్ క్లర్క్-77 ఖాళీలు ఉన్నాయి. వీటిలో కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్ కొలువులకు లెవెల్-3 రూ.21,700 మూలవేతనంతో అన్నీ కలిపి సుమారు రూ.40వేలు పొందవచ్చు. మిగిలినవి లెవెల్-2 ఉద్యోగాలు. రూ.19,900 మూలవేతనంతో సుమారు రూ.36వేలు మొదటి నెల నుంచే అందుకోవచ్చు.

ఎంపిక: అన్ని పోస్టులకూ రెండు దశల్లో నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ)లో ప్రావీణ్యం చూపాలి. టైపిస్ట్ (అకౌంట్స్ క్లర్క్, జూనియర్ క్లర్క్) పోస్టులకు టైపింగ్ స్కిల్ టెస్టు(టీఎస్‌టీ) నిర్వహిస్తారు. ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగంలోకి తీసుకుంటారు.

స్టేజ్-1: వంద ప్రశ్నలు. వీటికి 90 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ 40, మ్యాథమెటిక్స్ 30, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 30 ప్రశ్నలు వస్తాయి.

స్టేజ్-2: స్టేజ్-1లో అర్హత పొందినవారి నుంచి, కేటగిరీల వారీ ఉన్న ఖాళీలకు మెరిట్ ప్రకారం 15 రెట్ల మందిని స్టేజ్-2కు అవకాశమిస్తారు. దీన్ని 120 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. జనరల్ అవేర్‌నెస్ 50, మ్యాథమెటిక్స్ 35, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 35 ప్రశ్నలు వస్తాయి.

అర్హతకు: స్టేజ్-1, స్టేజ్-2 లలో అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ 40, ఓబీసీ ఎన్‌సీఎల్, ఎస్సీ 30, ఎస్టీ 25 శాతం మార్కులు పొందాలి. రెండు దశల్లోనూ ప్రతి తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు.

కంప్యూటర్ బేస్డ్ టైపింగ్ స్కిల్ టెస్ట్(సీబీటీఎస్‌టీ): జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ టైపింగ్ స్కిల్ టెస్టు(సీబీటీఎస్‌టీ) ఉంటుంది. స్టేజ్-2లో అర్హుల జాబితా నుంచి మెరిట్ ప్రకారం కేటగిరీల వారీ ఖాళీలకు 8 రెట్ల సంఖ్యలో అభ్యర్థులకు టైపింగ్ స్కిల్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తే సరిపోతుంది. ఇంగ్లిష్‌లో నిమిషానికి 30 హిందీ అయితే 25 పదాలు టైప్ చేయాలి.



ఇంటర్‌తో 3058 పోస్టులు

సన్నద్ధత

- పరీక్షలో విజయానికి ముందుగా చేయాల్సింది.. విభాగాల వారీ సిలబస్ వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలి. వాటికి సంబంధించిన వనరులు(స్టడీ మెటీరియల్-ఆఫ్‌లైన్, ఆన్‌లైన్) సిద్ధం చేసుకోవాలి.
- స్టేజ్-1, స్టేజ్-2 సిలబస్ ఒకటే. అందువల్ల ఒకే సన్నద్ధతతో రెండు దశలనూ ఎదుర్కోవచ్చు. ముందు ప్రాథమికాంశాలు పూర్తిగా చదవాలి. తర్వాత తేలిక, మధ్య స్థాయి ప్రశ్నలు బాగా సాధన చేయాలి.
- విభాగాల వారీ రోజూ ఒక అంశాన్ని బాగా చదవాలి. అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే ముఖ్యాంశాలూ నోట్సు రాసుకోవాలి.
- సిలబస్ క్షుణ్ణంగా చదివి, మాదిరి ప్రశ్నలు సాధన చేయడం 3 నెలలలో పూర్తి చేయాలి.
- పరీక్షపై స్పష్టమైన అవగాహనకు పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం, వాటిని సాధన చేయడం తప్పనిసరి. వీటి నుంచి ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.
- పరీక్షకు నెల ముందు నుంచీ రోజూ మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకుని, స్కోరు పెంచుకోవడానికి కృషి చేయాలి.
- రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి.
- పరీక్షలో విజయానికి వేగం, కచ్చితత్వం రెండూ కీలకం. ముందస్తు సాధన ద్వారా ఈ రెండిటిపై పట్టు లభిస్తుంది.
- పరీక్ష సన్నద్ధత కోసం ఏ పుస్తకాలు ఎంచుకున్నప్పటికీ, పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితమై, వాటినే బాగా సాధన చేయాలి.
- స్టేజ్-1, 2ల్లో ఎక్కువ ప్రాధాన్యం జనరల్ అవేర్‌నెస్‌దే. అందువల్ల అధిక సమయం ఈ విభాగానికి కేటాయించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వర్తమాన వ్యవహాల కోసం ఏప్రిల్ 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు గుర్తుంచుకోవాలి. పత్రికలు చదువుతున్నప్పుడే ప్రశ్నగా రావడానికి అవకాశం ఉన్నవాటిని నోట్సు రాసుకుంటే.. పరీక్షకు ముందు తక్కువ వ్యవధిలోనే మరోసారి పునశ్చరణ చేసుకోవచ్చు. సీబీఎస్ఈ 8,9,10 తరగతుల సైన్స్, సోషల్ పుస్తకాలు బాగా చదివి ముఖ్యమైన విషయాలు నోట్సు రాసుకోవాలి.

వివరాలు

అర్హత: ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సులో 50 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. డిగ్రీ లేదా పీజీ విద్యార్హత ఉంటే ఇంటర్‌లో 50 శాతం మార్కులు లేకపోయినా అర్హులే. **వయసు:** జనవరి 1, 2026 నాటికి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం 10-15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 27.11.2025

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జండర్, ఈబీసీలకు రూ.250. వీరు సీబీటీకి హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, మిగిలిన ఫీజు వెనక్కి చెల్లిస్తారు. ఇతర వర్గాల వారికి ఫీజు రూ.500. వీరు సీబీటీకి హాజరైతే రూ.100+బ్యాంకు ఛార్జీలు మినహాయించి మిగిలినవి వెనక్కి ఇస్తారు. **పరీక్ష తేదీలు:** తర్వాత ప్రకటిస్తారు.

వెబ్‌సైట్: https://www.rrbapply.gov.in/

స్కూలు పెట్టాలంటే...



బీటెక్ (ఈఈఈ), ఎంబీఏ (మార్కెటింగ్) పూర్తి చేశాను. బిజినెస్ అనలిస్టుగా పనిచేస్తున్నాను. వయసు 26 సంవత్సరాలు. బోధించడమంటే చాలా ఇష్టం. భవిష్యత్తులో స్కూలు ప్రారంభించాలనుంది. అందుకోసం బీఈడీ కోర్సు చదవాలా? లేదా ప్రవేశ పరీక్షలు ఏమైనా రాయాలా?

– సంతోష్ మేకల

■ మీరు బీటెక్, ఎంబీఏ (మార్కెటింగ్) పూర్తి చేసి స్కూలు నడపాలని అనుకోవడం మంచి ఆలోచనే. ఎందుకంటే, బీటెక్ ద్వారా.. లాజికల్, అనలిటికల్ నైపుణ్యాలు, ఎంబీఏతో.. బిజినెస్, మార్కెటింగ్, లీడర్‌షిప్, డెసిషన్ మేకింగ్, మోటివేషన్ నైపుణ్యాలు పొంది ఉండే అవకాశం ఉంది. కాబట్టి, సొంతంగా స్కూలు నిర్వహించడం సులువవుతుంది. మీరు బీటెక్, ఎంబీఏ చేసినప్పటికీ, బోధనా వృత్తికి సంబంధించిన అంశాలపై అవగాహన ఎక్కువగా ఉండే అవకాశం లేనందున బీఈడీ చేయడం ఉపయోగకరం. బీటెక్ చేసినవారికి గతంలో బీఈడీ చేసే అవకాశం ఉండేది కాదు. గత కొన్నేళ్ల నుంచీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ వాళ్లు.. బీటెక్ చేసినవారికి కూడా బీఈడీ చదివే వెసులుబాటు కల్పించారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ జరిగిన ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాల్లో చాలామంది బీటెక్, బీఈడీ చేసిన అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. కాబట్టి, మీరు నిరభ్యంతరంగా బీఈడీ చేసి, ఏదైనా కార్పొరేట్/ప్రైవేట్ పాఠశాలలో కొంతకాలం పనిచేసి, స్కూలు నిర్వహించడంలో ఉన్న సవాళ్ల గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయండి. బీఈడీ చేయాలంటే.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఎడ్‌సెట్‌లో మెరుగైన ర్యాంక్ సాధించి, రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లి కోర్సు పూర్తిచేయండి. అలా చదివితేనే భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయగలుగుతారు. స్కూలు ప్రారంభించిన కొంతకాలం తర్వాత, ఆసక్తి ఉంటే ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్, స్కూల్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులు కూడా చేసే ప్రయత్నం చేయవచ్చు.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్‌షిప్స్

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: డిజి అకాయ్
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, డిజిటల్ ఇలస్ట్రేషన్
స్టైపెండ్: రూ.7,000-11,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/voYv7

వీడియో యానొటేషన్ స్పెషలిస్ట్

సంస్థ: సమాధాన్ నైపుణ్యాలు: డేటా యానొటేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంస్-వర్డ్
స్టైపెండ్: రూ.12,000-12,500
దరఖాస్తు గడువు: నవంబరు 27
☛ https://shorturl.at/6boPf

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: ఘర్‌పే నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హ్యూమన్ రిసోర్సెస్ రిక్రూట్‌మెంట్, ట్యాలెంట్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.3,000-4,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/wcQRf

కోల్డ్–కాలింగ్

సంస్థ: క్రియేటివ్ బన్‌యన్
నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
☛ https://shorturl.at/IZAVa

కంటెంట్ రైటింగ్

సంస్థ: బవేజా మీడియా
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/pGGNw

ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: ఇంపాక్ట్‌హబ్ కనెక్ట్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, మల్టీటాస్కింగ్, ఆపరేషన్స్, టీమ్‌వర్క్ స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/UCASf

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: అలో ఇన్నొవేర్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడర్‌షిప్, ఎంఎస్-ఎక్సెల్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, వెండర్ మేనేజ్‌మెంట్, వెండర్ నెగోషియేషన్ స్టైపెండ్: రూ.7,000-10,000 దరఖాస్తు గడువు: నవంబరు 15 ☛ https://shorturl.at/dklPS

వీడియో ఎడిటర్

సంస్థ: ఎకనామిక్స్ క్లాసెస్ నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఆడియో ఎడిటింగ్, కలర్ కరెక్షన్, కలర్ గ్రేడింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఫైనల్ కట్ ప్రో, టైమ్ మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.2,000-3,000
దరఖాస్తు గడువు: నవంబరు 13
☛ https://shorturl.at/ZFPZv

మార్కెటింగ్

సంస్థ: బ్లాక్‌స్కల్ ప్లాట్‌ఫామ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.3,000
దరఖాస్తు గడువు: నవంబరు 21
☛ https://shorturl.at/fYcnO

రీల్ ఎడిటర్

సంస్థ: బడ్డింగ్ మారినర్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, ఆడియో ఎడిటింగ్, కేన్వా, డావిన్సీ రిసాల్వ్, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.3,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 28
☛ https://shorturl.at/Npu3e

పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలాంటి ఎన్నో దశల్లో గట్టి పోటీ ఎదుర్కొని ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సంపాదించటమే ఈరోజుల్లో కష్టం. అలాంటిది కోచింగ్ సాయమేదీ తీసుకోకుండా ఏకంగా ఎనిమిది సర్కారీ కొలువులను వరుసగా సాధించి ఉద్యోగార్థులకు స్ఫూర్తిగా నిలిచాడు అజయకుమార్. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాలోని ఓ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈయన తన విజయ పరంపరను 'చదువు'తో పంచుకున్నాడిలా...

కోచింగ్ లేకుండానే కొలువులు కొట్టాడు

మాది పాపన్నపేట మండలం పొడ్చన్‌పల్లి. నాన్న అర్కా సంజీవ రావు వ్యవసాయం చేస్తారు. అమ్మ జ్యోతి గృహిణి. మేం ముగ్గురు అన్నదమ్ములం. పదో తరగతి వరకూ తెలుగు మీడియం, ఇంటర్ నుంచీ ఇంగ్లిష్ మీడియంలో చదివాను. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్, ఆ తర్వాత బీబీఐ చేశాను.

అమ్మానాన్నల కష్టం చూస్తూ పెరిగాను. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాను. మొదట 2018లో అటవీశాఖ బీట్ అధికారి, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలకు ఎంపికయ్యా. ముందుగా పంచాయతీ సెక్రటరీగా చేరాను. ఈ ఉద్యోగం చాలా సంతోషాన్నీ, సంతృప్తినీ ఇచ్చింది. ఎందుకంటే.. నేరుగా ప్రజలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుంది.

2020లో మూడు కొలువులు సాధించాను. రైల్వే అసిస్టెంట్ లోకో పైలట్, బెటాలియన్ ఎస్ఐ, సివిల్ కానిస్టేబుల్. లోకో పైలట్‌గా చేరినా కొనసాగలేదు. తర్వాత 2023లో సివిల్ ఎస్ఐ, గ్రూప్-3 ఉద్యోగాలు వచ్చాయి. సివిల్ ఎస్ఐగా విధులు నిర్వహించాను. ప్రస్తుతం గ్రూప్-2 ద్వారా రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికై ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

పదో తరగతి వరకూ తెలుగు మీడియంలో చదవడం చాలా ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో అర్థంకాని విషయాలను తెలుగులో చదువుకునేవాడిని. పరీక్షలకు రెండు మూడు నెలల ముందు నుంచీ సన్నద్ధతకు ఐదారు గంటలు కేటాయించేవాడిని. మధ్యలో గంట విరామం తీసుకునేవాడిని.

60- 70 శాతం సిలబస్ చాలు

ఆన్‌లైన్‌లో ఇంగ్లిష్‌లో అందుబాటులో ఉండే జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్ అన్నీ చదివేవాడిని. అలాగే సోషల్ మీడియాలో షేర్ అయ్యే క్లిప్పింగ్స్ కూడా. ఒక పరీక్షకు రకరకాల సోర్సులు పెట్టుకునేవాడిని కాదు. రివిజన్ ఎక్కువగా చేసేవాడిని. సిలబస్ మొత్తం చదివేయాలని ఆరాట పడకూడదు. 60 నుంచి 70 శాతం సిలబస్ చదివినా సరిపోతుంది. అర్థం చేసుకుంటూ చదవడం ముఖ్యం.

పరీక్ష విధానం ప్రతిసారీ మారిపోతుంటుంది. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. 2017లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్ష రాసినప్పుడు బిట్ల రూపంలో చదివాను. ఇప్పుడు అలా కాకుండా కరెంట్ అఫైర్స్‌ను ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకుంటూ చదవాలి. ఎన్ని గంటలు చదివామన్నది కాదు.. ఎంత ఏకాగ్రతతో చదివామన్నదే ముఖ్యం.


నిజమైన పోటీ తక్కువే

విద్యార్థులు సాధారణంగా పోటీ పరీక్షలంటే చాలా భయపడతారు. పోటీ లక్షల్లో ఉంటుంది. ఉద్యోగం సాధించడం మన వల్ల కాదనుకుంటారు. కానీ ఇది సరికాదు. నిజమైన పోటీ చాలా తక్కువగానే ఉంటుంది. కాలేజీ రోజుల్లో చాలామంది పది పన్నెండు గంటలపాటు చదివేవారు. నేను మాత్రం ఐదారు గంటలే చదివేవాడిని. ఖాళీ సమయాల్లో క్రికెట్ ఆడతాను. టీవీలో క్రికెట్ మ్యాచ్‌లూ చూస్తాను. పరీక్షకు ముందు రోజు ఐపీఎల్ మ్యాచ్ చూసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాచేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.

సొంత నోట్సుతో సిద్ధం

కోచింగ్ తీసుకోవడం వల్ల ఒకే పద్ధతికి అలవాటు పడతారు. అలాకాకుండా వివిధ శిక్షణ సంస్థల ప్రశ్నపత్రాలను పూర్తిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఎక్కడా శిక్షణ తీసుకోకుండా సొంతంగా నోట్సు రాసుకుని సన్నద్ధమయ్యాను. కఠినంగా ఉన్న అంశాలను మొత్తానికి వదిలేయకూడదు. వాటిల్లో కనీసం సగమైనా చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

ముందుగా పోటీ పరీక్షలంటే భయం పోగొట్టుకోవాలి. సిలబస్ మొత్తం చదివేయాలని తాపత్రయ పడకూడదు. సగానికి పైగా చదివినా చాలు. ఎక్కువ గంటలు కాదు... ఏకాగ్రతతో చదవడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి.



సాధించిన ఉద్యోగాలు

1. అటవీశాఖ బీట్ అధికారి
2. పంచాయతీ కార్యదర్శి
3. రైల్వేలో అసిసెంట్ లోకోపైలట్
4. బెటాలియన్ ఎస్ఐ
5. సివిల్ కానిస్టేబుల్
6. సివిల్ ఎస్ఐ
7. గ్రూప్-3 ఉద్యోగం
8. గ్రూప్-2 అసిస్టెంట్ సెక్షన్ అధికారి

వీటిపై పట్టు అవసరం

పోటీ పరీక్షలన్నింటిలో కామన్‌గా ఉండే కరెంట్ అఫైర్స్, జనరల్ సైన్స్, పాలిటీ, జాగ్రఫీలపై పట్టు పెంచుకోవాలి. ఇక అరిథ్‌మెటిక్, రీజనింగ్‌లలో ప్రాథమిక పరిజ్ఞానం ఉంటే సరిపోతుంది. ముఖ్యంగా ప్రశ్న- జవాబుల రూపంలో కాకుండా.. ఒక అంశంపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. సారాంశాన్ని గ్రహించాలి. ఏ విధంగా ప్రశ్నించినా జవాబు చెప్పగలిగేలా ఉండాలి.

గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల సన్నద్ధత ఒకేలా ఉంటుంది. మూడు సబ్జెక్టులు.. జనరల్ స్టడీస్, పాలిటీ, ఎకానమీ (రాష్ట్రం, దేశం) ఉంటాయి. అయితే గ్రూప్-2 కోసం ఏ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు ఆ రాష్ట్ర చరిత్ర చదవాలి.

చివరగా ఒక్క విషయం.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోటీ పరీక్షలు నిర్ణీత తేదీల్లో జరుగుతాయి. రాష్ట్రాల విషయంలో అలా ఉండదు. ఏదో ఒక కారణంతో వాయిదాలు పడుతుంటాయి. ఇలాంటప్పుడు నిరుత్సాహపడకూడదు. మన చేతుల్లో లేని విషయాల గురించి అసలు ఆలోచించకూడదు. అదే స్ఫూర్తితో సన్నద్ధతను కొనసాగించాలి.

నోటీస్ బోర్డు

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **అసిస్టెంట్ ప్రొఫెసర్ (హైయర్ గ్రేడ్) - 04**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ప్రింటింగ్ టెక్నాలజీ. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంటెక్, పీహెచ్‌డీ, ఉద్యోగానుభవం. ఎంపిక: ఇంటర్వ్యూతో **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.11.2025 వెబ్‌సైట్: https://uoc.ac.in/index.php/vacancies-careers

జూనియర్ రెసిడెంట్లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), రాయ్‌బరేలీ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- **జూనియర్ రెసిడెంట్ - 16**

అర్హత: ఎంబీబీఎస్, డీబీఎస్‌తో పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి. **గరిష్ఠ వయసు:** 37 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు వర్తిస్తుంది. **మూల వేతనం:** నెలకు రూ.56,100. ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీ:** 10.11.2025, **వేదిక:** ఎల్‌టీ-గ్రౌండ్, మెడికల్ కాలేజ్, ఎయిమ్స్, రాయ్‌బరేలి, ఉత్తర్‌ప్రదేశ్. వెబ్‌సైట్: https://aiimsrbl.edu.in/recruitments

మెడికల్ ఆఫీసర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), జమ్మూ ఒప్పంద ప్రాతిపదికన జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్**

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** 45 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు రూ.60,000- రూ.70,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.11.2025. ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూతో వెబ్‌సైట్: https://iitjammu.ac.in/postlist/Jobs

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్లు

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ), చండీగఢ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- **సీనియర్ రెసిడెంట్(బ్రాడ్ స్పెషాలిటీ): 94**

విభాగాలు: అనస్థీషియాలజీ, బయోకెమిస్ట్రీ, చెస్ట్, డెర్మటాలజీ, మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, సర్జరీ, అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఐసీయూ, ఎన్ఐసీయూ, పీఐసీయూ. **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ/ఎంఎస్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్లు మించకూడదు. **మూల వేతనం:** నెలకు రూ.67,700. **దరఖాస్తు ఫీజు:** రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఐసీ ఉద్యోగులకు ఫీజు లేదు. ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీ:** నవంబరు 7. వెబ్‌సైట్: https://www.esic.gov.in

ఐఐఎస్‌టీలో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ), తిరువనంతపురం పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **పీహెచ్‌డీ ప్రోగ్రామ్- జనవరి 2026 సెషన్.** **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఏవియోనిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్. **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు గేట్/సీఎస్ఐఆర్/యూజీసీ నెట్/ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్ స్కోరు ఉండాలి. **వయసు:** 20.11.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఎంపిక: విద్యార్హతలు, జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష మార్కులు, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూతో **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 20.11.2025. వెబ్‌సైట్: https://www.iist.ac.in/

ఐఐఐటీ కొట్టాయంలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కొట్టాయం.. పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **పీహెచ్‌డీ ప్రోగ్రామ్ జనవరి సెషన్ 2026**

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.1000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళలకు రూ.500. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14-11-2025. **ఇంటర్వ్యూ తేదీలు:** నవంబరు 16 నుంచి 20 వరకు వెబ్‌సైట్: https://www.iiitkottayam.ac.in/#!/home

దక్షిణ మధ్య రైల్వేలో..

దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కోటాలో 61 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **స్పోర్ట్స్ కోటా పోస్టులు: 61**

క్రీడాంశాలు: అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఖోఖో, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ తదితరాలు. **అర్హత:** టెన్త్/ఐటీఐ, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు దేశం/రాష్ట్రం/విశ్వవిద్యాలయం/పాఠశాల తరపున గుర్తింపు పొందిన క్రీడా పోటీలలో విజయం సాధించాలి. **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** క్రీడా ప్రదర్శన పరీక్షలు (స్పోర్ట్స్ ట్రయల్స్), ధ్రువపత్రాల పరిశీలనతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24.11.2025. **దరఖాస్తు రుసుము:** రూ.500. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మైనారిటీ/ఓబీసీలకు రూ.250.

వెబ్‌సైట్: https://scr.indianrailways.gov.in/

అమెరికాలో ఉచిత ఆహార కేంద్రాల వద్ద రద్దీ

- స్నాప్ పథకంపై షట్‌డౌన్ ప్రభావమే కారణం

లాయిస్‌విల్లే: అమెరికాలో అదనపు పోషకాహార సహాయ కార్యక్రమం(స్నాప్)పై షట్‌డౌన్ ప్రభావం పడటంతో అక్కడి ఉచిత ఆహార పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. న్యూయార్క్, జార్జియా, కెంటకీ తదితర రాష్ట్రాల్లోని నగరాల్లో పండ్లు, కూరగాయలు, బ్రెడ్, పాలు, శాండ్‌విచ్ వంటి ఉచిత ఆహారం అందించే కేంద్రాల వద్ద తెల్లవారుజాము 4 నుంచే ప్రజలు వరుసల్లో నిలుస్తుండటం గమనార్హం. ఈ కేంద్రాలకు సాధారణ రోజుల్లో వచ్చే వారికంటే వచ్చే వారి సంఖ్య పెరిగింది. అమెరికాలో పేద, మధ్య తరగతి ప్రజలకు అదనపు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఆ దేశ వ్యవసాయ విభాగం కింద 'స్నాప్' పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద దేశవ్యాప్తంగా దాదాపు 4.2 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటుండటంతో ఈ పథకం కింద ఇచ్చే సాయాన్ని శనివారం నుంచి ఆపివేయాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. అయితే 'స్నాప్' కింద ఇచ్చే సాయాన్ని ఆపొద్దని ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులు ఆదేశించారు. ఈ సాయాన్ని తిరిగి ప్రారంభించే విషయంలో కొంత ఆలస్యమవుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దాంతో ఉచిత ఆహార కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు.

ఎవరివైపు తిరిగేనో తొలి 'దశ'

6న బిహార్ మొదటి విడత పోలింగు • ఎన్డీయే కూటమిలో ఉత్సాహం తొణికిసలాట



ఇంటర్నెట్ డెస్క్: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల మొదటి దశకు సమయం ఆసన్నమైంది. ఈ నెల 6న మిథిలాంచల్, కోశీ, ముంగెర్ ప్రాంతాల్లోని 18 జిల్లాల్లో ఉన్న 121 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. కీలకమైన ఈ దశ అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మిథిల, కోశీ, ముంగెర్ డివిజన్లలోని ఈ సీట్లలో అధికార ఎన్డీయే కూటమిదే పైచేయిగా కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వీటిలో 70 సీట్లను ఈ కూటమే గెల్చుకున్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన ద్వారా మహిళల వ్యాపారాలకు రూ.10వేలు సాయం చేస్తామనే హామీ అధికార కూటమికి కలిసి రావచ్చని భావిస్తున్నారు. కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్‌కు చెందిన ఎల్‌జేపీ, ఉపేంద్ర కుశ్వాహాకు చెందిన ఆర్‌ఎల్‌ఎం పార్టీల చేరికతో ఎన్డీయేమరింత బలంగా కనిపిస్తోంది. ఆ ఇద్దరు నేతల సామాజిక వర్గాలూ ఈ కూటమికి చేరువయ్యాయని అంటున్నారు.

బరిలో ఏడుగురు మంత్రులు

యువత, మహిళలను ఆకట్టుకునే దిశగా విపక్ష మహా గఠ్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి, ఆర్జేడీ అగ్ర నేత తేజస్వీయాదవ్ ముమ్మర కసరత్తు చేస్తున్నారు. యాదవ్-ముస్లిం ఓటుబ్యాంకు ఈ కూటమికి ప్రధాన బలంగా నిలవనుంది. అంతర్గత కలహాలు, టికెట్ల పంపిణీపై మిత్రపక్షాల్లో అసమ్మతి, అభ్యర్థుల్లో నెలకొన్న అసంతృప్తి మాత్రం పెద్ద అడ్డంకులుగా మారే అవకాశం ఉంది. దర్భంగా జిల్లాలో వికాస్ ఇన్‌సాన్ పార్టీ (వీఐపీ) నుంచి నెగ్గిన ఇద్దరు ఎమ్మెల్యేలు భాజపాలో చేరిపోయారు. ఈ జిల్లా నుంచి ఈ దశలో ముగ్గురు మంత్రులు బరిలో ఉన్నారు. దర్భంగా, సమస్తీపుర్ జిల్లాల్లో ఎన్డీయేదే పైచేయిగా కనిపిస్తోందని సీనియర్ పాత్రికేయుడొకరు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వంలోని నలుగురు మంత్రులు సమస్తీపుర్ జిల్లాలోనే పోటీ చేస్తున్నారు. మహిళా ఓటర్లు సీఎం నీతీశ్‌కు మద్దతుగా నిలుస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది ఎన్డీయేకు ప్రయోజనం చేకూర్చే అంశం.

శరద్ యాదవ్ కుమారుడికి భంగపాటు

తొలి విడత పోలింగ్ జరగనున్న సహర్సా, మాధేపురా జిల్లాలు కోశీ ప్రాంతంలో ఉన్నాయి. మాధేపురా అసెంబ్లీ స్థానంలో తీవ్రపోటీ నెలకొంది. జేడీయూ ముఖ్య నేత, శరద్ యాదవ్ కుమారుడు శంతను బుందేలా ఈ టికెట్‌ను ఆశించి భంగపడ్డారు. చివరి నిమిషంలో ఈ టికెట్‌ను మాజీ మంత్రి ప్రొఫెసర్ చంద్రశేఖర్‌కు ఆర్జేడీ కేటాయించింది. ఇది బుందేలా ఆగ్రహానికి కారణమైంది. ఆర్జేడీ అభ్యర్థికి ఆయన సహకరిస్తారా లేదా అనేది అనుమానంగానే ఉంది. ముంగెర్ డివిజన్‌లోని తారాపూర్ నుంచి ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, లఖీసరై నుంచి మరో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా పోటీ చేస్తుండటంతో అవి హాట్‌సీట్లుగా మారాయి. ముంగెర్ జిల్లాలో యాదవులు, కుశ్వాహా, భూమిహార్ సామాజిక వర్గీయులు ఎటు మొగ్గితే అటువైపే విజయం ఖాయం కావచ్చు. గత ఎన్నికల్లో నలంద జిల్లాలోని 6 స్థానాలను ఎన్డీయే, ఒక స్థానాన్ని మహాకూటమి గెల్చుకున్నాయి. సీఎం నీతీశ్ కుమార్ సొంత జిల్లా కావడంతో ఇక్కడ జేడీయూ హవా వీస్తోంది. ఈసారి కూడా ఇక్కడ నీతీశ్ పేరుతో గెలుస్తామనే ధీమాలో ఎన్డీయే అభ్యర్థులు ఉన్నారు.



పట్నాలో మోదీ భారీ రోడ్ షో

పట్నా: బిహార్ రాజధాని పట్నాలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ఆశీర్వదించాలంటూ ప్రజలను విజ్ఞప్తి చేశారు. దినకర్ గోలంబర్ నుంచి ప్రారంభమైన మోదీ రోడ్ షోలో జేడీయూ నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ లలన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జయస్వాల్, పట్నా సాహిబ్ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. రహదారికి ఇరువైపులా నిలిచిన ప్రజలపై మోదీ చేతులూపుతూ ఉత్సాహపరిచారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి బాటను ఎన్డీయే మాత్రమే మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రహదారికి ఇరువైపులా పెద్దఎత్తున మహిళలు ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. గాంధీ మైదాన్ వద్ద గల ఉద్యోగ్ భవన్ వద్ద మోదీ రోడ్ షో ముగిసింది. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా మోదీ పట్నాలో రోడ్ షో నిర్వహించారు.

గురుద్వారాలో మోదీ ప్రార్థనలు



పట్నా సాహిబ్ గురుద్వారాలో ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ ప్రార్థనలు నిర్వహించారు. అలాగే దిల్లీ నుంచి అక్కడకు ఉత్సవ ఊరేగింపుగా తీసుకొచ్చిన గురు గోవింద్ సింగ్, ఆయన సతీమణి మాతా సాహిబ్ కౌర్ పాదరక్షలు గల 'జోరే సాహిబ్'ను మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి, బిహార్ శాసనసభ స్పీకర్ నంద కిశోర్ యాదవ్ ఉన్నారు.

బిహార్‌లో గెలుస్తాం..
18న ప్రమాణం చేస్తాం

- తేజస్వీ యాదవ్ ధీమా
- 26 నుంచి నేరగాళ్లపై కొరడా ఝుళిపిస్తామని వెల్లడి



పట్నా: బిహార్‌లో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఖాయమని ఇండియా కూటమి తరఫు ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ పునరుద్ఘాటించారు. "ఈ నెల 14న శాసనసభ ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. 18న ప్రభుత్వం కొలువుదీరుతుంది. ఆరోజు ప్రమాణ కార్యక్రమం ఉంటుంది" అని తెలిపారు. జనసురాజ్ పార్టీకి మద్దతిస్తున్న దులార్ చంద్ హత్యకు సంబంధించి జేడీ(యూ) అభ్యర్థి, మొకామా మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ అరెస్టు నేపథ్యంలో తేజస్వి ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇవాళ ప్రధానమంత్రి బిహార్‌ను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలో పరిస్థితిని ఆయన గమనించాలి. నేరం జరగకుండా ఒక్కరోజు కూడా గడవటంలేదు. కానీ మహాగఠ్‌బంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక మార్పు వస్తుంది. కులమతాలతో సంబంధం లేకుండా ఈ నెల 26 నుంచి జనవరి 26 వరకు నేరస్థులందరినీ జైళ్లకు పంపిస్తాం. సాధ్యమైనంత కఠిన చర్యలు వారిపై తీసుకుంటాం" అని చెప్పారు. బిహార్ ప్రజలు ఈసారీ నీతీశ్ కుమార్‌పై నమ్మకం ఉంచుతారని తెలిసి విదేశాల్లో విహారయాత్రకు వెళ్లేందుకు తేజస్వి టికెట్లు కొనుగోలు చేసినట్లు తనకు తెలిసిందని కేంద్ర మాజీ మంత్రి, భాజపా నేత రాజీవ్ ప్రతాప్ రూడీ ఎద్దేవా చేశారు.

భద్రత పెంచండి: తేజ్ ప్రతాప్

ప్రస్తుత పరిస్థితుల్లో తనకు ముప్పు పొంచి ఉందని. భద్రతను మరింత పెంచాలని 'జనశక్తి జనతా దళ్' (జేజేడీ) చీఫ్ తేజ్ ప్రతాప్ యాదవ్.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల దుండగుల కాల్పుల్లో.. దులార్ చంద్ మరణించిన నేపథ్యంలో తనకూ ప్రాణ భయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

హత్యలు, అపహరణలు, దోపిడీలకు మంత్రిత్వశాఖలు

- బిహార్‌లో ఇండియా కూటమి నెగ్గితే జరిగేది అదే: అమిత్ షా



ముజఫ్ఫర్‌పుర్, వైశాలీ: బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఒకవేళ ఇండియా కూటమికి వస్తే.. హత్యలు, అపహరణలు, దోపిడీలకు మూడు మంత్రిత్వ శాఖలను తేజస్వీ యాదవ్ ఏర్పాటు చేస్తారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర ఆరోపణ చేశారు. ఇదివరకు ఆర్జేడీ అధికారంలో ఉన్నప్పుడు అపహరణలు, అత్యాచారాలతో ఆటవిక పాలనను బిహార్ చూసిందని, అది మళ్లీ రాకుండా ఓటర్లంతా ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. ముజఫ్ఫర్‌పుర్, వైశాలీ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆదివారం ఆయన ప్రసంగించారు.

మోదీ, నీతీశ్‌లు నిష్కళంకులు

"బిహార్‌లో కొత్త ముఖాలతో జంగిల్‌రాజ్‌ను తిరిగి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. అది జరగకుండా ఎన్డీయేను గెలిపిస్తే వరదల నుంచి విముక్తి కల్పించడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేస్తాం. భద్రతకు పెద్దపీట వేస్తాం. నదుల నీరు పొలాలకు పారేలా చూస్తాం. అంతర్గత కలహాలతో మహాగఠ్‌బంధన్ సతమతం అవుతోంది. లాలూ అండ్ కో, రాహుల్ అండ్ కో రూ.12 లక్షల కోట్ల అవినీతి, కుంభకోణాలకు పాల్పడ్డాయి. ఎన్డీయేలోని ఐదు మిత్రపక్షాలు మాత్రం బిహార్‌ను సరికొత్త ఎత్తుకు తీసుకువెళ్లేందుకు కట్టుబడి ఉన్నాయి. ఈ పక్షాలు పంచపాండవుల్లాంటివి. నీతీశ్ 20 ఏళ్ల పాలన, మోదీ 11 ఏళ్ల పాలన పూర్తిగా పారదర్శకం. వారిపై అవినీతి అభియోగాల్లేవు. మా కూటమిని గెలిపిస్తే 50 వేల కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. వ్యవసాయంపై రూ.లక్ష కోట్లు వెచ్చిస్తాం. భారీ ఫుడ్‌పార్క్, ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు చేయిస్తాం. లాలూ-రబ్రీ గానీ, సోనియాగానీ ఇలాంటివి చేయగలరా?" అని అమిత్ షా ప్రశ్నించారు.

ఆర్ అండ్ డీలో ప్రైవేటు పెట్టుబడులకు రూ.లక్ష కోట్ల నిధి

- నేడు ప్రారంభించనున్న మోదీ

దిల్లీ: పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగంలో ప్రైవేటు రంగ పెట్టుబడుల్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ.లక్ష కోట్ల నిధిని ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ప్రారంభించనున్నారు. 'శాస్త్ర సాంకేతికతల నవకల్పనల సమ్మేళనం' (ఎస్టిక్-2025)ను ఆయన ప్రారంభించి ప్రసంగించనున్నారు. ఇకపై ఏటా దీనిని నిర్వహిస్తారు. మూడురోజుల పాటు జరిగే ఎస్టిక్-2025లో వివిధ విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమల నుంచి మూడువేల మంది ప్రతినిధులు పాల్గొంటారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, నోబెల్ పురస్కార గ్రహీతలు, విధాన రూపకర్తలు హాజరవుతారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. ఎక్కడెక్కడ అంతరాలున్నాయో గుర్తించి, భాగస్వామ్యాలు ఏర్పరిచి, మన అభివృద్ధి ప్రాధామ్యాలకు అనుగుణంగా బాటలు వేయడం దీని ఉద్దేశమని శాస్త్ర సాంకేతికతల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. తయారీ, కృత్రిమ మేధ, డిజిటల్ కమ్యూనికేషన్లు, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, ఆరోగ్యం, అంతరిక్ష సాంకేతికతలు వంటి రంగాల్లో విస్తృత సమాలోచనలు జరగనున్నాయని చెప్పారు.

కరీబియన్‌లో అమెరికా మరోసారి దాడి

- ముగ్గురు స్మగ్లర్ల మృతి

వెస్ట్ పామ్ బీచ్: కరీబియన్ సముద్రంలో మాదక ద్రవ్యాల స్మగ్లర్లే లక్ష్యంగా అమెరికా మరోసారి దాడిచేసింది. ఈ ఘటనలో ముగ్గురు స్మగ్లర్లు మరణించినట్లు అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ సామాజిక మాధ్యమంలో వెల్లడించారు. అమెరికా ఉగ్రవాదిగా గుర్తించిన ఓ సంస్థకు చెందిన నౌకపై దాడులు జరిపినట్లు తెలిపారు. కానీ దాని వివరాలను పంచుకోలేదు. సెప్టెంబరు నుంచి కరీబియన్ సముద్రంలో అమెరికా చేపట్టిన 15వ దాడి ఇది. ఈ దాడుల్లో ఇప్పటివరకూ 64 మంది మరణించారు.

బీమా ఆలస్యంపై గేదె మృత కళేబరంతో రైతు ఆందోళన

- ఎట్టకేలకు దిగొచ్చిన బ్యాంకు

పాల్ఘర్: తక్షణమే బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఓ రైతు చనిపోయిన తన గేదెతో బ్యాంకు బయట నిరసనకు దిగిన ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇది బీమా పరిహారంలో జాప్యం, అప్పులు, నష్టాలతో రైతులపై పడే భారంపై చర్చకు దారితీసింది. పాల్ఘర్ జిల్లా, టాక్పాడా గ్రామానికి చెందిన పశువుల పెంపకందారుడు నవ్సు దిఘా 2022లో బ్యాంకు నుంచి రూ.12 లక్షల రుణం తీసుకొని 10 గేదెలను కొనుగోలు చేశాడు. గేదెలకు బీమా చేసినప్పటికీ గత మూడేళ్లలో చనిపోయిన రెండు గేదెలకు బ్యాంకు పరిహారం చెల్లించలేదు. ఈ క్రమంలో శనివారం గేదె కళేబరాన్ని ట్రాక్టర్‌లో తీసుకొచ్చి బ్యాంకు ముందు నిరసనకు దిగాడు. "నా గేదెలకు బీమా తీసుకున్న తర్వాత కూడా బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా ఒక్క రూపాయి పరిహారం లభించలేదు. బ్యాంకులు రైతులను మోసం చేస్తున్నాయి" అని దిఘా ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక రైతులు, నాయకులు, రాజకీయ ప్రతినిధులు దిఘా నిరసనకు మద్దతిచ్చారు. నెల రోజుల్లో దిఘాతో పాటు మిగిలిన రైతులకు కూడా పరిహారం చెల్లిస్తామని బ్యాంకు సీనియర్ అధికారి హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు.

ఎంపీలో మహిళా నక్సలైట్ లొంగుబాటు

- ఆమెపై రూ.14 లక్షల రివార్డు

బాలాఘాట్; భోపాల్: మధ్యప్రదేశ్‌లో పేరుమోసిన మహిళా నక్సలైట్ నేత సునీత ఆయుధాలు వదిలి శనివారం ప్రభుత్వానికి లొంగిపోయారు. ఆమెపై రూ.14 లక్షల రివార్డు ఉంది. ఈ మేరకు పోలీసు అధికారులు ఆదివారం వెల్లడించారు. నక్సలైట్ల నిరోధక విభాగం హవాక్ దళం అసిస్టెంట్ కమాండర్ రూపేంద్ర ధ్రువ్‌కు సునీత తన ఇన్సాస్ రైఫిల్‌ను అప్పగించిందని వివరించారు. సీపీఐ(మావోయిస్టు) సెంట్రల్ కమిటీ సభ్యురాలుగా ఉన్న సునీత ఎన్‌ఎంసీ జోన్ ఇంఛార్జి రాందేర్‌కు అంగరక్షకురాలిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా ఆమెపై రూ.14 లక్షల రివార్డును ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ తహసీల్‌లోని భైరాంగఢ్‌లో గోంవెటా ఆమె స్వగ్రామం.

5న కాశీలో దేవ్ దీపావళి

- 10 లక్షల మట్టి ప్రమిదలు సిద్ధం



లఖ్‌నవూ: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న కాశీలో దేవ్ దీపావళిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గంగా నది ఘాట్‌లలో లక్షలాది దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. "రాష్ట్ర పర్యాటకశాఖ, వారణాసిలోని మహోత్సవ్ సమితి కలిసి దాదాపు 10 లక్షల మట్టి ప్రమిదలను సిద్ధం చేశాయి" అని రాష్ట్ర మంత్రి జైవీర్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. దేవ్ దీపావళి కోసం నగర ఘాట్లతోపాటు గంగా నది తీరంలోని 20 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వీటి పర్యవేక్షణ కోసం ఒక్కో సెక్టార్‌కు ఓ నోడల్ అధికారిని కూడా నియమించామన్నారు. పౌర్ణమి సాయంత్రం వారణాసి మొత్తం దీపాలతో వెలిగిపోనుందని, కాశీ కథ పేరుతో 25 నిమిషాల 3డీ ప్రదర్శన కూడా ఉంటుందని చెప్పారు. కాశీ, అయోధ్య గొప్పతనాన్ని చాటి చెప్పేలా 500 డ్రోన్లతో ప్రదర్శన, లేజర్ షో కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయని జైవీర్‌సింగ్ చెప్పారు.

ఆకట్టుకున్న చైనా కళాకారుల 'రామాయణం'



ఇంటర్నెట్ డెస్క్: భారతీయ ఇతిహాసం 'రామాయణం' చైనాలోనూ ఆదరణ పొందుతోంది. ప్రముఖ చైనా పండితుడు, దివంగత ప్రొ. జి షియాన్‌లిన్ అనువాదం చేసిన 'ఆదికావ్య - ది ఫస్ట్ పోయం'ను చైనా కళాకారుల బృందం ప్రదర్శించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను చైనాలోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియాలో షేర్ చేసింది. సంగీతం ఇండియా ఆర్ట్స్ ఆధ్వర్యంలో బీజింగ్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శనకు.. చైనా భరతనాట్య కళాకారుడు జిన్ షాన్‌షాన్ దర్శకత్వం వహించారు. దాదాపు 50 మంది స్థానిక కళాకారులు ఇందులో భాగస్వామ్యమయ్యారు. భారీ సంఖ్యలో ప్రేక్షకులు 'రామాయణం'ను వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఓ అద్భుతమైన సాంస్కృతిక సంగమంగా భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

బాలుడి ప్యాంట్‌లో తేలును వదిలిన ఉపాధ్యాయులు

- హిమాచల్‌ప్రదేశ్‌లో ఘటన

ఇంటర్నెట్ డెస్క్: ఎనిమిదేళ్ల బాలుడిని ఉపాధ్యాయులు పదేపదే కొట్టడమే కాకుండా.. అతడి ప్యాంట్‌లో తేలును వదిలిన ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని శిమ్లాలో వెలుగు చూసింది. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. శిమ్లాలోని రోహ్రూ ప్రాంతంలో దళిత వర్గానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు స్థానికంగా ఓ ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. స్కూల్ హెడ్‌మాస్టర్ దేవేంద్రతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు బాబు రామ్, కృతికా ఠాకూర్‌లు దాదాపు ఏడాది కాలంగా బాలుడిని శారీరకంగా వేధిస్తున్నారు. పదేపదే కొట్టడం వల్ల తన కుమారుడి ఓ చెవి దెబ్బతిందని అతడి తండ్రి తెలిపారు. పిల్లాడిని పాఠశాలలోని టాయిలెట్‌కు తీసుకెళ్లి, ప్యాంటులో తేలును వదిలారని ఆరోపించారు. ఈ విషయాలు బయటకు చెప్పొద్దని, లేకపోతే బాలుడిని బడి నుంచి బహిష్కరిస్తానని ప్రధానోపాధ్యాయుడు బెదిరించినట్లు అతడు వాపోయారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, కాల్చేస్తామని కూడా బెదిరించినట్లు చెప్పారు. కృతికా ఠాకుర్ అనే మహిళా ఉపాధ్యాయురాలి స్థానంలో ఆమె భర్త చట్టవిరుద్ధంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడని, పాఠశాలలో ఉపాధ్యాయులు కులవివక్షను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

లుధియానా వర్సిటీలో..
కంబూచా చాయ్ పరిశోధన





ఈటీవీ భారత్: చైనా నుంచి మొదలై గత పాతికేళ్లలో క్రమంగా ప్రాచుర్యం పొందిన కంబూచా చాయ్ విక్రయాలకు ఆన్‌లైన్ వేదికల ద్వారా ఆదరణ ఉంది. చైనాలో దీన్ని అమృతప్రాయంగా భావిస్తారు. కొరియా, జపాన్ దేశాల్లోనూ విస్తరించిన 'కంబూచా' ఆ తర్వాత భారత్‌లోకి ప్రవేశించింది. ఇళ్లలో సాధారణ తేయాకుతోనూ పులియబెట్టే ప్రక్రియ ద్వారా ఈ పానీయం తయారు చేసుకోవచ్చు. దీనిపై గత అయిదేళ్లుగా తాము పరిశోధన చేసినట్లు పంజాబ్‌లోని లుధియానా వ్యవసాయ విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ప్రియా కత్యాల్ తెలిపారు. "ఆరోగ్యానికి మేలు చేసే ప్రొబయాటిక్స్, యాంటీ ఆక్సిడెంట్లతో ఇది నిండి ఉంటుంది. ఇందులో విటమిన్ బి, సి ఉన్నాయి. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఈ చాయ్ బాటిళ్లను ఇప్పుడు విశ్వవిద్యాలయం తరఫున విక్రయానికి పెట్టాం. పెరుగును పులియబెట్టినట్లే దీనిని మళ్లీ తయారుచేసుకోవచ్చు. కంబూచా టీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి" అని వివరించారు.

బిహార్ ఎన్నికల బరిలో సుశాంత్ రాజ్‌పూత్ సోదరి



పట్నా: బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పూత్‌కు సోదరి వరసయ్యే సమీప బంధువు దివ్యా గౌతమ్ బిహార్‌లోని దిఘా స్థానం నుంచి సీపీఐ (ఎంఎల్) అభ్యర్థిగా బరిలో దిగారు. ఈ స్థానం నుంచి భాజపా నేత సంజీవ్ చౌరాసియా రెండుసార్లు గెలిచారు. ఈసారి మహాగఠ్‌బంధన్ తరఫున ఆయనపై దివ్య పోటీకి దిగారు. పట్నా విశ్వవిద్యాలయం నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆమె.. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. బిట్స్ పిలానీలో పీహెచ్‌డీ చేశారు. మూడేళ్లపాటు పట్నా మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసి.. బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలై సప్లై ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల్లో గెలిచేందుకు మాత్రమే కాకుండా సమాజంలో నిజమైన మార్పును తెచ్చేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఆమె చెప్పారు. విద్య, ఉపాధి, మహిళా భద్రత, ఆరోగ్య సంరక్షణ, స్థానిక ప్రాంత అభివృద్ధిపైనే దృష్టి పెడతానని తెలిపారు. సుశాంత్ సింగ్ రాజ్‌పూత్ పేరును కొన్ని రాజకీయ పార్టీలు వాడుకొని వదిలేశాయని ఆరోపించారు.

రెండు ఐఏఎస్ అకాడమీలకు రూ.8 లక్షల చొప్పున జరిమానా

- అనుమతులు లేకుండా అభ్యర్థుల పేర్ల వాడకం

ఇంటర్నెట్‌డెస్క్: సివిల్ సర్వీసుల శిక్షణకు పేరుగాంచిన రెండు ఐఏఎస్ అకాడమీలపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ(సీసీపీఏ) భారీ జరిమానా విధించింది. యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన పలువురు అభ్యర్థులను తమ అకాడమీలో శిక్షణపొందిన వారిగా తప్పుడు ప్రకటనలు చేయడంతో దీక్షంత్ ఐఏఎస్, అభిమన్యు ఐఏఎస్ అకాడమీలకు రూ.8 లక్షల చొప్పున సీసీపీఏ జరిమానా విధించింది. 2021లో ఆల్ ఇండియా ర్యాంక్ 96 సాధించిన మణి శుక్లా ఫిర్యాదు ఆధారంగా దీక్షంత్ సంస్థపై సీసీపీఏ చర్యలు తీసుకొంది. ఇక 2022లో ఆలిండియా ర్యాంక్ 175 సాధించిన నటాష గోయల్ కూడా అభిమన్యు ఐఏఎస్ అకాడమీపై ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా ఫొటోను వాడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా... స్థాపించిన నాటి నుంచి 2,200 మంది అభ్యర్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు అభిమన్యు అకాడమీని ప్రకటనల్లో పేర్కొంది. ఆ సంస్థ 2023లో చెప్పుకొన్న 139 మంది అభ్యర్థుల్లో 88 మంది స్వయంకృషితో ఉద్యోగాలు సాధించినట్లు సీసీపీఏ వివరించింది.

యూపీలో 15 నెలల చిన్నారి అదృశ్యం

- తోడేలు దాడిగా అనుమానాలు

బహరాయిచ్: తోడేళ్ల బెడద అధికంగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాలో ఓ 15 నెలల చిన్నారి అదృశ్యమైంది. ఆదివారం కైసర్‌గంజ్ తహసీల్‌లోని కందౌలి గ్రామంలో తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని ఓ అడవి జంతువు లాక్కెళ్లింది. చిన్నారి కోసం జరిపిన గాలింపు చర్యల్లో... తోడేలు పాదముద్రలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఇది తోడేలు దాడిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చోటుచేసుకుంది.

నేర్చుకోవడం ఎన్నటికీ ఆపకండి

- లఖ్‌నవూ స్నాతకోత్సవ సభలో జస్టిస్ సూర్యకాంత్



జస్టిస్ సూర్యకాంత్‌కు జ్ఞాపికను అందిస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

లఖ్‌నవూ: న్యాయ విద్యార్థులు ఉత్సుకతతో ఉండాలని, నేర్చుకోవటాన్ని ఆపకూడదని, మెథోపరమైన నిశ్చిత అభిప్రాయాలను ప్రశ్నించాలని కాబోయే ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆదివారం ఆయన లఖ్‌నవూలోని డా.మనోహర్ లోహియా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..' 'వృత్తి ప్రారంభంలో మీకు ఎంత తెలుసు అన్న విషయంపై కాదు. కొత్త విషయాలు తెలుసుకోవాలనే స్థిరమైన ఆసక్తి, నిరంతరం నేర్చుకోవాలన్న సంకల్పం ఉండాలి. ఈ లక్షణాలే గొప్ప న్యాయవాదులను, కేవలం మనుగడ సాగించే లాయర్లను వేరు చేస్తాయి. వృత్తుల్లో అత్యున్నత స్థానాలకు ఎదగాలంటే ప్రశ్నించడం ఎంత ముఖ్యమో డా.లోహియా జీవితం మనకు తెలుపుతుంది. ధైర్యంగా ప్రశ్నించినప్పుడే తలరాత మారుతుంది'' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా న్యాయవాదిగా తొలినాళ్లలో ఆయన చేసిన ఓ తప్పు గురించి ప్రస్తావించారు. తనకు అన్ని తెలుసని అనుకుని సరిగ్గా సిద్ధంకాకుండా వాదనలకు వెళ్లి కేసును ఓడిపోయానని అన్నారు. ఈ ఓటమే ప్రతి కేసును క్షేత్రస్థాయి నుంచి సమీక్షించడం నేర్పించిందని తెలిపారు. న్యాయ వ్యవస్థలో ఉన్న విధానాలను కేవలం పాటించకుండా..మరింత అభివృద్ధి ఎలా చేయాలని ఆలోచించాలని విద్యార్థులను కోరారు.

వీధి కుక్కల కేసుపై నేడు సుప్రీంలో విచారణ

దిల్లీ: వీధి కుక్కల కేసును అత్యున్నత న్యాయస్థానం సోమవారం విచారించనున్నది. గత నెల 27న ఈ అంశాన్ని విచారిస్తూ, వీధికుక్కల నియంత్రణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై ఎందుకు అఫిడవిట్లు సమర్పించలేదో సోమవారం వచ్చి వివరణ ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు సుప్రీం ఆదేశించింది. అఫిడవిట్లు సమర్పించిన తెలంగాణ, పశ్చిమబెంగాల్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ (ఎంసీడీ) తప్ప మిగతా రాష్ట్రాలకు చెందిన ప్రధాన కార్యదర్శులకు తాఖీదులిచ్చింది.

గాజా సహాయ ట్రక్కును లూటీ చేసిన హమాస్

ఇంటర్నెట్ డెస్క్: గాజా ప్రజల కోసం పంపుతున్న మానవతా సాయాన్ని హమాస్ అడ్డుకుంటోందని అమెరికా ఆరోపించింది. దక్షిణ గాజా స్ట్రిప్‌లోకి ప్రవేశించిన ఓ సహాయ ట్రక్కును హమాస్ కార్యకర్తలు అడ్డుకుంటున్న డ్రోన్ దృశ్యాలను యూఎస్ సెంట్రల్ కమాండ్ సామాజిక మాధ్యమంలో షేర్ చేసింది. డ్రైవర్‌పై దాడి చేసి.. ట్రక్కును లూటీ చేసినట్లు వెల్లడించింది. అంతర్జాతీయ భాగస్వాముల నుంచి గాజా ప్రజలకు అందే మానవతా సాయాన్ని కూడా హమాస్ అడ్డుకుంటుండడంపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆకలితో అలమటించిపోతున్న గాజా ప్రజలకు చేరాల్సిన సాయాన్ని అందకుండా చేసి.. హమాస్ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. గాజాలో శాంతి నెలకొల్పడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయంగా వస్తున్న మద్దతును ఇటువంటి ఘటనలు బలహీనపరుస్తున్నాయని పేర్కొన్నారు.

ట్రంప్ ఎప్పుడేం చేస్తారో ఆయనకే తెలియదు

- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది వ్యాఖ్య

ఇంటర్నెట్ డెస్క్: భవిష్యత్తులో ఎదురయ్యే అనిశ్చితులు, భద్రతా సవాళ్లను ఎదుర్కొనేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని.. పాత సమస్యలు పరిష్కరించుకునేలోపే కొత్తవి వస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాల మధ్య.. ఏ సమయంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ రోజు ఏం చేస్తున్నారు.. రేపు ఏం చేయబోతున్నారు..? అనే విషయం ఆయనకు కూడా తెలియకపోవచ్చని ద్వివేది పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన ద్వివేది ఈ వ్యాఖ్యలు చేశారు.